


భారతి, నవంబరు '47.

నాగార్జునాచార్యులు

నాగార్జునకొండ శిథిలాలలో శిల్పముల మూలమున బౌద్ధధర్మములను బోధించుచు
నేటికిని సజీవముగా గోచరమగుచున్న ఆతని ఆత్మస్వరూపము

చిత్రకారుడు: శ్రీ దశిక సుబ్బరాయశర్మ

సంపుటము 24
సంచిక 11

భారతి

నవంబరు 1947
సర్వజిత్తు, ఆశ్వయుజము

గోవర్ధన సుభాషితములు

— శ్రీ పళ్లె పూర్ణప్రజ్ఞాచార్యులు —

వసుధ జని యటంచు వగపేల? స్వర్లోక
సుఖము సుకవులార! చూఱఁగొనఁగఁ
గోర్కి యున్నయెడల గోవర్ధనార్యోక్తి
సుధను శ్రుతిపుటముల జుఱ్ఱుకొనుఁడు!

ఒంటిపలువాఁడ! యిరువురి చంటివాఁడ!
మూఁడుగొనముల కావలివాఁడ! నాలు
గైదుచేతులు గలవాఁడ! ఆర్మొగాల
వేలుపుందోడ! వేలు జేజేలు నీకు.

బహురసము సూర్యవంశప్రభావబోధి
ఎసఁగ రామాయణాబ్జ మెవఁడు గోరు
బహురసాఢ్యమ్ము గంగాప్రవాహ మలరఁ
జూపు లెవ్వాని కటు కుల్యవైపు దిరుగు?

అధికచిరజీవితాదోష మలరుకతన
గొప్ప యశమును వ్యాసుండు గోలుపోయె

ఎవరు నడువరు శ్రీవ్యాసుఁడే గణాఢ్యు
డై జగంబున మఱుజన్మ మందె ననుమ?

అక్షరసుమైత్రి వరలు కావ్యముల సర్థ
బోధ మొనరింప శబ్దముల్ పూరుషులను
సాధువులె యెల్లభంగుల సమనిక్కృతులు
గ్రామ్యకర్కశగణము నిష్కాస్య మచట.

సాధుముఖమునఁ బడినచోఁ జాలు విగుణ
మయ్యుఁ గబ్బంబు తక్షణ మమృత మొలుకు
శుష్కఫూత్కారమేనియు సూటి వేణు
వివరమునఁ బడి వీనుల విందు సేయు.

తనకు వందలకొలఁది ఛిద్రంబు లున్న
సర్వతోముఖముగఁ దన చంచలతయె
నుసువఁబడిన, నదేమొ జల్లెడయుఁ గొండె
గాఁడు మొనగాఁడు తుషదోషగణము లేఱ.

లోని గూఢార్థములను సులువుగ వ్యక్త
పఱచలేక ప్రసాదంబు కొఱఁతవడిన
కావ్యగతమా రసము సదగతరసంబు
కాదు నెల వెన్నఁటికి రసజ్ఞాదరణకు.

అందని ఫలం బసాధుల కదియు నిదియు
అలరు నమృతంబు కొల్లగా నచట నిచట
వరలు సురసార్థములును సువర్ణరచన
లట నిటను, గావ్య మన స్వర్గ మనఁగ వేఱె?

మేటికవి నాల్క యను చిన్న చేటఁ జెరిగి
అమరిచిన శబ్దశాలిపాకమునఁ దనిసి
ఆదరింపఁడు ప్రియురాలి యధర మనఁగఁ
దొత్తునకు దానితో నేమి పొత్తు సుధకు?


సరసమేని, అలంకృతుల్ వరలకున్న
వాణి ముద మిచ్చు రతుల వివస్త్రవోలె;
విరస, మెన్నె నలంకృతుల్ వేయుఁగాక
రంజిలఁగఁజేయు దెద సాలభంజిభంగి.

పాడుచుందురు బాలికాపాంగభంగి
అంగజుని సూత్రముగఁ; గులటాంగనాక్షి
విలసనము భాష్యముగ దూతి; వివరణముగ
మధురభావంబులను గవిమాణవకులు.

స్ఖలిత మొప్పియుఁ బదనివేశముల శబ్ద
మయముల నలంకృతులమేన మానియు నను
కూలమై హారిశృంగారలాలితోక్తి
సంతసముఁ గూర్చు మది కభిసారికవలె.

విధుముఖీమధురాధరసుధ నెఱుంగు
సుకవికే తీయతీయని సూక్తు లొదవు;
కొల్లఁగొట్టక సహకారకోరకముల
హాయిగా గండుకోయిల గూయఁగలదె?

ధ్వనివినాకృతపదసంగ్రహణము ముదము
డెందమున కీదు; వీనుల విందు గాదు;
తద్జ్ఞజనగోష్ఠులం బ్రబంధంబువోలె
నాటలాడెడు వేళల నందెవోలె.



పెనుకొండలో శ్రీకృష్ణదేవరాయలవారి వేసవిభవనమైన 'గగనమహల్'

ద్రవిడము - ద్రావిడసిద్ధాంతము

— శ్రీ చిలుకూరి నారాయణరావు —

ద్రావిడు లార్యులు; ద్రావిడభాష లార్య భాషలు. జాతి భాషాచార సంప్రదాయములలో ద్రవిడు లార్యుల కెంతమాత్రమును భిన్నులుకారు.

'ద్రవిడ' మంటే ఏదో ఒక వింత జంతువని భావించే బుద్ధిమంతు లింకా ఉండడ మాశ్చర్యకరముగా ఉన్నది. ఈ శబ్దపు తత్త్వము నింతవరకు నెవ్వరును సంపూర్ణముగా, లోతుగా ఆలోచించి ఉండలేదు. ఇంతవరకు తెలిసిన విషయ మేమి టంటే, 'ద్రవిడ' మునకు పూర్వరూపము 'ద్రమిళ' మనీ, ఇదే ద్రవిడముగ సంస్కృతమున నిలిచి, ప్రాకృతాది భాషలలో 'తిరమిడ, తిరమిళ, తమిళ' మొదలయిన రూపములను పొందినదనీ.

ఇది సరియే. 'ద్రమిళ' మే పూర్వరూపము; 'ద్రవిడ' ముత్తరరూపము. నే నీ వ్యాసములో లోకమునకు తెలియజేసే దేమి టంటే 'ధర్మ' మీా రెండింటికిని సంధి అని. అంటే 'ద్రమిళ, ద్రవిడ, తిరమిడ, తిరమిళ, తమిళ' శబ్దములు 'ధర్మ' శబ్ద భవములు అని నా ఉపపాదన. దాని కుపబలముగా చెప్ప బోయేదానిని పండితులు చిత్తగించాలి.

'ధర్మ' శబ్దమునకు 'ధ్రమ' అనేది కొన్ని ప్రాకృతములలో రూపాంతరము. అశోకుని ధర్మశాసనములనుంచి ఉదాహరణములు—

[సంకేతములు: షాబా. = షాబాజగఢీ; మన్సే = మన్సేహ్రా. రోమను అంకెలు శాసనసంఖ్యను, ఇంగ్లీషు అంకెలు పంక్తిసంఖ్యను తెలియజేస్తవి.]

ధ్రమం = ధర్మమ్. షాబా. *IV*- 10; *XIII*- 10; మన్సే. *IV*- 17; *XII*- 6.

ధ్రమో = ధర్మః. షాబా. *XII*- 6.

ధ్రమ్మం = ధర్మమ్. మన్సే. *XIII*- 11.

ధ్రమస = ధర్మస్య. మన్సే. *XII*- 9; షాబా. *XII*- 10.

ధ్రమే = ధర్మే. షాబా. *IV*- 9; మన్సే. *IV*- 10.

ధ్రమ - కమత = ధర్మకర్మతా. షాబా. *XIII*- 12.

ధ్రమ-ఘోషే = ధర్మఘోషః. మన్సే. *IV*- 13.

ధ్రమ - చరణ = ధర్మాచరణమ్. మన్సే. *IV*- 15; 17.

ధ్రమ - చరణే = ధర్మాచరణమ్. షాబా. *IV*- 9.

ధ్రమ-చరణేన = ధర్మాచరణేన. షాబా. *IV*- 8; మన్సే. *IV*- 1.

ధ్రమ - దానేన = ధర్మదానేన. షాబా. *XI*- 25; మన్సే. *XI*- 1.

ధ్రమ-దిపి = ధర్మలిపి. షాబా. *I*- 1, 8; V- 13; *XIII*- 11; *XIV*- 13; మన్సే. *I*- 1, 4; *V*- 23; *VI*- 31; *XIII*- 12.

ధ్రమనుశస్తి = ధర్మానుశాస్తిః. షాబా. *VIII*- 1; *XIII*- 2, 10 (2); మన్సే. *VIII*- 36; *XIII*- 2, 11.

ద్రమవశీక్షితయః = ధర్మవశాక్షైత్రీ. పా. IV-8; మత్స్య. IV-14.

ద్రమనుశీక్షితయః = ధర్మానుశాక్షైత్రీ. మత్స్య. III-10; పా. III-6.

ద్రమనుశీకన=ధర్మశాసన. మత్స్య. IV-17.
ద్రమనుశీకనం=ధర్మశాసనం. పా. IV-10

ఇక ల, -ఇల, -శ, -ఇశ అనే ప్రత్యయాలు మతుర్థక ప్రత్యయాలు. ఉదాహరణములు: ఊర్మిళ (ఊర్మి అనగా మోహము, కె్ర + కలది.); మురిభళ (పారవశ్యము కలది).

ప్రాకృతములో ఈ '-ల,-ఇల,-శ, -ఇశ' అనే మతుబర్థక ప్రత్యయాలు సర్వసాధారణమైనవి.

అట్లే ఉత్తరార్య భాషలలో కూడాను.

అందుచేత సం. ధర్మ + ఇల = ధర్మిల- ప్రాకృతము : ద్రమ + ఇళ = ద్రమిళ = ద్రమిళ.

ఇచ్చట 'ధర్మ' మంటే బౌద్ధధర్మము. బౌద్ధమతములో ఆయర్థమే రూఢి అయినది. 'బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి' అనే వాక్యాలలో 'ధర్మం' అంటే బౌద్ధధర్మమని మాత్ర మర్థము.

బౌద్ధధర్మ ముత్తర హిందూస్థానమున కపిలవస్తు ప్రాంతమున ఆరంభమయి భరతఖండమంతటా వ్యాపించినా, దక్షిణహిందూస్థానములోనే దాని ప్రాబల్య మెక్కువ అయినది. ఇక్కడ పరిణామము పొందిన బౌద్ధధర్మమే టిబెట్టు, బర్మా, సింహళము, చీనా మొదలయిన దేశాలలో వ్యాపించినది. అందుచేత 'ధర్మ' మునకు నిలయమైన దేశ మంటే వింధ్యకు దక్షిణముగా ఉన్న దేశ మని ప్రసిద్ధప్రతీతిని పొందినది. అందుచేతనే తక్కిన ద్రావిడ జాతులతో బాటు మహారాష్ట్రులు, ఘూర్జరులు కూడా పంచద్రావిడులలో చేరినారు.

రానురాను బౌద్ధధర్మ ముత్తరహిందూస్థానములో క్షీణించినది. ఉత్తరాహుల దృష్టిలో దాక్షిణాత్యమే 'ధర్మ' ప్రతిష్ఠ గన్న దేశమైనది. కాబట్టి వారు దాక్షిణాత్యుల నందరినీ 'ధర్మికులు' అని పిలువసాగినారు. ఆ మాటే 'ద్రమిళ', 'ద్రమిళ' అని ప్రాకృత రూపమును పొందినది. 'ద్రమిళ' అనేది ప్రాకృతరూపమయినా సంస్కృత శబ్దముగానే గ్రంథములలో వాడబడినది. ఇట్లేర్పడిన 'ద్రమిళ' శబ్దము రానురాను 'ధర్మ'ము ప్రచారములో నుండిన దేశమునకును, ధర్మమున ననుసరించే జనులకును, జాతులకును గూడ అన్వయింపబొచ్చినది.

ఇట్లు జరగడము క్రీస్తుశకము అయిదు ఆరు శతాబ్దముల కీవలనే కాని అంతకు పూర్వము కాదు. వైదిక వాఙ్మయములో 'ద్రవిడ, ద్రమిళ' శబ్దములు లేనే లేవు. భాగవత పురాణములో 'ద్రమిళ' దేశ ముదాహరింపబడినది. ఆపురాణ మిటీవలి దని కొందరి అభిప్రాయము. ఇతర ప్రాచీనసంస్కృత గ్రంథములలో 'ద్రవిడ' శబ్దము కనబడితే అది ప్రక్షిప్తము కా దని రుజువయ్యేవరకు ఒప్పుకొనడానికి వీలులేదు.

ఇట్టి 'ధర్మ' సంబంధిమైన 'ద్రమిళ' శబ్దాన్ని పట్టుకొని కాల్డువెల్లు భాషాపరముగా ప్రచారములోనికి తెచ్చినాడు. ఆయనకు ద్రావిడభాషలతోగాని, ఉత్తరార్య భాషలతోగాని సంస్కృతముతో గాని, ప్రాకృతములతోగాని ఎట్టి గట్టిపరిచయమున్న

ఉన్నట్లు అతని 'Comparative Grammar' వల్ల కనబడదు. ఎక్కడనో శ్రుతిగోచరము లైన గాలి కబుర్లను ప్రోగుచేసి, ఒక తడిక నల్లి "ఇదిగో, దాక్షిణాత్య భాషాస్వరూపము" అని చూపినాడు. అతనికి తాను చెప్పినది తనకే బోధపడినట్లు తోచదు; తన సిద్ధాంత ములో తనకే విశ్వాస మున్నట్లు తోచదు.

అయితే, ఈ ద్రావిడ సిద్ధాంత మప్పటి పాలకులయిన ఈస్టిండియా కంపెనీ వారికి 'వేరుచేసి ఏలవలె' ననే రాజనీతికి మిక్కిలి సహాయకారి అయినది. కాబట్టి కాల్డువెల్లు గ్రంథమును వారు ప్రోత్సహించినారు. మిషనరీలు "మాపిరుదులకుకూడా ఇంత పాండిత్యము వున్నాయండి" అని తాము విద్వాంసులయినట్టు యూరోపా ఖండములో ప్రకటించు కొంటూ, యూనివర్సిటీలలో పలుకుబడిని సంపాదించి, వాటి మూలముగా ద్రావిడసిద్ధాంతమును ఉభయభ్రష్టులయిన ఆంగ్లపాఠశాలా విద్యార్థులలో బలవంతము గాను, నయముతోను, భయముతోను వ్యాపింపజేసినారు. ఈ ప్రచార మెంతవరకు సాగినదంటే, చరిత్రములోను, జాతుల చరిత్రములోను, ఇక్కడా అక్కడా ఏమిటి, తెలియని క్రొత్త విషయము ఎక్కడ బయలు పడినదంటే సరి, అక్కడ 'ద్రావిడ'ము తయారై కూర్చుంటున్నది. మొహంజోదరో నాగరికత ద్రావిడము; మెక్సికో నాగరికత ద్రావిడము; మధ్య ఆసియానాగరికత ద్రావిడము-అంతా రామమయం, జగమంతా రామమయ మయిపోయినది.

అయితే కానీయండి గాని, నూరేళ్ళ క్రిందట గూగేల్‌లో కాల్డువెల్లు నాటిన విష బీజము రాజకీయముగా ఎట్లు నేడు పరిణ మిస్తున్నదో మనవాళ్ళు కళ్లు తెరచి చూస్తే తిరుమలేశుడు చెప్పినదాని భావము గోచరిస్తుంది.

పాకిస్థాని, ద్రావిడస్థాన్, తుదకు రాయలసీమ స్థాన్—ఏమిటీ 'స్థాన్' లు? ఎక్కడనుంచి వచ్చినవి? ఈ రక్తపాతము, ఈ వైషమ్యాలు, ఈ గుద్రులు, ఈ కన్నీరులు ఎక్కడివి? కాల్డువెల్లు సిద్ధాంతబీజము నుంచి పెరిగిన మాయావృక్షమున పండిన చేదుపండ్లు అని వేరే చెప్ప నక్కరలేదు.

ఇంకా ద్రావిడభాషాసిద్ధాంతమును పట్టుకొని దేవులాడే 'విద్వాను' లను చూస్తే వారి వ్రాతలు చూచి జాలిపడడమో, కోప పడడమో తెలియకున్నది.

త్యాగరాజస్వామి ప్రబంధములు

— శ్రీ వాడ్రేవు నారాయణమూర్తి —

త్యాగరాజస్వామి యోగజ్ఞానాదరణము వదసిన భక్తిరసప్రధానమైన కీర్తనలేకాక నౌకాచరిత్రమను పుణ్యకథను, ప్రహ్లాదభక్తవిజయమను నాటకమును రచించెను. వీటినే త్యాగరాజ ప్రబంధము లని యనుచున్నారు.

తొలుత ప్రహ్లాదభక్తవిజయమును పరిశీలింతము. ఇష్టదేవతా ప్రార్థనలు: కొందరు 'భగవద్దాసుల' స్తోత్రము కావించి, పిదప కృతినాయకు డయిన శ్రీహరిని సంబోధించుచు కథాప్రారంభమునకు పూనును. ఇంతవరకు కందములు, గీతములు, ద్విపదలతో రచన సాగించి కథాంశముసందటనట కీర్తనలను గూడ జతపరచినాడు. నాటకాదిని దౌవారికుడు ప్రవేశించి తత్సభాసదులను ప్రశంసించును, సూత్రధారునితో నాటకాంశమును గూర్చి సంభాషణ చేయును. పిమ్మట దౌవారికుడు సూత్రధారు నుద్దేశించి కథాప్రారంభము చేయును. ఈ నాటకము సాధారణమైన నాటకముల వలె ప్రదర్శనీయమైనది కాదు. చదివి యానందించవలెను. 'తోలుబొమ్మలాట' కాండ్రు కొంత ప్రయత్నము చేసినచో తెరపై ప్రదర్శించుట కనువుగా నుండును. నాటకమునందు భక్తిరసము ప్రధానమైనది. 'రాగతాళాదియుత గానము' న కనువుగా నీ నాటక ముండుటయే ఇందలి విశేషము.

నాటకము నైదంకములుగా విభజించినాడు. ప్రతి అంకమును ముగించునప్పుడే విడిగా నైన ముగింపు వాక్యమును వ్రాయలేదు. నాటకాంతమున, అనగా ఐదవ అంకము ముగిసినపిమ్మట మంగళము నొక కీర్తన రూపమున చెప్పి, తరువాత ఫలశ్రుతి నీవిధముగా చెప్పినాడు:

"శ్రీ రామబ్రహ్మతనయ త్యాగరాజేన నిర్మితం
ప్రహ్లాదభక్తవిజయ ప్రబంధం భుక్తిముక్తిదం
యే గాయంతి సదా భక్త్యా, యే శృణ్వంతి చ శ్రద్ధయా,
యే పఠంతి సదా ప్రీత్యా, తేషాం సర్వాఘనాశనం."

నౌకాచరిత్రము నీ రీతిగ నాటకమువలె వ్రాయలేదు కాని. రచనయం దీ పథమును విడలేదు. దీని భాగములుగ విభజించనులేదు. అంతమునందు మంగళము నొక కీర్తన రూపమున జెప్పి, పిదప—

"త్యాగరాజకృతాం పుణ్యాం కథాం సాధుమనోహరాం
యే శృణ్వంతి నరా లోకే తేషాం కృష్ణః ప్రసీదతి"

అని ఫలశ్రుతి చెప్పినాడు. ఈ రెండు రచనల యందును 'సంగీతకట్టు' న మాత్రము విడలేదు. ప్రహ్లాద భక్తవిజయమున కృతినాయకుడయిన శ్రీహరి నుద్దేశించి-

"ఆగమాంతవిహారుడై యలరు నీదు
రాగతాళాదియుత గానరసముచేత
బాగు మీరంగ సంతోషపరచుచుంటి
త్యాగరాజును చేపట్ట కనరి వాడ !"

అని చెప్పుకొన్నాడు. దీనినిబట్టి కృతికర్తకు రాగతాళాది యుత గానరసముచేత కృతిభర్తను సంతోష పరుపగల సామర్థ్యము విశదమగును. మరియును—

"నాటకం బొకటి శ్రీ నవరసముగా నీదు
పాటగా వినుపింతు పాటకాభరణ."

అనియును,

"జ్ఞానవైరాగ్య విజ్ఞాన సద్భక్తి
దీని భావము తెల్ల దివ్యమై వెలుగు."

అని యును చెప్పియున్నాడు.

త్యాగరాజస్వామి శ్రీహరిని మెప్పించెడి గమకముతో గానము చేసెడివాడు. ఎల్లపుడు ఆ మహాదే

భావుని లీలలనే తలచుకొనుచు, వాటినే కీర్తనల రూపమున, ఇట్టి నాటకములరూపమున రచించినా డని తెలియనగును.

ఇక నాటక కథాంశమును పరిశీలింతము—

"కనకకశిపుడు మున్ను గడుచేంబునను
తనయుని సకలబాధల పెట్టి మరియు
నాగపాశంబున వడుమున గట్టి
సాగరంబున వేయ తలవిచ్చు మొదలు
ప్రహ్లాదయోగి ప్రబలవారిధిని
నాశనమును వాద నంగ రాజిల్లు
ఘనుడైన నారదాగమనంబు చేత
జనియించబడి జాలిజెంది మూర్ఛిల్ల
నావిూద మాధవుం డావిర్భవించి
సామర్థ్యముల జేసి సలిగింపగను
మమ్మొగ్గి యెదురుగా మదముతో నిల్చి
సామ్మసిల్లిన వేళ్క సొంపుగానుండు"

అనుచు కృత్యాదిని కథాంశమును కృతిపతి కెరిగించి "అనిశంబు నిది భవ్యహారంబుగాను- దనివార ధరియించు ధరసుతారమణ" అని వేడుకొన్నాడు. పిమ్మట నాటకారంభమున 'సకలగ్రహ నివారణుండగు గిరిసుతా సుతుడు సంగీతలోలుండు' ఘల్లుఘల్లనుచు, వివిధగతుల ధిత్తిళంగుమని ప్రవేశించి, తా మొనర్చు పూజలను గైకొనును. అటుపైన రాగతాళగతులను పాడుచు దౌవారికుడు—

"గడిగడను నాలకోడను
వదిబడిగా నటుంగు లేదు మ పరమతిలో దా
బెడశక హరిని పొగడుచు
పడుగడుగున సభనుజూచి నడుగను పెదశెల"

తోచినరీతిని పాడక రాగతాళగతులను పాడ కలెననుచు త్యాగరాజు తన సందేశము నిట్లే నాటకము పొడవునను చెప్పుచువచ్చును. మరియూ నీతను సర్వ దేవతలను సంగీతముచే తృప్తిపరుప జేయుటకు ప్రయత్నించుటను గ్రహింపవలెను. దౌవారికుని ప్రవేశమును పై నుదహరించిన కందమువలన వ్యక్తపరచును. ఇచ్చట నీతని శైలిని గమనింపదగును. మరియు దౌవారికుని నీరుకావి దోవతిని, నిటలమున బెట్టిన శ్రీ చూర్ణమును, మాటి మాటికి మీసము దువ్వెన తెరగును కీర్తనగా రచించి భట్టునకు చక్కగానేనమును చేకూర్చినాడు. సంపూర్ణముగ వర్ణించిన గాని యతని మనస్సునకు తృప్తి యుండదు కాబోలు—కనులకు కట్టినట్లు చక్కగ వర్ణించినను తృప్తి పొందక 'ఎంతవుచు వర్ణింతునే యీ యిందిరారమణుని' అని ప్రహ్లాదునకు దర్శన మిచ్చు నప్పటి శ్రీహరిని వర్ణించుటనుండి విరమించుకొన్నాడు.

ఈతని వచనములను పఠించిన, శైలి గ్రహింప వచ్చును. "ఇవ్విధంబున పలికిన సుధామాధుర్యమును గంభీరధ్వని విని యే మహాత్ముడో, యే సిద్ధుడో యొకరి పరిక్రాంతక కోటిని యను భయభక్తితో గూడిన వాడై కనులు వికసింపగా తరుణార్క ప్రకాశుడైన కరుణామూర్తియగు వరదాలయుని గనుంగొని యత్యంత హర్ష ప్రఫుల్లితుండై సాష్టాంగముగా మ్రొక్కి పలుకు చెట్లనన"...

ఈ రీతిగా నితనిచే వచనమును పఠించినను చక్కని శైలిని తెలిబుచ్చుచుండును. త్యాగరాజుని కందములను చూచుచుండిన పోతనామాత్యుని భాగవతమందలి కందములు జ్ఞప్తికి వచ్చును. ఈతని కీర్తనల శైలి జగద్విదితమే. అయినను మచ్చుకు—

"పల్లవి: వందనము రఘునందనా సేతు]
బంధనా భక్తచందనా రామా!
అనుపల్లవి: శ్రీదమా నాతో వాదమా నే
భేదమా యిది మోదమా రామా!"

ఇదే శైలిని కీర్తనలందలి చరణము లన్నియు నుండును. ప్రతి కీర్తనయును పదమాధుర్యము, చక్కని శైలి గలిగి యుండుటయే కాక లోకోక్తుల గలిగియుండుట వలననో, భావగాంభీర్యము చేతనో ప్రకాశించుచుండును.

శ్రీహరి కామవరముల నిచ్చెద కోరుకొమ్మనిన ప్రహ్లాదుడు "ఆపబోయిన తీర్థ మెదురైయినరీతి కనబడిన నిన్ను సామాన్యములయిన వరములను కోరె"దననుట ఇట్టి లోకోక్తులీ ప్రబంధములయందే కాక త్యాగరాజుని కీర్తనలయందు కూడ ననేకములు కానవగును. 'అటుకుల రుచి యెద్దునకు తెలియునా...'

మరియును తాను చెప్పిన ఒకానొక విషయమునకు సరిగా నన్ని రీతులపోలి యుండెడి సామాన్యములయిన కొన్ని కొన్ని యుపమానములను చెప్పి తన వాక్యమును సమర్థించును. వాని నుద్దేశించి ప్రహ్లాదుడు—

"వెన్న యుండగ నేతి వెసనంబు వనియేల
నన్న ముండగ జొన్న యంబ లేల
తల్లియుండ సుతునకు దాదివెసనం బేల
తన్ను తా దెలిసిన తత్త్వమేల
వ్యాధిహీనుకు వరవైద్యుని చెలిమేల
స్వధనంబు లుండ పంచాంగ మేల
అన్ని నీ వనువాని కమర భేదం బేల
ధీరుకు వైరిభీతి దిగులదేల
....
నీవు నాయొద్ద నుండుచే నిండు సుఖము
త్యాగరాజార్చిత, నీ కటాక్షంబె చాలు."

అనును. మరియును, "జ్ఞాన వైరాగ్య విజ్ఞాన సద్భక్తి దీని భావములెల్ల దివ్యమై వెలుగు" నని తాను చెప్పికొనిన వాక్యమునకు 'తన్ను తా దెలిసిన తత్త్వమేల' మొదలగు వేదాంతవాక్యము లనేకము లుదాహరణము లీయవచ్చును. వాని అంతర్ధానమైన పిమ్మట ప్రహ్లాదుడు 'పతిని గానని సాధ్విపరితాపరీతిని'బొంద నొందెనట. సమయోచితములగు నిట్టి యుపమానము లీతని ప్రబంధములం దనేకములుగలవు.

ఇక రసపోషణమున త్యాగరాజుకే తొలుత చెప్పవలెను. అందునను భక్తిరసము దతని ప్రజ్ఞ అద్వితీయము. ప్రహ్లాదుడు సాగరునిచే 'శ్రీమరక వారినామమును జపించుటయే యతని కనుబోమటకు మార్గ'మని చెప్పబడి వాని ధ్యానమునకు కడంగును. అట్టిచోట చక్కని దండకము మూలమున భక్తిరసమును చక్కగా పోషించినాడు. వాని ప్రహ్లాదునకు ప్రత్యక్షము మగుతరి, తనకే దరిశనమిచ్చిన వైఖరిని, తన్మయత్వమునొంది రచించెనా యనిపించు నా ఘట్టమునంతయు చదివి యానందించవలెనే కాని యుదాహరణలతో కార్యము లేదు. నాటకము నందే భాగమున జూచినను, చెలువు నెచ్చుట కోరికను తీరని రసము లభించునటుల భక్తిరస మట్టిపడుచుండును. ఇట్టి చక్కని శైలితో లెక్కకుమించు లోకోక్తులతో, కేవలము ఇది అసత్యముగా నున్నదని చూపజాలని యుపమానములతో భక్తిరసప్రధానమైన 'ప్రహ్లాదభక్తివిజయము' ను రచించిన త్యాగరాజు ధన్యుడు. పరమ భాగవతోత్తముడును, భక్తాగ్రేసరుడు నయిన యమ్మహానుభావుడు వందనీయుడు.

తరువాత నౌకాచరిత్రమునుగూడ చదివాతము. ఇది శృంగారరసప్రధానమై యొడనెడ భక్తిరసమును గూడ చూపించు పుణ్యగాథ. ఇందలి కథాంశము—

"...............నందాత్మజుం
డా కాంతామణులన్ రమింప మదిలో
నాహ్లాదసంయుక్తుడై
నౌకాక్రీడ యొనర్చుట..."

ఇష్టదేవతా ప్రార్థనాదికము లయినతర్వాత 'సరిగమపధనిస' యని గోపాలుడు మురళి పాడుటతో కథాప్రారంభమగును. అంత నా వేణురవామృతమును పానము చేసిచేసి, విరహముచే వీధివీధియు దిరిగి తుదకు—

"ముంగిట గ్రమ్మిన మేఘపు
సంఘము లెడబాసినట్టి చందురువగు శ్రీ
ముంగురులం దొలగింప నె
లంగడి శ్రీకృష్ణుమోము లలనలు చేర్కన్."

కనుగొందురు. ఇచట చక్కని పోలికలు గమనింపదగును. పిమ్మట గోపికాసంయుతుడై గోపాలుడు నౌకాక్రీడ నొనర్చు నుద్దేశముతో యమునా తీరమునకు పోవును. నదీతీరమందలి పొదరిండ్లను...అచటచటనున్న పక్షిగణములను, నదీతరంగములను గోపస్త్రీలెంతయో యానందమును గూర్చు రీతి వర్ణింతురు. స్వాభావికములగు వాటిని వర్ణించుటయందు త్యాగరాజు ప్రజ్ఞ అసమానము. కోకిలలు ప్రోయుగా మరుడు కుసుమశరములను ప్రయోగించగా, నల్లని యమునానదిలో తెల్లని రంగైన యోడపై విహారము చేయుటకు గోపికలు సిద్ధము చేయుదురు. అట్టితరి—

"బాలుం డిదిగాక మహీ
పాలుని తనయుండు మేన బంగరు సొమ్ముల్
చాల ధరించినవాడే
ఏలాగో కలదటంచు నెంచిరి తమలోన్."

కాని 'కమలనేత్రుని కాని సుఖమా' అని కొందరి అభిప్రాయము. ఇంతలో నొకముద్దియ 'యువతులార మీలోనె మీరు యోచింప బొద్దు పొయ్యెను' అనుచు తక్కినవారిని సాధించును. వీరి వరుస గాంచి గోపాలుడు—

"పురుషుండు లేకనే పూబోణులార
తరుణుల కెప్పుడైన తగదు సాహసము"

అనుచు వారితో వాదనకుపూని, తుదకు తానును వారితో కలసి నౌకావిహారము సల్పును.

ఇంతులకు సైజములయిన మాటలను తను సందర్భములందు ప్రయోగించుటలో త్యాగరాజు కడు నేర్పరి. దీనికి ఘట్టమంతయు నుదాహరణమే! "తొలుతనే, నౌకావిహార మబలలకైన మనకు కొంచెపు బాలుడయిన వీనితో తగదంటి" నని యొకతె. ఓడ గాలికిటు నటు నూగుటలో రంధ్రముద్వారా ఓడలోనికి నీరు ప్రవేశించుతరి ననును. తొలుత తా నడ్డనకపోయినను, ఆసమయమున ననుట స్త్రీసహజము. దానికి కృష్ణుడు—

"భామ లమ్మకు రేగుపండ్లకై నేను
కామించి ముత్యముల్ కరములనిండ
నునుచుక నే రాగ నవ్వాంగి మీరు
కనుల త్రిప్పుచు నెత్తికొని వేడ్కతోడ."

మీరే తీసుక వచ్చితిరి. అందువలనే 'ఇంతుల నమ్మరా దెంతవారికిని' అని చెప్పుదు ననును. ఇంచుమించు కథయంతయు నిట్టి శృంగారములగు సంభావణలతో గూడియుండును. చక్కని పదప్రయోగముచే నిట్టి సంభావణ కెంతయో సౌందర్యము నేకూర్చిన త్యాగరాజు ప్రశంసనీయుడు. అత్తమామలను గూడ నెదిరించివచ్చిన దీ విధముగా ఓడ మునిగిపోవుటవలన దుర్మరణమునకు లోనగుటకా యని చింతించు గోపికలకు—

"అంగలార్పరాదె యో భుజంగవేణులార యీ
యంగజారికైన కర్మ మంతరానంబు సా
రంగనేత్రలార పంచరంగుకంచుకంబులన్
బొంగివచ్చు నీటి కట్టె పొందుగాగ నుంపరే!"

అని శ్రీకృష్ణు డుపాయమును చెప్పెను. దానికై వారు గుసగుస లారంభించుటయు, నం దొకతె—

"గుసగుసలం దేమి వచ్చు చెలులార
ఉసురుండిన నూరుపోవచ్చు"

ననును. ఇంకొకతె—

"నగ్నముగా నిల్వ వశమా కృష్ణా!
వలుచరిలో నీకు యుక్తమా"

అనును. తుదకు 'బయలుదేరిన లొన్నమదెట్టిదో యిటుల నగ్నలమైతి' మన కొనుచు, వారు తమ వలువల నా నౌకారంధ్రమున కడ్డముంచుదురు. అంత 'కమ గొందుకో యని సరగున పాలిండ్లు కరములమూయ మురుసుదా' అనుచు నగ్నలగువారిని వర్ణించుటను త్యాగరాజు పూనును. తుదకు శ్రీహరి తన జగన్మోహనాకారము నవ్వారిజనేత్రలకు కనబరచి తన్ను ధ్యానము చేసిన వారి ఆపద తొలగు నని చెప్పును.

పూర్ణగర్భిణులయిన పాలకు నెల్లను మంత్రసాని చెప్పినమాట సల్పినట్లు........హరినామస్మరణము చేయుదురు. ఇచట గోపస్త్రీలకు శ్రీహరిపై గల భక్తిని వ్యక్తపఱచి రచయిత చక్కగా పోషించినాడు. పిమ్మట "కోటిమన్మథాకారుండయిన కువలయనేత్రుని కంజదళాక్షులెల్ల కౌగిటను చేర్చిరి సంతసిల్లుచున్" అనుచు నౌకాక్రీడను ముగింపజేసినాడు. ధరను గలుగు భోగభాగ్యములెల్ల, నిత్యము గాదుసుమీ. హరి హరి నీ యొక్క దివ్యపాదారవింద మీయవె యను కీర్తనవంటి వీని భక్తిరసపోషణ కుదాహరణములుగా గొనవచ్చును.

ఇట్టి శృంగారరసప్రధానమయిన కథను, భక్తిరస ప్రధానమయిన నాటకముగ త్యాగరాజు శ్రీహరి పదారవిందముల చేరు ప్రయత్నమునందలి సంకేతమే యని గ్రహింపవలెను. శ్రీహరి ప్రత్యక్షమగు ఘట్టమును కథలో వర్ణించునపు డాతడు తన్మయత్వము చెందియుండు ననిపించును. వేలకు వేలు కీర్తనలనే కాక ఇట్టి ప్రబంధములను గూడ రచించి గాయకలోకమునకే కాక, సాహిత్యలోకమునకు గూడ తన శక్తికొలది త్యాగరాజు కూర్చిన సౌందర్యము శ్లాఘనీయము. గాయకుల కతని సందేశము "రాగతాళయుతమై భావప్రధానముగా నుండునట్లు పాడవలె" ననుట. మరియు నీతడు భావమునకు పదములకు, ఇచ్చిన ప్రాముఖ్యము నటనట ఛందస్సునుకూడ లక్ష్యము చేయక రచించిన పద్యములను బట్టి గ్రహింపవచ్చును. తుదకు తన గానముచే శ్రీహరిని పరితృప్తి గావించి శ్రీకైవల్యపదము చేరిన త్యాగరాజు వందనీయుడు. అతని కొక నమస్కారమును సమర్పించుటయే కృతజ్ఞతను దెలుపుట.

భూప్రదక్షిణము

— శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య —

రష్యా అమెరికాలమధ్య ద్వేషము అభివృద్ధి గాంచిన కారణముచేత అమెరికావారియొక్కయు, వారి అనుచరులయొక్కయు ప్రాబల్యమును ఎదుర్కొనుటకును, అట్టి ప్రాబల్యమును అణచివేయుటకును రష్యావారు అక్టోబరుమాసములో క్రొత్త ఎత్తు నొకదానిని వేసిరి. అంతర్జాతీయ కమ్యూనిస్టుసమితిని పునరుద్ధరణచేయుటయే ఆ ఎత్తు.

అంతర్జాతీయ కమ్యూనిస్టుసమితి

ఇందుకై రష్యావారి యాజమాన్యమున తొమ్మిది దేశములలోని కమ్యూనిస్టు పక్షప్రతినిధులు పోలెండుదేశపు రాజధానియగు వార్సాలో సమావేశమైరి. వారు రష్యా, పోలెండు, జెకోస్లావేకియా, హంగరీ, బల్గేరియా, రుమేనియా, యూగోస్లావియా లోనగు రష్యాపలుకుబడిలో నుండు దేశములనుండి వచ్చినవారు. ౧౯౪౩ లో రెండవ ప్రపంచయుద్ధకాలమున రద్దుచేయబడిన అంతర్జాతీయ కమ్యూనిస్టు సమితిని కొంత స్వరూపము మార్చి తిరిగి ప్రతిష్ఠించుటకు ఈ సమావేశములో తీర్మానము గావింపబడెను. ఈ సమితికి యూగోస్లేవియా ప్రధానపట్టణమగు బెల్గ్రేడు ప్రధానకార్యస్థానముగ నుండెను. వివిధదేశములలోని కమ్యూనిస్టుపక్షములవారందరు ఒకే విధమైన ప్రచారము చేయవలెననియు, ఒకే కార్యక్రమమును అనుసరించవలెననియు ఈ సమితియొక్క ప్రధానోద్దేశము. దీనిమూలమున ప్రపంచమందంతట కొలదికాలములోనే కమ్యూనిస్టు విప్లవ మొకదానిని లేవదీసి, తద్ద్వారా పెట్టుబడిదారీ ఆర్థికవిధానమును (క్యాపిటలిస్టు) నిర్మూలముచేసి కమ్యూనిస్టుసిద్ధాంతాను సారము రాజ్యాంగవిధానమును, ఆర్థికవిధానమును స్థాపించవలెననుటయే దీనియొక్క ఆశయము.

ఈ సమితి పునరుద్ధరణ మైనదని చెప్పుటకు కారణ మున్నది. ౧౯౧౭ లో రష్యాయందు లెనిన్ నాయకత్వమున కమ్యూనిస్టువిప్లవము జరిగెను. ఒక దేశమునందుమాత్రమే అట్టి విప్లవము జరిగినయెడల దాని ఫలితములు సుస్థిరములు కాజాల వనియు, అట్టి విప్లవమును పడగొట్టుటకు పెట్టుబడిదారీ విధానము నను సరించు దేశములవారందరు విశ్వప్రయత్నము చేయుట తప్పదనియు, అన్ని దేశములలో కమ్యూనిస్టుపక్షములను బలపరచి వాటి అన్నిటియందు కమ్యూనిస్టు విప్లవములను లేవదీయుటయే ఆ ప్రయత్నమును విఫలము చేయుటకు సాధన మనియు లెనిన్ నమ్మినవాడు. అందుకై అతడు ౧౯౧౯ లో అంతర్జాతీయకమ్యూనిస్టుసమితి నొకదానిని రష్యాలో స్థాపించెను. ప్రపంచమందంతట కమ్యూనిస్టువిప్లవమును లేవదీయుటయే దీని యుద్దేశము. మధ్యవర్గము (బూర్జ్వా)నకు చెందిన రాజకీయపక్షము లన్నియు శత్రుపక్షము లనియు, విదేశములలోని అట్టి పక్షములను సర్వనాశము చేయుట విప్లవమునకు సాధనమనియు వారి విశ్వాసము. దేశాం

తరములలోని సోషలిస్టుపక్షములయెడకూడ వారికి సుహృద్భావము లేదు. అన్ని దేశములలోని కమ్యూనిస్టుపక్షములు రషియాలోని పక్షమునకు లొంగి నడుచుకొనవలె ననుట వారి సూత్రములలో ఒకటి. ఈవిధముగ ౧౯౧౯ లో స్థాపింపబడిన సమితి ౧౯౪౩ వరకు దాని ఉద్దేశములు నెరవేరుటకై పాటుబడుచుండెను. కాని రెండవ ప్రపంచయుద్ధములో పెట్టుబడిదారీ ప్రభుత్వములచే పరిపాలింపబడిన ఇంగ్లండు, అమెరికా మొదలగు దేశముల సహాయము రషియాకు అవసరమయ్యెను. అట్టి సహాయము సంపూర్ణముగ లభించుటలో సమితియొక్క ఆదర్శములు, ప్రచారము గొప్ప ఆటంకముగ కనబడెను. ఇదిగాక లెనిన్ తర్వాత రషియాకు నాయకుడై ఇప్పటివరకు దేశమును పాలించుచుండు స్టాలిన్ ప్రపంచమం దంతట విప్లవము జరిగినగాని రషియాలో కమ్యూనిస్టువిధానము సుస్థిరము కాజాలదను సిద్ధాంతేమునందు అంత విశ్వాసము కలవాడు కాడు. ఇతరదేశములందు ఎట్టి రాజ్యాంగ ఆర్థిక విధానము లున్నను రషియాలోని కమ్యూనిస్టు పరిపాలనమునకు చలన ముండదని అతని అభిప్రాయము. ఈ కారణములచేత ౧౯౪౩ లో అతడు సమితిని రద్దుగావించెను.

పరిస్థితులలో మార్పు

కాని యుద్ధము ముగిసిన తర్వాత అనేక కారణముల మూలమున రషియాకును, అమెరికాకును మధ్య ద్వేష మేర్పడెను. అమెరికా సామ్రాజ్యమును సంపాదించి ప్రపంచమున కంతకు నాయకత్వము వహించ ప్రయత్నించుచున్న దని రషియా నిందించుటయు, రషియాకు ఇట్టి ఉద్దేశ మున్నదని అమెరికా ప్రచారము చేయుటయు మామూ లయ్యెను. ఇది ప్రచారము మాత్రమేగాక కార్యరూపమును గూడ ధరించెను. తూర్పు యూరపు ఖండమందంతట రషియావారి ప్రాబల్యము స్థాపిత మయ్యెను. గ్రీసు, టర్కీ దేశములు అమెరికావారి పలుకుబడిలోనికి వచ్చెను. జర్మనీ, ఆస్ట్రియా, కొరియా, జపాన్ దేశముల భవిష్యత్తును గురించి అభిప్రాయభేదములు విపరీతము లయ్యెను. ఇట్టి పరిస్థితిలో కొన్ని మాసముల క్రిందట అమెరికావారు మార్షల్ ప్రణాళిక నొకదానిని ప్రవేశపెట్ట దలచినట్లు సూచించిరి. పశ్చిమయూరపులోని ఫ్రాన్సు, ఇటలీ, బెల్జియం, హాలెండు మొదలగు దేశములకు ఆర్థిక సహాయము చేసి, దాని ద్వారా వాటి నన్నిటిని తమ పలుకుబడిలో నుంచుకొనుటయే మార్షల్ ప్రణాళిక యొక్క ప్రధానోద్దేశ మని రషియావారి నమ్మకము. దాని మూలమున అమెరికాయొక్క ప్రాబల్యము యూరపులో వ్యాపించు ననియు, తద్ద్వారా తూర్పు యూరపులోని తమ పలుకుబడి తగ్గిపోవు ననియు రషియావారు అనుమానపడి దానిని ఎదుర్కొనుటకు కమ్యూనిస్టు సమితియొక్క పునరుద్ధారణము, ప్రచారము అత్యవసరమని నిశ్చయించుకొనిరి. ఇదిగాక, గత రెండు సంవత్సరములలో ఫ్రాన్సు, ఇటలీ మొదలయిన దేశములలో కమ్యూనిస్టు పక్షము వారు తక్కిన సోషలిస్టు పక్షములవారితో కలిసి పనిచేయుట లాభకరమని అభిప్రాయపడి యుండిరి. రషియావారికి కూడ అట్టి అభిప్రాయమే ఉండెను. కాని ఈ పొత్తు స్థిరముగ కుదరలేదు. అందుచేత సోషలిస్టుల సహాయము నపేక్షించకయే, కమ్యూనిస్టులు బలమును చేకూర్చుకొనుట అవసరమని రషియావారికి తోచినది. ఆకారణము చేతకూడ సమితి పునరుద్ధరణము గావింపబడెను.

ఆర్థిక మాంద్యము

ఇదిగాక కమ్యూనిస్టు సిద్ధాంతము ప్రకారము త్వరలోనే అమెరికాలోను, యూరపులోని దేశములందును, ప్రపంచములోని ఇతరదేశములందును ఆర్థిక మాంద్యము తప్పక ఏర్పడు నని రషియావారు అనుకొనుచున్నారు. పెట్టుబడిదారీ విధానములో కొన్ని సంవత్సరములు ధరలు విపరీతముగ పెరుగు ననియు, అటు తర్వాత అవి విపరీతముగ పడిపోవు ననియు, ఈ పడిపోవుటమూలమున వర్తకవ్యాపారములు మందగించుటయు, సాహుకార్లకు నష్టము వచ్చుటయు, కార్మికులు నిరుద్యోగు లగుటయు తప్ప దనియు కమ్యూనిస్టుల నమ్మకము. గత నాలుగైదుసంవత్సరములుగ అమెరికా మొదలైన దేశము లన్నిటిలో ధరలు విపరీతముగ పెరిగినవి. మన దేశమందుకూడ అట్లనే జరిగెను. ప్రస్తుతము అమెరికాలోని ధరలు రోజురోజుకు మరింత ఎక్కువగ

పెరుగుచున్నవి. "పెరుగుట విరుగుటకొరకే" అన్న పండిత వాక్యానుసారముగ రెండుమూడు సంవత్సరములలో ప్రపంచములోని దేశము లన్నిటియందును— రషియా పలుకుబడిలోని దేశములుతప్ప తక్కినవాటి యందు—ధరలు పడిపోగలవు. కార్మికులు జీవనాధారములు లేక సమస్తకష్టముల ననుభవించువారు కాగలరు. అప్పుడు వారియందు విపరీతమగు అతృప్తి, అసంతుష్టి బయలుదేరును. ఈ మధ్యకాలములో దేశములన్నిటి యందును కమ్యూనిస్టు ప్రచారమును అతితీవ్రముగ కొనసాగించినయెడల అతృప్తులగు కార్మికులు వర్గవైరస్యము గలవారై ధనికవర్గముపై తిరుగబడి కమ్యూనిస్టు విప్లవమును లేవదీయ సిద్ధులగుదురు. ఇట్టి పరిస్థితులు తప్పక రానున్నవి. ఇవియే విప్లవమున కనుకూలములగు పరిస్థితులు. కనుక అంతర్జాతీయ కమ్యూనిస్టు సమితిని పునరుద్ధరించి, దాని ద్వారా విదేశములలోని కమ్యూనిస్టు పక్షములను బలపరచి, తీవ్రతరమైన ఆందోళనము ప్రారంభించ వలసిన అవసర మేర్పడినట్లు రషియావారికి తోచెను. సమితియొక్క పునరుద్ధరణకు ఇవియే ప్రధాన కారణములు.

అమెరికా జవాబు


సమితిని పునరుద్ధరించుటకు రషియావారు తగిన చర్యలను తీసుకొనుచున్నారని తెలియగనే అమెరికా వారు దాని నెదుర్కొనుటకు ప్రయత్నములు చేయుచున్నారు. "ధనమూల మిదం జగత్" అని నమ్మువారిలో అమెరికా వారు అగ్రగణ్యులు. వారి వద్ద అపారమగు ధన మున్నది; అపారముగ వస్తు సామగ్రిని ఉత్పత్తి చేయగల శక్తి సామర్థ్యములు, యంత్రములు, వివిధములగు వసతులు వారికి కలవు. వారి సహాయమును అపేక్షించు దేశములవారు యూరపునందును, ఇతర ఖండములందును ఎందరో కలరు. అట్టి వారికి అమెరికాలో తయారగు ఆహార పదార్థములను, బట్టలను, యంత్రములను, ఇతరవస్తు సామగ్రిని అప్పుగనో, ఉచితముగనో ఇచ్చి, కష్టదశలో దారిద్ర్యము ననుభవించుచుండు వారి కష్టములను తొలగించి, తమ పలుకుబడిని ఆ దేశములలో స్థాపించుటయే అమెరికా వారికి గల సాధనము. ఈ సాధనమును ఉపయోగించుటకే మార్షల్ ప్రణాళిక తయారు చేయబడెను. కాని దాని ప్రకారము వారు యూరపు ఖండ వాసులకు హృదయ పూర్వముగ సహాయము చేయుదురో, చేయరో అన్న అనుమానము అందరికిని కలదు. అట్టి సహాయము చేయుటకుపూర్వము అమెరికా అధ్యక్షుడు శాసన సభయగు కాంగ్రెసు యొక్క అనుమతి పొందవలెను. ఆ సభ జనవరిలో గాని సమావేశము కాజాలదు. కనుక సకాలమునకు సహాయము చేయుట సాధ్యము కా దని అనేకు లభిప్రాయ పడియుండిరి. రషియావారు కమ్యూనిస్టు సమితిని పునరుద్ధరించినట్లు తెలిసిన వెంటనే అమెరికా అధ్యక్షుడగు ట్రూమన్ కాంగ్రెసు యొక్క ప్రత్యేక సమావేశము నవంబరు ౧౭ తేదీన జరుపుటకు నిశ్చయించెను. ఈ సమావేశములో రెండు ప్రధాన విషయములు చర్చింపబడును: అమెరికాలో విపరీతముగ పెరుగుచుండు ధరలు పెరుగకుండ చేయుటకు సాధనముల నేర్పరచుట మొదటి విషయము; ఫ్రాన్సు, ఇటలీ మొదలగు దేశములకు వెంటనే ఆర్థిక సహాయము చేయుట రెండవ విషయము. ఇట్టి సహాయము చేయుటకు కాంగ్రెసు అంగీకరించినయెడల కమ్యూనిస్టు సమితియొక్క ప్రచారమును ఎదుర్కొనుటకును, కమ్యూనిస్టు పక్షములకు విరోధములుగ నుండు పక్షములను బలపరచుటకును వీలగును. రషియనులకు ప్రచారము ప్రధానసాధనము. దానిద్వారా ప్రపంచవిప్లవమును లేవదీయుట వారి ఉద్దేశము. అమెరికావారికి ధనము ప్రధానసాధనము. దానిద్వారా విప్లవశక్తులను అణచి, సక్రమములగు ప్రజాస్వామిక సంస్థలమూలమున అన్నివర్గములవారి భోగభాగ్యములను వృద్ధిచేయుట వారి ఉద్దేశము. ఈ ఘర్షణలో ఎవరికి జయము రాగలదో చూడవలసియున్నది.

ఫ్రాన్సు

కమ్యూనిస్టులకును, ఇతరపక్షములవారికిని ప్రస్తుతము అనేకదేశములలో సంఘర్షణ జరుగుచున్నది. ఫ్రాన్సుదేశములో ఇది తీవ్రరూపమును ధరించియున్నది. యూరపుఖండపు దేశములలో ఫ్రాన్సు

దేశము అనేకశతాబ్దములుగ గొప్ప పేరుప్రతిష్ఠలను అనుభవించుచున్నది. ప్రస్తుతము అనేక దేశములలో నుండు మధ్యవర్గమువారి నాయకత్వము ననుసరించు ప్రజాస్వామ్య విధానము (Liberal Democracy) ౧౭౮౯ లో ఫ్రాన్సునందు జరిగిన మహావిప్లవము యొక్క ఫలితమే. ఆ విప్లవము యూరపునందలి దేశము లన్నిటిని ఉఱ్ఱూతలాడించినది. జర్మనీ ముందుకు వచ్చుటచేత దాని ప్రతిభ కొంత తగ్గినను, ఇప్పటికి కూడ ఫ్రాన్సుదేశము స్వాతంత్ర్యమునకును, సమానత్వమునకును, ప్రజాస్వామ్యమునకును పుట్టిల్లని ప్రముఖ లనేకుల అభిప్రాయము. ౧౯౪౬ లో ఆ దేశమందు క్రొత్త రాజ్యాంగవిధాన మొకటి అమలులోనికి వచ్చెను. దాని ప్రకారము జరిగిన ఎన్నికలలో కమ్యూనిస్టులకు ఎక్కువ విజయము లభించి, శాసనసభలో నూటికి నలభైమంది సభ్యులు ఆ పక్షమునకు చెందినవారైరి. వారుగాక సోషలిస్టు పక్షమువారు, మరికొన్ని ఇతర పక్షములవారు సభ్యులైరి. కమ్యూనిస్టు లధికసంఖ్యాకు లగుటచేత వారి నాయకత్వమున మంత్రివర్గము ఏర్పడుట సహజమైనను, సభలో వారికి మెజారిటీ లేనికారణమునను, వారితో కలిసి మంత్రివర్గములో వారి నాయకత్వముక్రింద పనిచేయుటకు తక్కిన పక్షములవారు ఇష్టపడకపోవుటచేతను సోషలిస్టు నాయకుడగు రమాడియర్ ప్రధానమంత్రి అగుటయు, కమ్యూనిస్టులుగాక తక్కిన పక్షములవారు అతని మంత్రివర్గములో చేరుటయు సంభవించెను. ఈ మంత్రివర్గము ఎనిమిది మాసములుగ అధికారమం దున్నది.

కాని ఫ్రాన్సులో ప్రస్తుతము డీగాల్ అను మరియొక నాయకు డున్నాడు. రెండవ ప్రపంచ యుద్ధపు ప్రారంభదశలో హిట్లరు ఫ్రాన్సును జయించిన తర్వాత హిట్లరును ఎదిరించి ఫ్రాన్సుకు స్వాతంత్ర్యము తిరిగి లభించుటకై పోరినవా డితడే. కాని కొన్ని కారణాల వలన ఇతడు రాజకీయములనుండి ౧౯౪౬లో విరమించుకొనెను. ఇతనికి కమ్యూనిజం ఎంతమాత్రము గిట్టదు. సోషలిజంకూడ ఇతనికి సమ్మతము కాదు. మధ్యవర్గ ప్రభుత్వమే సౌష్ఠవమైన ప్రభుత్వ విధాన మని ఇతని సిద్ధాంతము. ఎన్నికలలో కమ్యూనిస్టుల సంఖ్య పెరుగుటయు, వారి ప్రచారము మూలమున కార్మికు లనేక పర్యాయము లిటీవల సమ్మెలుచేయుటయు అతడు ఇష్ట



పడక కొన్ని నెలల క్రిందట తిరిగి రాజకీయములలో ప్రవేశించి ప్రజాపక్ష మను పేర నొక క్రొత్తపక్షమును నిర్మాణముచేసి దానికి నాయకు డయ్యెను.

రెండుమూడు వారముల క్రిందట ఫ్రాన్సులోని పట్టణములలోను, పల్లెలలోను మునిసిపల్ ఎన్నికలు జరిగెను. అందు డీగాలుకును, ప్రజాపక్షమునకును ఎక్కువ జయము లభించెను. కమ్యూనిస్టుసభ్యుల సంఖ్య తగ్గెను. సోషలిస్టుల సంఖ్యకూడ మరింత తగ్గిపోయెను. దీనినిబట్టి ఫ్రెంచి ప్రజలలో కమ్యూనిస్టులపై ద్వేషము, విరోధము ఎక్కువయ్యె ననియు, డీగాల్ నాయకత్వము ననుసరించుటకు వారిలో అధికసంఖ్యాకులు సంసిద్ధులుగ నున్నారనియు స్పష్టమయ్యెను. కాని ఈ ఎన్నికలు జరిగినప్పటినుండి ఫ్రాన్సులోని రాజకీయ పరిస్థితులు క్లిష్టతరము లయ్యెను. కమ్యూనిస్టులకును, ప్రజా పక్షము వారికిని ఘర్షణలు సంభవించుచున్నవి. దీనిమూలమున ఉభయ పక్షములవారికి అంతర్యుద్ధము సంభవించునేమో యను అనుమానముకూడ కలుగుచున్నది. కమ్యూనిస్టులను ఏలాగైన అణచివేయవలె నని కంకణము కట్టుకొని యుండు అమెరికావారు డీగాలును చేరదీసి, అతనికి

సహాయము చేసి మధ్యవర్గ ప్రభుత్వమును నిలబెట్టజూచుచున్నారు. అమెరికా కాంగ్రెసు యొక్క ప్రత్యేక సమావేశములో ఈ విషయము ప్రాధాన్యము వహించగలదు.

ఈ వివరణము వలన తెలుసుకొనవలసిన దేమనగా, యూరపు ఖండమందు కమ్యూనిస్టుపక్షమువారికిని, ఇతరపక్షములవారికిని విరోధము ప్రబలమగుచున్నదనియు, కమ్యూనిస్టులకు రష్యా వారును, ఇతర పక్షముల వారికి అమెరికావారును సహాయము చేయ సిద్ధపడియున్నారనుటయే. ఇట్టి విరోధము జర్మనీ, ఇటలీ, గ్రీసు దేశములందును, చైనా కొరియా దేశములందును కనబడుచున్నది. రాబోవు కాలములో ప్రపంచ మెదుర్కొను సమస్యలలో ఇదియే ప్రధానమైనది.

ఐక్యరాజ్య సమితి మహాసభ

ఆరువారముల క్రిందట న్యూయార్కులో సమావేశమైన ఐక్యరాజ్య సమితి మహాసభలో జరుగుచుండు చర్చలన్నిటిలో రష్యాకును, అమెరికాకును మధ్య ఏర్పడిన ద్వేషము స్పష్టముగ ప్రతిఫలించుచున్నది. అందు సభ్యత్వము వహించియుండు ౫౭ దేశములలో నిష్పక్షపాతముగ విషయములను విమర్శించు దేశములవా రనేకులు లేరు. ఏ నాలుగైదు దేశములో తప్ప—ఇందులో మనది ఒకటి అని సగర్వముగ చెప్పవచ్చును—తక్కిన వాటిలో అనేకములు అమెరికా పక్షమునను, కొన్ని రష్యా పక్షమునను మాటలాడుట మామూలయ్యెను. సాధారణముగ శాసనసభలలో రాజకీయ పక్షములు కొన్ని ఏర్పడునట్లు, సమితి మహాసభలో రెండు ప్రధాన పక్షములు ఏర్పడియున్నవి. అమెరికా పక్షమందలివారు అధికసంఖ్యాకులగుట చేత సాధారణముగ అమెరికామాట గెలుచుటయు, రష్యామాట వీగిపోవుటయు జరుగుచున్నది. తాము సమితిలో ఉండికూడ ఏమియు సాధింపలేకున్నామను అతృప్తి రష్యావారిలో వ్యాపించియున్నది.

మహాసభగాక భద్రతాసభ (Security Council) అనునది సమితియొక్క ప్రధానాంగములలో ఒకటి. ఇందు ౧౧ సభ్యులున్నారు. వారిలో రష్యా, అమెరికా, ఇంగ్లండు, ఫ్రాన్సు, చైనా ప్రతినిధులైదుగురి సభ్యత్వము శాశ్వతము. తక్కిన ఆర్గురిని మహాసభవారు ఎన్నుకొనెదరు. (ఇప్పుడు ఎన్నిక సభ్యత్వములలో నొకదానికై ఇండియాకును, యూక్రైన్ దేశమునకును తీవ్రముగ పోటీ జరుగుచున్నది. ఫలిత మింకను తెలియలేదు.) శాశ్వత సభ్యులందరు ఏకగ్రీవముగ ఆమోదించని తీర్మానము దేనిని కూడ చేయరాదని భద్రతాసభయొక్క సూత్రములలో ఒకటి ఉన్నది. తాత్కాలిక సభ్యులు ఆర్గురున్ను, శాశ్వత సభ్యులలో నలుగురున్ను—అనగా పదిమంది—ఒక తీర్మానమును అంగీకరించినను, శాశ్వతసభ్యులలో ఐదవవాడు—అనగా ఒకడు—దానిని ప్రతిఘటించినయెడల అది వీగిపోవును. ఈ విధముగ ప్రతిఘటించు అధికారమునకు వీటో అధికార మని పేరు. భద్రతా సభయొక్క ప్రధానలక్షణ మిదియే.

దీనియొక్క ప్రాధాన్యమును స్పష్టముగ గ్రహించినగాని సమితిలోని ప్రతిష్టంభనయు, కార్యములు సాధించలేకపోవుటయు ఎట్లు సంభవించుచున్నదో విశదము కాజాలదు. శాశ్వతసభ్యత్వ ముండు దేశములలో రష్యా ఒకటి. కాని రష్యాయొక్క అంగీకారము లేక భద్రతాసభలో ఏ పనికూడ జరుగుటకు వీలులేదు. మహాసభలో అమెరికాపక్షమందుండు సభ్యుల సంఖ్య ఎక్కువగ నుండుటచేతను, అచ్చట ఈ వీటో అధికారము ఎవరికిని లేనందునను రష్యాయొక్క పద్దు గెలుచుట సాధ్యముగుటలేదు. కాని భద్రతాసభలో ఈ వీటో అధికారముండుటచేత రష్యాను కాదని అధికసంఖ్యాకులు ఏపనియు చేయలేకున్నారు. ఇదిగాక మహాసభ సంవత్సరమున కొకపర్యాయము సమావేశమగుచుండును. భద్రతాసభ ప్రతిరోజు సమావేశమగు కార్యనిర్వాహకసభ. దీనికి మహాసభకంటె ఎక్కువ ప్రాధాన్య మున్నది. ఈ సభలో వీటోఅధికారము అగ్రరాజ్యములైదింటికి ఉండుటయు, అమెరికా ప్రతిపాదించిన తీర్మానములు వీగిపోవునట్లు చేయుటకు రష్యా ఈ వీటోఅధికారమును తరుచుగా వాడుచుండుటయు అమెరికాకు ఎంతమాత్రము ఇష్టములేదు.

కాని సమితియొక్క పరిపాలనవిధానమందే ఈ మాత్ర ముండుటచేతను, దానిని రద్దుచేయుట సులభసాధ్యము కాకపోవుట చేతను, ఉపాయాంతరమున రషియాకుగల వీటో అధికారమును తొలగించుటకు అమెరికావారు ఇప్పుడు జరుగుచుండు సమితిమహాసభలో ప్రయత్నము చేయుచున్నారు.

ఇందునిమిత్తమై వారొక తీర్మానమును ప్రతిపాదించిరి. మహాసభ సంవత్సరమున కొకపర్యాయము మాత్రమే సమావేశమగుచుండుటచేత, ఒక సమావేశమునకును ఇంకొక సమావేశమునకును మధ్య ఏదైన ప్రధాన విషయములను చర్చించి పరిష్కరించవలసియున్న యెడల, అట్టివాటిని పరిష్కరించుటకు ఒక ఉపసంఘ ముండవలెననియు, అందులో ఒక్కొక్క దేశము తరఫున ఒక్క ప్రతినిధి ఉండవలెననియు—అనగా అందు ౫౭ సభ్యు లుందురు—ఒక తీర్మానమును అమెరికా ప్రతినిధి ప్రవేశపెట్టియున్నాడు. భద్రతా సభయొక్క అధికారమును—దానితో వీటో అధికారమును—తొలగించు ఉద్దేశముతోడనే ఈ తీర్మానము ప్రవేశపెట్టబడిన దని రషియా ప్రతినిధి దీనిని ఎదిరించెను. దీనిని గురించి సమితిసభలో ఇంకను చర్చలు జరుగుచున్నవి.

ఇదిగాక మరికొన్ని ప్రధాన విషయములు కూడ సమితి మహాసభలో చర్చకు వచ్చినవి. కాని ఒక పాలెస్టయిన్ విషయమునతప్ప తక్కిన అన్నిటిలో రషియా అమెరికాలకు ఎట్టి ఏకీభావము కుదుర లేదు. రషియా పలుకుబడిలో నుండు అల్బేనియా, యూగోస్లేవియా, బల్గేరియాలలో నుండి అనేకులు గ్రీసు దేశమును ప్రవేశించి, అచ్చట ప్రభుత్వమువారిపై తిరుగుబాటు చేయుచుండు కమ్యూనిష్టులకు సహాయము చేయుచున్నారనియు, ఇట్టిది జరగకుండ ఆపుటకై ఐక్యరాజ్యసమితివా రేర్పరచిన కమిటీ యొకటి గ్రీసు సరిహద్దులలో నుంచుట అవసరమని అమెరికా ప్రతిపాదించెను. రష్యా, రషియా అనుచరులు దానిని ఎదుర్కొనిరి. కాని మెజారిటీ అమెరికాపక్షమం దుండుటచేత అది మహాసభయొక్క ఆమోదమును పొందెను. మరికొన్ని విషయములను గురించి చర్చలు ఇంకను జరుగుచున్నవి. వాటిని గురించి ఎట్టి తీర్మానములు చేయబడునో నవంబరులో గాని తెలియజాలదు.

పాలెస్టయిన్

గత సంచిక యందు పాలెస్టయిన్ సమస్య యొక్క స్వరూపము వివరింపబడియున్నది. దానిని గురించి విచారించుటకు ఐక్యరాజ్యసమితి వా రేర్పరచిన కమిటీలో అధికసంఖ్యాకులు పాలెస్టయిన్ రెండు రాజ్యములుగ విభాగము కావలెననియు, ఒకటి యూదుల రాజ్యముగను, ఇంకొకటి అరబ్బుల రాజ్యముగను ఉండవలెననియు సూచించిరి, అల్పసంఖ్యాకులు ఇట్టి విభాగము జరుగరాదనియు, దేశమంతయు ఒకే ఫెడరల్ ప్రభుత్వము క్రింద నుండవలెననియు సూచించిరి. కమిటీలో విభజనసూచనయే ఆచరణయోగ్య మనియు, న్యాయమైన దనియు సమితి మహాసభలో జరిగిన చర్చలలో అమెరికావారు, రషియావారు సూచించిరి. బహుశః సమితిమహాసభలో అధికసంఖ్యాకులు దీని కంగీకరించవచ్చును. కాని విభజన ఎంతమాత్రము జరుగరా దనియు, అట్లు జరిగినయెడల అరబ్బీరాజ్యము లన్నియు వారివారి సేనలతో దానిని ప్రతిఘటించెద రనియు, అందుకై ౨౫ లక్షల సైన్యము ఇదివరకే సిద్ధముగా నున్న దనియు అరబ్బీరాజ్యముల ప్రతినిధులు బెదరించుచున్నారు. అరబ్బీలకు అంగీకారముకాని విధానమును తామెన్నడును అమలు జరుపజాల మనియు, అట్టిదానిని అమలు జరుపు బాధ్యతను ఐక్యసమితివారే వహించవలె ననియు, కొద్దిమాసములలోనే తమ సైన్యములను ఉపసంహరించుకొని పాలెస్టయిన్ వదలిపోవుటకు తాము ఏర్పాటులు చేసుకొన్నట్లును ఇంగ్లీషువారు చెప్పుచున్నారు. అట్టిసందర్భములో పాలెస్టయినులో అరాజకము లేక, శాంతిభద్రతలను కాపాడుటకు ఐక్యసమితి తరఫున ఒక అంతర్జాతీయసైన్యము అచ్చటికి కావలసియుండెను. రషియావారు దేశ విభాగమున కంగీకరించుటలో ఒక రహస్య మున్నదని విషయజ్ఞుల అభిప్రాయము. విభాగమును అమలులో పెట్టుటకై వచ్చు అంతర్జాతీయ సైన్యములో రషియా సైన్యదళములు చేరుటకును, తద్ద్వారా మెడిటరేనియన్ సముద్రప్రాంతదేశములలో ప్రవేశము సంపాదించుటకును తమ కవకాశము కలుగు నని రషియావారి అభిప్రాయము. అనేక సంవత్సరము లుగ ఈ దేశములలో ప్రవేశము సంపాదించుటకు వారు

ప్రయత్నము చేయుచున్నను దానికి తగిన అనుకూల్యము కలుగలేదు. ఇప్పు డట్టి అవకాశము రషియాకు లభించ మన్నది.

కాని దేశము విభాగమై అంతర్జాతీయసైన్య మొకటి అక్కడికి వచ్చినయెడల దానికిని, అరబ్బీసైన్యములకును గొప్పయుద్ధము ప్రారంభమై, మధ్యప్రాచ్యము, పాకిస్థాన్, ఇండియాలు అన్నియు యుద్ధరంగము లగునేమో అన్న అనుమానము అనేకులకున్నది.

పర్షియా

మధ్య ప్రాచ్యము యుద్ధరంగ మగునన్న అనుమానము కలుగుటకు మరియొక కారణముకూడ కలదు. పర్షియాయొక్క ఉత్తరభాగములోని చమురుగనుల విషయమై రషియావారికిని, పర్షియావారికిని ఒక వివాద మున్నదని గతసంచికలో వివరించబడెను. ఆవిషయము పర్షియాశాసనసభలో ఇటీవల చర్చకు వచ్చెను. రషియావారు ఆ చమురుగనులలో భాగస్థులుగ నుండుటకు శాసనసభవారు అంగీకరించలేదు. ఇట్టి సందర్భములో రషియావారు ఊరకుండెదరో లేక ౧౯౪౫, ౪౬లో చేసినట్లు ఉత్తరపర్షియాలో పితూరీను లేవదీయుదురో, వా రట్లుచేసినయెడల ఇంగ్లీషువారు, అమెరికావారు పర్షియాకు సహాయము చేయుదురో చూడవలసియున్నది. మధ్య ప్రాచ్యము రణరంగ మగు ననియే చెప్పవచ్చును.

స్వాతంత్ర్యోద్యమము

అగ్రరాజ్యములమధ్య స్పర్ధ ఏర్పడుట ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల కొక లక్షణము. పాశ్చాత్యుల అధీనమందుండు ఆఫ్రికా, ఆసియాఖండములలోని దేశముల స్వాతంత్ర్య విషయమై ఆ దేశములవారు ప్రారంభించిన స్వాతంత్ర్యోద్యమములు రెండవ లక్షణము. గత మాసములో నాలుగు దేశములకు సంబంధించిన స్వాతంత్ర్యోద్యమము ప్రశంసలోనికి వచ్చెను. అవి కొరియా, ఇండోనీషియా, బర్మా, ఆఫ్రికాఖండములో రెండవ ప్రపంచయుద్ధమునకు పూర్వము ఇటలీవారి అధీనమందున్న లిబియా, ఎరిట్రియా, సోమాలీలాండు మొదలైన దేశములు. (౧) కొరియా ప్రస్తుతము విభాగమై ఉత్తరభాగము రషియావారియొక్కయు, దక్షిణభాగము అమెరికావారియొక్కయు అధీనమం దున్నది. ఈ రెంటిని కలిపి, దేశమునంతను ఒకే కేంద్రజాతీయప్రభుత్వపరిపాలనలో నుంచు విషయమై అనేక సమావేశములు జరిగినను రషియా అమెరికాలమధ్య ఎట్టి సామరస్యము కుదురలేదు. అందుపై ఈ సమస్యను పరిష్కరించుటకు రషియా, అమెరికా, ఇంగ్లండు, చైనాదేశములు నాలుగింటియొక్క ప్రతినిధులు సమావేశమై ఆలోచించవలె నని అమెరికావారీమధ్య సూచించిరి. కాని కొరియా విషయములో ఇంగ్లీషువారికిగాని, చైనావారికిగాని ఎట్టి జోక్యము ఉండరా దని రషియావారీ సూచనను నిరాకరించిరి. అప్పుడు అమెరికావారీ విషయమును ఐక్యరాజ్యసమితి మహాసభలో ఆలోచించవలసినదిగా కోరిరి. రషియా దానిని ప్రతిఘటించెను. కాని ప్రస్తుత మా విషయము మహాసభయందు చర్చింపబడుచున్నది. (౨) ఇండోనీషియాలో డచ్చివారు రిపబ్లిక్ ప్రభుత్వముతో అధర్మయుద్ధమునకు దిగిరనియు, అందుపై భద్రతాసభవారు యుద్ధము నాపవలసినదని రెండు పక్షములవారిని కోరిరనియు, డచ్చివా రాకోరికను మన్నించక యుద్ధమును సాగించుచు ఇండోనీషియా స్వాతంత్ర్యమున కాటంకము కలిగించుచున్నా రనియు ఇదివరలో చెప్పబడియుండెను. ప్రస్తుతము భద్రతాసభవారు ఈ విషయమై విచారణచేసి, ఉభయులకు రాజీ కుదుర్చుటకై ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటుచేసిరి. ఆ కమిటీవారు ఇప్పుడు ఇండోనీషియాలో ఉన్నారు. వా రెట్టి నిర్ణయము చేయుదురో చూడవలసియున్నది. సభ్యులు డచ్చివారియెడ పక్షపాతము వహింతు రన్న అనుమానము లేకపోలేదు.

బర్మా

రెండవ ప్రపంచయుద్ధానంతరము పాశ్చాత్యుల సామ్రాజ్య పాలనలో నుండి విముక్తి గాంచుటకు ప్రయత్నించిన దేశములలో బర్మా ఒకటి. ఈ దేశపు వారు ఆంగ్ సాన్ అనువాని నాయకత్వమున ఒక బలిష్ఠమగు రాజకీయ పక్షమును ఏర్పరచుకొని, దాని యాజమాన్యమున ఒక సైన్యమును కూడ తయారు

చేసుకొని, ఇంగ్లీషు పరిపాలకులపై తిరుగబడ తీర్మా నించుకొనిరి. స్వరాజ్య సంపాదనములో ప్రజలు ఉప యోగించవలసిన సాధనము హింసయా, అహింసయా అను సమస్య వారి నెదుర్కొనలేదు. అప్పటికి బ్రిటిషు వారు బలహీనులై యుండిరి. ప్రపంచ యుద్ధమందు వారికి లభించిన జయము పేరునకు మాత్రమే జయము. జర్మనుల చేతను, జపాన్ వారిచేతను వారు తినిన దెబ్బల మూలమున వారు పూర్తిగ చితికిపోయి యుండిరి. కనుక మంచిమీద తమ పలుకుబడిని నిల బెట్టుకొనదలచి, బర్మావారికి స్వాతంత్ర్య మిచ్చుటకు సహ రంగీకరించి, ఆంగ్ సాన్‌తో సంప్రదింపులు జరి పిరి. ఆంగ్ సాన్ అంతశ్శత్రువుల మూలమున కొన్ని నెలల క్రిందట అకాలమృత్యువు పాలైనను అతనితోడి నాయకులు స్వాతంత్ర్య సంపాదనములో పట్టు విడువక పనిచేసిరి. దీనికంతకు ఫలితముగ కొద్దిరోజుల క్రిందట బ్రిటిష్ పార్లమెంటులో బర్మా స్వాతంత్ర్య చట్ట మనుపేర ఒక చట్టము ప్రవేశ పెట్టబడెను. మూడు నెలల క్రితము మన దేశమునకు స్వాతంత్ర్యము నిచ్చు ఉద్దేశముతో బ్రిటిష్‌వారు ఒక చట్టమును చేసిరి. కాని దానికిని, బర్మా స్వాతంత్ర్య చట్టమునకును గొప్ప భేద మొకటి కలదు. మనకు లభించినది సంపూర్ణ స్వాతం త్ర్యము కాదు. మన కింకను ఇంగ్లండు దేశమును ఏలు రాజు రాజుగ నున్నాడు. అనగా బ్రిటిష్ సామ్రాజ్య ములో మన మింకను ఒక భాగముగ నున్నాము. మనకు వచ్చినది "డొమినియన్" ప్రతిపత్తి. బర్మావారి స్వాతంత్ర్య మిట్టిది కాదు. అది చట్టరీత్యా పరిపూర్ణ మైనది. ౧౯౪౮ జనవరి ౪ తేదీ నుండి బర్మా బ్రిటిష్ సామ్రాజ్యము నుండి విడిపోవును. దానిని ఇంగ్లీషు రాజు పాలించడు. ఇదిగాక మన స్వాతంత్ర్యమునకును, బర్మా స్వాతంత్ర్యమునకును ఇంకొక భేద మున్నది. మన దేశమును మతము ననుసరించి పాకిస్థాన్, ఇండియా అని ముక్కలుగ జేసి బ్రిటిషు వారు స్వాతంత్ర్యము నొసఁగిరి. బర్మాలో కూడ అట్టి విభేదము కల్పించు టకు వారు మొదట ప్రయత్నించిరిగాని, అది సఫలము కాలేదు. స్వాతంత్ర్యము లభించిన తర్వాత బర్మా ఒకే రాజ్యముగ నుండును.

కాని బర్మా చిన్నదేశము. ఆర్థిక వసతులు ప్రస్తుతము చాల తక్కువ. నవీనఆయుధములతో కూడిన గొప్పసైన్యము దానికి లేదు. గొప్పరాజ్యములలో నొకదానియొక్క సహాయము దానికి కొంత కాలము వరకు అవసరము. బ్రిటిషువారికికూడ బర్మాతోడి మైత్రి వర్తకవ్యాపారములకును, తూర్పు ఏషియాలో వారి అధీనమందున్న దేశములతోను, ఆస్ట్రేలియాతోను సంబంధములను నిలబెట్టుకొనుటకును అవసరము. ఆ కారణముచేత స్వతంత్ర బర్మాకును, ఇంగ్లండునకును మధ్య ఒక ఒడంబడిక కూడ జరిగెను. దాని ననుసరించి ఉభయదేశముల వారు వారి సంబంధముల నికమీదట ఏర్పరచుకొనెదరు. బర్మా సైన్యమును, తదితర రక్షక బలమును తయారు చేయుటకు కొంతకాలము వరకు బ్రిటిషు రక్షక కమిటీ (Military Mission) బర్మాలో ఉండును. ఈ కాలములో బర్మావారు మరి ఏదేశము నుండికూడ ఇట్టి రక్షకసాధనమును కోరరాదు. ఇదిగాక బర్మా వారు ఇంగ్లండుకు ఇదివరలో కొంత అప్పు ఇయ్యవలసియుండెను. దానిలో కొంతభాగమును ప్రస్తుతము ఇంగ్లీషువారు తోసివేసిరి. తక్కవదానిని కొన్ని సంవత్సరముల వాయిదామీదను బర్మావారు చెల్లించె దరు. వర్తక వ్యాపారముల విషయమై కూడ బ్రిటిష్ వారికి కొన్ని సదుపాయములు లభించియున్నవి.

బర్మాకు సంపూర్ణస్వాతంత్ర్యము లభించనున్నను బ్రిటిషు వారితో స్నేహ సంబంధము విడిపోదన్నమాట మనము గ్రహించవలసియున్నది. అధికారము మూలమున ఇదివరకు బ్రిటిషువారు బర్మాలో సాధించుచుండిన దంతయు ఇకమీదట స్నేహసాధనమున సాధించు కొన నిశ్చయించిరి.

ఇటలీఅధీనములో నుండిన దేశములు

రెండవ ప్రపంచ యుద్ధమునకు పూర్వము ఆఫ్రికా ఖండములోని దేశములు కొన్ని ఇటలీ పరి పాలనమందుండెను. యుద్ధములో ఇటలీవా రోడి పోవుటచేత అవి అన్నియు ప్రస్తుతము బ్రిటిష్‌వారి ఆక్రమణలో ఉన్నవి. వీటి భవిష్యత్తునుగురించి ఆలో చించుటకు గత మాసములో ఇంగ్లండు, రష్యా,

అమెరికా, ఫ్రాన్సుదేశపు మంత్రులు కొందరు సమావేశమైరి. దానికి ఫలితముగ ఒక కమిటీ ఏర్పాటుచేయబడెను. ఈ కమిటీ ఒక సంవత్సరము ఈ దేశములలో పర్యటనము గావించి ప్రజల అభిప్రాయమును కనుగొనెదరు. అటుపైన వీటి భవిష్యత్తు నిర్ణయింపబడును.

భరతఖండము

అక్టోబరు మాసమున భరతఖండపు పరిస్థితులు మరింత క్లిష్టతరము లయ్యెను. ఆగస్టు ౧౫ తేదీన మనకు లభించిన స్వాతంత్ర్యము నిలబడునా, లేదా అను విషయమును సమగ్రముగ పరిశీలించవలసిన సమయము తటస్థించిన దనియు, దానిని నిలుపుకొనుటకు మన ముపయోగించవలసిన సాధనము లెట్టివో వెంటనే మనము నిర్ణయించుకొని, వాటిని సమకూర్చుకొనినగాని మన స్వాతంత్ర్యము నిలబడజాల దనియు చెప్పవలసిన, పరిస్థితులు సంఘటిల్లినవి. మన ఈ ఇక్కట్టు లన్నిటికి పాకిస్థాన్ తత్వమే మూలము. ఆ తత్వమును ఆధారము చేసుకొని పాకిస్థానము ఎంతకాలము లీగు నాయకుల పరిపాలనక్రిం దుండునో అంతకాలమువరకు ఇండియాకు శాంతి యుండ దనియు, అట్టి తత్వమును పరిపాలనను నాశనముచేయుటకై మన శక్తులన్నిటిని కేంద్రీకరించి వినియోగించవలసియున్న దనియు, అది పూర్తియగువరకు మనము కార్యాంతరముల దేనిని తలపెట్టుటకు వీలుండ దనియు, అట్లు తలపెట్టుటకూడ యుక్తము కాదనియు స్పష్టమగుచున్నది.

పశ్చిమ పాకిస్థానములో నున్న లక్షలకొలది హిందువులను, సిక్కులను అక్కడినుంచి తరిమివేసి, ఒక మహమ్మదీయులనుమాత్రమే పౌరులుగ స్వీకరించుటకు లీగువారును, పాకిస్థాన్ ప్రభుత్వమువారును పన్నిన పన్నాగములు ఇప్పటికి పూర్తిఅయిన వని చెప్పవచ్చును. లక్షలకొలది హిందువులను, సిక్కులను వారు మృత్యువుపాలుగావించిరి. తక్కినవారిని బలాత్కారముగ ఇండియాలోకి తరిమిరి. మిగిలిపోయినవారిని, ముఖ్యముగ సింధురాష్ట్రములోనుండు హరిజనులను మహమ్మదీయ మతములో కలిపి, అల్పసంఖ్యాకుల సమస్య అనునది పశ్చిమపాకిస్థానములో లేకుండునట్లు చేయుటకు వారు సమకట్టియున్నారు. ఈ పనిలో చాలభాగము పూర్తియైనందున ఇప్పుడు వారు వారి దృష్టినంతను కాశ్మీరము వైపు త్రిప్పుకొనియున్నారు.

కాశ్మీరము

ఇందు (౧) కాశ్మీరమని (౨) జమ్మూ అని రెండు భాగము లున్నవి. కాశ్మీరములో మహమ్మదీయుల సంఖ్య ఎక్కువ. జమ్మూలో హిందువు లనేకు లున్నారు. మొత్తముమీద రాజ్యమందంతటను మహమ్మదీయుల సంఖ్యయే ఎక్కువ. కాని రాజ్యమును హిందూరాజు పాలించుచున్నాడు. లీగువారు ఏర్పరచదలచుకొనిన పాకిస్థాన్ రాజ్యములో కాశ్మీరము ఒక రాష్ట్రముగ నుండవలె నని జిన్నా ఏడుసంవత్సరముల క్రిందటనే నిర్ణయించుకొనెను. ఇప్పుడు ఆ నిర్ణయమును ఆచరణలో పెట్టుటకు కావలసిన చర్యనంతను అతడు తీసుకొనుచున్నాడు.

ఆగస్టు ౧౫ వ తేదినుంచి కాశ్మీరమునకును, పాకిస్థానమునకును ఒక ఒడంబడిక జరిగియుండెను. దానికే "యథాతథపు" ఒడంబడిక అను పేరు (Standstill agreement). కాశ్మీరమును ప్రవేశించుటకు కావలసిన రోడ్లు, రైళ్లు మొదలైన రవాణా సౌకర్యము లన్నియు పాకిస్థానములో ఉన్నవి. కాశ్మీరము చేరుటకు పాకిస్థానములోని రవాణా సౌకర్యములు తప్ప సులభ మార్గాంతరము లేవియు లేవు. ఆ రాజ్యమునకు రావలసిన ఆహారపదార్థములు, నూనె, బొగ్గు మొదలైన వన్నియు పాకిస్థాన్ ద్వారానే రావలసియున్నవి. ఇట్టి రాకపోకలు ఆగస్టు ౧౫ తేదీకి పూర్వము ఏవిధముగ జరుగుచుండెనో ఆదేవిధముగ జరుపుటకు పాకిస్థానపు ప్రభుత్వమువా రంగీకరించిరి. యథాతథపు ఒడంబడిక ఉద్దేశ మిదియే.

కాని ఈ ఒడంబడికను మరియొక ఉద్దేశమును సాధించుటకై జిన్నా దుర్వినియోగము చేయ నిశ్చయించుకొనెను. దాని మూలమున కాశ్మీర ప్రభుత్వమునకును, ప్రజలకును చిక్కులు కలిగించి, ఎట్లైనను కాశ్మీరమును పాకిస్థానములో కలుపుకొనుటయే ఈ ఉద్దేశము.

బలవంతముగ సంస్థానములను పాకిస్థానములో గాని, ఇండియాలో గాని కలుపుకొనరా దనియు, సంస్థానములను పాలించుచుండు మహారాజులకు ఈ విషయములో సంపూర్ణ స్వాతంత్ర్య మున్న దనియు ఇష్టము వచ్చినయెడల వారు పాకిస్థానములో గాని, ఇండియాలో గాని చేరక స్వతంత్రముగ నుండ వచ్చు ననియు కొన్ని నెలల క్రిందట జిన్నా ఒక రాజకీయ సూత్రమును ప్రతిపాదించెను. ఈ సూత్రము ననుసరించియే అతడు హిందూప్రజలు అధికసంఖ్యాకులుగ నున్న జునాగడ్ రాజ్యము పాకిస్థానములో చేరుటకు అంగీకరించెను. జునాగడ్‌ను పాలించు నవాబు మహమ్మదీయు డగుటయు, అతని అభీష్టము పాకిస్థానములో చేరుటయు అగుటయే దీనికి కారణము. ప్రజాభిప్రాయానుసారముగ గాక రాజుల అభిప్రాయానుసారము ఈ విషయమున నిర్ణయము కావలె ననుటయే జిన్నా యొక్క తొలి సూత్రము—సిద్ధాంతము.

కాని కాశ్మీరము విషయములో అత డీ సిద్ధాంతము ననుసరించుటకు సమ్మతింపక పోవుటయే గాక, దానికి విరుద్ధముగ ప్రవర్తించసిద్ధపడి కాశ్మీరులోని హిందూప్రజలను నిర్మూలము చేయుటకును, అచ్చటి హిందూ మహారాజును సింహాసన భ్రష్టుని గావించి, తన ప్రభుత్వమును స్థాపించుటకును తీర్మానము చేసుకొనెను.

దీనికి ప్రాతిపదికగా పాకిస్థానము నుండి కాశ్మీరమునకు వెళ్లవలసిన ఆహారపదార్థాదులు వెళ్లనియ్యక చేసెను. మహారాజునకు, ప్రభుత్వమునకు, ప్రజలకు ఇందు మూలమున అనేక కష్టము లేర్పడెను. ఇట్టి ఒత్తిడి మూలమున మహారాజు లొంగిపోయి, శరణాగతుడై పాకిస్థానములో చేరు నని అత డూహించెను.

ఇది జరిగిన కొంతకాలమునకు మరియొక ఉపాయమును పన్నెను. సరిహద్దుప్రాంతములలో అఫ్రీడీలు మొదలైన పఠానులు ఎందరో ఉన్నారు. చుట్టుపట్ల నుండువారిని దోచుకొనుటయే వీరి ప్రధానవృత్తి. వీరిలో కొందరు పాకిస్థాన్ సైన్యములో చేరినవారు. వీరందరు మహమ్మదీయులు. వీరిద్వారా కాశ్మీరముపై దండెత్తుటకు జిన్నా పన్నాగము పన్నెను. ఈ ఉద్యమము అక్టోబరు మధ్య ప్రారంభమయ్యెను. అప్పటినుండి పాకిస్థానములోని రోడ్లద్వారాను, రైళ్లద్వారాను వేనవేల అఫ్రీడీలు కాశ్మీరమును ప్రవేశించి, పల్లెలను, పట్టణములను దోచుకొని, హిందువులను సిక్కులను నిర్మూలముజేసి, సుభిక్షములగు ప్రదేశములను అగ్నిదగ్ధము గావించి, తుదకు ప్రధానపట్టణమగు శ్రీనగరమును పట్టుకొను ఉద్దేశముతో దాని సమీపమును చేరిరి. ఈ దోపిడీగాండ్రవద్ద నవీనములగు సైనికపరికరము లుండెను. టాంకులనుగూడ వారు వాడుచుండిరి. వారిలో అనేకులు పాకిస్థాన్ సైన్యమునకు చెందినవారు. వారి వశమందున్న లారీలు పాకిస్థానములోనివి. వారికి కావలసిన పెట్రోలంతయు పాకిస్థానమునుండియే లభించుచుండెను.

తన రాజ్యములోనికి రావలసిన ఆహారపదార్థములను రానీకచేయుటయు, దోపిడిగాండ్రకు కావలసిన సదుపాయముల నన్నిటిని సమకూర్చుటయు పాకిస్థాన్ ప్రభుత్వమునకు తగని పని అనియు, అట్టి అక్రమములు వెంటనే ఆపుట అవసర మనియు, వాటిని ఉపనివర్తనమున ఇండియాప్రభుత్వముయొక్క సాహాయ్యమును తాను కోరవలసియుండు ననియు కాశ్మీరమహారాజు జిన్నాకు తెలిపెను. ఇండియాసాహాయ్యమును అతడు కోరనున్నాడను మాట వచ్చినవెంటనే అతడు మరింత ఉగ్రుడయ్యెను. మహారాజుకోరికలను నిరాకరించెను. అప్పుడు మార్గాంతరము లేక, తన రాజ్యమును, ప్రజలను దుండగీండ్రయొక్కయు, దోపిడిగాండ్రయొక్కయు ప్రమాదమునుండి తప్పించుటకు మహారాజు ఇండియాప్రభుత్వ సహాయమును కోరుచు, కాశ్మీరము ఇండియాలో చేరుటకు సమ్మతించెను.

వెంటనే ఇండియా ప్రభుత్వము వారు అతనికి సహాయము చేయ నిశ్చయించి, సైన్యములను కొన్నిటిని కాశ్మీరమునకు పంపిరి. ప్రస్తుతము ఈ సైన్యములకును, సాయుధులగు దోపిడిగాండ్రకును భీకరయుద్ధము జరుగుచున్నది. పేరునకిది దోపిడిగాండ్రతో యుద్ధమైనను నిజముగ ఇది పాకిస్థానముతోటి యుద్ధమనియే చెప్పవలసియున్నది. పాకిస్థాన్ ప్రభుత్వపు సహాయ సాధన

మునానే ఈ దోపిడిగాండ్రు కాశ్మీరమును ప్రవేశించుటయు, ఇప్పటికికూడ అట్టి సహాయము వారికి లభించుచుండుటయు ఇట్లు చెప్పుటకు కారణము.

ఈ సందర్భములో మరియొక ప్రధానవిషయమును గమనించవలసియున్నది. కాశ్మీరము ఇండియాలో చేరుటకు ఇండియా ప్రభుత్వమువారు తాత్కాలికముగ అంగీకరించిరి. బహుప్రమాదావస్థలో నున్న మహారాజును, రాజ్యములోని ప్రజలను రక్షించుటయే వారి ఉద్దేశము. పాకిస్థానములో నుండి తరిమివేయ బడిన సిక్కులు, హిందువులు అనేకులు కాశ్మీరములో చేరియుండిరి. వారిని రక్షించుటకూడ అత్యవసరమయ్యెను. ఇదిగాక, ఇట్టి సహాయమును మహారాజు మాత్రమే గాక, కాశ్మీరులో జాతీయ పక్షమునకు నాయకుడైనట్టియు, అనేక సంవత్సరములుగ ప్రజాస్వాతంత్ర్యమునకు పోరాడుచుండినట్టియు షేక్ అబ్దుల్లా కూడ దీనిని కోరెను. మహారాజు షేక్ అబ్దుల్లా యొక్క నాయకత్వమున మంత్రివర్గమును ఏర్పాటు చేయుటకు అంగీకరించెను.



కనుక కాశ్మీర వ్యవహారములలో ఇండియా ప్రభుత్వము వారు జోక్యము కలిగించుకొనుట ప్రజాపక్ష నాయకుడును, ప్రస్తుతము ప్రధానమంత్రియు నగు షేక్ అబ్దుల్లా యొక్క అనుమతిమీదనే అన్నమాటను మనము మరువ కూడదు.

కాని జిన్నాకు షేక్ అబ్దుల్లాయొక్క నాయకత్వము కొంచెముగూడ గిట్టలేదు. ఇతడు తీసు వర్గమునకు చెందిన నాయకుడు కాడు. హిందువులను, సిక్కులను సోదరప్రాయులవలె భావించి, వారి సహకారముతో రాజ్యమును పాలించువాడు. మహమ్మదీయేతరులను నిరూ్మలము గావించి, వారి ఆస్తిపాస్తులను దోచుకొని, వారిని బలాత్కారముగ మహమ్మదీయ మతములో కలుపుకొని, వారి స్త్రీలను చెరచు లీగు సిద్ధాంతమునకును, పాకిస్థాన్ తత్వమునకును ఇతడు పరమవిరోధి. వాయవ్య సరిహద్దురాష్ట్రములో ఖాన్ సోదరు లెట్టివారో కాశ్మీరమందు షేక్ అబ్దుల్లా అట్టివాడు. అందుచేతను జిన్నాకు అతనియందు పరమ ద్వేషము. అట్టివాని నాయకత్వమున కాశ్మీరములో మంత్రివర్గము ఏర్పడుట అతని కెంతమాత్రము ఇష్టము లేదు. లీగు నాయకత్వమున మంత్రివర్గమును, రాజ్యపాలనమును స్థాపించవలె నని జిన్నా ఆదర్శము. అదే జరిగినయెడల పశ్చిమపాకిస్థానములోని హిందువులకును, సిక్కులకును ఎట్టి దుర్గతి పట్టెనో అట్టి దుర్గతియే కాశ్మీరములోని మహమ్మదీయేతరులకు పట్టును.

ఇంకొక విషయముకూడ ఇచ్చట గమనింపవలసియున్నది. భూగోళరీత్యాకూడ కాశ్మీరమునకు ఇండియాతో సంబంధము లేకపోలేదు. అది దక్షిణదిక్కులో కొంత భాగమున తూర్పుపంజాబును ఆనుకొనియున్నది. భూగోళదృష్ట్యా అది తప్పక పాకిస్థానములో చేరవలె నని చెప్పుట అసందర్భము.

ఇంతకును ప్రజాభిప్రాయ మెట్లుండునో అట్లే చేయవలె నను సూత్రమును ఇండియా ప్రభుత్వమువారు పూర్తిగ నమ్మియున్నారు. జిన్నావలె దౌర్జన్యమును, దోపిడిని, దండయాత్రలను సాధనములుగ నుపయోగించి కాశ్మీరమును ఏలాగైనను ఇండియాలో చేర్చుకొనుట వారి అభిమతము కాదు. ఇప్పటికికూడ వారి సూత్ర మిదియే. ఇప్పుడు జరుగుచుండు యుద్ధము ముగిసి, శాంతిభద్రతలు ఏర్పడినతర్వాత— అవసరమైనయెడల ఐక్యరాజ్య సమితివారి యాజమాన్యమున—కాశ్మీరము

లోని ప్రజల అభిప్రాయమును తెలుసుకొని, వారిలో అధికసంఖ్యాకులు పాకిస్థానములో చేరవలెననిన అట్లే చేయుటయు, ఇండియాలో చేరవలెననిన అదే విధముగ చేయుటయు, సమంజసమైన పద్ధతి యని ఇండియా ప్రధాని పండిత నెహ్రూ నిర్వచించియున్నాడు.

మహమ్మదీయేతరుల నందరిని దోపిడి చేసి, నిర్మూలము గావించి, తమ అధికారమును దౌర్జన్యము ద్వారా స్థాపించవలెనని విశ్వసించు లీగువారు కాశ్మీరమునకు పాలకులై, దాని భవిష్యత్తును నిర్ణయించవలెనా, లేక మతభేదములను పాటింపక, వారు లందరిని ఒకే విధముగ ఆదరించుటయే ఉత్తమ రాజకీయ ధర్మమని విశ్వసించు షేక్ అబ్దుల్లా నాయకత్వమునకు లోబడిన ప్రజా పక్షమువారు పాలకులగుటయా అనునదియే సమస్య. పాకిస్థాన్ తత్వమును, లీగు చర్యల చరిత్రను తెలిసినవా రెవ్వరుకూడ కాశ్మీరములో లీగు ప్రభుత్వ మేర్పడుట ధర్మమని చెప్ప సాహసించరు.

పాకిస్థాన్ తత్వము

మతముపేర మహమ్మదీయులు మహమ్మదీయేతరుల మధ్య యుద్ధముల లేవదీసి, మహమ్మదీయేతరుల భోగభాగ్యములను, స్త్రీలను, ప్రాణములను అపహరించుటయే పాకిస్థాన్ తత్వము. కాశ్మీర విషయములో వారిట్టి రాజనీతినే అనుసరించుచున్నారు. ఇందులో వారు విదేశములలోని మహమ్మదీయుల సహాయమును అపేక్షించుచున్నారు. ఇండియాలో హిందూ సామ్రాజ్యమొకటి ఏర్పడిన దనియు, ఈ సామ్రాజ్యాధికారులు మహమ్మదీయులను, పాకిస్థాన రాజ్యమును నిర్మూలము చేయుటకు సర్వ విధముల ప్రయత్నము చేయుచున్నారనియు, అట్టి ప్రమాదము నుండి మహమ్మదీయ మతమును రక్షించుట ప్రపంచములోని మహమ్మదీయు లందరి ధర్మమనియు ప్రచారముచేసి, అట్టి సహాయమును సంపాదించుటకై పాకిస్థాన్ ప్రభుత్వము తరఫున ఫీరోజు ఖాన్‌నూన్ మధ్య ప్రాచ్యములోని టర్కీ, ఇరాన్ మొదలైన మహమ్మదీయ రాజ్యములలో పాకిస్థాన్ రాయబారిగ పర్యటనము సాగించుచున్నాడు. ఇట్టి ప్రచార ఫలితముగ ఇరాన్ వారు కాశ్మీర యుద్ధము మహమ్మదీయులకు సహాయము చేయుట అవసరమని అప్పుడే అభిప్రాయ పడుచున్నారు. పాకిస్థానమునకు ఐక్యరాజ్య సమితి సభ్యత్వమునకు అర్హత లేదనియు, జిన్నా వాయవ్య సరిహద్దు రాష్ట్రములోని పఠానులకు స్వాతంత్ర్యము నియ్యక అడ్డుతగిలెనని వాదించిన అఫ్ఘనులుకూడ ఇప్పుడు అతనికి అభిముఖులైరి. కనుక ఇండియా స్వాతంత్ర్యమునకు ఒక పాకిస్థాన్ రాజ్యమునుండియేగాక, పాకిస్థాన్ తత్వమును విశ్వసించు యావత్తు మహమ్మదీయ ప్రపంచమునుండి ప్రమాదము రానున్న దనియు, ఇండియా రాజ్యములోని లీగుసభలలో సభ్యులుగ నుండు మహమ్మదీయు లందరు పాకిస్థాన్ తత్వము నమ్మినవారనియు, వారిమూలమున మన స్వాతంత్ర్యమునకు విపరీతమైన ప్రమాదము రానున్నదనియు ఇండియాలోని ప్రజలు, ప్రభుత్వము గ్రహించి, ఈ ప్రమాదములనుండి రక్షించుటకు కావలసిన సాధనసామగ్రిని సమకూర్చవలసియున్నది. ఆ సాధనసామగ్రి ఎట్టిదో విపులముగ వివరించుట కిచ్చట అవకాశము చాలదు.

మహమ్మదీయుల ఆయుధ సేకరణ

ఈమధ్య అనేకపట్టణములలో మహమ్మదీయుల ఇండ్లలో కత్తులు, కటారులు, తుపాకులు, బాంబులు, బాంబులుచేయుటకు కావలసిన పరికరాదులు దొరికినట్లు పత్రికలమూలమున తెలియుచున్నది. మసీదులు కొన్నిటియందు కూడ ఇవి దొరికినవి. కనుక దేశమందు, పాకిస్థాన్‌తత్వమును విశ్వసించువారి మూలమున ఎట్టి ప్రమాదములు రానున్నవో ప్రత్యేకముగ చెప్పవలసినదిలేదు.

హైదరాబాదు

హైదరాబాదునకును, ఇండియా ప్రభుత్వము వారికిని మధ్య జరుగుచుండు రాయబారముల స్వభావమును గుర్తెరుగుటలో ఈ పాకిస్థాన్‌తత్వమును మరవకూడదు. హైదరాబాదు ఎన్నటికికూడ ఇండియాలో చేరజాల దనియు, సంపూర్ణస్వాతంత్ర్యమును నైజాం ఎన్నడుకూడ విడనాడ దనియు హైదరాబాదు ప్రభుత్వమువా రనేకపర్యాయములు ప్రకటించిరి.

అట్టి సందర్భములో ఎందునిమిత్తమై ఈ రాయబారములు జరుగుచున్నవో తెలియకున్నది. ఈ సందర్భమున, అక్టోబరుమాసములో జరిగిన చర్యలలో కొన్ని ముఖ్యముగ గమనింపవలసియున్నవి: (౧) హైదరాబాదు ప్రభువగు నైజాం హైదరాబాదులో పాకిస్థాన్ తత్వమును అనుసరించుచుండువట్టియు, తీసులో చేరినట్టియు మహమ్మదీయ నాయకుల చేతులలోని కీలుబొమ్మ. వా రెట్లు ఆడించిన అట్లు ఆడువాడు. ప్రధానమంత్రియగు చతారినవాబుయొక్క గాని, శాంతతతో కూడి ఉద్యోగమందుండు ఇతర మంత్రులయొక్క గాని, సలహాదారులయొక్క గాని సలహాలను వినక, ఈ మహమ్మదీయ నాయకులకు విధేయుడై ప్రవర్తించుచున్నాడు. అనేకపర్యాయములు ఢిల్లీకి వెళ్ళి, పటేల్ మొదలయిన వారితో సంప్రదింపులు గావించి, సంధి పత్రము నొకదానిని తయారుచేసి, నైజాం యొక్క సమ్మతినిగూడ సంపాదించ గలిగిన ప్రధానమంత్రియు, ఇతర సలహాదారులున్న ఉద్యోగములనుండి విరమించుకొనవలసి వచ్చెను. తీసు నాయకులు నైజామునకు సలహాదారులగుట సంభవించెను. వారి యాజమాన్యమున ప్రస్తుతము హైదరాబాదు ప్రభుత్వము వారు ఇండియా ప్రభుత్వముతో రాయబారములు జరుపుచున్నారు. కాని పాకిస్థాన్ తత్వము ననుసరించువారితో ఇండియా ప్రభుత్వమునకు ఎన్నడైన పొత్తు కుదురునా? (౨) కాలయాపనచేసి, ఇండియా ప్రభుత్వమును ఎదుర్కొనుటకు కావలసిన సాధనములను, సైన్యములను, ఆయుధములను సమకూర్చుకొనుట కవకాశము సంపాదించుటయే ఈ రాయబారముల ఉద్దేశమని స్పష్టమగుచున్నది. ఈ మధ్య ఇండియాలోని వివిధ రాష్ట్రముల నుండి లక్షలకొలది మహమ్మదీయులు హైదరాబాదును ప్రవేశించిరి. ఎవరి నాయకత్వమున ఇప్పుడు రాయబారములు జరుగుచున్నవో ఆ పక్షము వారే ఈ మహమ్మదీయులను హైదరాబాదుకు రప్పించి, వారికి భూములను, వసతి గృహములను ఇచ్చి, సాయుధుల గావించి వారిద్వారా మహమ్మదీయ సైన్యము నొకదానిని తయారు చేయుచున్నట్లు తెలియుచున్నది. హిందువులను నిర్మూలము చేసి, వారి యాస్తులను, ఇండ్లను, భూములను మహమ్మదీయులకు ఇచ్చుట పాకిస్థాన్ తత్వములో ఒక భాగము. అట్లు చేయుట ధర్మవిరుద్ధము కాదనియు, మహమ్మదీయ మతము వృద్ధిగాంచుటకు అదియే ముఖ్య సాధనమనియు ఆ తత్వము బోధించుచున్నది. రాష్ట్రముల నుండి మహమ్మదీయులను హైదరాబాదులోనికి రప్పించు ఉద్యమము ఈ తత్వమును ఆచరణలో పెట్టుటకై నిర్ణయము చేయబడినది. దీని మూలమున హైదరాబాదులోని హిందువుల కష్టములు అపరిమితము లగుచున్నవి. (౩) ఇండియా మధ్య భాగమందు పాకిస్థానము నొకదానిని సృష్టించుటయే నైజాం సలహాదార్ల ఉద్దేశము. సత్యాగ్రహము చేయుచుండువారిని నానా విధములుగ బాధించి, అల్ప సంఖ్యాకులగు మహమ్మదీయుల ప్రభుత్వమును శాశ్వతముగ నిలబెట్టుటకు వీరు సిద్ధపడియున్నారు. వీరి చర్యలమూలమున పరిస్థితులు విషమించగల వన్నమాటను మనము మరవరాదు.

మైసూరు

మైసూరులో సత్యాగ్రహోద్యమము జయప్రదముగ ముగిసినది. కాంగ్రెసు నాయకుల ఆధ్వర్యమున క్రొత్త మంత్రివర్గము అధికారములోనికి వచ్చినది. అనవసరముగ రెండుమూడు మాసములకాలము దివాను, మహారాజుయొక్క ఇతర సలహాదారులును ప్రజలను హింసించిరి. ఇట్టి హింసాకాండ లేకయే మూడు నెలల క్రిందనే ప్రజాప్రభుత్వమును స్థాపించియుండినయెడల మహారాజు ఎంతో శ్లాఘాపాత్రుడై యుండెడివాడు. ఇప్పటికైన అతడు దుష్టుల సలహాలను పరిత్యజించి, వివేకవంతుడై, ప్రజాప్రతినిధులగు మంత్రులను నేర్పరచుట ప్రశంసనీయమగు విషయమే. వీరు ప్రజాపరిషత్తుద్వారా క్రొత్తరాజ్యాంగమును నిర్మించనున్నారు. నిరంకుశప్రభుత్వ మడుగంట నున్నదనియు, ప్రజాప్రభుత్వము ముందుకు రానున్న దనియు అనుకొనుటకు ఇది యొక గొప్ప నిదర్శనము.

మద్రాసు రాష్ట్రము

మద్రాసు రాష్ట్రములో విమర్శించతగ్గ విషయము లనేకములు అక్టోబరులో జరిగినవి. జమీందారీల రద్దు విషయమై కాంగ్రెసు హైకమాండువారు మద్రాసు మంత్రివర్గమువారి కిచ్చిన సలహా ఇట్టి విషయములలో ఒకటి. అమ్మకపుపన్నును హెచ్చించుటకై ప్రవేశపెట్టబడిన బిల్లు మరియొకటి. భాషాప్రయుక్త రాష్ట్రమునుగురించి శాసనసభలో (Council) చేయబడిన తీర్మానము, ఆంధ్రరాష్ట్రమును గురించి సంఖ్యలలో జరిగిన రాయలసీమ మహాసభ వారు చేసిన తీర్మానము ఇంకొకటి. వీటినన్నిటిని రాబోవు నెలలో విమర్శించెదను.

(1-11-'47)

ప్రాచీన భూగోళము

౪

— శ్రీ వేలూరి శివరామశాస్త్రి —

ఎవరును ఒక మేరుపర్వతమునే సంపూర్ణముగా చూచియుండలేదని మనము మొదటి వ్యాసమున చూచియున్నాము. ఆ కాలమున భూభ్రమణ మొనరించిన కొందఱు ఋషులు తాము చూచినంత వఱకును కొందఱకు చెప్పిరి. ఆ విన్నవారు తాము విన్నంత మాత్రము వినవారికి చెప్పిరి. అంతటితో సరి. తావన్మాత్రమే పురాణములలో ప్రవేశించెను.

వాయు విష్ణు మత్స్య పురాణముల తరువాత జైనులు వానినే అనుసరించి వర్షములను, వర్ష పర్వతములను, నదులను చెప్పిరి. భూమి, సూర్యుడు, చంద్రుడు, గ్రహములు—వీని పొడవు, వెడల్పు మొదలగు లెక్కలలో మాత్రము భేదించిరి. వారు వీని లెక్కలను కనుగొనుట కొక సూత్రగ్రంథము రచించిరి. ఈ జైన సూత్రరచన క్రీ. శ. ౫౦౦-౬౦౦ నడుమ నని విమర్శకుల అభిప్రాయము. ౬వ శతాబ్దమునకు చెందిన ఆర్యభటుడు[1] ఈ జైనగణితమును చూచెనో లేదో యిపుడు మనము తెలిసికొనుట కాధారము దొరకదు.

ఈ ప్రాచీన భూగోళము వలన మన కిపు డేమియు నుపయోగము లేనట్లే ఆ జైనసూత్రము వలనను మన కిపుడు ఉపయోగము లేదు. ఆర్యభటుని కడనుండి నేటివఱకును పెరుగుచు వచ్చిన గణితము మాత్రము ప్రశంసనీయము.

పురాణ మతమును, సిద్ధాంత మతమును ఒకటే. సిద్ధాంతములు పురాణములకు విశదమయిన వ్యాఖ్యలు. సవ్యాఖ్యలు దక్షిణధ్రువముకడ నున్న పుష్కరాది ద్వీపములను పడమటికి తెచ్చి కేతుమాలమున బడవైచిరి. రెండవ వ్యాసమున ప్లక్షాది ద్వీప టీకలను జూచునది. దానికి వారు చెప్పగల హేతువు లివి.

౧. (అ) పురాణము లీ ద్వీపము లెచట నుండెనో చెప్పలేదు. భాస్కరాదు లీ ద్వీపములను దక్షిణమున కుక్కిరి.

(ఆ) అచట నిపు డీ యేడు ద్వీపములు లేవు సరికదా ఆఱంగుళముల నేల యైనను లేదు.

౨. ఈ ద్వీపములలో నొకటయిన శాకద్వీపమునకు తూర్పుగా మేరు వున్నదని మత్స్యపురాణము చెప్పెను. కావున మేరువునకు ఇది పడమట నున్నది. మఱియు నీ దీవి లోకదానికంటె మఱియొకటి పరముగా నున్నదని పురాణములలో కలదు కావున నివి పడమటి సముద్రమువఱకును కేతుమాలమునం దంతర్గతములు.

౩. (అ) రవి దక్షిణమునుండి మరలి విషువమునం దుండునపుడు పాలపుంత ఉత్తరాంతమున నుదయించును (వా. ౫౦-౧౨౫).

---

1. 'షష్ట్యబ్దానాం షష్టి ర్యదా వ్యతీతా స్త్రయశ్చ యుగపాదాః
త్ర్యధికా వింశతి రబ్దా స్తదేహ మమ జన్మనోఽతీతాః'

'కలి ౩౬౦౦ ఏండ్లు చనగా నా కిరువదిమూడేండ్లు నిండెను. అనగా ఆర్యభటుడు ౩౫౭౭ కల్యబ్దమున పుట్టెను. కల్యబ్దమునుండి ౩౧౭౯ తీసివేయుచో శకాబ్దములు వచ్చును. కావున ౩౯౮ వ శకాబ్దమున ఆర్యభటుని పుట్టువు.

అతడు తన ౨౩ వ ఏట సూర్యసిద్ధాంతము రచించెను. భూమి గోళ మని సిద్ధాంతీకరించిన దితడే. ఇతడు జ్యోతిర్గురువు. ఆర్యభటుని గ్రీకులు అందూబేరియస్ లేక అర్దూబేరియస్. అరబ్బులకు ఆర్‌జభర్. ఇతని సిద్ధాంతము అర్కండ్. ఇతని బుద్ధికి పాశ్చాత్యు లంద రాశ్చర్యపడిరి.

(అ) పుష్కరము నడుమ నుండి రవి యేగు తఱి ౩౦° భాగ (వా. ౫౦-౧౧౯)

(ఇ) వైశ్వానరపథమునకు వెలుపల నున్నపుడు రవి మొదటి వెలుగు పుష్కరముగుండ ప్రవర్తించును (మ. ౧౨౪-౭౧). రవి ఉత్తరాయణమున ౬వ దీవి యగు శాకద్వీపపు ఉత్తరాంతమున శ్రవణమునందుదయించును. రెండవ వ్యాసమునందలి మూడవ చిత్రము చూచునది.

ఈ దేవేంద్ర కుమార రాజారామ పటేల్ గారు తమ Cultural History from the Vayu purana ౩౧౬ వ పుటలో వాయుపురాణమునందలి ౫౦-౧౧౯ శ్లోకమునకు "When the Sun passes over the centre of Pushkara one third of the earth is traversed by the sun in one Muhurtha" అని అర్థము వ్రాసిరి. అనగా పుష్కర మధ్యము మీదుగా పోవునప్పటికి రవి ఒక ముహూర్తమున భూమి మూడు వంతులు కడచును. కావున పుష్కరాది ద్వీపములు ౩౦౦ వ Latitude లో (అక్షాంశములో) నున్నవి.

ఈ పై హేతువులన్నియు హేత్వాభాసములు. ఇంతియకాక ఈ హేతువులు పుష్కరాదులు నిరక్ష రేఖకు క్రింది వనుటకే సాధకములు. చూడుడు—

౧. (అ) వాయుపురాణ ముత్తర మేరువు మొదలుకొని దేశముల నుగ్గడించుచు జంబూ ద్వీపము కడకును, తదనుద్వీపముల కడకును వచ్చి పుష్కరాంతమగు ద్వీపములను జెప్పి లోకాలోకమును జెప్పెను. (చూ. వాయు. ౪౦-౧౦౭) అంతటితో దక్షిణదిగంతము.

యోగవాసిష్ఠమున దిగంతముల గమనగోవ జేసిన విపశ్చిత్తులలో పశ్చిమవిపశ్చిత్తు కేతుమాలమున కేగ ననియు, దక్షిణ విపశ్చిత్తు ప్లక్షాది ద్వీపముల కేగెననియు కలదు. కావున భాస్కరాదులును, జ్యోతిస్సంహితాకారులును మనకంటె సరిగా అర్థము చేసికొనియే యీ దీవులెల్లను నిరక్షరేఖక్రింద యామ్యార్థమున నున్నవని చెప్పిరి.

(ఆ) జపానుచుట్టుప్రక్కల నున్న దీవు లెన్ని మునుగుచున్నవో, ఎన్ని తేలుచున్నవో ఎవ రెఱుంగరు! కావున నివి యెప్పుడో మునిగియుండును.

౨. శాక ద్వీపములో నున్న ఒక వర్ష పర్వతము పేరు మేరువు. ఈ మేరువు వేఱు, మహామేరువు వేఱు (చూ. మత్స్య ౧౨౨-౭). ఈ మేరువులో నొక ఉదయ పర్వతమును, ఒక అస్తపర్వతమును గలదు. ఈ నవ్యులు ఈ మేరువును ఆ మేరువును ఒకటే అని అనుకొని ఈ ఉదయాస్తములను మహామేరువున కంటగట్టి ఒక చిత్రగవు సృజించిరి. ఒకటవ వ్యాసమున మూడవ చిత్రము చూచునది. ఈ మేరువు మహామేరువుకంటె వేఱగుటవలన శ్రీధరస్వామితో విరోధము లేదు. (మా-౨ వ్యాసము. శాకద్వీపపు ౬ వ టీక)

౩ (అ) వాయుపురాణమునందలి ౧౦-౧౨౫ శ్లోకములోని 'క్షీరోదస్య సముద్రస్య'కు 'పాలవెల్లి' అని అర్థము కాని 'పాలపుంత' అని అర్థము కాదు. శాకద్వీపము క్షీరసముద్రములో నున్నది. 'క్షీరోదమునకు' ఈ రెండర్థములును కలవు. దానకే వీరిట్టులు పొరపడిరి.

(ఆ) పుష్కరమధ్యముగా రవి యేగుతఱి ౩౦° భాగ (వా. ౫౦-౧౧౯) ఇది దక్షిణదిగ్భ్రమణపు ముచ్చటగాని ఉత్తరదిగ్భ్రమణపు ముచ్చట కాదు. కావుననే—'ఈనడకతో రవి మాఘమున దక్షిణదిగంతమున కరుగును' అను నర్థము కల 'ఏకేన గతియోగేన యదాకాష్ఠాంతు దక్షిణామ్, పర్యాగచ్ఛేత్తదాఽఽదిత్యో మాఘే కాష్ఠాంత మేవహి' అను తదుత్తరశ్లోకము సంగతమగును. నవ్యులు క్షితిజమునకు ఉత్తరమున ౩౦°వ భాగ అని అనుకొని దాని కనుగుణముగా పటము లిఖించిరి (చూ. రెండవ వ్యాసమున మూడవచిత్రము). కాని వారు క్షితిజమునకు దక్షిణమున గూడ ౩౦°వ భాగ కల దను మాటయే మఱచిరి. రవి ఒక ముహూర్తములో క్షితిజమునకు ఉత్తరమున ౩౦°వ భాగలో నుండు కొంత విపరీతవ్యాపారాలోచింపరైరి.

దీని కర్థ మిది :—

రవి దక్షిణపుకొన నున్న పుష్కరముమీదుగా ఉత్తరమున నున్న ధ్రువచక్రమువఱకు నడచును. రవి పుష్కరముమీద నున్నపుడు, అనగా దక్షిణాయనమున మౌహూర్తికగతితో నడచుచు ౩౦ అంశలు గడచును. పగలు ఆఱురాసులు, రేయి ఆఱురాసులు ౧౨ × ౩౦=౩౬౦ అంశలు. కావున ముహూర్తమునకు ౩౦ అంశలు నడచు నని దీని కర్థము (విష్ణుపురాణము ౨-౮-౪౫, ౪౬ చూచునది). ఉత్తరాయణ మౌహూర్తికగతి వేఱు, దక్షిణాయన మౌహూర్తికగతి వేఱు. దాని గణనము వాయ్వాది పురాణములలో గలదు (మా. వా. ౫౦-౧౨౮, ౧౨౧).

(ఇ) ఈ శ్లోకమునందు (మ. ౧౨౪-౭౧) 'లోకసంతానతః... బహిః' అని ఉన్నది. దీనిని నవ్యులు పరికింపక అర్థము లెంచక వదలివేసిరి. 'లోకములకు వెలపల' అని దాని కర్థము. అదియే ఇచట వైశ్వానర పథ బహిర్భాగము. కావున రవి సర్వదక్షిణమున నున్నపుడు అతని తొలివెలుగు పుష్కరమునుండ ప్రసరించు నని అర్థము. పుష్కరము పడమటి కొన నుండు నేమి! ఎక్కడో దక్షిణమున ఉన్న సూర్యుని తొలి వెలుగు పుష్కరముమీదుగా ప్రసరించు నేమి? ఇది ఎటులేని పొసగునా? కావున పుష్కరద్వీపము దక్షిణాగ్రమున కుమేరువుకదా యున్నదని అంగీకరింపవలెను. రెండవ వ్యాసములోని వారి మూడవచిత్ర మెంత విపరీతమో ఇపుడు చూడుడు.

(ఈ) శ్రీ పఠేల్ గారు 'త్ర్యంశాంశకమ్'అను పదమునకు 'మూడువంతులు'అని అర్థము చేసికొనిరి. కాని అది కాదు. ఇది అచ్చుతప్పు. 'త్రి + అంశ + అంశ' అనునది తప్పు కాదా? 'త్రింశాంశకం'అను పాఠాంతరము వీరు చూడలేదు. త్రింశాంశమనగా ౩౦ వ అంశ. విష్ణుమత్స్యములలో 'త్రింశద్భాగంతు మేదిన్యాః' అని విస్పష్టముగానే కలదు (చూ. విష్ణు. ౨-౭; మత్స్య. ౧౨౪-౪౧). కావున వీరు తీసిన అర్థములవల్లను, గీచిన పటములవల్లను పురాణభూవిన్యాస మంతయు తల్లక్రిందులాయెను.

రెండు మేరువులు

పురాణముల ఉద్దేశముల ప్రకారము గీచిన ఈ క్రింది చిత్రమును జూచినచో మేరుద్వయకల్పనము వ్యర్థము. మేరువుచుట్టును ఇలావృత మున్నది. మేరువు పొడవు ౧౬ వేల యోజనములు. ఇలావృతము మేరువునకు ఉత్తరమున ౯, దక్షిణమున ౯ వేల యోజనముల విస్తీర్ణము. వెరసి ౩౪,౦౦౦ యోజనములు.

మేరువునకు ఉత్తరమున నున్నది ఉత్తర దిగాకాశమును, ధ్రువమును అని మూడవ వ్యాసమున చూచితిమి.

భూమి గోళమైనను ఇది యంతటను గుండ్రము కాదు. ఉత్తర దక్షిణధ్రువముల వైపున నున్న ప్రదేశము లనుముడుపడి నార్దలాకరిణివలె నుండును. దాని చుట్టుకొలత కొన్ని వేల యోజనములు. కావున నచటను దిగ్విభాగము కలదు. 'అట నుండువారికి ధ్రువతారకా స్థితికముకాన ఉత్తర దిక్కనగా ఊర్ధ్వ దిశయే, దక్షిణదిక్కనగా అధోదిశయే' అని అందురు కాని అచటను కొన్ని వేల యోజనముల సమవిస్తృత ప్రదేశ ముండుటవలన దిగ్విభాగ ముండును. ఒకవేళ వారికి లేకున్నను ఇతరుల దృష్టిలో నుండును.

ఉభయ మేరువులకడ ౬ నెలలు ఉదయాస్తమయములు కదా! ఇలావృతమునందు 'చంద్రుడును సూర్యుడును నక్షత్రములును ప్రకాశింపవు' అని వాయు. ౪౬-౧౧. కావున మేరువన నేదియో, ఇలావృత మన నేదియో ఇపుడు తెల్ల తెలియును. నవ్యులు చెప్పినటులు మేరువు ౮౦. ౪౫ అక్షాంశములందు లేదు. అట నున్నచో సూర్యచంద్రులప్రకాశ మసంభవము. (నక్షత్రప్రకాశ ముండునని కొందఱందురు) వారు చెప్పినటులు ఇలావృతము మేరువునకు తూర్పు కాదు. మఱియు చీనాటర్కీయు కాదు.

ఇక సిద్ధాంతములును, సంహితలును ఈ పురాణములను ఎటు అర్థము చేసికొనెనో తెలిసికొందము.

బ్రహ్మాండ కటాహము! నడుమ భూగోళము ఆకాశమున వ్రేలుచున్నది. దాని నడుమనుండి దక్షిణోత్తరములుగా మేరువు కఱ్ఱవలె వెలికుబికెను.

2. వెనుకటి వ్యాసమునందలి చిత్రములో నవ్యులు మేరువు భూమిలో పాతిన కఱ్ఱచందముగా చూపిరి. ఇపుడు నారింజపండులో పుడక గ్రుచ్చినటులు కనబడును. ఒకటవ చిత్రము చూచునది.

దాని ఉత్తరాగ్రము సుమేరువు. దక్షిణాగ్రము కుమేరువు. లవణసముద్రము భూమధ్య (Equator) నందేయున్నది. ఈ భూవృత్తమునందు యమకోటి, లంక, రోమకము, సిద్ధపురి అను పత్తనములు సమాన దూరమున గలవు. ఈ నాలుగు పత్తనములను క్రమముగా భద్రాశ్వ భారత కేతుమాల కురువర్షములకు కేంద్రమని. లంకాసిద్ధపురులును, యమకోటిరోమకములును ఉభయ మేరువులును సమదూరమున నున్నవి. ఈ దూరము నూటెనుబది అంశలు.

దీనిలో లంకకు తూర్పున యమకోటి. దానికి తూర్పున సిద్ధపురి. దానికి తూర్పున రోమకము. వీని అన్నింటికి సుమేరువు ఉత్తరము. కుమేరువు దక్షిణము. (సూ. సిద్ధ. భ. వ. హీర.) పురాణ భూగోళఖగోళ పేటికకిది యొక కుంచిక.

సురలును, అసురులును, మనుష్యులును విషువత్స్థలందుండు రవిని క్షితిజమున గాంతురు. ఎవనిని ౧౮౦° భాగలు చూడగలరు. అనగా ముడి యెడమ వెనుకముందుల వెలు చూచినను ౯౦° భాగలు మాత్రము చూడగల రని తాత్పర్యము. మేరువునుండి విషువత్తు ౯౦ భాగలు కావున విషువత్ప్రాంతమును క్షితిజమునందు మన కగపడును.

క్షితిజమున పొడిచిన రవి సాయన మేషాదినుండి వృషభమిథునములు గడచి మేరువు చేరబోవును. అపుడు కర్కాటకాది. సురలకపుడు మట్టమధ్యాహ్నము. రవి మఱల మూడు నెలలకు విషువమునకు వచ్చును. వానితో సురలకు పగలు చెల్లు. ఈ యాఱు నెలలను వారికి రవి క్షితిజమున కనబడును. సాయన మేషాదిని పొడిచిన రవి సాయన తులాదియందు అస్తమించును. ఈరీతిగా నీ యాఱునెల్లును వారి కొక్క పగలు.

కుమేరు (దక్షిణధ్రువ) వాసులకు అసురులకు రవి పైరీతికి విపరీతముగా కనిపించును. రవి యిచట తులాదియందు పొడిచి మకరాదికి పగలు సగపాలు గడపి మేషాది కస్తమును పొందును.

ఇక ఉ. ద. ధ్రువముల నడిమి మట్ట—విషువమున నున్న రవి లంకా యమకోటి సిద్ధపురీ రోమకముల మీదుగా బోవును. ఈ పత్తనములందు విషువచ్ఛాయయు, అక్షాంశయు సున్న. లంబాంశములు ౯౦°. మేరువునం దక్షాంశములు ౯౦°. లంబాంశములు సున్న. యమకోటిలో మట్టమధ్యాహ్నమునపుడు లంకలో ఉదయము, రోమకమున అర్ధరేయి, సిద్ధపురిలో అస్తమయము.[3] (సూర్యసిద్ధాంతము.)

వృద్ధవసిష్ఠ సిద్ధాంతమునందు వర్ష విభాగమిట్టులు:

భూమధ్యవలయమునకు దక్షిణమున లవణార్ణవము. దధి దుగ్ధ ఘృత ఇక్షు మద్య స్వాదు సముద్రము లొకదానికొకటి దక్షిణముగా లవణసముద్రమునకు దక్షిణమున నున్నవి. ఇవి క్రమక్రమముగా నొకదానికంటె నొకటి చిన్నవి. లవణాబ్ధికి ఉత్తరతటమున నరకదేశమున లంకాదిపత్తనములు నాలుగు. లవణాబ్ధి ఉత్తరమున గల భూగోళమున సగము జంబూద్వీపము. యామ్యగోళమున లవణాదిసముద్రముల యందు క్రమముగా శక శాల్మలి కుశ క్రౌంచ గోమేద పుష్కర ద్వీపము లున్నవి.

౧. సౌమ్యభాగమున లంకకు ఉత్తరమున హిమ హేమకూట నిషధ పర్వతములు. లంకా హిమాద్రుల నడుమ భారతవర్షము. హిమహేమకూటముల నడుమ కిన్నరవర్షము. హేమకూట నిషధముల నడుమ హరివర్షము.

౨. యమకోటి కుత్తరమున మాల్యవంతము. ఈ రెంటినడుమ భద్రాశ్వము.


౩. రోమక గంధమాదనములనడుమ కేతుమాల వర్షము.

౪. సిద్ధపురి కుత్తరమున శృంగవ చ్ఛుక్ల నీల పర్వతములు. సిద్ధపురీ శృంగవత్పర్వతములనడుమ కురు వర్షము. శృంగవ చ్ఛుక్లముల నడుమ హిరణ్యవర్షము. శుక్ల నీలముల నడుమ రమ్యకవర్షము.

---

3. పురాణములు సూర్యుని ఉదయాస్తములు తెలుపుటకు మేరువుచుట్టును కొన్ని పురములను చెప్పెను. సిద్ధాంతములు నిరక్షరేఖమీద అవి కలవని తెలియజెప్పెను. వాని పేరులు కొన్ని వేఱు,

ఇటు ఈ నాలుగు పట్టణములనుండి ఉత్తరముగా పోవుచుండిన, నిషధ మాల్యవన్నీల గంధమాదనముల నడుము నున్న ఇలావృతవర్షములో నుందుము. దాని నడుమగా మేరువు పోవును. ఈ మేరువు జంబూ మధ్యమున శిఖ్యనడుమ దుర్దువలె నున్నది.




ఒక దబ్బపండునుగాని, నుమ్మకిపండునుగాని తెచ్చి సమానముగా నాలుగు డిప్పలుగా కోసి మరల వాని నతికించి పట్టనడుమ నొకత్రాడు ట్టి దాని తొడిమకు మఱొక త్రాడుకట్టి, ఆకాశమున నిలువుగా త్రేలదీసి చూచునది. ఆ నడిమి త్రాడు నిరక్షరేఖ. నాలుగు డిప్పలయు కొలకడ త్రాటిమీద నాలుగు సుద్ద గుఱుతు లుంచునది. నాలుగు తెల్లబొట్లును నాలుగు పట్టణములు. తొడిమ సుమేరువు. అడుగు పొట్ట కుమేరువు. నాలుగు తెలుపు మచ్చలును, తొడిమయు, పొట్టయూ ఒక దాని కొకటి సమదూరమున నుండును. ఇపుడు దానిని అడ్డముగా పట్టుకొని ఒక చిన్న దీపము వెచ్చుకొని పట్టునది త్రాటిమీదుగా త్రిప్పుచు చూచునది. వెనుకనుండుల డిప్పలలో కొలదికాంతియు, తానున్న డిప్పమీద నిండు కాంతియు, ఆవలిదిస డిప్పమీద చీకటియు నుండును. ఈ రీతి యూహ ఈ భూగోళవర్ణనము నకు బీజము.

ప్రకృతభూగోళమున లంక క్రింద దక్షిణధ్రువము వఱకును దేశమే లేదు. అంత పట మారయునది.

ఇక తూరుపు దక్షిణముల నడుమ మాత్రము ఆస్ట్రేలియా మొదలగున వున్నవని సరిపెట్టుకొనవలెను. లేదా ఇది పూర్వకల్పమునాటి దనికాని, కలియుగమున దేశవిపర్యయము కలుగును - 'కలౌ దేశవిపర్యయః' (మా. వాయు.) అనికాని నిర్ధారించుకొనవలయును.

పురాకల్పములందలి కొన్ని దేశములు మునిగిపోవుట వింతకాదు.

పౌరాణికులు భూవిన్యాసప్రస్తారమున భూమి ఛత్రాకారమనియు, మండలాకారమనియు, వర్తుల



పురాణభూగోళము సంహితాభూగోళమని పాఠకులిపుడు నిశ్చయించుకొనగలరు.

'భూమి గోళాకారము. మరియు అది సూర్యుని చుట్టును తిరుగుచున్నది' అని ఆర్యభటుని మతము.

అంతియేగాక తెలియుటకు పురాణములు దేశనిరూపణమందు భూమి పద్మాకారమనియు, మండలాకారమనియు,[5] ఛత్రాకారమనియు,[6] వృత్తాకారమనియు చెప్పెను. అనగా మొత్తముమీద చక్రాకారము. పుష్కర ద్వీపమునావల లోకాలోకము. పురాణములు చెప్పట భూమి చక్రాకారమనుట కనుమాపకము. కావుననే లోకాలోకమునకు చక్రవాళమని పేరు. 'వల వల్ల - సంవరణే వఞ్చరణే చ.' భూచక్రమును వలగొన్నది అని నిరుక్తి. కావున బోధసౌలభ్యముకొఱకు దేశవిషయమున భూమి నడుమ ఉన్నతమై అంచుల వాలి చక్రమువలెను, కూర్మమువలెను, గొడుగువలెను ఉన్నదని పురాణములు చెప్పె ననవలయును.

మనియు చెప్పిరి. జ్యోతిః ప్రస్తావమున గోళాకారముగా చెప్పక చప్పిరి. భిన్నము లయిన యీ రెండు మతములకును సామరస్యమెటు లొనగూడెనో తెలిసికొనుటకు కుతూహలము కలుగును గావున ఆ విషయమిచట కొంచెముగా తెలిసికొందము.

ధ్రువముక్రింది భూమికి మేరువని పేరు. అది భూమికి నాభి. తొల్లి భూవిభాగమున పద్మకర్ణికకు నాలుగు దిసలను నాలుగు రేకులవలె ఈ నాభికి నలుదెసలను నాలుగు దీవులు. ప్రాచీన ఋషులు మేరువుమీద పద్మయోని నివాసమును కల్పన చేసిరి. అనగా మేరువు ఖస్వస్తికమున సత్యలోకముకలదని తాత్పర్యము. దీనికి కారణము వారు మేరుగిరిజాలము చుట్టును నివసించిరి. వారు చెప్పిన విషయములు చాలవట్టు వారి స్వదేశమునందలివే. కాలాంతరమున పద్మచతుర్దళములలో దక్షిణోత్తర దళములయందు వర్షములు, మనుష్యనివాసము - ఇవి వారు చూచినవి.

ఆ సమయమున సుమేరువు స్వస్థానచ్యుతము కాలేదు. నానాదేశములు తిరుగుటలో సూర్యచంద్రా

4. ౪౧-౮౬ వా. 5. ౪౬-౨౧ వా. 6. ౩౦-౪౧. 7. ౪౬-౨౧.
'సర్వేషా ముత్తరే మేరు ర్లోకాలోకస్తు దక్షిణే' (౩౦-౧౦౪ ;౮)

8. 'భూమి బంతివలె గోళాకారము. అది సూర్యాదులవలెనే ఆకాశములో నున్నది. దాని క్రిందను మీదను ఎల్లెడలను జీవరాశి కలదు. భూమిమీద ఎక్కడ నున్నవా రక్కడ తాము భూమి పైభాగమున నున్నామని అనుకొందురు. 'భూమి సంతతము క్రిందికి పడుచున్న దనియు, నీటిలో నావవలె తేలాడుచున్న దనియు, ఊరక పైకెగురుచున్న దనియు దక్షిణో

దుల గమనమునందు విశేషము వారికి కనుపట్టెను. వారే దేశము పుట్టినను వారి కా దేశ మంతయు చక్రాకారమే. కాని సూర్యచంద్రులయు, నక్షత్రములయు మార్గ మొక రీతిగా నుండదు. ఒక దేశమున ఒక రీతిగను, వేఱొక దేశమున మఱియొక రీతిగను కనబడును. ఉదయాచల మని ఒకటియు, అస్తాచల మని మఱియొకటియు నుండెను. పర్వతము లెక్కువగా నున్న దేశమునందు భూపృష్ఠము గోళాకారముగా నుండు నని ఊహింప వలను కాదు. కాని సూర్య చంద్ర నక్షత్ర గమనమును తెప్పగా పరిశీలించినచో నపుడు భూమి గోళాకార మని ఒప్పుకొనితీఱవలసివచ్చును. వారపుడు భూమి బల్లపఱుపుగ లే దనియు, గోళాకారముగా నుండవలయు ననియు నిర్ణయించిరి. 'సూర్యుని! ఉదయమును లేదు. అస్తమంతకంటె లేదు. కంటికి గానబడుటయే ఉదయము; కానబడకపోవుటయే అస్తము. ఐతరేయబ్రాహ్మణమున (౩-౪౪)ఇట్టి మాట కలదు. దీని ననుసరించియో, లేక స్వయముగా తెలిసియో వాయు విష్ణు మత్స్యాదులు—"ఎప్పుడును ఉన్నవానికి ఉదయాస్తమయము లేమి? సూర్యుని దర్శనాదర్శనములే ఉదయాస్తమయములు." 9 అని చెప్పెను.

భూమి గోళాకార మగుటవలన, సూర్యుడు లేయుంబవలు భూమిని ప్రదక్షిణించుటవలన గమన కృత్తపు సాక్షి. లేక కేంద్ర మెచట? 'భూమికి పరోవ్వత్తర మున' అని అపుడు చెప్పవలసి వచ్చెను. అదియే ధ్రువ క్షితి. ఉత్తరబిందువు. మేరువు. ఇది జ్యౌతిషికులయు, వేదములయు, పురాణములయు మాట. ప్రాణాతుడు చూచిన చందముగా చూడక, అనుమాన ప్రమాణముచేతనే ఈ విషయము సాధిత మయిన దని

త్తరధ్రువములు అను ఇరుసుమీద తిరుగుచున్న'దనియు వాదములు కలవు. కాని భూమి అచలము.' అని యోగవాసిష్ఠము. చూ. నిర్వాణ. విపశ్చిదుపాఖ్యాన. ౧౨౬-౧౩౧ మొ. సర్గలు.

యోగవాసిష్ఠము భూగోళఖగోళములమొదల పూర్తిగా పురాణానుయాయి. వస్తవముద్రావృతములయిన శాకాది ద్వీపములను శాకమునందలి ఉదయపర్వతము మొ. వానిని చెప్పెను.

కాశ్మీరములందు తనకు ప్రసిద్ధి గలట్లు ఈ గ్రంథము తానే చెప్పుకొనెను. దీని కర్తృత్వమునుగుఱించియు, కాలమునుగురించియు పలువురకు సందియము కలదు. శంకరు లెచటను దీని నుదాహరింపలేదు. కాని వారి శిష్యులు బ్రహ్మసూత్రభాష్యవ్యాఖ్యానములో నుదాహరించిరి. ప్రామాణ్యముకొఱకు నే నిది వ్రాసితినిగాని కాలనిర్ణయమున కంతగా కాదు. ఆర్యభటుడు భూమి తిరుగుచున్న దని సూర్యసిద్ధాంతమున నిర్ణయించెను. ఈ వాదము ఇందు ఖండితము. దానఁజేసి యీ గ్రంథరచన ఐదవశతాబ్దికి పిదపనా అని సంశయము కలుగును. మఱియు 'తథాఽఽత్మసిద్ధే ర్మ్లేచ్ఛానాం తద్దేశేషు న దుష్యతి' (పర్వ ౫౬.౧౦) అని కలదు. అనగా మ్లేచ్ఛులు వారి చింతాధార ననుసరించి జీవాత్మలను చెప్పిరి. ఆ దేశములందు ఆ సంప్రదాయము పొరపాటు కాదు అని దీని అర్థము.


'మ్లేచ్ఛులు యవనాదులు. దేహాకారము కల జీవుని ఈశ్వరుడు సృజించు నని వారి సంప్రదాయము. చనిపోయిన పిదప జీవుడు పాతిపెట్టిన చోటనే ఉండును. కాలాంతరమున భగవంతుడు వారిని పరామృశించి పుణ్యపాపానురోధముగా శాశ్వతస్వర్గనరకములకు పంపును' అని ఆనందబోధేంద్రసరస్వతి వ్యాఖ్య. ఈ మూలమును, వ్యాఖ్యను జూచి ఇది అర్వాచీన మనవలెను. ఆంగ్లవిమర్శకులచే మనకు దూరదృష్టి తగ్గెను. ఈ గ్రంథకర్తకు పారసీకాదిదేశ ధర్మములతో పరిచితి కలదు. పారసీక స్మృతిగ్రంథమగు వెండిదాద్ హోరాకాయితి అంచలమందు ఖననమును, చర్మ అంచలమందు దహనమును మహాపాప మని చెప్పుచున్నది. కావున ఈ గ్రంథకర్త వారి ఆచారమునుగాని, భారతప్రత్యంత దేశములందలి ఆచారములనుగాని తలచియుండవచ్చును. మఱియు జ్యోతిర్విశేషములలో ఇతడు విశిష్టుడు. మూడు వేలయేండ్లకు ఇంకను వెనుకటి జ్యోతిర్విషయముల నితడు వ్రాసెను.

9. 'నైవాస్తమన మర్కస్య నోదయః సర్వదా సతః
ఉదయాస్తమనాఖ్యం హి దర్శనాదర్శనం రవేః.' వి. ౨-౫-౧౬,౧౭.

అనుకొన్నను, చూచిన విషయమును చెప్పుచో ఎటులు చెప్పుదురో ఈ యనుమానముకూడ అటులే చెప్పించెను. కాగా భూగోళోత్తర ప్రదేశము మేరువు. కాగా భూవిన్యాస ప్రకరణమున భూమి చక్రాకార మనియు, జ్యోతిః ప్రకరణమున గోళాకార మనియు వారు పామరుల సౌలభ్యమునకై రెండు విధములుగా వ్యవహరించిరి. ఈ రెండు సంగతులను వారెచటను వాచ్యము చేయలేదు. ఈ సంగతి బాగుగా మనస్సునకు పట్టించుకొనక కొందరు పెద్దలు పురాణములు భూమిని దర్పణనిభముగా చెప్పెనని[10] ఖండించిరి. వారే ఖండింపగా ఇక ఖండింపని వా రెవరు? నేను బడిలో నాగరిక తరగతి చదువు బాలుడనుగూడ కాదనాయనా! మీద భార సామువాడే.

కేవల నక్షత్రము లన్నియు సూర్యుని పాలించి పడమటగా అస్తంగతము లగును గాని ఒక నక్షత్ర మటులు కాదు. దాని పేరు శింశుమారము. మరియొకటి. శింశుమార ముఖమున ఒక నక్షత్రము కలదు. అది కొంచెమైనను కదలదు. అది నియతముగా ఒక చోటనే ఉండును. కావుననే దానికి ధ్రువము అను సంజ్ఞ. దీనికి ఖాల్డియా దేశమున శుబక్ అని పేరు. నక్షత్రములును, చంద్రుడును దీని చుట్టును తిరుగుచుందురు. ధ్రువము ఎత్తుగా ఆకాశమున పాతిన కట్టుకొయ్యవలె నుండును. అది గ్రహనక్షత్రములకు పగ్గము కట్టి త్రిప్పుచున్నటు లుండును. సూర్యుడు దానిని ప్రదక్షిణించుచుండును. ఇది క్రీ. పూ. సుమారు మూడు వేల యేండ్ల క్రిందటి మాట. అపుడు, లేక అప్పటికి ముందు సూర్య చంద్రాదుల దైనికగమనము తెలిసికొనవలయు నను కోరిక ఉదయించియుండవచ్చును.

మిగుల ఎత్తగు ఆకసమున ధ్రువము. నేలమీద సూటిగా దానిక్రింద మేరువు. దీనినిగూడ నొక పెద్ద కొండ యని కల్పన చేయనిచో కట్టుకొయ్య దొరకదు. నేల నడుమనుండి సూర్యుడు లక్ష యోజనముల ఎత్తు.



కట్టుకొయ్యయు అన్ని యోజనముల ఎత్తు అని కల్పన చేయవలెను. భూగోళ వ్యాసము ముప్పది రెండు వేల యోజనములు. మేరువు పొడవు నేలలో పదునారు వేల యోజనములు. భూమిపై ఎనుబది నాలుగు వేల యోజనములు.

జైను లీ లెక్కను తగ్గించి చెప్పిరి. మేరువు వేయి యోజనములు నేలలో పూడి యున్నదని వారి అంచనా.


శింశుమారమున కెదురుగ నున్న ఈ నక్షత్రము నాలుగయిదు వందల యేండ్ల వరకును ధ్రువముగనే యుండెను. అపుడు ధ్రువ దర్శనము కానిచో వివాహము పూర్ణాంగ మాయెడిది కాదు. ధ్రువుడెటు లచలుడో నవదంపతుల ప్రేమయు అటులు అచలముగా ఉండవలయునను భావము సుస్పష్టము చేయుటకై అపుడు ధ్రువ

10. పుష్కరద్వీపమున కావల దర్పణనిభమగు భూమి కలదు. కురుద్వీపమున కలదు. అనియే కానిపించునుగాని భూమి యెల్లయు దర్పణనిభ మని కాని, బల్లవలె నని కాని నాకు వా. వి. మ. వ. బ్ర. మా. పురాణములలో కానరాలేదు. ఎవరేని చూపుచో మన్నింతురుగాక.

తర్పణము చేయించుచుండెడివారు. ఇటులు కొంతకాలము గడచినతరువాత ఆ ఖగోళ పరిశీలకులకు ఆ కాలమున తెలియరాని కారణములచే శింశుమారముకడ నున్న నక్షత్రము లన్నిటితోపాటు ఈ ధ్రువుడును కదలుచున్నటులు 11 కానబడెను. అపుడు పెండ్లిండ్లలో అరుంధతీ వసిష్ఠుల చూపు ఆచారము మొదలాయెను. కాని ధ్రువమున నున్న గ్రహనక్షత్రసమూహం వెనుకటి వలెనే ఉండెను. కావున కట్టకొయ్యకు బదులుగా ఇప్పుడు పోలికను మార్చెదనుగాక, దానిపై కట్టకు12 వ్రాసెను. ఈ క్రింది చిత్రము చూడునది.

మేరువు ఇచట దార్ష్టాంతికము. శేలలో పాతిన చింతమాను దృష్టాంతము. మేరుశిఖరాధికము దార్ష్టాంతికము. గానుగలో తిరిగెడి కట్టె దృష్టాంతము. ఆకాశము నందలి ధ్రువము, గానుగలోని పాదనుకట్టె-అగ్రబిందువు. ప్రవహనామకమగు వాతరశ్మి పగ్గము. కట్టె చివరనుండి ఒక పగ్గము వ్రేలాడుచుండును. ఎద్దు ఆ త్రాటితో చక్రాకారముగా తిరుగును.

వాయుమత్స్య విష్ణు పురాణములు సమ్మతిపారెను పోలికగా చెప్పెను. భాగవతము విష్ణుపురాణమునకు వివరణమే కావున దాన వెతుకబడలేదు.




11. ధ్రువుడు కదలడు. మిగిలిన చుక్కలన్నియు కదలును. మా బోటి యోగుల కిది ప్రత్యక్షము అని యోగవాసిష్ఠము వసిష్ఠుని నోటితో ననెను. (చూ-౧-౨౬, ౧౨౦ వ అధ్యా-౧ వ శ్లో)

వాయుపురాణము ధ్రువునకు భ్రమణము చెప్పెను-'భ్రమద్ భ్రామయతే'. కావున ధ్రువభ్రమణ మెఱుగని కాలమున వాసిష్ఠ రచన అని అవనగునుగాని ఒక తంటా ఉన్నది. యోగదృష్టితో పని లేకయే మాంసచక్షుస్సులకే ధ్రువము కదలునటుల కనబడును. యోగదృష్టికే కదలనటుల కనబడవలయును.

12. 'తైలపీడాకరం చక్రం భ్రమ ద్భ్రామయతే యథా
తథా భ్రమంతి జ్యోతీంషి వాతబద్ధాని సర్వశః' (వా ౫౨.౨౨)

పురాణ రచనా కాలమున శింశుమారము తోక చివర నున్న నక్షత్రము ధ్రువ మాయెను. ఈ నక్షత్ర మిపుడు ధ్రువ మను తలపునకు గుఱియగు చుక్కకు దాపుగా వచ్చెను.

వైష్ణవ గోళవర్ణన మెల్లయును ముఖ్యముగా వాయు విష్ణు మత్స్య పురాణముల లోనిది. ఈ పురాణముల కాలమును మనము నిర్ణయించుకొన గలిగినచో ఈ భువన విన్యాస మెంత ప్రాచీనమో మనకు పొనపొన కనబడును.



ఇపుడు పురాణము రచియింప బడెనేని గానుగుతో పోలిక చూప బనియుండదు. వరికర్లమునందున పాతిన కట్టుకొయ్యను ఉపమించిన సరిపోవును.

జైను లీ గానుగుకఱ్ఱ పోలిక చెప్పిరి. కాని అది క్రింద లావు; చివర సన్నము.

ఈ పురాణముల కాలమును కనుగొనుటకు వీనియందే స్ఫుటమయిన సాక్ష్యము కలదు. ఈ సాక్ష్యము రెండు విధములు: ఒకటి—రాజులు మొదలగు వారు; రెండు—అయనాది కాలము. పై వ్యాసములో వానిని పరిశీలింతము.

సవరణలు

౧	వ్యాసము	౧౨౧ పుట	౨ పెడ	౭౯-౩౦ పంక్తి	శేషుమాలముతక్క	ప్లక్షాదివట్కముతక్క
	,,	౧౨౨ ,,	,, ,,	౫ ,,	గోమేద	(గోమేద)
౨	,,	౨౫౬ ,,	,, ,,	౧౩ ,,	శేషము	శేషమని నవ్యులు.
౨,౩	,,				౮౮౦౦	౮౦౦౦
౩	,,	౩౬౦ ,,	౧ ,,	౧౯ ,,	క్రీ. శ. ౩ వ శతాబ్ది	క్రీ. పూ. ౧౫౦.
,,	,,	౩౬౩ చిత్రమున మాల్యవద్గంధమాదనములను, కురు రమ్యకములను వ్యత్యయముగా చదివికొన వలయును.				

హరిచరణుడు

[నవల]

— శ్రీ తల్లావఝ్ఝల కృత్తివాసతీర్థులు —

౭

చరణుడు కాళ్లీడ్చుకొంటూ విశ్వంభర చౌదరీ నివాసము చేరినాడు. ఉదయము తొమ్మిదిగంట లయినా చౌదరి పక్కమీదనుంచి లేవలేదు. రాత్రల్లా చిత్పూర్ రోడ్డులో భద్రకాళితో జాగరణం చేయడంవల్ల అతనికి చప్పున కళ్లు విడివడలేదు. పడుకున్నవాణ్ణి లేపడము ఎందుకని చరణుడు ఈజీచైరులో నడ్డి వాల్చి మగతగా ఉన్నాడు. అతనికీ రాత్రల్లా వేదనవల్ల నిద్ర లేకపోయింది. చౌదరీ పదింటికి లేచి, కళ్ళు నలుపుకొంటూ మిత్రుణ్ణి చూచి "అరె! ఎప్పుడొచ్చాడు! ఏమిటిలా నిద్ర?" అనుకొని, తాగి పరున్నాడేమో నని అనుమానించి దగ్గరికి వచ్చి వాసనచూస్తే, చరణుడు తాగి రాలేదని తెలుసుకొన్నాడు. అతన్ని లేపి "చరణ్! ఏమిటి రాత్రి అలా వెళ్ళిపోయావు?" అని ప్రశ్నించాడు.

"నేను అలాంటిచోట్లకు రాను" అని భీష్మించుకొన్నాడు చరణుడు.

"విలాసంగా వెళ్ళితే తప్పా? కాళి ఎంత మంచి దనుకొన్నావు!"

"ఏమిటా మంచితనం?" అని ఆశ్చర్యంగా అడిగినాడు.

"మంచితనం కాక మ రేమిటి? ను వ్విచ్చిన రూపాయలు నీకు తిరిగి ఇచ్చి వెయ్య మన్నది. నన్ను చెడ్డ బలవంతంచేసి రూపాయలు నీ కివ్వ మని నాచేతి కిచ్చివేసింది"

"నా కెందుకు! ఆ సొమ్ము నువ్వ నా కేలుకో వేసిఉంటావు"

"ఫరవాలేదు గాని... చరణ్, నిన్నొకసారి ఎలా గయినా తన దగ్గిరికి తీసుకురమ్మని పదేపదే చెప్పింది కాళి."

హరిచరణుడు ఆశ్చర్యపడ్డాడు—"నన్నా... నన్ను!"

"ఎందు కలా ఆశ్చర్యం? నీమీద ఎందుకో ఇష్టంగా ఉంది భద్రకాళి"

"వేశ్యకు మనమీద ఇష్ట మేమిటి?"

"అలా కాదు. రేపురాత్రి తప్పకుండా వెడదాము."

"రాను చౌదరీ!"

"అలా కాదు. చాలా గట్టిగా చెప్పింది. బలవంతాన నిన్ను లాక్కుని రమ్మన్నది."

చరణుడు క్షీణంగా నవ్వి "సరే వెడదాం" అని అంగీకారం తెలియజేసినాడు.

రాత్రి రిక్షాలలో ఇద్దరూ చిత్పూర్ రోడ్డు మీది విలాసినీభవనముముందు దిగారు. భద్రకాళి చేతి రుమాలు విసిరింది. చిరునవ్వుతూ, కంకణాలు మోగగా కరా లెత్తి నమస్కరించి ఇద్దరినీ లోపలికి ఆహ్వానించింది. చౌదరి కనుసైగ చేసి కాళితో "ఇప్పుడే వస్తా" నంటూ ఎటో వెళ్ళిపోయాడు. హరిచరణుడు ఒక్కడూ గదిలో తెల్లని పరుపుమీద కూర్చుని తాలీను అనుకొని విద్యుద్దీపం చూస్తూ ఉన్నాడు. కాళి అతని

దగ్గరగా కూర్చుని పైటతో విసురుతూ మరోచేత్తో గ్లాసెడు మధువు అతని పెదవులకు అందించింది. చరణుడు విద్యుద్దీపకాంతిలో తెరతెరా మెరిసే మద్యం చూచి "అపద్బంధూ!" అని సంబోధించి తాగుతున్నాడు.

"నేను మీకు ఆపద కలిగించానా!" అన్నది నవ్వుతూ కాళి.

"నువ్వు నాకు ఆపద! ఆపద మరచిపోవా లని తాగేస్తున్నాను."

అతని మాట విని, కాళి తల నేలకు కొట్టుకోవా లని అనుకొన్నది. అతను తాగిన గ్లాసు విసిరివేయగా ముందుదగ్గిరే వున్న సోఫాకు తగిలి ముక్క లయింది. గాజుముక్క భద్రకాళినుదుట తగిలింది. అయినా అతనికోసం ఓర్చుకొని దెబ్బ తగిలినచోట కట్టు కట్టుకొన్నది.

భద్రకాళి ముసలితల్లి "తలకు కట్టు కట్టా వేం?" అని అడిగితే "తలనొప్పి; మరేం కాదు" అని సమాధానం చెప్పి తప్పించుకొన్నది.

కాళీకుమ అనుకొని హరిచరణుడు తీవ్రంగా "కాళీ! నా తెలివి తేటలు ఇంకా పోలేదు. అన్నట్టు నీకు దెబ్బ తగిలింది! ...కా...ళీ, నిన్ను ముట్టుకో... లేను. నీ వంటే ...నాకు...అస...హ్యం" అన్నాడు హరి.

భద్రకాళి చీరకొంగుతో కళ్ళు తుడుచుకొన్నది. హరిచరణుడు పరుపుమీద పరుండి తల వాలి కుదురుద్దుతూ పొర్లినాడు. కాళి అతని ముఖం పైకి ఎత్తబోయింది.

"ఛీ! నన్నంటుకోకు...పాపం చేస్తున్నావు. వెలుతురులోనుంచి అంధకారంలోకి వచ్చాను. ఇక్కడ ఉండడానికే తాగుతున్నాను. నాకు ఈ లోకంలో ఎవరూ లేరు...హ్హాఁ, కాదు కాదు...ఒక్క మిత్రుడు మాత్రం ఉన్నాడు."

అతని మాటలకు భద్రకాళి ఖిన్నురాలయింది. లోలోపల విచారము దిగమింగి ఏమీ సమాధాన మియ్యక అతన్ని జాలిగా చూచింది. ఆమె స్తిమితప్రకృతి చూచి, ఆశ్చర్యపడి హరిచరణుడు "అబ్బ! నీలో ఎంత సహన శక్తి ఉంది! తిట్లు, దీవెనలు, చీత్కారాలు అన్నీ సహించగలవు" అని పలికినాడు. వేశ్యాప్రవృత్తిలో భద్రకాళి అతనికి నూతనంగా తోచింది. గాజుపెంకు నుదుటికి తగిలినా, బాధగా ఉన్నా, ఆమె పల్లెత్తుమాట అనలేదు. మళ్ళీ కొంత సేపటికి అతని ఆలోచన మారిపోయింది. నిషా క్రమేణ ఎక్కువౌతున్నది. పక్కమీద వెల్లకిలా పరుండి హరిచరణుడు గంభీరంగా ఉపన్యాసం ఆరంభించాడు.

"ప్రేమ...ప్రేమట...కామినీజాతికి ప్రేమ కల్ల ...నాటకరంగంలో.. పాత్రలు రంగులు వేసుకొని ఫిరాయిస్తూ ఉంటారు. ... ప్రేమ నటిస్తారు. ... ప్రపంచంలో అంతా వేషం...వేషం..."

భద్రకాళి కొంతసేపు చిన్నబుచ్చుకొన్నది. ఒక ఉద్రేకపు వెల్లువలో హరిచరణుడు తన పూర్వం అన్న దేమిటో మరిచిపోయి "కాళీ! ఓ కాళికా! ఒక్క పాట పాడవే!" అని కోరినాడు. అతను చేసిన చీత్కారాలు కాళి ఒక్కసారి మరిచిపోయింది. ప్రీతి భావం ఆవేశించడంవల్ల కాళి తంత్రులు మీటుతూ మీరాబాయి పదావళిలో ఒక గేయం అందుకొని తీయగా గొంతెత్తి పాడింది.

"విశో దిశో పంథ్ నిహారూఁ పియకో
బార్ బార్ ఉర లాగిరే"

ఆ చరణం అతన్ని ఉర్రూతలూగించింది. రసోద్రిక్తుడై హరిచరణుడు "ఓహో ప్రేయసీ! ఎన్నో పగళ్ళు, ఎన్నో రాత్రులు నీకోసం తపించానే! ఎక్కడున్నావో ప్రియురాలా!" అని కేకలు వేశాడు.

కాళి అతనివి ఉన్మత్తప్రలాపా లనుకొంది. కాని అలా అనుకొని సమాధానపడలేదు. ఎవ రీ ప్రియురాలు! ఎవరినో ప్రేమించి విధురుడై పోయిన అమాయిక కోమల హృదయుడు! ఎవ రా ప్రేయసి! చొరవ ఇతని ప్రియురాలిసంగతి చెప్పలేదే!

మళ్ళీ ప్రలాపన సాగించాడు హరి.

"షెల్లీ మహాకవి అంటాడు: ఏ వస్తువైనా బద్దలయితే పనికిరాదు. హృదయం బద్దలయితే అమూల్యం. పగిలినహృదయం అమూల్యమైనా కాకపోయినా యాతన ఎలా సహించడం! అహో! ... ఇప్పుడు...ఇప్పుడు ఏ

కోరికా లేదు. ఏ అభిమానం లేదు. నమ్మకాలు లేనేలేవు. వేదనే లేదు...ఆహా...ఆహా...విస్మృతిశయ్యాంచలాలు... నీలగగనపాళులు-లోకాంచలాలు... గగనకామినీ గండపాళులు-" అతని కవిత్వం, ఉన్మత్తప్రలాపన కాళికి ఆశ్చర్యం కలిగించాయి.

అతని ముఖం కందగడ్డలాగ ఎర్రనై చిరుచెమటతో తడిసింది. కాళి తన చీరకొంగుతో అతనిముఖం అద్దింది. కొంతసేపు విసిరింది. అతని నేత్రాలు మూత పడేదాకా అతని పక్కనే ఉంది.

౮

మర్నాడు హారిచరణుడు విశ్వంభరుని దగ్గిరికి వెళ్ళేసరికి తల్లికి చాలా జబ్బుగా వుందనీ, వెంటనే రమ్మనీ విహారి తంతి ఇచ్చాడు. తల్లికి అనేకసార్లు కష్టం కలిగించినా, ఇంటికి కావలసినవి తీసుకురాకపోయినా ఎంతో సహనం చూపిన జననిమీద అతనికి భక్తిభావం పొంగిపోయింది. తల్లి, చెల్లెలు కుటుంబవిషయంలో తను ఎంత కఠినంగా ప్రవర్తించాడో తలుచుకొని విచారించాడు. చాదరీదగ్గిర డబ్బు తీసుకుని తాల్‌పోనాపురం వెళ్ళినాడు. తల్లిని ఆఖరిసారి చూచేందుకు వీలు లేకపోయింది. ఇంట్లో అతను అడుగు పెట్టేసరికి అందరూ గొల్లుమన్నారు. తారిణి గోడకు అంటుకుపోయి కళ్ళల్లో ప్రాణాలు నిలుపుకొని శిలావిగ్రహంలా ఉంది. తారిణీదేవి భర్త, మిత్రుడు విహారి ఇంట్లో మంచీచెడ్డా చూస్తున్నారు.

తల్లికి అగ్నిసంస్కారం చేసివచ్చాక హారిచరణుడు వసారాలో గోడను ఆనుకొని బాధలు ఒకదానివెంట ఒకటి రావడంవల్ల ఏడవడానికికూడా వోపిక లేక దిగాలబడి కూర్చున్నాడు. కొంతసేపటికి "చెల్లాయీ, తారిణీ, ఎలాగు బెంగపెట్టుకోంటే! పోయిన అమ్మ రాదు కదా" అంటూ చెల్లెల్ని ఊరడించాడు. తల్లి ఉండగా అతను చెల్లెల్ని ఎప్పుడూ ఆప్యాయంగా పిలిచి,మాట్లాడి, కష్టసుఖాలు ఒకరొకరు చెప్పుకొని ఎరగరు. తారిణి అన్నలో కలిగిన-పరివర్తనంవల్ల కొంత అతనిహృదయ సమీపానికి రాగలిగింది. విహారి ఇద్దర్నీ ఓదార్చినాడు. చరణుడు "విహారీ! నీ ఋణం తీర్చుకోలేను. నేను తల్లికి చాకిరీచేసి మాతృఋణం తీర్చుకోలేని కృతఘ్నుణ్ణి! నాకు సోదరుడివి కాకపోయినా సోదరుడివై నా ధర్మం నీవు నెరవేర్చగలిగావు" అని కంట తడిపెట్టి పలికినాడు.

"మీ కుటుంబం ఇలా అయిపోయిందే అని బాధపడుతున్నాను. బాధపడి నేను చేయగలిగిందేమీ లేదు" అన్నాడు విహారి.

చరణుడు "అమ్మాయీ తారిణీ! విహారి నిజంగా నాకు బావ కాకపోయినా ఒక ఉద్దేశం నా మనసులో ఉంది. నువ్వూ, విహారీ ఇద్దరూ వియ్యమొందితే మన కుటుంబాలు కలిసిపోతాయి. మైత్రి బంధుత్వంగా మారుతుంది" అన్నాడు. విహారి చిరునవ్వుతో అంగీకారం చూపినాడు.

తారిణి మాతృదుఃఖంలో ఉన్నా, అన్నగారి మాటకు క్షీణంగా మందహాసం చేసింది. తారిణి కాపరానికి వెళ్ళి పదేళ్ళు దాటిపోయినా,వంశాంకురము బయలుదేరలేదు. ఆమెభర్త వృద్ధు డవుతున్నాడు. తారిణికి ఆశమాత్రం పోలేదు. వార్ధకంలోనైనా బిడ్డ కలగక పోతుందా అని. జీవించినంతకాలం తల్లి హారికోసం, కూతురికి పిల్లలు కలుగలే దనీ,భర్త బికారిగా సాధువుల్లో కలిసిపోయా డనీ బాధలు పడుతూ ఉండేది.

కర్మ పదిరోజులు యథావిధిగా చేశాడు చరణుడు. అతని పినతల్లి కొంచెము స్థితిపరురాలు కావడంవల్ల శ్రాద్ధకర్మకు అయ్యే సమస్త ఖర్చులూ భరించి, దానధర్మాలూ చేసింది. అక్కకొడుకు చరణుడు పాడైపోయా డని కష్టసమయంలో పలకరించకపోతే మాత్రం బాగుండ దని అతనితో మాట్లాడుతూ వచ్చింది.

"హారీ! కుదురుగా ఉండి నా ఇల్లూ వాకిలీ చూస్తూ ఉండు" అన్నది పినతల్లి.

అతనికి అభిమానం వచ్చింది. ఆమె సొమ్ము తింటూ, మాటలు పడుతూ ఉండడానికి అతనికి రవంత ఇష్టమూ లేదు. తల్లి పోయింది కనక పినతల్లిగారి గుమ్మం తొక్కినాడు. తాల్‌పోనాపురంలో అతను ఉండ తలుచుకోలేదు. నిర్భాగ్యుడు బికారి విరాగియై పోతే మంచి దని ఆమె అనుకొన్నది. అతనికి తావు ఎక్కడా

లేదు. ఇవాళ ఉన్న చెల్లెలు రేపు యథాప్రకారం అత్తారింటికి వెళ్ళిపోతుంది. ఇక తనకు విశాలప్రపంచంలో చోటు లేదు. ఒకసారి అతను శూన్యంగా, బెంగగా ఉన్నాడు. ఇంతవరకూ అరుణతార విషయం మిత్రునితో హెచ్చరించనైనా లేదు. విహారి సమయం కాదని ఆమాట మాట్లాడ లేదు.

"భగవంతుడా! దిక్కు లేని పక్షికి నువ్వుతప్ప ఆధారం లేదే! ఈ నిర్భాగ్యుడి జీవితం ఇలా వెళ్ళిపోవలసిందేనా? నా ఇచ్ఛ నన్ను పడదోస్తున్నది ప్రభూ! ఇంకా, అయ్యో, ఇంకా అంధకారంలో, కూపంలో పడిపోతున్నాను. నీ ఇచ్ఛానుసారం యంత్రంలాగ నన్ను నడిపించు భగవంతుడా!" అని హరిచరణుడు మానబాష్పనయనాలతో వినమ్రుడై ప్రార్థన చేసినాడు.

విహారి "ఎప్పుడు బయలుదేరుతావు! ఎక్కడికి?" అని ప్రశ్నించినాడు.

"ఇప్పుడే. నా కేం పని ఇక్కడ! కలకత్తాలోనే ఉంటాను, ఎక్కడో ఓదిక్కున"

"నాతో ఉండు. ఏ షాపులోనైనా నౌకరీ చేరువుగాని. నీకు లోపం ఉండదు"

"నేను ఎక్కడా ఉండలేను స్థిరంగా. అప్పుడప్పుడూ నీ దర్శనం ఇప్పించు; అంతే చాలు."

"నేను రాసిన ఉత్తరం అందే వుంటుంది. నేను వేరే చెప్పవలసింది లేదు."

"నేను మనస్సు రహితం చేసుకోలేక పోతున్నాను."

"అంతవరకూ బాధలు తప్పవు."

"నిజమే విహారీ"

౬

హరిచరణుడు కలకత్తా వచ్చాడేకాని, వచ్చినప్పట్నించీ భద్రకాళిని చూడాలనే ప్రేరేపణ అంతరంగంలో రేగుతూ వచ్చింది. ఎంత తను చీదరించినా, చీత్కారాలుచేసినా, దూషించినా, రోత చూపినా అతి సహనపటిమ స్థిరంగాచూపిన భద్రకాళి అతనితలపుల్లో మెలగుతూనే ఉంది. తనను కొంతవరకు అధోగతిలోకి తెచ్చిన విశ్వంభర చౌదరి దగ్గరికే తిరిగి చరణుడు వెళ్ళినాడు. ఇద్దరూ నిత్యమూ తాగుతూ వివేకము పోగొట్టుకొంటూ ఉన్నారు. చౌదరితో చెప్పకుండా హరిచరణుడు చిత్పూరు వెళ్ళాడు. గుమ్మంలోకి వెళ్ళి చూస్తే తలుపు తాళం వేసి ఉంది. భద్రకాళి ఊళ్ళో లేదేమో, ఎక్కడికైనా వెళ్ళిందేమో నని అతను అనుకొని, పక్కనే మేడలో ఉన్నవాళ్ళను సిగ్గు విడిచి "ఈమేడలో భద్రకాళి లేదే! ఎక్కడికి వెళ్ళింది?" అని అడిగినాడు.

ఇరుగుపొరుగువాళ్ళవల్ల కాళి ఎక్కడ ఉన్నదీ తెలుసుకొని బయలుదేరాడు. అతను అక్కడ ఉండగానే కొందరు పెద్దమనుషులు రిక్షాలలో వచ్చి, భద్రకాళి సంగతి తెలియక, అడిగితే అభిమాన మని తల వంచుకుపోతూ వచ్చారు. వాళ్ళు మాట్లాడుతూ ముందుపోతూవుంటే వెనక రిక్షాలో చరణుడు జాగ్రతగా విన్నాడు.

ఒక గొంతు "అది, బస మార్చేసి ఎక్కడుంటుందిరా అబ్బీ?" అని రిక్షావాణ్ణి అడిగింది.

"నా కేంతెలియ" దని వాడు చెప్పినాడు.

"వృత్తి మానేసిందా? వారంనుంచీ కనపడదు"

"మానేసిం దనే విన్నాను బాబూ"

"వేశ్య వృత్తి మానడ మేమిట్రా? నమ్మదగ్గదే! పడుచుకారులో ఉంది – మూడుపూలు నాలుగు కాయలు! కాళి వృత్తి మానేస్తుందా?"

"చిత్తం, ఏమో నండి"

"ఎక్కడైనా ఉందీ ధర్మం?"

హరిచరణుడికి ఆశ్చర్యం కలిగింది. భద్రకాళి వృత్తి మానేసి సంసారస్త్రీ లుండే జాగాలో కాపరం పెట్టినందుకు అతని ఆశ్చర్యానికి అంతు లేదు. ఎందుకు అలా చేసిందో, అంత పరివర్తనానికి తగిన కారణము ఏమై వుంటుందో తెలుసుకోవా లని అతను ఉర్రట్లూగుతూ వెళ్ళినాడు. నడిచి నడిచి చెప్పిన గుర్తు ప్రకారం దీపస్తంభంముందున్న ఇంటిదగ్గిర ఆగి విచారు చేస్తున్నాడు. కిటికీలో ఒక ముఖం కనపడింది. అయితే దీపకాంతి అటు ప్రసరించకపోవడంవల్ల ఎవ

రైందీ తెలియలేదు. అనుమానిస్తూ "భద్రకాళి ఇక్కడే ఉంటున్నదా?" అని ప్రశ్నించాడు.

తలుపు తెరుస్తూ "హరి బాబుగారు దయ చేశారా?" అన్న పరిచితకంఠం వినవచ్చింది.

"భద్రకాళి ఎక్కడ?" అని ఆదుర్దాగా అడిగినాడు.

"పైకి దయచెయ్యండి" అంది.

"నువ్వా? సరే పద" అంటూ డాబామీదికి వెళ్ళాడు.

"నన్ను మరిచిపోయారా బొత్తిగా" అంటూ, నల్లచీరె కట్టుకొని, నగలు లేని బోసితనంతో, సంస్కారంలేని కేశపాశంతో భద్రకాళి ఎదురై ఆహ్వానించింది. అతని ఆశ్చర్యానికి మేరలేదు. "నువ్వేనా!" అంటూ పరిశీలించాడు. నవకం తగ్గి కృశించిఉన్నది కాళి.

"ఏం ఇలా చిక్కిపోయావు?"

"జబ్బేమీ లేదు. శరీరం బాగానే ఉంది."

డాబాగదిలోకి వెళ్ళి చూచేసరికి గోడలమీద తైలవర్ణ చిత్రాలుగాని, శృంగార చిత్రాలుగాని ఏవీ లేవు. గోడమీద సాలీళ్ళు జాలరు అల్లినవి. నిరలంకృతిగా ఉన్న గది చూచి అతను తెల్లపోయినాడు.

"ఇంత ప్రమాదం సంభవించిందేమి కాళీ?"

"ప్రమాదం కాదు, నాభాగ్యం" అంటూ, అతని పాదాలప్రోల ఆమె గొంతుకూర్చున్నది. అతని పాదాలు స్పృశించబోయి "మీ పాదాలు అంటవచ్చునా?" అని సందేహంగా అన్నది.

అతను చిరునవ్వు నవ్వి, అంగీకారం కనబరిచినాడు. అంతటితో ఆమెకు పూర్ణమైన తృప్తిలేక, అతని పాదాలమీద తల మోపి నిశ్శబ్దంగా కన్నీరు కారుస్తూ "చరణా! ప్రియచరణా! ఇక్కడ కొంచెం చోటు ఇవ్వరా?" అని జాలిగా అడిగింది. ఆమె కన్నీటితో తడిసిన తన పాదాలు కదల్చి ఆమె గడ్డంచివర పట్టుకొని ముఖం పైకెత్తి చూచినాడు హరి.

"ఎన్ని నదులయినా నా పాపపంకిలాన్ని కడిగివెయ్యలేవు. ఈ తుచ్ఛురాలిని, అపవిత్రురాలిని ఆదరిస్తారా?" అని అడిగింది. ఉద్వేగంవల్ల సమాధానం చెప్పలేక అతను మనసు చిక్కబట్టి ఆమె తలకట్టు, బుజాలు, కపోలాలు స్పృశించి చేష్టలవల్ల హృదయసంతృప్తి కలిగించినాడు. ఇద్దరూ చాపమీది పరుపుమీద కూర్చున్నారు.

ఉద్వేగం తగ్గిన తరువాత అతను "కాళీ! ఆభరణాలు అన్నీ ఏం చేశావు?" అన్నాడు.

"అమ్మివేశాను"

"సామాన్లు?"

"అవీని"

"బేరసారాలు?"

"బేరసారాలు ఉడిగిపోయాయి. ఎవరన్నా గుర్తు తెలుసుకొని వస్తే కాళ్ళు విరగ్గొట్టి పంపిస్తాను"

"బాబోయ్!" అంటూ తన పాదాలు చూసుకొన్నాడు.

"మిమ్మల్ని ఏమీ చెయ్యను"

"చౌదరి రావడం లేదూ?"

"లేదు"

కొంతసేపు అతను పరాకుగా ఉన్నాడు. మళ్ళీ ప్రశ్నించాడు.

"వ్యాపారం కట్టేసినట్టేనా?"

"కాక మరేమిటి?"

"భుక్తి ఎలాగ?"

"అదివరకే చెప్పాను, నగలు అమ్మేశానని"

"ఎంత సొమ్ముంది?"

"రెండువేలు. అది ఒకరిదగ్గిర పెట్టి, వడ్డీతో కాలక్షేపం చేస్తాను"

"ఇదంతా ఎందుకు?"

కాళి మొదటిసారి సిగ్గుపడి తల వాల్చింది. అతని దగ్గిరికి జరిగింది.

"రెండువేలమీద వచ్చే వడ్డీతో కాలక్షేపం ఎలా చేస్తావు; ఇది మహానగరం కదా?"

"చాలకపోతే ఈ నగరం విడిచి ఏ పల్లెటూరో వెడతాను"

హరిచరణుడు విస్మితు డైనాడు.

"ఒకవేళ నేను వెళ్ళేటట్లయితే మీతో ఒక్క విషయం చెపుదా మనుకొంటున్నాను. నన్ను మీరు కలుసుకొన్నప్పుడు చాలా చీదరించుకొన్నారు. బహుశా నా జీవితంలో అంతగా ఎవరూ నన్ను చూచి అసహ్యించుకోలేదు. నన్ను మీరు రోతగా చూచినా, మీ రెంత గొప్పవారింటి బిడ్డ అయినా, మీ రెంత తెలివితేట లున్నవారయినా, వద్దన్నా మీరు గుప్పెడు రూపాయలు నా వొళ్ళో పోసినా, ఎందుకో మీరు నాకు నచ్చారు. మొదటిసారి నన్ను కలుసుకొన్న రోజుల్లో-మీకు జ్ఞాపకంఉందా- తాగుతూ, గ్లాసు విసిరికొట్టారు. గాజుపెంకు నాకు తగిలింది. నన్ను గాయపెట్టారు. ఆ గాయం మానిం దనుకున్నారా? ఇదిగో చూడండి" అంటూ మరుట నున్న మచ్చ చూపింది. చరణుడు చకితుడైనాడు.

మళ్ళీ ఆరంభించింది: "చిత్ర మైన వ్యక్తిగా మీరు నాకు తోచారు. అప్పణ్ణించీ మిమ్మల్ని నేను మరిచిపోలేకుండా ఉన్నాను. మీరు రాకపోతే ఏదో వస్తువు పోగొట్టుకొన్న దానివలె, కాలు గాలిన పిల్లిలాగ తిరిగేదాన్ని. ప్రతివస్తువునూ కొత్తదృష్టితో చూడడం మొదలుపెట్టాను. నాలో పాత 'నేను' పోయి, కొత్త 'నేను' వచ్చింది. మీకు మద్యము అలవా టయింది. దానికి చౌదరీ కారణము. నాకు సారా అంటే రోత. అయినా మీకు అలవాటు కదా అని ఇచ్చాను. తాగుబోతును చూస్తే నాకు పరమఅసహ్యం. మిమ్మల్ని చూస్తే సహ్యభావం కలిగేది" అంటూ అతని ఒడిలో తల ఉంచి కన్నీరు కారుస్తూ "నేను చాలా నీచురాలిని, నా దోషాలు లెక్క చెయ్యకండి. మీరు నన్ను రోతగా చూచినా మీరు నిద్ద రోయాక మీ శరీరం తాకి మీదగ్గరకు వచ్చేదాన్ని. మీదగ్గిరికి రావడానికి ఎంతో ప్రయత్నించేదాన్ని" అని వేదనతో తూలి సోలి చెప్పింది.

భద్రకాళిహృదయతాపము అతని హృదయాన్ని కరిగించివేసింది. అదివరకు ఎన్నడూ మాట్లాడని భాషలో కాళి మాట్లాడేసరికి ఆశ్చర్యము వేసింది. వేదనలో హృదయం ఉదాత్తరమణీయంగాపలుకుతుంది. రగిలిన గుండె, రాగరక్త మైన గుండె అసామాన్యంగా పలుకుతుంది. కళ్ళు తుడుచుకొంటూ భద్రకాళి మళ్ళీ వెళ్ళబోసుకొన్నది. "ఒకసారి మీ రన్నారు జ్ఞాపకం ఉందా? 'ఎన్ని తిట్లు, తిరస్కారాలు, ఛీత్కారాలు నువ్వుసహిస్తావు' అని అన్నారు. అప్పటినుంచీ నాకు వృత్తిమీద రోతకలిగింది. ఎంతో ఆవేదన రగిలింది. చస్తే ఈ వృత్తి వద్దు. ఈ క్షుద్రజీవితం గడపకూడ దని పశ్చాత్తాపంతో వేడి కన్నీరు కార్చినాను. మీమాట నాలో మార్పు తీసుకొని వచ్చింది."

"పట్టణంలో ఉంటే, ప్రలోభాలకు లొంగి పోతావేమో?"

"అందుకే పల్లెటి దిక్కుకు పోదా మని అనుకొంటున్నాను. అసలు మనిషిమనసే ప్రలోభాలకు వశ మవుతుంది. కొంతకాలం మనసును వాంఛల్లో తృప్తిపరిచినాను. బుద్ధిపూర్వకంగా వాంఛలకు దూరమై పోతున్నాను. నా కేం భయం?" అంటూ కాళి అతని రెండుచేతులూ పట్టుకొన్నది. నన్ను ముట్టుకో వద్దని అనలేకపోయినాడు చరణుడు. ఆమె అతన్ని దగ్గిరికి లాక్కొని ముఖంలో ముఖ ముంచి "మీ హృదయం నేను గ్రహించాను. మీ ముఖంలో వేదన కనిపిస్తుంది. ఎందుకో చెప్పరూ?" అని జాలిగా అడిగింది.

"మా అమ్మ చచ్చిపోయింది"

"పాపం! నా దగ్గిరికి వచ్చినప్పణ్ణించీ ఏదో బెంగగానే ఉంటూ వచ్చారేమి?"

"నన్ను నమ్మించి, నా వలపుల గిలక మోసం చేసింది"

"ఎవ రండీ?"

"ఒక తార"

"పేరే అసలా? తారలాగ చంచలమైందా?"

"అదీ ఇదీ కూడాను. పైగా గొప్పకుటుంబములో నుంచి వచ్చిన పిల్ల!"

"సుఖానికి ప్రత్యేకం చోటుండదు. ఏమంటారు?"

"అవును. అసలు స్త్రీజాతినే విశ్వసించకూడ దేమో!"

"అంతా అలా ఉంటారా? మాది వృత్తి కనుక చాంచల్యం ఉండక తప్పదనుకొంటారు"

"అయితే నీకు చాంచల్యం ఇంకా ఉందా?"

"లేదు. మీ మాటవల్ల వృత్తి మాని, నియమానికి లొంగుతున్నాను. అవునుగాని పాపం, అంత గొప్ప ఇంటిపిల్ల అలా చేసిందేమండీ?"

"ఏం చెప్పను- ఎప్పటికయినా మార్పు అంటూ ఆమెలో వస్తుందేమో!"

"నాలో వచ్చినట్టు వస్తే నయమే"

"రాదు రాదు. తీయని వాగ్దానాలు చేసింది. మాట నిలవబెట్టుకోలేకపోయింది"

"మీ హృదయంలో పూర్తిగా ఆమెకే చోటు ఇచ్చారు కాబోలు-అయినా పురుషులు అలా చెయ్యరే?"

"అమాయకంగా అరుణ తారను అందల మెక్కించాను."

"ఆమెను వెంటనే మాట అనేయకండి. స్త్రీలు హృదయభావము వెంటనే తెలియచెప్పరు. ఆమె ఎలాంటిదో నెమ్మదిగా తెలుసుకోలేదు. మీరు తొందర పెడితే, ఏదో మాట అంటే, వాగ్దానంగా తీసుకొన్నారేమోను!"

"మీ స్త్రీజాతిని వెనకేసుకొస్తున్నావు"

"పురుషులు పెద్దకబుర్లు చెప్పి, ప్రేమిస్తున్నామని అంటారు. నేను వ్యాపారం చేశాను చాలాకాలం. ఈ జీవితంలో ప్రేమానుభవం ఒక్కసారే కలిగింది, ప్రేమ వేరు, రూపాకర్షణ వేరు. మా రూపాకర్షణ వల్ల చాలామంది దీపంచుట్టూ పురుగులవలె ముసురుతారు. పురుషులు మమ్మల్ని చూచి ఉబ్బి తబ్బిబ్బు అవుతారు. మీకంటె మాకు మోహం తక్కువ. పురుషులను చూచీచూడడంతో వెర్రిగా సంచరించము. మీరే- మీ పురుషులే ప్రేమ వ్యక్తం చేస్తారు. మిమ్మల్ని బాధపెట్టడానికి సిగ్గు, అనుమానము, దుఃఖమూ అడ్డువస్తూ ఉంటాయి. మేము తొందరపడి నోరు జారము. ప్రేమించి సమస్తమూ సహిస్తాము. ప్రేమించిన వాళ్ళు తృప్తిపడి కుటుంబకల్లోలం తీసుకురారు. నేననుకోడం అరుణతార మిమ్మల్ని మోసంచేసి ఉండదనీ, మీరే నన్ను అర్థం చేసుకొన్నట్టు ఆమెను అర్థం చేసుకొన్నారనీ."

హరిచరణుని నేత్రాలు అశ్రుపూరితాలయినాయి. కాళి అతని కన్నీరు తుడిచివేదామనుకొన్నది. కాని ప్రయత్నం చెయ్యక ఊరుకొన్నది.

మళ్ళీ కాళి ఆరంభించింది:

"నన్ను మీరు సరిగా తెలుసుకోలేకపోయినారు. మీ దృష్టిలో నేను అల్పప్రాణిని. అయితే నాకు హృదయం, అనురాగము అంటూ ఉంటాయని మీరు ఎరగకపోవడం విచారకరం. అయితే నేను మీ రూపానికి మోసపోక రూపంవెనక దాగిన హృదయం గ్రహించాను. నా జీవితంలో ఇదే మొదటిసారి మీ వంటి హృదయము గుర్తించడం. నా హృదయ రత్నాకరమే మీరు. మిమ్మల్ని నేను వదులుకోను. ఏ స్త్రీ తన మనోధనాన్ని వదులుకోగలదు?"

చరణుడు నవ్వుతూ "ఏమిటి కాళీ, ఇవాళ ఇలా అతిగా మాట్లాడుతున్నావు. పొరపాటున తాగలేదు కదా!" అని అడిగినాడు.

"మీరే తాగుడుకు అలవాటు పడ్డారు. నేనలా తాగలేదు. అన్నట్టు మీరు దురలవాటు మానేశారా! లేదా!"

"నామిత్రుడు విహారి నీలాగే అడిగాడు. ఇక నుంచీ తాగను. నాతల్లి పోయాక ఒక్కసారి తాగాను. ఒట్టు! కాళీ, తాగను" అంటూ చేతిలో చెయ్యి వేసినాడు.

"మీరు చలచిత్తులు. మీ మాట నమ్మడమేనా!"

"శపథం చేస్తున్నానంటే నమ్ము"

"మీ వొళ్ళు పాడవుతుందేమో నని చెపుతున్నాను. మీరు చాలా కృశించారు. మీరు నడుస్తూ ఉంటే గమనించాను, చాలా నీరసంగా అడుగు వేస్తూ వచ్చారు. నామాట పాటించి అలవాటు విడిచిపెట్టండి" అంటూ అతని గడ్డం పట్టుకొన్నది.

అతనికి వింతగా ఉంది. అరుణతారకన్న మిన్నగా ఆమె ఎంత సహృదయత చూపిస్తున్నది!

"కాళీ! ఎప్పుడైనా అవసరముంటే కబురు పంపు; వెళ్ళివస్తాను" అంటూ లేచినాడు హరి.

"మరిచిపోకండి" అంటూ నమస్కరించింది కాళి.

అతను వెళ్ళిపోయాక శూన్యదృష్టితో "భగవంతుడా! ఆయనదర్శనం మళ్ళీ నాకు ఏర్పాటు చెయ్యవా!" అంటూ కళ్లు ముకుళించింది. జాలుగా కన్నీరు కపోలాల వెంట స్రవించింది.

౧౦

మద్యపానము మానేసినప్పటినుంచి హరిచరణుని నరాల సత్తువ పోతున్నది. అస్తమానము కీళ్లు పట్టేవి. నరాలు నములుతున్న బాధ పడేవాడు. లేవడం, నడవడం, మెట్లెక్కి దిగడం అతనికి యాతనగా ఉంది. కడుపు ఉబ్బి పెద్దబానవలె తయారయింది. శరీరంలో పాటవం తగ్గింది. ఎముకల పోగులాగ ఉన్నాడు. మనిషి నల్లబడి రూపే క్రమేణా పోతున్నది. ఉన్ననాడు తిండి తినడమూ, లేనినాడు ఏ స్నేహితుని దగ్గరో డబ్బుచ్చుకొని పానశాలదాకా వెళ్లి తిరిగి వచ్చే జనాన్ని చూచి, లోలపడి అతికష్టంమీద తాగవలె ననే ప్రేరేపణను అణగతొక్కి భద్రకాళిమాటలు స్మరిస్తూ వెళ్లిపోయేవాడు. బలవత్తరమైన ప్రేరేపణకు వశంకాక కొంత మనస్థైర్యము సంపాదించ గలిగినాడు. అప్పుడు కాళిని తలుచుకొని "కాళీ! నిన్ను తిట్టాను, కొట్టాను, చీదరించాను. అన్నీ సహించి నాకు హితము చెప్పి పుణ్యం కట్టుకున్నావు. కాంతాసమ్మితంగా చేసిన నీ ఉపదేశం నేను స్మరిస్తూ కొద్దిగా మనస్థైర్యము సంపాయించ గలిగాను. అందుకు నేను నీకు కృతజ్ఞుణ్ణి" అంటూ విశ్వాసబాష్పములు కపోలాలమీద జార్చినాడు.

తాల్‌సోనాపురంలో పినతల్లి అతన్ని రమ్మని ఉత్తరం రాసింది. ఆమెకున్న నాలుగైదుయకరాల పొలంబాపతు పంట జాగ్రతచేసుకొని కాలక్షేపం చెయ్యవచ్చును, తప్పక రమ్మని రాసింది. విహారి ఆమెకు నచ్చచెప్పడంవల్ల ఆమె 'చెడిపోయిన' అక్క కుమారుణ్ణి రమ్మని రాసింది. అయితే అభిజాత్యం వచ్చి "ఛత్! నేనా సున్నం ఎలా తొక్కను? పరాధీనంగా బతకనా? వితంతువుచేసే శాసనాలకు తలొగ్గి ఎలా జీవించను?" అనుకొని సమాధానము ఏమీ రాయకుండా ఊరుకొన్నాడు హరి.

ఇలా ఉండగా అతని పలుకుబడి చిత్‌పూర్ రోడ్డుదగ్గర అధికమైంది. అతనిదగ్గర నాలుగుడబ్బు లుంటే నలుగురు మనుష్యుల్ని పిలిచి పంచిపెట్టేవాడు. సిగరెట్టు తాగుతూ "రావోయ్ మిత్రమా!" అంటూ పదిమందిని చేరదీసి సిగరెట్లు ఇచ్చేవాడు. పనిపాటలు చేసుకొనేవాళ్ళతో తిరగడం, ఏ తమలపాకుల దుకాణంమీదనో కూర్చోవడం, వాళ్ళ కష్టసుఖాలు అడగడం, మాటసాయం చేయడం జరిగేది. పాటకపు జనానికి హరిచరణుడు ఇష్టమైనాడు. వాళ్ళందరికీ అతను తలలో నాలుక. అందువల్ల ఏపని చెపితే ఆపని వాళ్లు చరణుడికి చేసిపెట్టేవారు. మంచిమాట చేసినపని మహాస్త్రం చెయ్యదు. ఒక్కనాడు చిత్‌పూర్‌లో అతను కనపడకపోతే ప్రతివాడూ "హరి,హరి,హారేడీ! ఏమైనాడు" అని ఖంగారుపడేవారు. ప్రజాహృదయాన్ని చూరగొన్న హరిచరణునికి అదే ధైర్యం, తన అంత్యకాలంలో వాళ్ళే ఆదుకొంటా రని.

నరాల నిస్సత్తువవల్ల క్రమేణ ఒకనాడు చేతికి పక్షవాతం వచ్చింది. నలుగురు పోగయి తేనెకోసం పరుగెత్తి సంపాయించుకొచ్చారు.

"ఎందుకురా అబ్బీ! ఇంతటితో జీవితం చాలిస్తాను" అని దీనంగా అన్నాడు చరణుడు.

"అలా కాదు హరిబాబూ! మాకోసం మీరు కలకాలం ఉండాలి" అన్నాడు దుకాణపు మాలీ.

"అదేమిటి సోదరా అలా అంటావు? నాలుగు కాలాలుపాటు తిని తిరిగి మాతో ఉండవలసినవాడివి, వేదాంతం చెబుతా వేమిటి?" అంటూ శ్యామలాలు బలవంతంచేసి అతనికి తేనె ఇచ్చాడు.

కొన్నాళ్లదాకా బాగానే పనిచేసింది తేనె. మొత్తంమీద తన శరీరంపైన తనకు పీసమెత్తు అధికారంకూడా లేకుండాపోయింది. అప్పుడప్పుడూ విహారి వచ్చి, ధన మిచ్చి, కన్నీరు కార్చి వెళ్లిపోతూ ఉండేవాడు. దుకాణదారు మాలీ డబ్బు పుచ్చుకోకుండా చర

ణుడికి ఎప్పుడు కావలిస్తే అప్పుడు సిగరెట్లు, కిళ్లీలు, సోడా, మిఠాయి ఆప్యాయంగా ఇచ్చేవాడు. తన కొట్టుపక్కనే చిన్నగది హరిబాబుకు మకాము ఏర్పాటు చేశాడు. గదిముందు అరుగుమీద అతను అధిష్ఠించగా శ్యామలాలు, దులారి, కాయస్థ, కిశోరీ మొదలయినవాళ్లంతా కొలువులోకి వచ్చేవారు. అంతా మాలీదగ్గిర చుట్టలు పుచ్చుకొని కాగడాలు వెలిగించి ధూమం వదులుతూ లోకాంతరాలదాకా కబుర్లు చెప్పుకొనేవారు.

హరిచరణుడు ఒకరాత్రి అరుగుమీద పరుండి అనుకొన్నాడు—"ఇక్కడివాళ్లంతా నన్ను గౌరవిస్తారు. నెత్తిమీద పెట్టుకొంటారు. నేను చనిపోతే అప్పుడు వీళ్లు ఎలా చెప్పుకొంటారో? ఎంత పనికిమాలినవాడయినా చచ్చిపోయాక ప్రజాహృదయాన్ని కరిగిస్తాడు. అయ్యో పాపం అంటారు అందరూ".

చీకటితోనే లేచి చరణుడు చిత్పూర్ విడిచి ఎక్కడికో వెళ్లిపోయాడు. రెండు మూడు రోజులైనా తిరిగి రాలేదు. మాలీకొట్టుదగ్గిర అంతా గూడుపుఠాణీ చేశారు. మూడోనాడు మధ్యాహ్నము మాలీకి ఎక్కణ్ణించో కార్డు వచ్చింది. వాడిజన్మలో వాడికి ఎవరూ ఉత్తరంరాసిన పాపాన పోలేదు. కిశోర్ పరుగెత్తుతూ వచ్చి "మాలీభాయ్, హరిబాబు దగ్గిర్నుంచేనా?" అని ఆదుర్దాగా అడిగినాడు.

మాలీ "అవును భాయ్. కొంచెం చదివిపెట్టు" అని అడిగాడు.

ఆ ముఠాలో అక్షరంముక్క ఒక్కరికీ రాదు. తోవనేపోయే పెద్దమనిషిని తెచ్చి ఉత్తరం చదవమన్నారు.

"మాలీదాదా!

చాలాదుఃఖభారంతో ఈఉత్తరం రాస్తున్నాను. ఇక్కడ కాలువగట్టున స్నానంచేస్తూఉండగా, పడవ ఢీకొన్నది. తలపగిలి హరిబాబు చనిపోయాడు. మనల్ని అందరినీ నడిఏట్లో ముంచిపోయాడు. అతని తాలూకు వస్తువులు, అతని చక్కని చేతిసంచీ, పుస్తకాలకట్ట అన్నీ జాగ్రత్త చేయాలి. అయ్యో! ఏదీ అలాంటివాడు!

మిత్రుడు విహారి."

చదివే చదవడం తరవాయి, మాలీ కళ్లమ్మట నీళ్లు పెట్టుకొని "నన్ను గంగలో దింపిపోతావా? నాతో చెప్పకుండా ఎక్కడికి పోయావు హరీ?" అని విచారించాడు.

"మృత్యువు వచ్చేటప్పుడు చెప్పిరాదు" అంటూ ఆ పెద్దమనిషి వెళ్లిపోయాడు.

మాలీ దుకాణము కట్టేసి విచారంతో చరణుడి గదిలో ప్రవేశించి అతని సంచీ, చిన్నదువ్వెన, అద్దం, ఉత్తరాలు-అరుణతార ఎప్పుడో పూర్వాశ్రమంలో రాసినవి అన్నీ జాగ్రత చేసినాడు. ప్రపంచనాటకరంగంలో ఒక పాత్ర నిష్క్రమించిన మాత్రాన నాటకం ఆగిపోతుందా? రంగశాలకు ఏమైనా లోపమా! సూర్యుడు ఉదయిస్తాడు; చీకటి పడుతుంది.

కాయస్థుడు కొంత తెలివి తెచ్చుకొని "నారే! ఉత్తరం చదివారుగాని, హరి ఎక్కడ పోయాడో తెలిసిందా?" అని ప్రశ్నించాడు.

"ఉత్తరంలో ఎక్కడ చనిపోయిందీ లేదు" అని కిశోరి.

"అయ్యో! పోస్టుముద్రయినా చూడండి" అని మాలీ అన్నాడు సమయస్ఫూర్తిగా. భూతద్దాలవంటి కళ్లజోడు కళ్లకు పెట్టుకొని కాయస్థుడు తిరగేసి మిరేసి అవస్థపడి అక్షరాలు గుర్తుపట్టి "తాల్ సోనాపూర్" అని చదివినాడు.

"కాలవలో స్నానం చేస్తూంటే పడవ వొస్తే తప్పుకోలేడా?" అని మాలీ అన్నాడు.

"గుద్దేసిందేమోరా" అని కిశోరీ అన్నాడు.

"ఏమో, వాడు చచ్చిపోడురా. నానమ్మకం అది" అన్నాడు.

"నీనమ్మకం నీది. చావుదారి చావుది" అని లాలు.

"నరాల పట్టు లేక అసలు వాడు కాలవలోకి ఎలా దిగాడో? పోనీ దిగాడనే అందాము. పడవొస్తే తప్పుకోడానికి ఈత రాదే వాడికి" అని మాలీ.

౧౧

విశ్వంభర చౌదరీ నిత్యవిధి తప్పకుండా సాయం కాలం సారాదుకాణానికి వెడుతూ, తోవలో హరిచరణుడు చచ్చిపోయాడని విని, ఆరోజు వైరాగ్యంతో తాగుడు మానేశాడు. ఇంటిపట్టున కూర్చుని "అరోగ్య చరణ్! నన్ను విడిచిపెట్టావు. నీకు మరణము సంభవించింది. హాయిగా ఇక్కడే ఉండి, తాగుతూ కష్టాలు మరిచిపోతూఉండా మనుకున్నానే!" అనుకొన్నాడు.

ఇటీవల కొంతకాలంనుంచి చౌదరి భద్రకాళి ఇంటికి వెళ్లడంలేదు. కాళి వృత్తిమానేసి మడి కట్టుకొన్నదని అతనికి కోపం వచ్చింది. మకాము కూడా ఎత్తేసి, ఎక్కడో సంసారస్త్రీ లుండే చోట సదాచారంగా ఉంటున్నదని విని నిరాశ చెందినాడు. ఆమె హరిచరణుని ప్రేమిస్తున్న దని చౌదరి అదివరకే కొంత గ్రహించిఉండడంవల్ల, మిత్రుని మరణవార్త ఆమె చెవిని వేదామని అనుకొన్నాడు. తత్కాలీనాశ్రమావస్థలోనుంచి ఏతత్కాలీన పతివ్రతాత్వంలోకి ఎగిరి గంతేసిన భద్రకాళీముఖం ఎలా చూడడ మని అతను మీమాంసలో పడ్డాడు.

దుర్వార్త ఆమెచెవినివేస్తే ఎలాగో బాధపడక మానదు. అలా ఆమె బాధపడుతూ ఉంటే చౌదరి చూడలేడు. ఆమెను చూస్తే అతను ప్రతిఘంగము చేయాలనిపిస్తుంది. ప్రియునికోసం కంటతడిపెడుతూ వుంటే తానెలా ఆమెతో సరసమాడతాడు? ఇదంతా దూరాలోచన చేసి ఎందుకయినా మంచిదని కాళి దగ్గిరికి వెళ్లడం మానేసి కబురు పంపించాడు.

కబురు రాకముందు భద్రకాళి చక్కగా జడ అల్లుకొంటూ, ఇంట్లో కూర్చున్నది. ముసిలితల్లి "ఏమే పిల్లా, ఆ బ్రాహ్మడిమాలావ వృత్తి బుగ్గయిపోయింది. ఎలాగే? చక్కగా పుళ్య లెట్టుకో, చూస్తాను. నీకోసం ఎవరినన్నా చూస్తాను" అంది యాదాలాభంగా.

భద్రకాళి కాళికామూర్తిలాగ గద్దిస్తూ "ఛీ, ఏం మాటది? ఈ శరీరం హరికే అర్పితమైపోయింది. పరాయివాణ్ణి చస్తే స్పృశించను. తలపెట్టను." అని పలికింది. తల్లిమాట తీసివెయ్యలేక మల్లెదండ అర్ధచంద్రాకృతిగా సిగకు చుట్టుకొన్నది. తిలకం తీర్చి, దిద్దుకొని అంతటితో ఊరుకోక పాపిట సిందూరం పెట్టుకొన్నది. ఎర్రతమ్మెలచీర కట్టుకొని ముసుగువేసుకొని చిన్న అద్దంలో చూసుకొంటున్నది.

"ఏమే పిల్లా! ఎంత పెద్దమనిషితరహా వచ్చిందే. ఇవేళ అతను వస్తాడా ఏమిటే?" అంది ముసిలిది బోసినోటితో నవ్వుతూ.

"ఆయన అన్నమాటప్రకారం రావాలి. అందుకోసమే ఇదంతాను" అని అర్ధస్మితంతో అన్నది కాళి.

సరిగా అప్పుడే భద్రవాడు చౌదరీదగ్గిరనుంచి వచ్చి కబురు చెప్పాడు. కెవ్వన కేక వేసి భద్రకాళి గుమ్మందగ్గిరే పడిపోయింది! ముసిలితల్లి "అరెరా, కూతురా! ఏం చేతునే" అంటూ గుండెలు బాదుకొని తోచీ తోచక కాలు కాలిన పిల్లిలా తిరిగింది. పొరుగున ఉన్న శ్యామసుందరి గగ్గోలు విని పడిపోయిన కాళి మీద నీళ్లు చిమ్మరించింది. కాళి మెల్లిగా లేవగలిగింది.

౧౨

విహారి చరణునిమీద మమకారంవల్ల అతన్ని గురించి పత్రికలో 'అశ్రుతర్పణము' అనే శీర్షికతో రాశాడు. చరణుడు వియోగవ్యథలో అరుణతారకు రాసిన ఉత్తరాలు మాలీదగ్గిరినుంచి తెప్పించి, సంపుటంగా ముద్రించా లని యత్నంచేస్తున్నాడు. గ్రంథం అచ్చు వేయించడానికి భద్రకాళి ఎంతైనా ధనమువసూలుచేసి ఇస్తా నని వేదనాపూర్వకంగా తెలియజేసింది. మిత్రుని మరణవార్త అరుణతారకు తెలిసిందో లేదో అని విహారి, పత్రికలో ముద్రితమైన అశ్రుతర్పణాన్ని విడతీసి పంపినాడు. అరుణతారసంగతి తెలుసుకోవలె నని విహారి కుతూహలంతో ఉన్నాడు.

ఒకసాయంత్రం ఐన్‌పార్ల రోకు పానీయము తాగుదామని అతను బయలుదేరినాడు. గుమ్మంలో సవాశ్యలు నవ్వుతూ "ఏమండోయి, దారితప్పి వచ్చారు" అని కొంత వెటకారంగా అన్నాడు.

"పాంథుల పథభ్రమ - మీరు పోగొట్టేస్తారు, దారి తప్పడ మే ముంది ఇందులో? "

"అవును గాని ఈ మధ్య కబురొకటి విన్నాను: ఎంతవరకు నిజం!"

"ఏమిటది!"

"హరిచరణుడు చచ్చిపోయాడని—ఏ ఊళ్ళోనో కాలవలో, స్నానం చేస్తూ చేస్తూండగా, పడవ దగ్గిరపాకస్తే తప్పుకోలేక తలపగిలి మరణించాడని"

"నేను పత్రికలో చూశాను సన్యాల్."

"అతను చనిపోవడ మేమిటి!"

"మనిషి అయినవాడు చనిపోవడం వింతేమిటి? పానీయం తెప్పించండి" అంటూ కుర్చీలో కూర్చున్నాడు విహారి.

క్షణంలో మెరుపుతీగెలా అరుణతార బాబ్ చేసుకొన్న జుట్టుతో, సీతాకోక చిలకలా, ఎత్తుజోళ్లు టకటక లాడించుకొంటూ, హిమశీతలపానీయం తెచ్చి విహారిముందున్న బల్లమీద ఉంచి వెళ్ళిపోతున్నది. అప్పుడే సన్యాల్ కోసం ఎవరో 'హారన్' కొట్టినారు. "తారా! ఆయనకు కావలసిం దేదో కనుక్కో" అంటూ సన్యాలు మోటార్ లో ఎక్కినాడు. సన్యాలు అలా వెళ్ళిపోవడం తారకు కొంచెం ఇబ్బందిగా ఉంది. విహారితో ప్రసంగం చేదామని ఆమెకు ఇచ్ఛలేదు.

ఆమె వేషం పూర్వాశ్రమంలో ఉన్నట్టు లేకపోవడంవల్ల విహారి కొంచెము ఖంగారుపడి తెప్పరిల్లినాడు. ఆమెను చూశాక ఆమెస్వభావం అతనికి కొంతవరకూ తెలిసింది. మిత్రుని మరణవార్త తారను బాధించినట్టు తోచదు. హిమశీతల పానీయము తయారుచేసే చోట ఉండడంవల్ల ఆమెహృదయముకూడా జడమై ఘనీభవించిందేమో! పానీయము మెల్లిగా అతను తాగుతూండగా, పత్రిక చూస్తూ కూర్చుంది తార. కొంతసేపు బల్లమీద చితాలు తిరగవేసింది. ముందు ఆవిడ పలకరిస్తే తను పలకరించాలని అనుకొని ఆమెవాలకం కనిపెట్టాడు విహారి. తారముఖం చూస్తే సంతోషమూ లేదు, దుఃఖమూ లేదు. ఏ భావమో ఆ ముఖారవిందం స్ఫుటం చెయ్యలేదు. హృదయం చాలా లోతైె పూర్ణమైనప్పుడు తొణకకుండా ఉండడం కద్దు. భావభరిత హృదయగాఢడంవల్ల మాట్లాడలేకపోయిందేమో నని అతను అనుకొన్నాడు. ఆమె వేషాన్నిబట్టి చూస్తే అంతగా విచారం ఉన్నట్టూ లేదు.

పలకరించి తీరాలని సంకల్పించుకొని విహారి "ఏమండీ, నన్ను ఎక్కడయినా చూచిన జ్ఞాపకం ఉందా?" అని ప్రశ్నించాడు.

"No, Thanks" అని గంభీరంగా సమాధానమిచ్చేసరికి అతను నిర్విణ్ణుడైపోయాడు. కొంత తెప్పరిల్లి, "నన్నెప్పుడూ చూడలేదా? హరిబాబుతో తరణాలయానికి తరుచు వచ్చేవాణ్ణి" అన్నాడు.

"హరిబాబు అంటే హరిచరణుడా!" అంది ఆమె.

"మరేనండి"

"Excuse me. జ్ఞాపకం వచ్చింది. ఈ వ్యాపార సంస్థలో రాబడి ఎక్కువ వల్ల లెఖ్ఖాడొక్కా అజమాయిషీ నేనే చూస్తూండడంవల్ల ఇతరమంతా జ్ఞప్తిలో ఉండదు."

"ఫరవాలేదు. పొరపాటు మానవసహజం" అని వ్యంగ్యధోరణిలో ఆమెను కదిపినాడు విహారి.

"మరేనండి, పొరపాటే. మీరు అప్పటికీ ఇప్పటికీ ఒకలాగు లేరు. ఏదో మార్పువల్ల గుర్తించలేక పోయాను" అన్నది తార.

"మీలో మార్పువల్ల మీ రవునా కాదా అనుకొన్నాను" అన్నాడు విహారి.

అప్పటికీ హరిచరణుని విషయం ప్రసంగవశాన్నైనా ఆమె ఎత్తుకోక ఏదో ఉదాసీనంగా ఉండడం అతను గ్రహించి, ఆశ్చర్యాన్ని ప్రకటించలేదు.

"అశ్రుతర్పణం పత్రికలో చూశారా?"

"మరేనండి పాపం! అంత దారుణంగా చనిపోయాడు!"

"ఏమి చెయ్యగలం!"

"మనచేతుల్లో ఏదీ లేదు. ఎంతో మంచివాడు" అన్నది. క్షణం ఊరుకొని "ఎవరండీ అశ్రుతర్పణం పంపించింది? మీరేనా?" అన్నది తార.

"మీ ఉభయుల మిత్రులూ అయి ఉంటారు."


"పాపం, ఆయన త్యాగమూర్తి!" అని అరుణ తార హరిచరణుని మీద గౌరవము వెల్లడించింది.

"ఎందువల్ల త్యాగమూర్తి?"

"మీకు తెలియదా? ఆయన నాకోసం త్యాగం చేశారు" అంటూ కొంత దైన్యాన్ని కనబరచింది. క్షణం నిదానించి "నాకు వేరే Engagement ఏర్పాటుంది. క్షమించండి, సెలవు" అన్నది.

అలా ముక్తసరిగా తార మాట్లాడి తప్పుకొంటూ వుంటే విహారి ఏమీ చెయ్యలేక "వెళ్ళొస్తాను" అని వెళ్ళిపోయాడు. తోవలో నడుస్తూ అనుకొన్నాడు. ఇంగ్లీషు చదువుకొని కాస్తో కూస్తో పాఠశాలల్లోనో, కళాశాలల్లోనో అనుభవం సంపాయించి ఇంత విపరీతంగా సంచరిస్తుందేమని అతనికి సందేహం పట్టుకొన్నది. ఇలాంటి ఆంగ్లవిద్యా పారంగత సామాన్యంగా చదువుకొన్నవాణ్ణి మనసారా ప్రేమించి స్థిరంగా ఉండమంటే ఎలా వుంటుంది? సీతాకోక చిలకలా ముస్తాబై జనాకర్షణ చేస్తూ, విద్యాసంపత్తి ఉన్నదనే భ్రమతో దురభిమానంతో ఉండే అరుణతార హరిబాబును ఎలా ప్రేమిస్తుంది? అయినా నా దగ్గిర తన విషయం చెప్పుకోడానికి ఇష్టపడలేదేమో. ఎన్నోసార్లు హరితో కరణాలయానికి వెళ్ళినా నేను జ్ఞాపకం లేనట్టు వింతగా నటించింది. నటనాశక్తి అలవడిన నవనాగరిక శిరోమణి పురుషహృదయంలో ఆటలాడి నమ్మించి, కొంపతీసిం దంటే వింతపడక్కర్లేదు. ఇలాంటిదాన్ని అమాయకుడు హృదయసింహాసనంమీద ప్రతిష్ఠచేసి తన జీవిత మంతా అర్పించాడు. వెర్రివాడు! అసలు హరి శోలాపూర్‌లో చనిపోయా డంటారు. వెళ్ళి భోగట్టా చేసితీరాలి. చచ్చిపోయా డంటే నమ్మకంగా లేదు. నేనే ఈ కబురు పత్రికల్లో వేయించాను. యథార్థం నాకూ తెలియదు. అయ్యో! తల పగిలి చచ్చిపోయాడు నా ప్రియ మిత్రుడు. అలాంటి ఘోరమరణం అమాయకుడు, నవనీతహృదయుడు అనుభవించడు!

(ఇంకా ఉంది)



"గోరుగోరు ముద్ద"

పునరాలోచన

•

– శ్రీ దేశిరాజు కృష్ణశర్మ –


పవ లోక ముండ్లడొంకగ, విభావరి పూవుల బాటగాగ, ఈ
భువి సకలంబు నాహృదయమ్మున్ గుడుసుల్లుగ ఆక్రమించ, నా
కెవ రెదురైన మృత్యు వను కేక వినంబడ-జన్మజన్మసం
భవదురితాంధముల్ కనులు బ్రామగ పోవుచునుంటి ఒంటిగన్.

నీ వొక సత్యచైత్యరమణీయతతో దిగివచ్చినావు నా
లో వసియించినావు ఎటులో-రిపుసత్వములన్ కృశించు బా
ధావివరంబు నాయెడద తల్పు లొకింతగ ఓరజేసి నీ
కై వెతుకాడితిన్. దొరకవైతివి ఏకడ నుంటి దొంగవై?

నా కనుచూపుమేరల కనంబడు జీవితభూమికన్ జగు
ప్సాకలుషంబు నర్తనము సల్పు అపశ్రుతి తోడుగాగ-నీ
వేకడ కేగి తీ జగతి నింత దరిద్రత లోన ముంచి-స్వా
మీ!కరుణించి రాగదవె ఈభువి నీనిలయంబు చేయగన్.

రావనుకొందుగాని అపరంజిత సాంధ్యదిశాళి మేఘముల్
ప్రోవుగ క్రమ్మినప్పుడు-ప్రవృద్ధి ఉషోదయరాగరేఖలన్
జీవితవాంఛ లీజగతి చిందెడు దివ్యరసోల్బణంబు-నా
లో వెలిగించె స్వామి!ఎటులో అరుదెంతు వటన్న ఆశలన్.

నీకయి నిల్వబెట్టితి కనీనికలన్ దొలుకాడు ప్రాణముల్
చేకొని పోదువో?మరల చేర్చెదవో నను ఉన్నచోటికిన్
నాకును నీకు ఎన్ని జననంబుల పంతమొ స్వామి! ఎందు కీ
రాకడపోకడల్-నిలుపరాదటె ఈయెడ నన్ను నీవుగా.



తాడిపత్రి దేవాలయము - అంతర్భాగము.

కీర్తిశేషుని ఘోష

(వ్యంగ్యరచన)

— శ్రీ ఈరంకి వెంకటరావు —

కీర్తిశేషుడు మళ్ళీ మనలోకి వస్తా నన్నాడు. నేను రావద్దన్నాను. కీర్తిశేషుడికి కోపం వచ్చింది. ఇంక అక్కడించి ఒకటే వరసని ధోరణి మొదలెట్టాడు.

"అందుకనే ప్రపంచం అంటే నాకు వెగటు పుట్టింది. నేను బతికి వున్నన్నాళ్ళూ లోకంలో మహత్తర కార్యాలు చేశాను; అనేక ఉద్గ్రంథాలు వ్రాశాను; అనేక సంఘాలు అధోగతిపాలవకుండా కాపాడాను. నేను జీవించినన్నాళ్లూ గుడ్డి లోకం కానలేక పోయింది. నా దీనస్థితికి గాని, సంసారపు బాధలకు గాని హృదయపూర్వకంగా ఒక్కరూ సానుభూతి చూపలేక పోయారు. నా ఉద్గ్రంథాలు అచ్చువేయించడానికి అనేకులను ప్రతిమాలవలసి వచ్చింది. నా గ్రంథాల్ని కృతి ఇస్తానన్నప్పటికీ అప్పట్లో చాలామంది వాటి గొప్పదనాన్ని గుర్తించలేక పోయారు.

"కాని, ఏమిటో నేను జీవితం చాలించాక చూశాను, అబ్బ! లోకం మహా ఏడ్చింది నా కోసం. ఊరూరా, వాడవాడల్లోనూ సంతాపసభలే. అందరూ నా త్యాగాన్నీ, ఉదారాశయాల్నీ, సర్వమానవ సౌభ్రాతృత్వాన్నీ, మానవ సేవనూ, దేశసేవనూ అనేక వేల నోళ్ళ పొగిడేవారే. నేను చచ్చిపోయినాక నా పేర ఒక నిధిని పోగుచేసి నా కుటుంబాని కిచ్చారు. దానితో, నేను బతికి వుంటగా భీమా చేయలేదే అనే చింత పోయింది. అసలు డబ్బుంటే భీమా చేయడానికైనాను; ఏదో నా జీవితానంతర దినాలు చాలా బాగా వెళ్ళాయి. అయితే ఎవరు అనుభవించినట్టు. ఉక్కగా దుగ. లోకం నాకిచ్చిన నీరాజనాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు వంటివి. అందుకనే అన్నాను లోకం గుడ్డిదని."

ఈ ధోరణి చూస్తుంటే నాకు మహా కసుగొచ్చింది. "మహాప్రభో! నీ కొక దణ్ణం. నువ్వు చాలా గొప్పవాడివి. లోకంలో నీ అంత గొప్పవాడు మరి ఇహ లేడని ఒప్పుకుంటాను. దయవుంచి ఇక్కడనుంచి దయచేసి నన్ను నిద్ర పోనీ" అన్నాను.

"వెధవ నిద్ర! అందుకే మీరంతా అంటే నాకు మహా చెడ్డ యిది. మీ రంతా సోమరి పోతులు. ఇదుగో నేను చెప్పేది పూర్తిగా విను. నువ్వు చాలా మంచివాడివి. కాబట్టే ఇంతమంది వుండగా అందర్నీ వదిలేసి నీ దగ్గర కొచ్చాను. చూశావ్! నేను బతికివున్నన్నాళ్లూ యమబాధ పడ్డాననుకో. నేను చాలాసార్లు అనుకున్నాను — కవిగా గాని, దేశసేవకుడుగా గాని పగవాడైనా తయారు కాకూడదని. కాని అది అట్టే అంత మంచి అభిప్రాయం కాదులే. ఏమిటో జీవితంమీద చిరాకుపుట్టుకొచ్చి అప్పుడలా అనిపించేది. నేను బతికున్నన్నాళ్లూ మానవుల హృదయాలు తిరుదుగట్టినట్టు కనిపించేవి. తోటిమానవుడు ఎంతో అవస్థలో వుంటే సహాయం లేకపోతే పోనీ, కాస్త జాలన్నా లేదయ్యా.

"నేను ఏదో స్వయంకృషి, స్వయంసహాయం అనే అక్షరాల్ని పాటించేవాణ్ణి గాబట్టి నాకు ఒకరి అపేక్ష లేక పోయింది. నేను జీవించివున్నప్పుడు నాకే గనక సరియైన స్తోమత, ఉత్సాహం ఇచ్చేవాళ్ళున్నట్టయివుంటే, మన దేశానికి మరే నాయకుడూ చేయలేనంత సేవ చేసివుందును. ఏమయితే ఎందుకు? నేను పోయాక లోకం మహా ఏడ్చింది! అల్లారు ముద్దుగా పెంచుకున్న పిల్లాడు పోయినప్పుడు విహరించే తల్లిలాగ అయిపోయింది లోకం. చివరికి నా కీర్తి మాత్రం నిలిచిపోయింది. నేను మాత్రం లోకానికి దూరమై పోయాను. అందుకే నన్ను కీర్తిశేషు డన్నది లోకం."

చెవులో మోత ఎక్కువయింది. "స్వామీ! నువ్వు కీర్తిశేషుడివే గాదు, కీర్తికాయుడివి గూడాను. ఎందుకు నన్నిలా చంపుతావు. నిద్రపోనీ" అన్నాను నేను.

"మరేం లేదు. రెండు ముక్కలు నీతో చెప్పాలని వచ్చాను; కాస్త ఓపికపట్టు. మొన్న నా స్మారకసభలో వక్తలు అనేకమంది ప్రముఖుల ఎదుట నన్ను చెడపొగిడి, ఇప్పుడిలా విసుక్కుంటావేం? ఆ నాడు నీ నోటితో నువ్వే కదూ 'ఆ మహానుభావుడు మన కళ్లముందర తిరుగుతున్నంత

కాలమూ ఆయనగొప్పతనాన్ని మనం గుర్తించలేకపోయాం. అటువంటి మహనీయులు ఛస్తే మన కళ్ళు కగపడరు. ఒక వేళ అటువంటిదే జరిగితే మనం నిజంగా తరిస్తాము' అని ఏకధాటిగా చెప్పావు. మరి ఇప్పుడు నేను కనిపిస్తే ఆలా విసుక్కుంటావేం?

"ఇదుగో. నీకు కొన్ని ముఖ్యవిషయాలు చెబుతున్నాను. విను. ఈ నాటి ఖుర్రకారు ఎందుకూ పనికిరాకుండా పోయింది. ఇప్పటివాళ్ళు ఏ పనీ సాధించలేకపోయినా మా కీర్తిని పాడుకుంటే నిజంగా తరిస్తారు. మా అడుగుజాడల్లో నడిస్తే వారి కింక కావలసిం దేముంది? లోకం అప్పుడే మా పురాతన పద్ధతులు వదిలేసి తన కిష్టమొచ్చిన మార్గాలు వెదుకుతోంది. అందుకే నాకు తలకాయనొప్పి. కొత్త మార్గాలు అన్వేషించినకొద్దీ, కొత్త చిక్కులు అనేకం అస్తు తగులుతాయి. దాంతో మీ రెప్పటికీ బయలుదేరిన చోటే వుంటారు అనవసరశ్రమ. వృథాప్రయాస మాత్రం మిగులుతాయి.

"లోకం అప్పుడే నన్నేగాకుండా నా అభ్యుదయ మార్గాల్నికూడా మరిచిపోతోంది. నేను పుస్తకాల్లో వ్రాసింది ఎవరికీ పనికిరాకుండా పోతోంది. అనేకమంది బయలుదేరి ఊరికే—ఇష్టే—అనేక పుస్తకాలు రాస్తున్నారు. చాలామంది ఏదో దేశసేవ, సంఘసేవ అని ప్రజల్ని భ్రమింపజేసి నన్ను మరపింప జేస్తున్నారు.

"నేను కీర్తిశేషు ణ్ణయాక నాముందువారిని మరిచిపోయి వట్టే నావెనక కొంతమంది కీర్తిశేషులు బయలుదేరగానే నన్ను మరచిపోతున్నారు ప్రజలు. ఏదో ఇంకా పూర్వకాలం వాణ్ణి గాబట్టినీ, నేను చేసిన సేవ కాస్త కూస్తా గాదు గాబట్టినీ ప్రజలు నన్ను అంతపూర్తిగా మరిచిపోలేక పోతున్నారు. ఇప్పటివాళ్ళల్లో మళ్లీ వెనకటి ఆవేశం తీసుకురావాలంటే, ఇంకా లోకం నన్నూ, నా సేవనీ మరిచిపోకుండా వుండాలంటే నేను మళ్ళీ ఇంకొక్కసారి వెనకటి జీవితాన్నే తొడుక్కుని రావాలి. ఇదివరకే నాకు పేరువచ్చేసింది గాబట్టి ఇహ ప్రజలు నన్ను చిన్నచూపు చూడకుండా, నాకు అమోఘంగా తోడ్పడుతారు. నేను వస్తాను. తప్పకుండా వస్తాను. ఈలోపుని ప్రజలు నన్ను మరిచిపోకుండా సభలు, సమావేశాలు జోరుగా జరిపి నన్ను వాళ్ళకి తరుచూ జ్ఞాపకం చేయిస్తూ వుండు—ఏం? ఏమంటావు? రమ్మంటావా?" అని అడిగాడు కీర్తిశేషుడు.

"బాబూ! నువ్వు దేహం లేకుండానే వన్నిలా బాధిస్తున్నావు. నీవు దేహం తాల్చివస్తే ఇంకెంత బాధపెడతావో? నా కన్న ఇంకా ముందువెనకలు ఆలోచించేవారు చాలామంది వున్నారు. వాళ్ళ నెవళ్ళనైనా అడుగు. లేకపోతే మీ కీర్తిశేషులందరూ ఒక సభచేసి తీర్మానం నెగ్గితే, నువ్వు కీర్తిశేషులందరి తరఫునా ప్రతినిధిగా రా. నన్నెందుకు బాధపెడతావు? నిద్రపోనీ" అన్నాను.

"అదుగో, అక్కడే నువ్వు పొరబడుతున్నావు. నాకు మిగిలిన కీర్తిశేషులతో పనిలేదు. వాళ్లందరూ అనవసరంగా పేరు సంపాదించి నా కీర్తిని అడుగంటేటట్లు చేస్తున్నారు. నేను లోకంలో ఉండగా కొన్ని కార్యాలు చెయ్యడం మరిచిపోయాను. అవన్నీ యీమధ్య జ్ఞాపకం వస్తున్నాయి. ఆ పనులుగూడా చేసేశానంటే నాకీర్తి మిన్నుముట్టుతుంది. లోకం నన్ను ఛస్తే మరిచిపోలేదు.

"ఇదుగో. నీకు తెలియదుగాని రోజులు గడిచినకొద్దీ మీవాళ్ళ తెలివితేటలు నన్నగిలుతున్నాయి. లేకపోతే ప్రతీ చచ్చిన వాణ్ణీ, వాడికి కీర్తి వున్నా లేకపోయినా, కీర్తిశేషు డనడమేమిటి? ఏ కుష్ఠు మొద్దావతారం చచ్చినా, ఏ జులాయి వాడు చచ్చినా, ఏ అవినీతి పరుడు చచ్చినా—వాళ్ళందర్నీ కీర్తిశేషు డంటావు. ఇంక ఆ పదానికి విలువెక్కడిది? అటువంటప్పుడు అసలయిన కీర్తిశేషులు వాళ్ళో, నేనో తెలియకుండా పోతుంది. నేను ఎళ్ళీ జీవందాల్చి కీర్తిశేషు లంటే ఎవరో ప్రపంచానికి బ్రహ్మాండంగా చాటే ఒక పుస్తకాన్ని వ్రాస్తాను. ఈలోగా దానికి కావలసిన సరంజామంతా సిద్ధం చెయ్యి. అయినా లోకంమీద యీ మధ్య పుస్తకాలు అట్టే అంతపని చెయ్యడం లేదు. దాబుగా నాలుగు కబుర్లు చెప్పి, చెప్పిందాన్నే మళ్ళీ ఇంకోలాగ తిప్పి చెప్పేవాళ్ళ వెనకాలే పడుతున్నారు ప్రజ. మాటలు అనవసరంగా ఖర్చుపెట్టకుండా లోకాన్ని పుస్తకాలద్వారా లోపర్చించి మరమ్మతు చేసుకొద్దామనే మా ఆశయాలు యీనాటివాళ్ళకి నచ్చటం లేదు.

"అందుకని నేను మళ్ళీ వచ్చాక పుస్తకం వ్రాయడం అనవసరమేమో ననిపిస్తూంది. కాబట్టి ఒకపని చేస్తాను. ఈ మధ్య పత్రికా ప్రచారం, పత్రికల్లో వ్రాసింది వెర్రిగా నమ్మడం ఎక్కువై పోయింది. అందువల్ల 'కీర్తిశేషుడు' అనే ఒక పత్రిక స్థాపించి దాని ద్వారా లోకానికి ఎవరు అసలైన కీర్తిశేషుడో, ఎవరు నకిలీ కీర్తిశేషుడో అమోఘంగా చాటుతాను. ఈ ఉద్దేశ్యాలు ఒట్టి గాలిగోపురా లనుకోకు. నేను ఎప్పటికయినా లోకంలోకి మళ్ళీవచ్చి యీ మధ్య పాడయిపోయిన ప్రపంచాన్నీ-ప్రజల్నీ మళ్ళీ బాగుచేస్తాను. ఏమంటావు?" అన్నాడు కీర్తిశేషుడు.

నేను కీర్తిశేషుడికి బాగా పాఠం చెప్పదలచుకున్నాను. చెడిన నిద్ర ఎలాగా చెడింది అని ఇలాగన్నాను.

"ఇంతసేపూ నువ్వు మాట్లాడావు. ఏదో నీ స్వంతసోది వెళ్ళబోసుకున్నావు. ఇంక నన్ను మాట్లాడనియ్యి. నువ్వు ఇదివరకు ఘనకార్యాలే చేశావు.కాస్తో కూస్తో కీర్తి పొందావు. అయితే, లోకం పుట్టింది మొదలు ఇప్పటివరకూ, ఇకముందూ ఎవరూ నీలాగ ఘనకార్యాలు చెయ్య లేదనిగాని, చెయ్యబోరని గాని అనుకోకు. ప్రతికాలంలోనూ మహామహులు బయలు దేరి ఏదో ఒక విషయంలో కొన్ని మహత్తర కార్యాలు చేస్తున్నారు. అయితే లోకం కొన్నాళ్లు నీకోసం మహా యేడ్చి, ఇప్పుడు మెల్లిమెల్లిగా నిన్ను మరిచిపోతున్నదంటే ఆ తప్పు ప్రజలది గాదు; కాలానిది.

తరువాత పూర్వకాలంవాళ్ళే అన్నిటికీ సమర్థులు, ఇప్పటివాళ్లు ఎందుకూ పనికిరా రనుకోవడం శుద్ధ పొరబాటు. కొంచెం ఆలోచించి చూస్తే ఇప్పటివాళ్లు గూడా ఎంత గట్టి వాళ్లో నీకే తెలుస్తుంది.

ఇంతకూ నీ బాధ ఏమిటంటే, కీర్తిశేషు డనే పదానికి సరియైన అర్థం, విలువా లేదంటావు. ఆ పదానికి సరియైన అర్థం కల్పించడానికి, ఇదివరకు నువ్వు మరిచి పోయిన శ్లోక మరమ్మత్తులు కొన్ని చెయ్యడానికి మళ్ళీ అవతరిస్తా నంటావు. కాని నువ్వు రానక్కరలేదు. నువ్వు గాదుగదా, నీలాంటివారు అనేక మంది ప్రయత్నించినా ఆ పదానికి అర్థం అంతే. అది ధస్తే మారదు. కీర్తివున్నవాడు చచ్చినా, లేనివాడు చచ్చినా, వాడు చచ్చిన తరువాత మాత్రం కీర్తి శేషు డవకమానడు. అది లోకాచారం; లోకసహజం.

నిజంగా నీ బాగు కోరి చెబుతున్నాను. కాబట్టి నువ్వు మళ్ళీ ప్రజల కంట బడకుండా నీకు చివరకొచ్చిన పేరు నిల బెట్టుకోవడం చాలా ఉత్తమం. నీ కాలంనాటికీ, యీ కాలం నాటికీ అప్పుడే పరిస్థితులూ, వ్యూహాలూ అన్నీ మారి పోయాయి. ఏదో అవతరించి ఇంకా గొప్పపేరు సంపా దించుకొందామని చూస్తున్నావేమో. అది వట్టిమాట. కాబట్టి ఇంక సెలవు తీసుకో. నన్ను నిద్రపోనీ" అన్నాను.

కీర్తిశేషుడు తెల్లబోయాడు. అతని ఆశలన్నీ అడు గంటాయి. ఏదో గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు. నాకిప్పుడు నిజంగా నిద్రాభంగ మయింది. లేచి చూసే టప్పటికి ఎవరూ లేరు. వేసిన తలుపులు వేసినట్లే వున్నాయి. అయితే ఇదంతా కలా?



ఆతిథ్యము

[కథానిక]

*

— శ్రీ జనమంచి రామకృష్ణ —

నేను సైనికదళంలో హవిల్దారుగా పనిచేశాను. యుద్ధం ముమ్మరంగా జరుగుతూన్న దినాలవి. వాయవ్య సరిహద్దు రాష్ట్రానికి నన్ను బదిలీ చేశారు. మా సిబ్బందిలో వివిధ ప్రాంతాలకి చెందిన వాళ్ళుంటా వున్నారు. శిబిర దాటి వెలుపలికి వెళ్ళేందుకు మా దళాధిపతి కొంతమంది పఠానుల కాపలా నిచ్చి మరీ పంపేవాడు. ఆ సందర్భంలోనే ఫతేఖాన్ నా కాప్త మిత్రుడయాడు. కారణం: బహుశా మా ఆదర్శాల ఐక్యతే అనుకుంటాను.

ఒకనాడు మేమంతా షికారుగా ఒక కొండ గూడెం ప్రాంతంలోకి బైల్దేరాము. నడుస్తూన్న ఫతేఖాన్ హఠాత్తుగా ఆగి, "భాయీ! ఆ ప్రదేశం జ్ఞాపకం పెట్టుకోండి. మీ కో మంచి కథ చెప్తాను తర్వాత" అన్నాడు.

"మీ దేశమంతా కథలదేశంలా గుందే! ప్రతి చిన్న ప్రదేశాన్నిగురించీ ఏదో ఒక కథ ఉందన్నమాట! బాగుంది భాయీసాబ్!" అని నేను నవ్వగానే "మా జాతిని ఇంతవరకూ ఈ బ్రిటిషు వారు అర్థం చేసుకోలేదు. ప్రభుత్వంవారి అభిప్రాయమేమంటే, సరిహద్దురాష్ట్రప్రజలు అనాగరికులనీ, మానవమాత్రులు కారనీ, వారికి హృదయం లేదనీని. వారి నాగరికత కొలబద్దతో మా నాగరికతని కొలుస్తారు—పర్యవసానం విమానదాడులూ, గుళ్ళవర్షాలూను. భాయీ! మా పఠానులున్నారే—వారు స్వాతంత్ర్యప్రియులు. ఆ స్వేచ్ఛకోసం అమానుషంగాకూడా ప్రవర్తించడానికి వెనుతీయరు. తర్వాత మా జాతి సక్క హృదయం మరెవ్వరిలోనూ గోచరించదు మా ఆదర్శాలు విపరీతంగా ఉంటాయి. ఇంక మా ఆతిథ్యం అంటారా—మానవజాతి అంతా మా దగ్గిర నేర్చుకోవాలి!... అన్నట్లు, ఆ ప్రదేశాన్నిగురించిన కథ ఆతిథ్యాన్నిగురించే!"

మేమంతా మా శిబిరాలు చేరుకున్నాము. నా గుడారంలో నేనూ, ఫతేఖానూ కూర్చున్నాము. చీకటిని చీలుస్తూ అప్పుడప్పుడు కొండగుహాలలోంచి తుపాకీగుళ్లు మెరుస్తున్నాయి-మిణుగురుపురుగుల్లా.

"ఫహరా హుషార్! ఫహరా హుషార్!"

పహరాలో ఉన్న సిపాయిలు కేకలు వేస్తూ గస్తీ తిరుగుతున్నారు. ఫతేఖాన్ హుక్కా పీలుస్తూ వెర్రిగా నవ్వి, "భాయ్! మనవాళ్ల కీ పేళ రాత్రి కునుకు పట్టదు. చూశారా తుపాకీ లెలా పేలుతున్నాయో!......భాయీసాబ్! రండి, మా ఆతిథ్యం గురించి చెప్తాను వినండి!

"ఆ కొండగూడేనికి ఒక నాయకుడుండేవాడు—అజ్ఞాంఖాన్. అతనంటే బ్రిటిషువారికి పక్కలోని బల్లెం, సింహస్వప్నం. అతన్ని లొంగతీసుకుందుకు నయాన్నీ భయాన్నీ ప్రయత్నించారు కాని లాభం లేకపోయింది......అజ్ఞాంఖా నింట్లోనే నేను చెప్పబోయే కథ జరిగింది.

"భాయీ! సరిగ్గా పదేళ్ల క్రితం నాటి గాథ. ఆ గూడెంలోని యువకులు అందరూ అజ్ఞాంఖాన్ కొడుకు అమానుల్లా నాయకత్వం క్రింద ఉంటూ బ్రిటిషు వారి చర్యలకు ప్రతీకారం చేస్తుండేవారు.

"అమానుల్లా ఆజానుబాహుః అందగాడుః చురుకైనవాడు. ఆ వేళ పానశాలవద్ద యువకు లందరూ సమావేశమయారు. పొరుగు గూడెంనుండి వచ్చే అట్టాఖాన్ రాకకోసం ఎదురుచూస్తున్నారు.

"అట్టాఖాన్ తుర్కీ రక్తం కలవాడు. అతనూ మంచి ఆజానుబాహుడే కాని నల్లగా, మోటుగా, భయంకరంగా ఉంటాడు. అట్టాఖాన్ అమానుల్లా గూడెంలోని కన్యను అల్కాను ప్రేమించాడు. గాఢంగా ప్రేమించాడు. ఆమెకూడా మరులుకొంది, కాని అమానుల్లాకీ విషయం సరిపడలేదు. పొరుగుగూడెం యువకు డెవడో తన గూడెంలోని యువతిని తన సమ్మతిగాని, ప్రమేయంగాని లేకుండా ప్రేమించడం అతని కిష్టం లేకపోయింది. బహుశా అమానుల్లాకూడా అల్కాను ప్రేమించియుండవచ్చును. ఏమైనా ఆ ప్రణయానికి స్వస్తి చెప్పాలని తలచి అమానుల్లా తన బృందంతో అట్టాఖాన్ కోసం ఆ పానశాలవద్ద వేచి ఉన్నాడు.

"అట్టాఖాన్ గుర్రందిగడం యువకబృందం చూసింది. అట్టాఖాన్ కూడా చాలామంది యువకులు తనపై పే దృక్కులను కేంద్రీకరించి చూడడం గ్రహించాడు. ఐనా లెక్కచేయక తిన్నగా గూడెంలోకి వచ్చాడు. రావడంతోనే, యువకులందరూ అతని చుట్టూ వలయాకారంగా మూగారు. అమానుల్లా ముందుకు వచ్చి అట్టాఖాన్ ఎదురుగా ఛాతీ విరుచుకుంటూ నిలబడి, వంగి సలాంచేసి, 'దోస్త్! మాతో పానశాలలోకి రావలసిందని ఆహ్వానిస్తున్నా' అన్నాడు.

"'నీ ఆహ్వానం నిరాకరిస్తున్నా!' అన్నాడు అట్టాఖాన్ కొంచెం కోపంగా.

"'మా ఆతిథ్యాన్ని అంత అమర్యాదగా నిరాకరించవద్దని కోరుతున్నాను. అతిథ్యాన్ని మానవుడైనవా డెవ్వడూ నిరాకరించడు!'

"అట్టాఖాన్ ఆతిథ్యాన్ని త్రోసిరాజనలేక అమానుల్లాతో పానశాల ప్రవేశించాడు. యువకబృందం కూడా తమ నాయకు ననుసరించారు. ఒక పానపాత్ర అట్టాఖాను కిచ్చి, తా నొకటి తీసుకు త్రాగుతూ—

"'దోస్త్! నాకూ, నా మిత్రులకూ నీవు అల్కాను ప్రేమించడం ఇష్టంలేదు. ఈ ప్రణయవ్యవహారానికి ఇంతటితోనంచి స్వస్తిచెప్తే చాలా మంచిది' అన్నాడు అమానుల్లా.

"'అలాగా! ఐనా, ఆ వ్యవహారం నాకు సంబంధించినది, మీకు ప్రమేయం లేనిది.'

"'వీల్లేదు! ఈ విషయంలో మాకు సంబంధం వుంది!' అని కోపంగా గద్దించాడు అమానుల్లా.

"అట్టాఖాన్ హేళిగా నవ్వి—'భాయీ! నీ ఆతిథ్యానికీ, నీ సలహాకూ చాలా కృతజ్ఞణ్ణి! త్రాగడం ఐందికాబట్టి, నాకు సెల విప్పించు. తిన్నగా అల్కా ఇంటికి వెడతాను.'

"'అట్టాఖాన్! ఈ పానశాల వదిలి తిన్నగా మీ వూరికి పోయే దారి పట్టు...లేకపోతే...'

"'దోస్త్! శాంతంలో నా కంత నమ్మకం లేదు. అవ్యాజంగా అల్కాను ప్రేమిస్తున్న సంగతి ఎవరికి తెలుసును! ఐనా మాట్లాంటే!'

"ఏమీ మాట్లాడకుండా అందరూ ఒక్కక్షణం సేపు ఆలోచనలో పడ్డారు. ఇంతలోనే అట్టాఖాన్ అమానుల్లాకు సిగరెట్టు కాల్చమని అందిచ్చాడు. అమానుల్లా ఎంతో మర్యాదతో సలాంచేసి, సిగరెట్టు తీసుకొన్నాడు. అట్టాఖాన్‌కు ఆ నిశ్శబ్దత విసుగు కల్గించింది. ఒరలోంచి కత్తి తీసి బల్లమీద ఏవో బొమ్మలు గీయడం సాగించాడు. తిరిగి హఠాత్తుగా కత్తిని యథాస్థానంలో ఉంచి, లేచినిలబడి, 'దోస్తాం! ఏం పనిలేకుండా ఇక్కడ ఊరికే మూగగా కూర్చోవడం ఏమీ బాగు లేదు. నేను వెడుతున్నాను.'

"'జానా! ఇలా కూర్చోవడం బాగాలేదు. రండి బైటికి పోదాం' అని అమానుల్లా అనగానే యువకు లందరూ కూడా లేచి పానశాల బైటికి వచ్చేశారు.

"'దోస్తాం! మరి సెలవా?'

"'వాలేకుం సలాం దోస్త్...దోస్తాం! అట్టాఖాన్ తిరిగి తన గ్రామం వెళ్ళిపోతున్నాడు...దారి ఇవ్వండి!' అన్నాడు అమానుల్లా.

"'నేను మా వూరు వెళ్లడం లేదు. నా పనిమీద నేను ఊళ్ళోకి వెడుతున్నా!'

"'మంచిది! సరే. ఐతే, మేమూ నీవెనకనే నడిచి వస్తాము!' అంటూ అమానుల్లా బృందం అట్టాతో కలిసి నడిచారు. అల్లా వుండే వీథివైపు మళ్లుతూన్న అట్టాఖాన్ జబ్బలు పట్టుకుని 'ఇటు! ఇటు!' అని ఇద్దరు యువకులు కొండవైపు లాగారు. తక్కినవారు అర్ధ చంద్రాకారంలో అట్టాఖాన్ చుట్టూ మూగగానే అమానుల్లా ముందుకువచ్చి 'దోస్తు! వాళ్ల బాహుబంధంనుండి తప్పించుకుందుకు ప్రయత్నించకు, లాభంలేదు... దోస్తు! మేము చూపుతూన్న అమర్యాదకు మన్నించు. కాని, ఇదంతా నీ మంచికోసమే చేస్తున్నాము. నలుగురూ ఈ విషయంగురించి తెలుసుకోడం మా కిష్టం లేదు. అందుచేత, ఆ మసీదు వెనకాతలకి రా. అక్కడ మాట్లాడుకుందాము....'

"అట్టాఖాన్ క్రోధపూరితుడై పళ్లు పట పట కొరికినాడు. ఏమీ మాట్లాడకుండా ఆ ఇద్దరు యువకులతోనూ మసీదు వెనుక కెళ్లాడు.

"'ఇప్పటికైనా ఈ పెంకితనం చాలించి ఇంటికి వెళ్లిపోతావా లేదా? మేమంతా కలిసి నిన్నేమి చేయబోతామో నీ కర్థమైందనుకుంటాను. నా మాట విని ఇంటికి వెళ్లిపో!...వెడతావా వెళ్లవా?' అని గర్జించాడు అమానల్లా.

"అట్టాఖాన్ సమాధానం చెప్పలేదు.

"'వెడతావా వెళ్లవా?'

"'నే నిలా వెడతాను'. అని శరవేగంతో అట్టాఖాన్ యువకుల్ను ప్రక్కకి త్రోసివేసి ముందుకు నడిచాడు. కాని, అమానుల్లా మెరుపులా ముందుకురికి, అట్టాఖానుని మసీదుగోడకు వేసినొక్కి అపాడు. అట్టాఖాను మండిపడిపోయి ఒరలోంచి కత్తి తీశాడు.

"'వద్దు! వద్దు! అంతపని చేయవద్దు!' అంటూ అమానల్లా అట్టాఖాన్,చెయ్యి పట్టుకున్నాడు. లోన ప్రవహిస్తున్న తుర్కీరక్తం అట్టాఖాన్‌ని పిచ్చెత్తించింది. ఒక్క వూపుతో అమానుల్లాని విసిరికొట్టి గుండెల్లో పొడిచాడు. అమానుల్లా నేలమీది కొరిగాడు. అట్టాఖాన్ మెరుపులా పారిపోయాడు. సగంమంది యువకులు అతని వెంట తరుముతూ పరుగెత్తారు. మిగతా సగం మంది యువకులూ ఉపచారం చేస్తూ అమానుల్లా వద్ద ఉండిపోయారు.

"తరుముకుంటూ వేటకుక్కల్లా వెనక వస్తున్న యువకుల్ని చూసి అట్టాఖాన్ భయపడిపోయాడు. పరుగెత్తలేకపోయాడు. ఏ కొంపలోనైనా దూరి ప్రాణం రక్షించుకుందామని ప్రయత్నించాడు. అలసిపోయాడు. దూరాన ఒక ఇల్లు కనిపించింది. లోపలికి పరుగెత్తాడు; ముసలి వానిని చూశాడు లోపల. పరుగెత్తుకుంటూ వస్తూన్న యువకుణ్ణిచూసి, 'ఏం నాయనా' అని ముసలివాడడగగానే, అట్టాఖాన్ అతని కాళ్ల మీద పడి, 'నన్ను రక్షించండి!' అని వేడుకున్నాడు.

"'నీ కే అపాయం రాదు. నేనున్నాగా! నీ కేం భయంలేదు!'

"'నేను పొడిచాను!...అతణ్ణి...నేను...పొడిచాను! మీ ఊళ్లోని ఒక యువకుణ్ణి నేను అన్యాయంగా పొడిచాను...ఐనా వాడు నా శత్రువు—వాళ్లంతా నన్ను చంపడానికి తరుముకుంటూ వస్తున్నారు...నన్ను రక్షించరూ?'

"'తప్పకుండా?...అబ్బాయీ! నువ్వు నా అతిథివి' అన్నాడు ముసలివాడు.

"'అంతలోనే అట్టాఖాన్ ని తరుముకుంటూ వచ్చిన యువకులు ముసలివాని ప్రాంగణంలో చెమటలు కక్కుకుంటూ నిలబడ్డారు. ఒక యువకుడు ముసలి వానితో—

"'హజరత్! మాలో ఒకణ్ణి వాడుపొడిచినాడు!,

"'ఔను! అతనే చెప్పాడు;...ఐతే, ఇతణ్ణి ఏమి చేయతలిచారు మీ రంతా!'

"'ఆ సంగతి మాకు వదిలిపెట్టేయండి! అతణ్ణి మాత్రం మాకు అప్పచెప్పండంతే!'

"'లాభంలేదు.మీరు ఇంతకు ముందే రావలసింది. ఇప్పుడతను నా అతిథి. మీ కతణ్ణి అప్పగించలేను సరి గదా, అతని ఒంటిమీద మీలో ఎవరైనా చెయ్యి వేసినా ఒప్పను.'

"నోటంట మాట లేకుండా నిశ్చేష్టులై యువకు లంతా అక్కడే నిలబడిపోయారు. మళ్లా యువకుల్లోంచి మరో ప్రశ్న:

"'హజరత్! అన్యాయంగా ఒక మనిషిని పొడిస్తే ఆ హంతకుణ్ణి శిక్షించవద్దా?'

"'శిక్షించ వచ్చును. కాని, ఆ పొడవబడినవాడు నా అతిథి శత్రువట. శత్రుత్వంలో పొడిస్తే నేరం కాదు'

"'కాని ఒక గంటక్రితం వా రిద్దరూ శత్రువులుం కారు. ఏదో కోపంలో చంపితే అది న్యాయమా?'

"ముసలి వాడు అట్టాఖాన్ వైపు చూసి భుజా లెగరేసి—

"'ఏమో! అతను నా అతిథి' అన్నాడు.

"'అతను, మీ...' వాక్యం పూర్తిచెయ్యలేక పోయాడు యువకుడు.

"'చెప్పేయ్! అసలుసంగతి ఆయనకుచెప్పేసేయ్ ...అక్రంఖాన్ పొలంలో ఉండి ఉంటాడు-అతణ్ణి పిల్చుకురండి. అతనే చెప్తాడు...ఎవరు చచ్చిపో యారో!' అన్నాడు మరొక యువకుడు.

"అక్రంఖాన్ కోసం ఇద్దరు యువకులు పొలం లోకి పరుగెత్తారు. కోపంతో, దుఃఖంతో అక్రం పరు గెత్తుకుంటూ వచ్చాడు. ముందుకు నడిచి—

"'అబ్బాజాన్!'అని ముసలివానిని పిల్చాడు.

"'అబ్బాజాన్! మీ కొడుకునే చంపినట్లైతే,ఆ మనిషికి రక్షణనిస్తూ అతిథిగానే గౌరవిస్తారా?'

"ముసలివాడు-అజ్జాంఖాన్ తనకొడుకు— అక్రంఖాన్ కళ్లల్లోకి తేరిపారచూశాడు. యథార్థం గ్రహించాడు.

"'అమానుల్లా!' అని తండ్రి దీర్ఘమైన నిట్టూర్పు విడిచినాడు. 'అమానుల్లా గాయపడ్డాడా?'

"'వాళ్లంతా కలిసి తమ్ముణ్ణి మసీదులోకి తీసి కెళ్లారు! ఇంటికి వస్తూ, తమ్ముణ్ణి చూశాను...చచ్చి పోయాడు!'

"'ఇతనేనా వాణ్ణి చంపుత!'

"'ఔను! అతనే! ఇక్కణ్ణించి తరిమివేయండా నరహంతకుణ్ణి! అబ్బాజాన్!..... అబ్బాజాన్! అమానుల్లాని ఇంటికి తీసుకురావాలి! వాణ్ణి ఇక్కణ్ణించి గెంటేయండి!'

"అజ్జాంఖాన్ అమానుల్లా తండ్రనీ, తాను శరణుజొచ్చినది తాను చంపినవాని గృహమేననీ తెలియగానే అట్టాఖాన్ తెల్లబోయి నిశ్చేష్టుడయాడు.

"అజ్జాం ఒక్కసారి వెనక్కి తిరిగి అట్టాఖాన్ కేసి చూశాడు. అట్టాలోని దీనత్వాన్ని గ్రహించాడు.

"'అమానుల్లా! అమానుల్లా!' అని అట్టాఖాన్ కంట తడిపెట్టడం అక్కడున్నవారంతా చూశారు. 'అమానుల్లా చనిపోయాడా! చనిపోయాడా!'

"అక్రంఖాన్ కేసి తిరిగి అజ్జాంఖాన్—'బేటా! అమాన్ దగ్గిర కెళ్లు! ఈ మనిషిని నేను తరిమివేయ లేను...ఇతను నా అతిథి!'

"'ఇప్పుడు కాకపోతే ఇంక కొంచెం సేపటికైనా బైటికిరాడా! మేము వదులుతా మనుకున్నారా?' అని యువకులందరూ కోపోద్రిక్తులై కేక లేశారు.

"'నా రక్షణక్రింద ఈ వూరు విడిచివెడతాడు! అంతకన్నా నే నేం చేయగలను చెప్పండి'! లోని బాధను పుక్కిటబట్టి అన్నాడు అజ్జాంఖాన్.

"అక్రంఖాన్ అమానుల్లాదగ్గిర కెళ్లి పోయాడు. యువకబృందంకూడా అజ్జాంగృహ ప్రాంగణంనుండి తొలగిపోయి, బైట,దారిలో అట్టాఖాన్ కోసం ఎదురు చూస్తున్నారు. వీథితలుపు వేసి, లోపలికి వెళ్లి, ఒక కుర్చీలో కూలబడి అజ్జాంఖాన్ దీర్ఘంగా ఆలోచించ సాగించాడు. అజ్జాం, అట్టాఖానులు ఒకరితో నొకరు మాట్లాడుకోలేదు. పుత్రశోకంలో ఉన్న ముసలివానిని ఓదారుద్దామని అట్టా ప్రయత్నించాడు గాని, ఎలా ఓదార్చాలో తెలిసిందికాదు. చివరకు అట్టాఖాన్ ఇలా అన్నాడు:

"'హజరత్! అతణ్ణి చంపాలని అసలు అనుకోనే లేదు. అనవసరంగా దెబ్బలాడుకున్నాము......నేను ఉండబట్టలేక పోయాను......'

"సర్వం తెలిసినట్టుగా తల ఊపి, మాట్లాడకుండా ఊరుకున్నాడు అజ్జాంఖాన్.

"సాయంత్రం పడింది. తన అతిథినిగురించి ఆలోచిస్తున్న అజ్జాం ఒక నిశ్చయాని కొచ్చి, వంట మనిషి మౌలీని పిల్చి, అట్టాకు భోజనం పెట్టమన్నాడు.

"'చూడు! అబ్బాయ్! భోజనం చేయకుండా మాత్రం వెళ్లవద్దు......అపుర్పీబల్ల దగ్గరగా లాక్కొని భోజనం చెయ్యి..... కొద్దిగా, నీతోపాటు నేనూ భోజనం చేస్తాలే...నేను తక్కువ తింటూన్నందుకు నీ వేమీ అనుకోకు!......నాకు...నాకు...అంతగా ఆకలి లేదు!'

"'నాకూ ఆకలిలేదు హజరత్!'

"'అచ్చే! అలా అంటే ఎలాగ? అంతో ఇంతో భోజనం చేసి తీరాలి! చూడు! నీవు చాలా దూరం నడిచివెళ్లాల్సివుంది...పోనీ నేనూ మామూలుగా భోజనం చేసేందుకు ప్రయత్నిస్తాలే!' అంటూ అజ్జాంఖాన్ భోజనంచేయడం ప్రారంభించాడు.

"'అబ్బాయి! అలా భోజనం చేయకుండావుంటే ఎలాగ? పోనీ కొంత సారా త్రాగు! అందులోనూ, కష్టంలో ఉండి, మనస్సు చికాకుగా ఉన్నప్పుడు మనిషి త్రాగితే ఏ బాధా కనిపించదు!'

"తన అతిథి ఎక్కడ అమర్యాదగా తోస్తుందో నని అజ్జాంఖాన్ మాట్లాడడం మొదలెట్టాడు.

"'ఈ లోయలో పండే గోధుమలు చాలా బాగుంటాయికదూ?'

"'ఔనట! మా అబ్బాజాన్ అంటూంటారు!'

"'ఈయేడు ఏమిటో తమాషా, వేసవిలో బాగా వర్షాలు పడ్డాయి. లోయప్రాంతంలోనే కాదు, చివరకు మా పొలాలలో కూడా వర్షపాతం ముమ్మరంగానే వుంది. నేల పచ్చబడ్డందేత గొర్రెలూ, మేకలూ బాగా మేసి బలిశాయి.'

"'చాలా సంతోషం'

"'అబ్బాయి! భోజనం చేయడానికి భిడియపడుతున్నట్లున్నావు!......సరే లే! తినగల్గినంతే తిను. తతిమ్మాది మూటకట్టి ఇస్తాను, దారిలో, ఆకలేస్తే తిందుగాని.'

"తర్వాత అజ్జాంఖాన్ అట్టాఖానకు హుక్కా, పాన్‌సుపారీ ఇచ్చాడు. కొంత విశ్రాంతి తీసుకున్న తర్వాత అజ్జాం, 'అబ్బాయి! ప్రయాణానికి తగినంత శక్తి చేకూరిం దనుకుంటాను!......మరి లేద్దామా?'

"'చిత్తం! మీకు నా కృతజ్ఞత!'

"'లే మరి!'

"'నేను సిద్ధమే!'

"పిస్తోలు పట్టుకుని అజ్జాం ముందు నడుస్తూంటే, అట్టాఖాన్ అతని వెనుక నడిచాడు. వీధిలోకి రాగానే, అట్టారాక కెదురుచూస్తున్న యువకులు అజ్జాం కళ్లబడ్డారు వారికేసి చేయి ఊపుతూ, 'వెనక్కు తగ్గండి! ఇతను నా అతిథి. నా రక్షణ క్రింద ఉన్నాడు!' అని కేకవేశాడు. యువకులు వృద్ధుని మనస్సు గ్రహించి, వెనక్కు తగ్గారు. అట్టాఖాన్‌ని వెనక వేసుకొని కొండల చాయలలోకి రాగానే అజ్జాంఖాన్, 'అట్టాఖాన్! త్వరగా, చీకటిపడకముందె మీ వూరు చేరుకో! ఇంక కొంత ఘంటల వ్యవధే వుంది. తర్వాత మన వూళ్ళ రెంటికీ రక్తపాత మయ్యే యుద్ధం జరుగుతుంది. వెళ్లిపో!' అన్నాడు.

"అల్లా ఉంటాయి భాయీ నా మర్యాదలు!" అని ఫతేఖాన్ నవ్వాడు. ఇంతలోకే కొండలోయలో జ్వాలాతోరణం కన్పించగానే గుడారంలో కలకలం పుట్టినది. మేమంతా సాయుధులమై ముందుకు పురోగమించాము.

నరకచతుర్దశి : దీపావళి

*

శ్రీ బులుసు వెంకటేశ్వర్లు

హరి కిటిరూపంబున నుర్వరఁ బ్రోచిన వేళఁ బ్రణయభావముతోడన్
దరుణి యయి విష్ణుఁ గూడిన నరకుఁడు జనియించె ధరకు నందనుఁ డగుచున్.

భూకాంతాతిలకంబు విష్ణునకు సమ్మోహంబుఁ గల్గింపఁగాఁ
గైకొ మ్మొక్కవరం బటం చతఁడు పల్కన్ ధారుణీమాత యం
గీకారం బయి వేఁడెఁ బుత్త్రున కొసంగన్ వైష్ణవాస్త్రంబు ది
వ్యాకారాత్మక సుప్రతీకగ జ మత్యానందియై విష్ణుఁడున్.

నరకుం డంత మహాబలాధిపతియై నక్తంచరేంద్రత్వమున్
వరమాహాత్మ్యమునన్ గడించి యలరెన్ బ్రాగ్జ్యోతిషాధీశుఁడై;
తరువాతన్ బలగర్వియై దివిజులన్ దండించుచున్ మానులన్
బరిపాటిన్ గలఁగించుచున్ సుదతులన్ బట్టం దొడంగెన్ జెరల్.

అసురుల విసరముతో రక్కసుఁ డత్యుద్ధతిని నదితిఁ గని యాయమక
ర్ణసువర్ణకుండలంబులు వెస లాగి సురాద్రి వీడ వేల్పులఁ దఱిమెన్.

అదితికుమారుఁ డింద్రుఁడు భయంబునఁ బాఱి, యదూద్వహుండునై
ముదితలఁ గూడి కృష్ణుఁ డనఁ బూజ్యత గాంచిన శ్రీహరిన్ గృపా
సదనునిఁ జేరి విన్నపము సల్పినఁ గృష్ణుఁడు జాలి నంది దు
ర్మదుఁ డగు రక్కసున్ బిలుకుమార్చెద నంచని పంపె నింద్రునిన్.

పతితో వచ్చెద నన్న సత్యను గృపాపారీణతన్ గూడి య
ప్రతిమప్రీతి జయార్థియై ఖగపతిన్ భావించి యారోహియై
నతిచే నాజి నొనర్పఁ జేసి నరకున్ జంపించె శ్రీకృష్ణుఁ డా
శ్రితమందారుఁడు, లోకసంకటము వాసెన్ దైవసంప్రీతి నై.



నరకుఁడు పడుటఁ జతుర్దశి "నరకచతుర్దశి" యనంగ నాఁడాదిగ ను
ర్వరఁ బర్వ మొప్పు దీపేందిర మఱురాత్రిఁ వెలుంగు "దీపావళి" నాఁ.

వెలిఁగించుచుందురు విమలార్యమానినీతిలకంబు లెల్లెడ దీపరాజి
పట్టించుచుందురు ప్రమదామణుల్ నిజసుతులచే దివటీలు పతులు చూడ
ప్రేలించుచుందురు వివిధంబు లౌ బాణసంచులు బాలురు సంబరమున
కట్టించుచుందురు కమనీయవస్త్రముల్ క్రొత్తయల్లుండ్రచే నత్తమామ
లానందమందుదు రెల్ల రా రాత్రియందుఁ బరమతేజోమయం బగు ప్రకృతిఁ జూడ
భారతీభాగ్యరేఖాప్రభావ మిటులు వెలుఁగు ననఁ దోఁచు దీపాళివిధము గనఁగ.

అల నూత్న తాళపత్రంబులఁ జిత్రిత మైన ముద్దుమురిపెపుఁ బాసలఁ
బలపలని వెలుఁగు దీపపుఁ బలుకుందెలు మించుచుండు బహుకాంతులతోఁ.

ఒక దివ్వె వెలుఁగంగ నుజ్జ్వలం బయి భారతీదివ్యరేఖ దీప్తించె ననఁగ
ఒక సంచు మ్రోయఁగా నుత్తమభారత జయభేరి మ్రోఁగిన సరణి దోఁప
ఒక చిచ్చుబుడ్డి రాఁగక ముత్యముల్ చిమ్మ భారతరత్నముల్ ప్రబలె ననఁగ
ఒక చువ్వ మింటికి పెక దీసికొనిపోవ భరతశోభలు మిన్నుప్రాకె ననఁగ
అన్ని యొకమాఱు తోఁపఁగా నన్ని యొక్కమాఱు తోఁచినయట్లయి మాఱుమ్రోఁగ
భరతవర్షంపుఁగీరితి పరిఢవిల్ల వెలుఁగు దీపావళీదివ్యవిభవ మవని.

దీపంబుల రూపంబులఁ బ్రాపింపఁగరాక దివిజభామలు త్రపచేఁ
గూపంబులఁ దాపంబునఁ బ్రాపించుటఁ దోఁచు సంబరమ్మునఁ దారల్.

దీపావళిదీపావళి పాపాటవులఁ దహించి భారతజననీ
రూపంబుఁ గీర్తిఁ దేజము దీపింపఁగఁ జేయుఁగాత దినదినవృద్ధిఁ.

జ్యోతిర్విద్యాభరణుడు

సర్ విలియం హెర్షెల్



శ్రీ గొబ్బూరు
వెంకటానంద రాఘవరావు

సౌ జ్యోతిర్వేద వ్యాసములలో హెర్షెల్ దొర గారి పేరు తఱచుగా నుటంకింపబడుచుండుట చేత పాఠకుల కాతని నామము విదితమై యున్నది. కాని ఆ మహనీయుని సంగ్రహ జీవిత చరిత్రమును, జ్యోతిశ్శాస్త్రాభివృద్ధి కాతడు చేసిన మహోత్కృష్ట సేవయు కొంతవరకైన తెలిసికొనుట కూడ మిక్కిలి యవసరము.

౧౭౩౮ సంవత్సరము నవంబరు నెల ౧౫ తేదీని జర్మనీ దేశమునందలి హానోవరులో నతడు జన్మించెను. సంగీతము వారి కులవిద్య. ఆరు సంవత్సరముల ప్రాయమునందే చక్కని లయజ్ఞానము కలవాడగుటచేత మిలిటరీ బాండు వాయించు జట్టులో డోలుపని కతడు నియోగింపబడెను. ౧౭౫౬ సంవత్సరములో ఇంగ్లీషు వారికిని, ఫ్రెంచివారికిని ఏడు సంవత్సరముల యుద్ధము ప్రారంభమయ్యెను. హెర్షెల్ కుటుంబములో మగవారందరును మిలిటరీ ఉద్యోగములో నుండిరి. యుద్ధములో సేవ క్షేమకరమా! వంశాభివృద్ధి కొఱకైన మిగిలి యుండుట మంచిదని యెంచి, పెద్ద లితనికి ఏర్పాటులిచ్చి, ఎలాగో పోయి బ్రతుకుమని సెలవు లేకుండానే ఉద్యోగము నుండి వెడలించిరి. చక్కగా పాటలు పాడి, ఉదర పోషణము చేసికొనుచు జర్మనీ, హాలెండు, బెల్జియమ్, ఫ్రాన్సు దేశములు గడచి, ఇంగ్లండు చేరుకొని గాయక జీవనము చేయుచు నతడు కాలము గడుపుచుండెను. ఇట్లు బహు సంవత్సరములు అయినవి.

పిమ్మట నొకనాడు జేమ్సు ఫెర్గుసన్ అను జ్యోతిశ్శాస్త్రవేత్త జనసామాన్యమునకు కూడ, ఆ శాస్త్ర విషయములు తెలుపవలెనని ఉపన్యాస మిచ్చుచుండగా హెర్షెల్ ఆ సభకు వెళ్లి ఆ శాస్త్రాంశములు కొన్ని వినెను. వినుట తడవుగా అతని కందు అద్భుతమైన అభిరుచి కలిగెను. ఫెర్గుసన్ రచించిన గ్రంథము కూడ అతడు చదివెను. దానితో నతని మన శ్శరీరము లుప్పొంగెను. అసలా ఫెర్గుసన్ వృత్తాంతము కొంచెమైన తెలుసుకొనుట అవసరమని కొన్ని పంక్తు లీ దిగువ వ్రాయుచున్నాను.

ఫెర్గుసన్ స్కాట్లండులో ౧౭౧౦ సంవత్సరమున జన్మించెను. అతి పేదకుటుంబమగుటచే నతడు కూలికి గొఱ్ఱెలను గొల్లను కాయుచు, మధ్య మధ్య కొంత తీరిక కలిగించుకొని, స్వతంత్రముగా యోచించి అపూర్వ యంత్రకల్పన చేయుచుండెను. రాత్రులందా బాలుడు అత్యంతమగు అభినివేశముతో ఖగోళమును గమనించుచు, ఒక్కొక్క చుక్క కొక్కొక్క పూసను ముడివేయుచు, చుక్కల మధ్య దూరమును దిశలను సరిచూచుకొని దారము గొలిచికట్టుచు, రాసుల యొక్కయు, ఇతర నక్షత్ర సమూహముల

(Constellations) యొక్కయు రూపములను పూసలలో నిర్మించుచుండెను. ఈ విచిత్ర చర్యలకు విస్మితులై కొందరు శ్రీమంతులు ఆ గొడ్లకాపరిని పనినుండి మాన్పించి, పట్టణములకు పంపి తన సహాయము చేసి చదివించిరి. కాలక్రమమున నతడు అత్యంత ప్రజ్ఞాశాలియై రాయల్ సొసైటీ సభ్యుడై జ్యోతిశ్శాస్త్రవిదుడై యంత్రజ్ఞుడై గొప్ప ప్రసిద్ధి బడసెను. విద్య గుప్తముగా ఉండవలె ననియు, అదికూడ విశ్వవిద్యాలయములో పెద్దజీతము లిచ్చి చదువుకొనగల శ్రీమంతులగువారికే గలుగవలె ననియు నానాటివారి మతము. "అది తప్పు" అని ఫెర్గూసన్ ఖండించెను. ధనవంతులైననేమి, ధనహీనులైననేమి- మానవులకందఱకును పీల్చుటకు గాలి, త్రాగుటకు నీరు, తినుటకు ఆహారము ఎట్లవసరమో శరీరధారణకు మేధావృద్ధికి విద్యకూడ అట్లే అవసరము; విద్యకూడ ఎల్లరకును స్వేచ్ఛగా గరపుట కూడ అంతే యవసరమే ననియు, పేదసాదలని విచక్షణ చేయక ఎల్లవారికి విద్యాదానము చేయవలయుననియు ఫెర్గూసన్ అభిప్రాయము. కాబట్టి జనసామాన్యమునకు చక్కగా తెలియునట్లు అతడు తన యభిమానశాస్త్రాంశములను ధనప్రతిఫల మభిలషింపక ఊరూరను, వాడవాడలను స్వేచ్ఛగా వెదజల్లెను.* అతడు జల్లిన బీజములు హెర్షెల్ హృదయక్షేత్రములో చక్కగా నాటుకొని మొలకలై పెరిగి, పెంపొంది; దశదిశల నాక్రమించి మహావృక్షమయ్యెను.

అంతవఱకు కేవల మనోదృష్టితో మట్టుపడిన హెర్షెల్ విశాలక్షేత్రము లప్పటినుండి యథార్థదృష్టికా ముఖము లైనవి. టెలిస్కోపుతో ఖగోళపరిశీలన చేయవలయు నని గాఢమైన యభిలాష కలిగినది. కొనుటకు డబ్బులేదు. పగటిపూట సంగీత వ్యాసంగము చేసినగాని పొయ్యిలో పిల్లి లేవదు. అందుచేత ఆకృషి అతడు ఎన్నడును మానలేదు. టెలిస్కోపు స్వయముగా చేసికొందమన్న నది నిర్మించుకొను క్రమము ఎవరును చెప్పరైరి. ఒక (Physics) భౌతికశాస్త్రగ్రంథము చదివి, టెలిస్కోపు అంగములు తెలిసికొని స్వయముగా నాయంత్రము తయారుచేయ నెంచెను. కాని దానిని నిర్మించుట మాటలతో జరుగు పనికాదు. పలుసార్లు యత్నించి అతడు విఫలుడయ్యెను. రాబర్టుబ్రూస్ అను యోధుడు ఆరుసార్లు పరాజితుడై పట్టువదలక పనిచేసి ఏడవ సారి గెల్చెను. హెర్షెల్ రెండువందల ఆరుసార్లు ప్రయత్నించి, టెలిస్కోప్ నిర్మాణకృషిలో కృతార్థుడు కాలేకపోయెను. తుదకు ౨౦౭ వ సారి సఫలుడయ్యెను. అప్పటినుండి టెలిస్కోపులు నిర్మించుటకూడ అతనికి అభిమానవ్యాపారమైనది. ఒక టెలిస్కోపుతో నిత్యము రాత్రులు ఖగోళమును పరిశీలించుచు, మరియొకటి తయారు చేయుచునే యుండెను. అంతకు ముందు పనిచేసిన యంత్రము లవసరము లేకపోగా, యూరప్ ఖండమందలి నక్షత్రశాలలకు వాని నమ్మివేయుచుండెను. ఈ విధముగా నతడు యూరపు ఖండము నందలి విశ్వవిద్యాలయములకు (Telescope - maker to the European Universities) దూరదర్శి యంత్రనిర్మాత కాగలిగెను. బొత్తుగా మేఘచ్ఛన్నమైన ఆకాశమున నేమియు కానరానప్పుడు తప్ప అతడు నలుబది సంవత్సరముల పైకాలము ప్రతినెల, ప్రతి రాత్రి ఖగోళవేధ చేయుచునే యుండెను. అతనికి నిద్రావశ్యకత లేకపోయినది. టెలిస్కోపు చేతబట్టినదిమొదలు అత డెన్నడును నిద్రపోలేదు. లక్ష్మణుడు అరణ్యవాసము చేయునపుడు పదునాలుగేండ్లు రాత్రులు, పగలు నిద్రపోలేదని రామాయణము తెలుపుచున్నది. కాని ఈ హెర్షెల్ మహనీయుడు అంతకు మూడురెట్లకాలము, మూడుపదునాల్గులు నలుబది రెండేండ్లకు పైకాలము నిద్రమొఱగడు. అతడు ఆరుబయట డాబామీద పండుకొని, టెలి

*ఉచితముగా జనసామాన్యమునకు విద్యాప్రదానము చేయవలె నను సత్సంకల్పముతోనే పూనానగరమున నీ పండితుని పేరుతో ఫెర్గూసన్ కాలేజి అను మహావిద్యాలయము స్థాపించిరి. లోకమాన్యతిలక్ ప్రభృతు లందులో పనిచేసిరి. నెలకు వేలకొలది జీతము తెచ్చుకొను సామర్థ్యముగల గోపాలకృష్ణ గోఖలే పండితుడు శరీరధారణ కవశ్యమైన డెబ్బదిరూపాయల వేతనముమాత్రము గొని ఈ ఫెర్గూసన్ కళాశాలలో అధ్యాపకుడై పనిచేసెను.

స్కోపు ద్వారా నక్షత్రవేధ చేయుచున్నపుడు ఆహారముమాట మఱచిపోవుచుండెడివాడు. అపు డాతని సోదరీమణి—కెరోలిన్ నామ్ని మెత్తని యాహారము చెమ్చాతో నోటవేయుచుండగా నాతడు పరాకుగా మ్రింగుచుండెను. ఖగోళ పరిశోధనధ్యానము తప్ప మరొక ధ్యానము లేక అత డతిదీక్షతో వేధసాగించెను. ఇట్టి తపోనిమగ్నులైన మహాఋషులు దప్పిక యెఱుగక, ఆకలి యెఱుగక, శరీర మెఱుగక తన్మయులై యుండిపోవుట భారతభూమికి క్రొత్తకాదు. భారతీయ శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాదు లిట్టి తపః ఫలితములే కదా ? ఒడలెరుగక వల్మీకాక్రాంతదేహుడై బహుకాలము తపోనియతి నుండియుండి పిమ్మట వాల్మీకి రామాయణామృతమును లోకమునకు ప్రసాదించెను.

హెర్షెల్ కూడ ఖగోళతపోనియతినుండి పాశ్చాత్యుల జ్యోతిర్విజ్ఞాన మనేకముఖముల వికసింపజేసెను. అంతే కాదు. తత్పూర్వమే భారతీయఋషులచే సాధింపబడియుండియు, నగమ్యము నయోమయము నై స్పష్టముగా తెలియరాక మరుగుననున్న భారతీయ విజ్ఞాన సమస్య సాధించుటకు చక్కని ఉపపత్తు లందిచ్చినాడు.

“దీని భావ మేమి తిరుమలేశ”అన్నట్లు అంతఱు పట్టియ్యక, కర్మార్థముగ తప్ప ఇతరవిధముగా సాధింపరాక యున్న వేదమంత్ర విజ్ఞానసమస్యలు సునాయాసముగా సాధించుకొనుటకు కావలసినంత సాధన సామగ్రిని మనకు కూర్చి యిచ్చినాడు. అవి యొక్కొక్కటి సంగ్రహముగా ప్రశంసింతము.

(౧) సూర్యకుటుంబవిజ్ఞాన మభివృద్ధిచేసినాడు:

సూర్యకుటుంబములో సూర్యుడు, బుధుడు, శుక్రుడు, భూమి, అంగారకుడు, గురుడు, శని అను గ్రహము లుండుటయు, అవి సూర్యునిచుట్టు తిరుగుచుండుటయు నంతకుముందే తెలిసియుండెను. శనికవ్వల కావల మరి గ్రహము లున్నట్లు పూర్వులకు తెలియదు. అక్షరసంజ్ఞలతోను, సంఖ్యాసంజ్ఞలతోను నిశితముగా నక్షత్రములను గుర్తించి తీవ్రమైన పరిశోధన సాగించగా, శనిగ్రహమున కావల ‘యురేనస్’ అని యితడు పేరుపెట్టిన గ్రహ మొకటి కలదని నిర్ధారణ చేసి, సూర్యకుటుంబవిజ్ఞానము నభివృద్ధిచేసినవా డైనాడు. పిమ్మట, లెక్కలప్రకారము ఈ గ్రహము ఉండవలసిన చోట నుండక వెనుకపడుట గమనించి, దీని కావల మరొక గ్రహము ఉండితీర వలెనని పరిశోధించగా ‘నెప్ట్యూన్’ అను మరొక గ్రహ మున్నట్లు నిర్ధారణ మైనది. ఇటీవల ౧౯౩౦ లో ప్లూటో అను పేరుపెట్టబడిన గ్రహము కూడ ఉన్నట్లు ఋజువుకాబడినది. కాబట్టి సూర్యకుటుంబ సంబంధమైన విజ్ఞానాభివృద్ధి ఇతని కృషి ఫలితము.

(౨) చంద్రుడు భూమి చుట్టును, భూమి సూర్యుని చుట్టును పరిభ్రమించుచున్నవి. బుధ, శుక్రాదిగ్రహములుకూడ సూర్యునిచుట్టు తిరుగుచున్నవి. అయితే సూర్యునిమాట యేమి ? అనగా, సూర్యుడు, సకుటుంబముగా ఉత్తరాభిముఖుడై సెకెండుకు ౧౨ మైళ్ళ చొప్పున దినమునకు పదిలక్షల మైళ్ళకు పైగా హెర్క్యులస్ (శ్రీ మహావిష్ణు) మండలమునందున్న ‘లాంబ్డా’ నక్షత్రమువైపు పోవుచున్నట్లు నిశ్చయించినాడు. ఇటీవలివారు లాంబ్డా చుక్కగాక ఆ సమీపముననున్న వీణామండలమందలి వీగా (Vega) దిక్కునకు సూర్యుడు పోవుచున్నట్లు తెలుపుచున్నారు. కాని దిశ, త్వర హెర్షెల్ చెప్పినదే యొప్పుకొనుచున్నారు. సూర్యకుటుంబము ఉత్తరాభిముఖముగా దక్షిణమును వదలి వెడలుచున్నది. కాబట్టి దక్షిణదిశ గతముతో సంబంధము కలదగుచున్నది. ఈ యంశమును జ్యోతిశ్శాస్త్రరీత్యా ఎఱిగియుండియే గతించిపోయి పితరులైనవారికి రాజై యముడు దక్షిణమున కధిపతి యైయున్నట్లు పూర్వఋషులు వేదాదులలో తెలిపిరి. సూర్యకుటుంబపు ఉత్తరదిశాగమనము నిర్ధారణమైనగాని యముని దక్షిణాధిపత్యమును, మన సూర్యకుటుంబ గమ్యస్థానమైన ఉత్తరదిశా ప్రాముఖ్యమును మనకు స్పష్టముగా బోధపడలేదు. ఇది తెలిసిన తరువాత చాల సంగతులు చక్కగా బోధపడినవి. ఏటి కెదురీతవంటి దక్షిణాయనముయొక్క నిషేధము, ఉత్తరాయణ ప్రాముఖ్యము తేటతెల్లమయినవి. ఉత్తరవాహినులైన నదులు అధిక పుణ్యప్రదములగుట,

బ్రహ్మాదిదేవత లుత్తరమున నుండుట, ప్రళయవేళకూడ మార్కండేయుడు ప్రాగుత్తర దిశామధ్య వటపత్రశాయి విష్ణుని సందర్శించుట లోనగు పురాణ విషయములు బహుచక్కగా అవగతము లగుటకు కారణము లేర్పడి నవి. శయనఏకాదశి, బోధనఏకాదశి, వైకుంఠఏకాదశి మొదలగువాని యంతరార్థము విదితమైనది.

(౩) చుక్కలనేకాదు-జంటచుక్కలను, వాని గమనరీతులనుకూడ హెర్షల్ గమనించి స్పష్టముగా పట్టికలు తయారుచేసినాడు.

(౪) పాలవెల్లి (Milky way) స్వభావమును బహుచక్కగా పరిశీలించి వర్ణించినాడు. క్షీరసాగర మథనవృత్తాంతము జ్యోతిశ్శాస్త్రరీత్యా అర్థము చేసు కొనుటకు ఈ వర్ణన మెంతో సహకారి.

(౫) ఎన్నెన్నో చుక్కల గుత్తులను (Star Clusters) గుంపులను, వాని విశేషములను గమనించి వర్ణించినాడు.

(౬) ప్రళయానంతరము పునస్సృష్టి క్రమములో "ఆకాశా ద్వాయుః"అను శ్రుతిప్రకారము, వాయు రూపమై నీహారముట్లుతోచు తెలిమబ్బులు (Nebulae) క్రమముగా నక్షత్రము లగునని తెలిసికొని, వాని స్థానముల నిరూపించి వాని పట్టికలను తయారు చేసినాడు.

(౭) చుక్కల గుంపులమధ్య పరిమాణములను నిర్ణ యించి నక్షత్రపటములు తయారుచేసినాడు.

(౮) ఖగోళములో చుక్కల గుత్తులును, గుంపు లును ఎక్కడెక్కడ నేయేవిధముల చెదరియున్నవో నిరూపించినాడు. అంతకుపూర్వము తెలిసినవానికంటె ఐదువేలకుపైగా తెలిమబ్బులను లెక్కించి గ్రంథస్థము చేసెను.

ఇతని కుమారుడు సర్ జాన్ హెర్షల్ ఇంగ్లం డులో దక్షిణాకాశమున కానరాని చుక్కల పరిశీల నకు ఆఫ్రికా దక్షిణభాగమున నున్న కేప్‌టవున్ పట్ట ణమునకు వెళ్ళి తండ్రిగారు చూడని చుక్కలను చూచి ఆతడు ప్రారంభించిన పని పూర్తిచేసినాడు.

యురేనస్ గ్రహము కనుగొన్న తరువాత స్వదేశ విదేశస్థులైన జ్యోతిశ్శాస్త్రవేత్తలు, సభికులు, ప్రభు వులు, రాజులు బహువిధముల నతనిని గౌరవించిరి.

చిన్నప్పుడు మిలిటరీబాండును డోలును విడిచి పెట్టి పారిపోయిన నేరమును కరుణతో క్షమించి, జార్జిరాజు 'సర్' బిరుద మిచ్చి సత్కరించెను.

హెర్షల్‌దొర ఆఖరున పనిచేసిన ౪౦-అంగుళ ముల వ్యాసము గల టెలిస్కోపు నిర్మాణమునకు ఖర్చు ఆయిన ఆరులక్షలలో జార్జిరాజు మూడులక్ష లిచ్చెను. సుఖజీవనార్థము గౌరవవేతన మిచ్చి యీ జ్యోతి ర్విద్యాధికారదుని మూడవజార్జిరాజు ఎంతో గౌర వించెను.

అతడు ౨౫-౮-౧౮౨౨ తేదిని కాలధర్మము నొందెను. తెనుగుదేశమునకుకూడ హెర్షల్‌వంటి జ్యోతిశ్శాస్త్రవేత్తలు, ఫెరడేవంటి విజ్ఞాన ప్రచా రకులు జన్మించి, నిగూఢముగానున్న శ్రుతి విజ్ఞానమును ప్రకాశింపజేసి నూతన విజ్ఞానమును వెలయింపజేయు శుభదినము నెదురుచూతము!

'రామస్య ప్రియదర్శినీ'

[కథానిక]

✻

– 'శ్రీ వాత్సవ' –

రామప్రియ వాయిస్తూవున్న వీణ అటకల పెట్టి రామశాస్త్రికేసి దీక్షగా చూచింది. అతడు వంచిన తల ఎత్తకుండా వ్రాస్తున్నాడు. ఏం వ్రాస్తున్నాడో చూడాలన్న కుతూహలం రామప్రియకు అతిశయించింది. మళ్లా చూచింది. చూచి, ఝళంఝళత్కటకసూచిత వేగపదారవిందయై లేచి...దురుములే నడు మల్లలవాడ అతని వెనకనే వెళ్లి పరిశీలిస్తుంది. రామశాస్త్రి తాను వ్రాస్తూవున్నది చూపకుండా త్రిప్పివేసుకున్నాడు. రామప్రియ నవ్వుమొగంతో అతని వెనకవైపునించి చేయిజాచి వ్రాస్తున్నది లాగుకోబోతున్నది. రామశాస్త్రి దొరకనివ్వలేదు.

"ముట్టుకో కూడదు" అని అదిలించాడు.

"మడి కట్టుకున్నారా ? ముట్టుకోనులెండి. ఆ వ్రాస్తున్నదేదో చూడనివ్వండి" అని అడిగింది.

"చూడకూడదు" అని దూరంగా జరిగాడు.

"అంత రహస్యమా ? ప్రేమలేఖ వ్రాస్తున్నారా ?"

"ప్రేమలేఖలు కాగితాలమీద వ్రాయడం ఎందుకు ? చూపుల్లోనే అవి చదువుకొనేవాళ్ళుండగాను"

"ఓహో ! అదా మీ వెలితిచూపుల కర్థం ! కొత్త రాగంలోని సంగతులు ఆలోచిస్తున్నారేమో అనుకున్నాను"

"రామప్రియ వచ్చిందా ?"

"ఇంతసేపటికి కనిపించానా ?"

"నీమాట కాదు; నీకు నేర్పిన రామప్రియ కీర్తన మాట"

"ఇంతసేపూ వాయిస్తూవున్న దేమిటి ?"

"ఏదో పరధ్యానంగా ఉండి వినలేదు. వచ్చిందా ?"

"వీణమీద సరిగ్గా రాలేదు. మీకో ? కొత్తగా చెప్పిన పంచరత్న కీర్తన వల్లెవేశారా ?"

"ఆఁ, ఏమిటి ?" అని మళ్ళీ వ్రాయడం మొదలు పెట్టాడు రామశాస్త్రి.

"అంత పరధ్యానం ఏమిటండీ ? మీరు వ్రాస్తున్నది నాకు చూపిస్తే తప్పా ?"

"చూడకూడదని చెప్పానుకదా ?"

"మీ పాఠం కూడా మాని అంత శ్రద్ధగా చేయవలసిన తొందర ఏమొచ్చింది ? అందులో రహస్యం ఏమున్నదో ?"

"రహస్యమే మరి-యీ వేళ సాయంకాలానికి ఇది పూర్తిచెయ్యాలి."

"కొత్త కీర్తన కట్టున్నారా, దేవిమీద పాడటానికి?"

"దేవీ నవరాత్రులు అయిపోతూవుంటే ఇంకా కొత్త కీర్తన వ్రాయడం దేనికి ?"

"నిన్న మహర్నవమి కచేరీకి గురువుగారు ఏం బాగా పాడారండీ !"

"ముఖ్యంగా ఆ కామవర్ధని ఆలాపన..."

"మీకూ అదే నచ్చిందీ! ఆలాపనలో ఆయన చూపిన వింత పోకడలు ఇప్పటికీ వినిపిస్తున్నట్లుంది."

"ఆయనకు మనస్ఫూర్తిగా పాడాలనే ఆ భావన రావాలి! వస్తే సాక్షాత్తూ సరస్వతీదేవి పాడినట్టే!"

"ఏదీ, అనండీ-ఆ సంగతి ఒక్కసారి, క్రింది షడ్జమంనుంచి పై పంచమంలో."

త్రిస్థాయిలో రామశాస్త్రి గొంతుక సారించి ఆ సంగతి పలికించడానికి ప్రయత్నించాడు. ఆ రాగస్థాయిలో లీనంఅవుతూ రామప్రియకేసి అరమోడ్పు కనులు సారించాడు. రామప్రియ వేడికోలుగా "అ వ్రాస్తున్న దేదో చెప్పరూ ?" అని మళ్ళా అడిగింది. రామశాస్త్రి "నీ కెందు కంత కుతూహలం?" అని వారించాడు.

"అయితే నాకు కొత్తపాఠం వ్రాసిపెట్టండి"

"నువ్వు వ్రాసుకోలేవా?"

"మీ అక్షరాలు అందంగా ఉంటాయని"

"అక్షరాలేనా?"

"మీ పరిహాసాల కేంగాని, గురువుగారు వచ్చేటప్పటికి వ్రాత పూర్తిచేసుకొని సిద్ధంగా ఉండాలని"

"గురువుగా రెక్కడికి వెళ్ళారు? ఈ వేళ పాట కచ్చేరీ లేది లేదే?"

"పాటకచ్చేరీ లుంటే మనంమాత్రం వెళ్ళకుండా ఉంటామా? నవరాత్రి గానసభలకి వచ్చిన విద్వాంసుల నందరినీ సాగనంపడానికి వెళ్ళారుగా"

"సరే, ఆయన వచ్చేక యింక పాఠం ఏ ముంటుంది?"

"ఎందుకు ఉండదు?"

"ఇప్పటి కప్పుడే సంజపడింది. వచ్చే త్రోవలో కొలనులో సంధ్య వార్చుకొని మరీ వస్తారు. అదిగో నాయనింగారి నాగస్వరవాద్యం! ఖరహరప్రియ ఎలాగ వాయిస్తున్నారో! దేవుడు యింక కాస్సేపటికో కాస్సేపటికో బయలుదేరుతాడు"

"ఎక్కడికి?"

"మరచిపోయా వేమిటి రామప్రియా? ఈ వేళ గజోత్సవం; జమ్మికొట్టడానికి స్వామి ఊరేగివెళ్తారు"

"మీరూ వెళ్తారా?"

"నే నేమిటి? నువ్వూను! మన సహాధ్యాయులం అందరమూ కలిసి జమ్మిచెట్టుకు యీ లేఖ లంటించి రావద్దూ?"

"అదా ఇంతసేపటినించీ మీరు వ్రాస్తూ ఉన్నది?"

"అశ్లోకమే! రహస్యం గ్రహించావు"

"ఇందులో రహస్యం ఏముంది? అవునుగాని, యీ శ్లోకాల కాగితాలు జమ్మిచెట్టుకు అంటిస్తే ఏమి వస్తుందండీ?"

"ఇది వ్రాసి క్రింద ఎవరిపేరు వ్రాస్తే వారికి మనస్సులో ఉన్న కోరిక లన్నీ తీరిపోతాయట!"

"మీ మనస్సులో కోరిక ఏమిటండీ?"

"ఎప్పటికైనా యీ నవరాత్రిగానసభలకి పాట కచ్చేరీ చేసి నిన్ను మెప్పించాలని"

"నన్ను మెప్పించడం ఎందుకు?"

"నిన్ను మెప్పిస్తే లోకాన్ని మెప్పించినట్టే!"

"ఏం ముఖస్తుతిమాటలండీ?"

"ముఖస్తుతిమాటలు కావు. నిజమే. ఈ శ్లోకం చదివి నీపేరుకూడా వ్రాసుకో"

"శమీ శమయతే పాపం
శమీ శత్రువినాశనీ
అర్జునస్య ధనుర్ధారీ
రామస్య ప్రియదర్శనీ.
—అంటే ఏమిటండీ?"

"పూర్వం యీ శమీవృక్షంమీద అర్జునుడు తన గాండీవం దాచుకొన్నాడు. రామచంద్రుడు సీతా వృత్తాంతం తెలుసుకొన్నాడు"

"ఈ రామశాస్త్రిగారు ఏం చేస్తారు?"

"రామప్రియను సందర్శిస్తాడు"

"అయితే నా కేం లాభం?"

"నీ కోరికకూడా కోరుకో!"

"మగవాలీగా జీవించాలని"

"మంచిదే! నీ సంగీతం—నీ నాట్యం ఏం చేస్తావు?"

"వెలయాలుగా ఉంటేతప్ప సంగీతానికీ, నాట్యానికీ సభాపూజ్యత కాదా? ఇతరకులాలలో ఎందరు కులీనలు సభల్లో గానంచేసి, నాట్యంచేసి మన్ననలు పొందడంలేదు?"

"లేదని కాదు; మీ కులవృత్తి ఎక్కడికి పోతుంది?"

"అమానుషం—అందరికీ ముఖ్యమైన మానం విపణివీథిని అమ్ముకోవడం ఏం వృత్తిఅండీ?"

"అయితే—నీ కావృత్తి యిష్టంలేనపుడు ఎవరినో తగిన వరుణ్ణి చూచి వివాహం చేసుకోలేక పోయావా? ఈ సంగీతం ఎందుకు నేర్చుకొన్నావు?".

"సంగీతం నేర్చుకొంటేమాత్రం పెండ్లి చేసుకొని శీలవతిగా జీవించకూడదా?"

"మరి నాట్యం నేర్చుకొన్నావు. గజ్జెపూజ అయింది. ఈ సంవత్సరం నవరాత్రులలో కుంభహారతిచ్చి......"

"కులటవృత్తి అవలంబించవలసిందా? గురువుగారి దయవల్ల కాలేదు. అయినా నామనస్సు అంగీకరించదు."

"మీవాళ్లు ఒప్పుకుంటారా?"

"నా మానప్రాణాలను రక్షించడానికి వాళ్ల ఒప్పుదలతో నిమిత్తం ఏముంది?"

"అంత పట్టుదలతో ఉంటే వివాహం చేసుకొంటేనే మంచిది..."

"దానికి మీ సహాయం కావాలి"

"దానికేం?...తగిన వరుణ్ణి చూచి, నీ మంచితనాన్ని చెప్పగలను. నీవంటి లక్షణవతి అయిన పిల్లను కళ్ల నద్దుకొంటూ ఎవరు పడితే వాళ్లే వస్తారు."

"ఎవరుపడితే వాళ్లు కారు—నాకు నచ్చిన వరుడు కావాలి."

"పోనీ, ఎవరో చెప్పు—నేను ప్రయత్నించి చూస్తాను. నావల్ల కాకపోతే గురువుగారిద్వారా ప్రయత్నిస్తాను."

"చాలామంచిది. మిమ్మల్నే కోరితేనో?"

"రామప్రియా! నువ్వు నిజంగా చెబుతున్నావా—నాతో పరిహాసం చేస్తున్నావా?" అని రామశాస్త్రి వాలుచూపులతో ప్రశ్నించాడు. రామప్రియ లజ్జాభరంతో మొగం వాల్చుకొని, క్రింది బొటన వ్రేలితో నేల రాస్తూ, కంపిస్తూవున్న పెదవులతో, తొట్రుపాటుపడే చూపులతో బదులుచెప్పింది.

"ఏం, మీ దాని కాగోరే సాహసానికి నాలో యోగ్యత లేదంటారా?"

"రామప్రియా! ఎంత మాటన్నావు? ఈ పేద బ్రాహ్మణ్ణి వరించి ఏం సుఖిస్తావని? నీవు కనుసన్న చేసినంతమాత్రంచేత కాళ్ల నుండర కనకాభిషేకం చేసేవా ళ్లుండగా యీ నిరుపేదపైన నీ మనస్సు ఎలాగ పోయిందా అని నా ప్రశ్న."

"వెయ్యి కనకాభిషేకాలు చేసినా నా మనస్సులోని పెన్నిధానాన్ని కొనలేవుగదా!"

"నాపై అంత మనస్సు నుంచినందుకు ధన్యుణ్ణి. కాని నన్ను వరించడంలో ఆనందసుఖాలనూ, భాగ్యభోగాలనూ విడిచి ఆపదలనూ, కష్టాలనూ వరిస్తున్నావన్నమాట"

"కానివ్వండి! వలచిన వరునితో ఆపద ఆనందం, కష్టాలే సౌఖ్యాలు!"

"సరే, యింత త్యాగానికి నే నేమివ్వగలను?"

"నా వాద్యానికి మీ గీతం—నా నాట్యానికి మీ గానం"

"నాలో విశిష్టత ఏ ముంది రామప్రియా! నేనూ నీతో సహాధ్యాయుణ్నే కదా?"

"అయినాసరే, నా కోరిక చెల్లించగలిగే త్యాగం మీరు చెయ్యాలి"

"త్యాగం నే చెయ్యవలసిం దేముంది?"

"మీ తలిదండ్రుల్నీ - వర్ణసంప్రదాయాల్నీ మీరకలగడం"

"నీ వంత స్వార్థత్యాగం చేసేటప్పుడు నే నింతమాత్రం చెయ్యలేనా?"

"చూద్దాం!"

"వచ్చే సంవత్సరం నవరాత్రాలకు తిరిగి నన్నీ దుర్గాదేవికి బలియిచ్చేలోపున నన్ను రక్షించాలి"

"మన మిద్దరమూ ప్రయత్నిద్దాం- ఆ శమీపూజ చేసి వద్దాం! చాలా ప్రొద్దుపోయింది. "

"అయితే, జమ్మికొట్టేటప్పుడు నేనుకూడా వస్తా! "

"ఇదిగో! నీ చీటీ మరచిపోయావు"

మళ్లీ యిద్దరూ శమీపూజశ్లోకం చదువుకొన్నారు.

"రామస్య ప్రియదర్శనీ" అన్నమాట చూచి ఇద్దరూ నవ్వుకొన్నారు.

౨

ఒక సంవత్సరం గడచిపోయింది. తిరిగి నవరాత్రి ఉత్సవాలు కాకినాడలో. ఈమాటు ఉత్సవాలకూ, ఊరేగింపుకూ అలివేణి మేజువాణి ఏర్పాటు చేశారు. అలివేణి కూతురు రామప్రియ వ్యక్తురాలయింది. నాట్యం, సంగీతం పూర్తిచేసింది. మహర్నవమినాడు— దేవాలయంలో కుంభహారతి చేయించి యింక కులవృత్తిలో ప్రవేశపెట్టాలని అలివేణి అభిలాష. ఆ వేళ సాయంసమయం మంటపంలో జరిగిన పాటకచ్చేరీలో మహావిద్వాంసుడు పేరిశాస్త్రిగారి గానంలోనే ప్రక్కపాటకుడు, ప్రియశిష్యుడు రామశాస్త్రిగారి గానం మిళితమై సభాసదుల ప్రశంసాపాత్ర మయింది. వచ్చేసంవత్సరం యీ పాటికి రామశాస్త్రి స్వయంగా కచ్చేరీ చేయగల డంటున్నారు. అతనికి మాత్రం దక్షిణాది వెళ్ళి విద్వాంసుల దగ్గర విద్య అభ్యసించి రావాలని ఉంది. దానికి పేరిశాస్త్రి గారు కూడా దోహదంచేసి నవరాత్రోత్సవాలకు వచ్చిన విద్వాంసు డొకరితో ఏర్పాటుచేశారు. ఆనాటి కచ్చేరీలో రాగమాలిక పాడుతూవుండే గురువుగారు కామవర్ధని పాడి వదిలేశారు. శిష్యుడు రామశాస్త్రి అందుకొని, పావురా గుబాళింపుల వంటి సంగతులన్నీ వేసి చూపించాడు. 'భేష్' అన్న సభాసదులవైపు చూస్తూవుంటే స్త్రీల ప్రత్యేక స్థలంలో విప్పారిన రెండు ప్రశంసానేత్రాలు తళుక్కుమన్నాయి. రామశాస్త్రికి సంవత్సరం క్రితం సంగతి జ్ఞాపకం వచ్చింది. వాగ్దానభంగం చేయకూడదు. ఆ జవ్వని సోగకన్నులలో జాలిగా వేడుకొనే ప్రార్థన కనిపించింది.

సభ అయిపోయింది. ఎవరిదారిని వారు వెళ్ళుతున్నారు. అలివేణి రామశాస్త్రికి నమస్కారం చేసి "మీ విద్య చూపించారు—మా పిల్ల విద్య కూడా చూద్దురుగాని యీ రాత్రి దయచేయరూ ?" అని పిలిచింది. రామప్రియ వెనుక ఆగిపోయి, రామశాస్త్రిని "వాగ్దానం నిలుపుకోరూ ? నన్ను రక్షించరూ ?" అని వేడుకొంది. తలబడుతూ రామశాస్త్రి "అలాగే" అన్నాడు. "రామస్య ప్రియదర్శనీ" అని ఒక నవ్వు నవ్వి "యీ రాత్రే—పదిగంటలకు, జమ్మిచెట్టు క్రింద" అని సంకేతం చెప్పి మరుని చేకటారిలాగ రామప్రియ వెళ్లిపోయింది.

రామశాస్త్రి పరిపరివిధాల తర్కించుకొన్నాడు. ఒక సర్వవిద్యాపారంగతురాలిని— ఒక సద్గుణవంతురాలిని అసహాయను చేసి, ధనంకోసం బలియిస్తున్నారు. ప్రాణభంగంకంటే నీచమైన మానభంగం! లజ్జా విహీనమైన దుర్వృత్తినించి, మహాపాపకూపంనించి ఆ అబలను తాను రక్షించాలి. పైగా సుదీర్ఘమైన వేణీభారంతో, ఆకర్ణాంత విశాల నేత్రాలతో, వికసించిన యౌవనవిలాసంతో లక్ష్మీదేవిలాగుంది. అటువంటి స్త్రీని అడ్డమైన వాళ్ళకు అర్పించవలసిందేనా ? వద్దు. రక్షించాలి. ఇదే న్యాయం. ఆమె చెప్పిన సంకేతం జ్ఞాపకం ఉంచుకున్నాడు.

ఆ రాత్రి 'కుంభహారతి' కి పోవడానికి బదులు కుహనారోగం కల్పించుకొని రామప్రియ విడిదిలోనే ఆగిపోయింది. ఊరి చివర జమ్మిచెట్టుకు ఎదురుగానే అలివేణి మేళంవాళ్ళ విడిది. అలివేణీ, మిగతా హంగుదారులూ స్వామిసేవకు వెళ్లారు. గుడిలో రామప్రియ లేకుండా మేళం జరుగుతూఉంది. అభిసారిక రామప్రియ బయలుదేరింది. శమీపూజ చేయించుకొనే కుతూహలంతో ఆ శమీవృక్షం గంభీరంగా అనవమి వెన్నెల లోని చిరునీడలు చూచుకుంటూ చిరుగాలుల కూని

రాగాలు తీస్తోంది. ఆ క్రీనీడలో రామశాస్త్రి నిలుచుండి ఆమెకోసం ఎదురుచూస్తున్నాడు. రామప్రియ రావడమే తడవుగా అప్పటికే మాటలాడి ఉంచిన గుఱ్ఱపు బండిమీద అతివేగంగా వాళ్ళిద్దరూ నిష్క్రమించారు. రాత్రివేళ వాళ్ళ ప్రయాణానికి అనువైన రైలుబండి దొరికింది. ఇంక బ్రతికి బయటపడ్డామనే నిట్టూర్పుతో బండి యెక్కారు. రైలుపట్టాల రణగుణధ్వనులలో వారి యిరువురి పడుచు హృదయాలలోని ఆరాటం తెలియడం లేదుగాని, బండెడు భారంతో క్రుంగిపోతున్నారు. ఒకరిని ఒకరు పలుకరించుకోకుండా మూగనోములోనే వారి మనోభారం తెలియపరుచుకొంటున్నారు.

మర్నాడు తెల్లారుజామున మేలుకొలుపులు పాడకుండానే అలివేణి ముందే విడిదికి వచ్చివేసి, జబ్బుతో పడివున్న కూతురికేసి చూచింది. ఆ ప్రక్కలో కప్పిన కాశ్మీరశాలువా తొలగించి చూస్తే—పొడుగాటి దిండు పడిఉన్నది. తనకూతురు ఇంత పని చేస్తుందని నమ్మలేకపోయింది. చివరికి చివరికి అవగాహన చేసుకొని వెంటనే స్టేషనుకు వెళ్లి అక్కడ దర్యాప్తుచేస్తే—రామశాస్త్రి, అతనితో ఒక స్త్రీ మద్రాసు వెళ్లినట్టు తెలిసింది. అపుడే ఉన్న ప్యాసింజరులో తానుకూడా బయలుదేరింది. మద్రాసు చేరుకొని అన్ని హోటళ్ళలోనూ పరీక్షచేయగా వాళ్లున్న ఉనికి తెలిసింది. అలివేణి అనరాని, వినరాని దుర్భాషలతో రామశాస్త్రిని తూలనాడింది. ఆ ప్రవాహం అంతా ముంచుకొని పడుతూవుంటే రామశాస్త్రి నిర్విణ్ణుడై నిలుచుండి చూస్తున్నాడు. రామప్రియ ముగ్ధరాలు—తల్లి చేసే తిట్టిపోతలకు మారాడలేకపోయింది. రామశాస్త్రి అంతా విని ఏదో చెప్పబోతే, అలివేణి అందుకొని "ఏ పాపమూ ఎరగని పిల్లకు మందో, మాకో పెట్టి యిలా చేశారు. సిద్ధాన్నం చెడగొట్టి, ఇలాగ లేవదీసుకొని రావటం మీకు న్యాయమేనా అండీ! మీరూ చిన్నవారు. ఇంకా చదువుకొని పదిమందిలో పేరుప్రతిష్ఠలు తెచ్చుకోవలసినవారు. తల్లికీ పిల్లకూ ఎడబాపులు చేసి యిలాగ లేవడం మీకేమంత జయకరం" అని అడిగింది.

"ఇందులో నా తప్పేమీ లేదు. మీ అమ్మాయినే అడుగు" అని జవాబు చెప్పాడు.

"దాని కేం తెలుసు? కసుగాయ. యౌవన మదంలో కళ్లు కనిపించక వచ్చివేసింది. తెలిసున్నవారు మీరైనా బుద్ధి చెప్పవద్దూ?" అని మళ్లీ అందుకొంది. రామప్రియ యీ మాటలన్నీ మరి వినలేక, తల్లితో "యింక యెంత అల్లరి చేసినా రాదలచుకోలే" దని నిష్కర్షగా చెప్పివేసింది. అయితే తన నగలన్నీ తీసి యిచ్చివేసెయ్యమని అడిగింది అలివేణి. లేకపోతే పోలీసులను తీసుకొనివచ్చి కేసు పెట్టిస్తానని బెదిరించింది. "అయితే యీ ప్రేమ అంతా నా నగల మీదగాని నామీద కాదన్నమాట" అని రామప్రియ తన వంటి నగలన్నీ తీసి తల్లిచేతుల్లో పెట్టింది. "వినాశకాలే విపరీతబుద్ధిః" అని దీవించి అలివేణి నిష్క్రమించింది. తన తల్లిచేసిన అవమానానికి రామప్రియ రామశాస్త్రికి ఎంతో క్షమార్పణ చెప్పుకొంది. పొంగి పొరలివచ్చే దుఃఖం, వెక్కి వెక్కి యేడ్చిన యేడ్పు కన్నీరుగా వాళ్ల పరుపుచుట్టు నంతా తడిపివేసింది. రామశాస్త్రి ఆమెను సేదదేర్చుతూ ఉన్నాడు గాని, లోకానుభవంలేని తనకు—ఇప్పుడు చేసిన నిశ్చయం కల్పించే విపత్పరంపరలు భీషణంగా ఎదుర్కొనే టప్పటికి భీరువుగా లొంగిపోవాలో, ధీరుడుగా ధిక్కరించాలో తెలియని అవస్థలో పడ్డాడు.

అలివేణి పెద్ద కార్పణ్యంతో కూతురినీ, రామశాస్త్రినీ నిగ్రహించాలని గురువుగారైన పేరిశాస్త్రి గారివద్దకు వెళ్లి, కథ అంతా పూసగ్రుచ్చినట్టు చెప్పింది. ఆ సద్బ్రాహ్మణుడు రామశాస్త్రి దక్షిణాదికి విద్యకోసం వెళ్లాడనుకున్నాడుకాని ఈ వృత్తాంతం నమ్మలేకపోయాడు. ఘోరావమానంగానూ, విప్రకులానికి తీరని కళంకంగానూ తలచి, రామశాస్త్రి స్వగ్రామం వెళ్లి అక్కడ ఉన్న శాస్త్రి తల్లిగారికీ సంగతంతా తెలియజేశాడు. రామశాస్త్రి తండ్రిలేని బిడ్డ. చిన్నతనంనించీ తల్లే పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు గరపింది. స్మార్తం చెప్పించాలని ప్రయత్నం చేశారుగాని, అది అతనికి అబ్బలేదు. మొదటినించీ సంగీతం అంటే అభిమానంతో రామశాస్త్రి అటు దృష్టి చూపాడు. దానికి తగినట్టు మంచి గురువువద్ద శుశ్రూష లభించింది. బాగా విద్య వచ్చింది. చివరకు యిటువంటి అప్రతిష్ఠకార్యం

చేశాడేమిటి అని తల్లికడుపు చెరువై పోయింది. వెంటనే ఆమె కొడుకుజాడలు వెదకుకొంటూ పేరిశాస్త్రి గారిని తోడుచేసుకొని వెంట బయలుదేరింది. వారు మద్రాసుపట్టణం వచ్చేటప్పటికి రామశాస్త్రీ, రామ ప్రియా తిరువనంతపురం వెళ్లిపోయారు. అక్కడే అత నికి సంగీతం నేర్చుకోవడానికి తగిన సెలవు దొరికింది. అతనివెంట తల్లీ, గురువూ వెదకుకుంటూ పోకతప్పింది కాదు. చివరకు అందరూ తిరువనంతపురం చేరు కొన్నారు. సమయానికి రామశాస్త్రి కొత్తగురువుగారి వద్దకు వెళ్లాడు. బసలో రామప్రియ ఒక్కర్తే వుంది. గురువుగారినీ, వారితోకూడా వృద్ధ మాతనూ చూడగానే ఆమెహృదయం క్రుంగి పోయింది. వెక్కివెక్కి యేడ్చింది. పేరిశాస్త్రిగారు రామశాస్త్రిని పిలవడానికి వెళ్లిపోయారు. ఆ స్త్రీలు ఇద్దరూ ఉండిపోయారు. ఇద్దరి మనస్సులలోనూ ప్రేమ ఉంది. తన కొమారుడు తన అధీనం లోంచి తప్పి పోకూడదని ఆ తల్లి ఆ రాటం. తన ప్రియునికోసం ఎంత త్యాగమైనా చేసి అతన్ని దక్కించుకోవాలని ఆ ముద్దరాలి పట్టుదల. తల్లి పొంగిపొంగి వచ్చే దుఃఖం తో ఏడ్చి, చిన్నతనంనించీ రామశాస్త్రిని తా నెలా పెంచి పెద్దచేసిందీ చెప్పింది. వారిది గానావధ్యులవారి వంశం. ఘనం, జటా చెప్పడంలో వారిది పెట్టింది పేరు. అటువంటి అగ్నిహోత్రంలాంటి పవిత్ర వంశానికి రామశాస్త్రి ఒక్క అంకురం. అతను ఒక్కడూ ఇలా వెలి యైపోతే వంశం ఏంగాను? అతన్ని ఇన్నాళ్లూ కళ్లల్లో ఒత్తివేసుకొని పెంచుకొని వచ్చింది. అతని మీదే ఆమె పంచ ప్రాణాలున్నూ, వాళ్ల వంశగౌరవ మున్నూ. ఇప్పు డిద్దరిలో ఎవరో ఒకరు త్యాగం చెయ్యాలి. తాను త్యాగం చేస్తే వంశం త్యాగంచెయ్యదు. వీడితో కులానికీ, వంశానికీ, గురువుకూ అందరికీ అప్ర తిష్ఠ. రామప్రియ త్యాగం చేస్తే పోయింది లేదు. వీడు పోతే మరో మంచివాడు దానికి దొరుకుతాడు. కాక, వాళ్ల కులవృత్తి ఉండనే ఉంది. ఒక్క దుష్ట కార్యంవల్ల పాలవంటి వంశం భగ్నంపొడవుతుంది. ఇన్ని వాదించి చెప్పి చివరికి ఆ తల్లి రామప్రియచేతులు పట్టుకొని ఇలా అంది:

"అమ్మా! ఇవి చేతులు కావు, కాళ్లు. నువ్వు నన్ను కనికరించి పుత్రభిక్ష పెట్టవూ? వీ డిలాగ నిన్ను పెళ్లిచేసుకొంటే, ఇటు ఏడుతరాల వాళ్లకూ, అటు ఏడు తరాలవాళ్లకూ గతు లుండవు. యజ్ఞ యాగాదులు చేసిన వీడి తండ్రితాతలు పితృలోకాలలో ఏంగాను? నువ్వైనా వాడి క్షేమం కోరుతున్నావు గదా! వాడిని నీ తో పా టు అధికపా తా ళ లో క ం లో కి దిం పి తే వా డి ని ఎ వ రు పూ జి స్తా రు! గానసభలో వాడికి విద్వాంసుడన్న కీర్తి యెలా వస్తుంది? వాడి మేలు కోరినదానివైతే, వాడి ఉన్నతి కోరినదానివైతే నామాట విను. నీ వృత్తిలోకి నీవు వెళ్లిపో. అంధకూపంలోకి వాడిని క్రుంగదీసే బదులు వాడి ఉన్నతిలోకి నీవు రా! తల్లిని, వాడి క్షేమం, నీ క్షేమం కోరినదాన్ని! నామాట వినవూ?"

అని ఆమె తన హృదయం అంతా విప్పి చెప్పింది. ఈ మాటలు చెబుతూవుంటే, రెండేళ్ల క్రితం రామశాస్త్రి శమీపూజాపత్రం వ్రాస్తూ కోరిన వరంమాట జ్ఞాపకం వచ్చింది. 'ఇదే నవరాత్రులకు గాన సభ చెయ్యాలి. నలుగురితోపాటు ఈమెచేత భేష్ అనిపించుకోవాలి'. తాను అటువంటి విద్వాంసుణ్ని వివాహంచేసుకొంటే ఈ కోరిక ఎలా తీరుతుంది? అవును, ఆమె అన్నట్టు, ఈయన భ్రష్టుడైతే ఎవరాద రిస్తారు? సభాపూజ్యత ఎలా వస్తుంది! తాను కోరేది అతని ఉన్నతి, అతని క్షేమం! తాను మానప్రాణాలు కోల్పోయినా సరే, అతని పేరుప్రతిష్ఠలు, కుల ప్రతిష్ఠలు కాపాడాలి. నిశ్చయంచేసుకొంది. ఆతల్లి ప్రార్థన అంగీకరించి రామశాస్త్రి రాకుండానే ఆమెతో వెళ్లిపోవా లనుకొంది.

రామశాస్త్రిని వెంటబెట్టుకొని పేరిశాస్త్రిగారు వచ్చారు. కొడుకును చూచి తల్లి ఒక్కసారి భోరు మన్నది. రామశాస్త్రి మహాపరాధం చేసిన నేరస్థుడి లాగ తల వాల్చి నిలువబడ్డాడు. పేరిశాస్త్రిగా రందు కొని "యిప్పటికైనా మిం చి పో యిం ది లేదు. ఈ రామప్రియకూడా తెలివిలేనిది, అవివేకవతి కాదుగదా!" అని చెప్పబోతున్నాడు.

ఇంతలో ఆ వృద్ధమాత మాటకు అడ్డువచ్చి—

"గురువుగారూ! రామప్రియలాంటి గుణవంతురాలుంటుందటండీ! ఏదో విధివ్రాత, అలా తప్పిపోయి ఆ కులంలో జన్మించింది. నిజానికి బొగ్గుల్లో మాణిక్యం! మనం చెప్పకుండా ఆ పిల్లే గ్రహించింది" అని కొంచెం సంతోషం ముఖంమీద కనబరుస్తూ పైటచెరగుతో కన్నీళ్లు అద్దుకొన్న దా వృద్ధురాలు!

"నే నన్నానుకాదూ! ఇంతకూ వేళావిశేషం. కాని మనం చూచాయగా అందించేటప్పటికి గ్రహించుకుంది. రత్నంలాంటిది" అని శాస్త్రిగారు ప్రశంస చేశారు.

రామశాస్త్రికి ఇదేమీ అర్థం కావడం లేదు. ఆ తల్లి రామప్రియను దగ్గరకు తీసుకొని "మా చల్లని తల్లి! అన్నమాట తీసి పారవేయలేదు. లేవండి, మరి శాస్త్రిగారూ! మనతోటే వచ్చివేస్తుంది. తీసుకొని పోదాం!" అని ఉన్న సంగతి చెప్పింది.

"అవును, ఇంక వేరే ట్రెయిను లేదుకూడాను. యీ బండిలోనే వెళ్ళిపోవచ్చు. నాయనా! రామశాస్త్రీ! అదొక గ్రహచారం—ఏదో రాహు భుక్తిలాగ వచ్చింది, వెళ్లిపోయింది. విడుపు అయిపోయింది. ఇదొక పీడకలలాగ మరచిపో! సంగీతం నేర్చుకొని, నలుగురిలోనూ అవుననిపించుకో." అని సలహాయిచ్చి ఆయన నిష్క్రమించారు.

రామశాస్త్రి మనస్సులో రేగిన పెనుతుపాను మౌనముద్రతో ఆపాజేసెనో కాని మాటలాడడం మొదలుపెట్టితే ఏమయ్యేదో!

రామప్రియలో ఈ మార్పు ఎలావచ్చిందో బోధపడలేదు. 'పీడకలలాగ మరచిపో' అని గురువుగారు చెప్పారు. రామప్రియ మూగచూపులతో సెలవు తీసుకొంది. ఆమెజీవితంలో ఇది పీడకలో, మధుర స్వప్నమో! తన జన్మకు తగని కోరిక కోరింది. కులీనగా జీవించదలచింది. అది సాగనీయలేదు సంఘం. తనను అపార్థం చేసుకొంది. తనకు ఆప్తులు సైతం తాను కోరిన మార్గం అపమార్గ మని అన్నారు. లోకం అన్నది సత్యమా, తాను కోరింది సత్యమా? మానాభిమానాలు చంపుకొని అసత్య జీవితం జీవిస్తేనే లోకం హర్షిస్తుందే! తనతోపాటు లోకం ఉండదు. తన్ను ద్వేషిస్తుంది. అందుచేత లోకంతోపాటు తాను జీవించాలి.

రామప్రియ లోని అభిమానం చంపుకొన్నది. ఆత్మను అసత్యంవెనుక దాచివేసింది. ఇక్కడి నుంచి సిగ్గూ, లజ్జా లేని ధన సంపాదనా యంత్రంలో పరకాయప్రవేశం అయింది. రామప్రియ కిదొక కొత్త అవతారం.

3

ఎనిమిది సంవత్సరాలు గడచిపోయాయి. రామశాస్త్రి 'సంగీత భూషణు' డయ్యాడు. దక్షిణాది విద్వాంసులతో సరిసమాన హోదాతో వివిధ సంగీత వేదికలమీద పాటకచ్చేరీలు చేసి, సెబాస్ అనిపించుకొంటున్నాడు. దక్షిణ దేశంలో వివిధ సంస్థానాలు పర్యటనచేసి, ఆయారాజుల ప్రత్యేక ప్రశంసలంది, చివరకు మద్రాసు చేరుకున్నాడు. రేడియోలో రెండు మూడు సారులు ఆతడు పాడిన పాటకు తెనుగు పత్రికలూ, తమిళ పత్రికలూకూడా జేజేలు పాడాయి. అతని కీర్తి నలుదెసలా వ్యాపిస్తూవుంది. పట్టణంలోని వివిధ సభలలోనూ అతని గానకాలక్షేపాలు ఆబాల గోపాలమూ విని ఆనందిస్తున్నారు.

క్రమేణా ఆంధ్ర దేశంలో కూడా అతని ప్రతిష్ఠ వ్యాపించింది. దేవీ నవరాత్రాలు వచ్చాయి. ఆంధ్ర దేశంలో అఖండప్రశస్తి చెందిన కాకినాడలో సరస్వతీ గాన సభలకు మహార్నవమినాడు రామశాస్త్రిగారు గానం చెయ్యవలసిం దని ఆహ్వానం వచ్చింది. ఇన్నాళ్ళకు తాను కలలుగన్న కోరిక నెరవేరబోయే తరుణం వచ్చింది. సరస్వతీ గాన సభల్లో తన స్వంత కచ్చేరీ! పదేళ్ళక్రితం శమీ పూజాసమయంలో తాను కోరిన వరం. సరస్వతీ విగ్రహంముందు వేదికపై కూర్చున్నాడు రామశాస్త్రి. గానసభ కిటకిటలాడుతూవుంది. స్త్రీల ప్రత్యేక స్థలంవైపు అతని దృష్టి ప్రసరించింది. ఒక అంగనామణి కర్ణభూషలలోని రెండు చిరత్న

రత్నాలు తళుక్కు మన్నాయి. వంచిన తల ఎత్తగానే ముక్కుపై రవ్వల బేసరి కన్ను విప్పింది. తుమ్మెద ఝుంకారంలాగున తంబురా ఝుమ్మనే శ్రుతి అందిస్తూవుంటే మొదట్లోనే. మూడోకాలంలో వసంతరాగవర్ణం అందుకున్నాడు. ఫిడేలూ, మృదంగం తటాపటాయించే లోపున ఒక ముత్యాల వాన కురిసినట్లు రామశాస్త్రి స్వరాలు పలుకుతూ ఒక్క చిరునవ్వు విసిరాడు. తీర్చిదిద్దిన కాటుకకళ్లుగాని, పవుడరు పులిమిన దళసరి చెక్కిళ్లుగాని ఒక ముదిత హృదయాన్ని దాచలేకపోయాయి. రామప్రియను గుర్తించాడు రామశాస్త్రి సభాసదుల్లో. వర్ణంలోని చాకచక్యం గుర్తించే లోపున సౌరాష్ట్రరాగంలో త్యాగయ్య వారి "శ్రీగణపతిని" అందుకొన్నాడు. రామప్రియ చూపుల్లో మెప్పు కనిపించలేదు. మూడో కీర్తన రామప్రియ రాగంలో "కోరిన వర మొసగుమయ్య" అని పట్నం సుబ్రహ్మణ్యయ్యగారు రచించిన కీర్తన. రామప్రియకు అభిమానరాగం—అభిమాన కీర్తన. ఆలాపనలోని రాగచ్ఛాయలలో కొత్త మెలకువలు పలికిస్తూ వుంటే సభాసదులు సంగీతరసవార్ధిలో మునకలు వేస్తున్నారు. రామప్రియ దీనితో రససిద్ధి పొందింది. మనస్సులోని ఆనందాతిశయం ఆపలేక ప్రక్కనున్న తోడి నర్తకిని కౌగిలించుకొంది. ఒక కొత్త కీర్తన అపూర్వరాగంలో పాడి స్వరకల్పన చేస్తూవుంటే, ఫిడేలు-మృదంగ వాద్యకులు ముఖముఖాలు చూచుకొన్నారు. గానసభ మంచి రక్తిలో ఉంది. సభాసదు లందరూ తదేకతత్పరులై రస పిపాసతో ఆలకిస్తున్నారు. కృతిమీద చరణంలో ఆయన చేసిన స్వరకల్పన చిత్తజల్లులాగ కురిసి వెలిసింది. తిరిగి నిశ్శబ్దం. ఝుమ్ ఝుమ్మని తంబురా శ్రుతి. పా పా పా అని త్రిస్థాయిలో ఆలాపన ప్రారంభించి మేఘగంభీరనిస్వనంతో అందుకొన్నాడు. వెలుపలి ప్రకృతికూడ అరుణరేఖలతో సంధ్యాశోభ రూపించి మసకచీకటిలో సేద తీర్చుకొంటూ ఉంది. దీపారాధన, దూరాన దేవాలయంలోని చిరుగంటలు వినిపించినా సభాసదుల్లో ఎవ్వరూ లేవడంలేదు. పల్లవి ఏ రాగంలో పాడతారా అని రసికులు ఉవ్విళ్లూరుతున్నారు. సమయోచితంగా రామశాస్త్రి 'కామవర్ధని' అందుకొన్నాడు. ఈ రాగంపోకడలే వింతవింత తోవలు చూపుతున్నాయి. గంటసేపు పైగా రాగాలాపనే. ముగ్ధురాలై చూస్తోంది రామప్రియ! ఆనాడు శమీపూజ చేసి అతడు కోరిన వరం నెరవేరింది. గానసభలో గద్దెమీద ఎక్కి నలుగురిచేత సెహబాస్ అనిపించుకొన్నాడు. తాను మెచ్చుకొన్నది. తన జీవిత మంతా ఒక చలనచిత్రంలాగ కనిపించింది. దాని వెనుక అతడు పాడిన తానం, పల్లవి, స్వరకల్పన భీషణమైన నేపథ్యసంగీతంలాగ వినిపిస్తోంది. ప్రజల హర్షధ్వనులు, కరతాళధ్వనులు. అతడు సాధించాడు. తానో! ఊహించిన స్వర్గానికీ, అనుభవించే నరకానికీ ఎంత తారతమ్యం! కాని తోడివారందరూ "రామప్రియ క్షేమమ్మా? మూడుమేడలు కట్టింది, ఒంటినిండా రత్నాల నగలు, దాసదాసీజనం, గొప్ప పేరుప్రతిష్ఠలు" అంటారు. ఇవన్నీ తనలోని మానం, ఆత్మ పరిత్యజించినతర్వాత వచ్చినవే! ఈ ఎనిమిదేళ్లూ తాను జీవించినది యంత్ర జీవితం. తనలోని మానవత్వం చల్లని, మంచి సంగీతం వినగానే తిరిగి మేల్కొన్నది. జలపాతంలాగ చిమ్ముకొంటూ రాబోతోంది. ఇంక ఆగలేక వెళ్లిపోయింది.

విజయదశమి రాత్రి. శమీపూజ! ఊరేగింపులో అలివేణి కూతురు రామప్రియ మేజువాణి. ఊరంతా తిరిగి ఏనుగు జమ్మిచెట్టు దగ్గరికి వచ్చింది. అక్కడ నాయకురాలిచేత ఆడించాలని కొంతమంది కోణంగిగాళ్ల ప్రయత్నం. సభచేసి కొలువు తీరిస్తేతప్ప నాయకురాలు నాట్యంచేయడం లాంఛనం కాదు. ఎంతమంది చెప్పినా రామప్రియ వినలేదు. చివరికి ఏనుగును శమీవృక్షానికి సమీపంగా ఒక యింటివద్ద ఆపి—ఆ అరుగుమీద ఊరేగింపు ఆపి మేజువాణీ చెయ్యమన్నారు. మేజువాణీ చెయ్యడానికి అభ్యంతరం లేదు, కాని నాట్యం మాత్రం చెయ్యలేనని చెప్పింది రామప్రియ. ఎలాగయినా సరే నాయకురాలిచేత గజ్జె కట్టించి తీరా లనుకొన్నారు ఊరి పెద్దలు. రామప్రియ ఎంత బ్రతిమాలినా వినలేదు. తాను ధనసంపాదనచేసే యంత్రం. ధనం ఇచ్చేవారు ఏమి కోరితే అది చెయ్యాలి. ఇదివరకైతే ఏమైనా చేసేది. ఈవేళ తిరిగి తనలో మాన

కర్తవ్యం మేల్కొన్నది. పూర్వస్మృతులు జ్ఞాపకం వచ్చి, తాను జారవిడుచుకొన్న పెన్నిధానాన్ని తిరిగి చూపాయి. ఏమైనాసరే తాను పరువుకు భంగం రానీయదు. ఊరేగింపులో గజ్జె కట్టదు. పట్టు, విడుపు ఉండాలి అని పెద్దలతో వాదించింది. తన మేజువాణి కుదిర్చినవారు సమ్ముఖాన లేరు; కొంచెం కోణంగులతో వాదం. "మీరు మా మేళం కుదిర్చినవారు కారుగనక మీతో మాకు ప్రసక్తి లేదు" అని రామప్రియ చెప్పింది. దానితో వారిలో తుంటరులు అల్లరి ప్రారంభించారు. ఆడపాపలమీద అవీ యివీ వెయ్యటం నానా అపభ్రంశాలు మొదలుపెట్టారు. ఆ ఊరేగింపులోనే సన్నాయిమేళంవద్దనున్న రామశాస్త్రి వచ్చి చూశాడు. ఇంతలో మేళంవద్ద కక్షలు ఏర్పడ్డాయి. రాళ్లతో గ్యాసులైట్లు పగలగొట్టారు. అంతా చీకటి. బాణాకర్రలు బుర్రల మీద పనులు తున్నాయి. మేళంలోని పాపలందరూ పారిపోతున్నారు. దుండగీండ్రు వారి వెంట బడి తరుముతున్నారు. రామశాస్త్రిగారి స్నిగ్ధహృదయం తన బాల్య స్నేహితురాలి పతనానికి పలవించింది. ఇంతలో పోలీసులు రావడం, కొంత ప్రశాంతి యేర్పడటం జరిగింది. రామప్రియా, తోటి ఆడపాపలూ జమ్మిచెట్టుఎదుట ఉన్న విడిదిలోకి చేరుకొన్నారు. రామప్రియకు కణతమీద బలమైన గాయం తగలడమే కాకుండా, ఎవరో నీచుడు ఆ మెకనులమీద ఆసిడ్ పోశాడు. వికృతరూపంతో బీభత్సంగా కనిపిస్తోంది. డాక్టరును పిలిపించి చికిత్స చేయించవచ్చు గాని అంతగా ప్రయోజనం ఉండేటట్టు లేదు. అటువంటి దురవస్థలో ఉన్న తన ఆప్తురాలిని రామశాస్త్రి పలుకరించకుండా ఉండలేకపోయాడు.

రామప్రియకు కనులు కనిపించవు. స్పర్శతోనే పోల్చింది. "మీ సంగీతం విన్నాను—నా కోసమే పూర్తిగా గానం చేశారేమో! అన్నీ పాతో పలుకరించినట్టయింది. మీరు..."

"నీ కోరిక తీర్చలేక పోయాను. నీవు చేసిన మహోత్యాగానికి అణుమాత్రం కూడా ప్రత్యుపకృతి చేయలేక పోయాను"

"ఇంత కంటే ఏం కావాలి? మీ కోరిక నెరవేర్చుకొన్నారు. నన్ను మీ గానంచే మెప్పించారు. అదే నా కోరికాను"

"కాని యీ దురవస్థలో—నిన్ను చూడటం"

"దురవస్థ! నాకు మంచి శాస్తి జరిగింది. ఈ అసంపూర్ణ జీవితానికి మంచి సమాప్తి"

ఇవన్నీ రామప్రియ యెంతో ఆయాసంతో మాటలాడింది. లోపల పడే వేదన ఆ యానందంలో కనిపించనీయలేదు. క్రీనీడలోనే ఆమె కన్నులు మూస్తూవుంది. వేరే వెలుతురులోకి తియ్యాలని రామశాస్త్రి ప్రయత్నిస్తున్నాడు.

"ఇలాగే పడుకోనీయండి—జమ్మిచెట్టు ఆకుల నీడలే యివి. ఆ చెట్టుమీద మనం కట్టిన చీటిముక్కలు ఇంకా ఉన్నవేమో! ఏదీ ఆ శ్లోకం...శమీ శమయతే పాపం!...రామస్య ప్రియదర్శనీ" అని చిరునవ్వుతో కనులు మూసివేసింది.

"రామస్య ప్రియదర్శినీ" అని మననం చేసుకొంటూ రామశాస్త్రి అడుగులో అడుగు వేసుకొంటూ వెళ్తున్నాడు.

ఆ జమ్మిచెట్టుమీద వాలిన తీతువుపిట్ట అరుస్తూ ఉంటే అది కూడా ఆ శ్లోకపాదమే "రామస్య ప్రియదర్శినీ" అంటున్నట్టుంది.



పరివర్తనము

•

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ

నగరమునం దంతటను ఈ వార్త ఇట్టే పాక్కిపోయినది. నగరమంతయు నట్టుడికిన ట్టుడికిపోయినది. ఏ యిరువురు పౌరులు కలసికొన్నను, ఏ యిరువు రమ్మలక్కలు ఒక్కచోట చేరినను ఈ వార్తనుగురించి ముచ్చటించువారే, దీని ఫలితమునుగురించి తలపోతలు సేయువారే. పురుషులేమి, స్త్రీలేమి ఎల్లరును ఈ వార్తను విని ముక్కున వ్రేలిడికొని అబ్బురపడువారే. "మహారాజునకు గడుగూర్చు ముద్దులరాణియైన నేమి, ఎంతటి విద్యావతియైనను ఆ విధమున మహారాజు నవమానింప జనునా? జలక్రీడా వినోదవేళనయిన నేమి, నోటి కెంతవచ్చిన నంతయు ననివేయుటయేనా? నోటికి తాళ ముండవలెను. చిన్న పెద్ద తారతమ్య ముండనక్కరలేదా? మర్యాద పాటింపనక్కరలేదా? ఒకవేళ మహారాజునకు సంస్కృతభాష తెలియదే యనుము. అయినను తన కమ్మ తెలియునని మిడిసిపడి యహంకరించి మహారాజు నవమానించి చిన్నబుచ్చుటయేనా? విద్యాసంపన్న మయిన ప్రసిద్ధ రాజవంశమునుండి వచ్చిన తాను తన కొలది యెఱుంగక తన భర్తను - విశేషించి సకలదక్షిణాపథేశ్వరుని, శాతవాహనకుల కలశాబ్ధిచంద్రుని, హాలనరవరోత్తముని ఆ పగిది నవహేళనము చేయుట కామె కది తగవా?" అని యందరును చాటునను మాటునను తమరాణి వేదవల్లిచర్యను విమర్శించువారే; భార్యాభర్తలకు సంబంధించిన కేవల సాంసారిక విషయము, తమ కెందుకని యూరకయుండినవా రొక్కరును లేరు. ఎల్లరును రాణి మహారాజును జేసిన యవహేళనము తమ్ము జేసినట్టు భావించువారే. ఆ ప్రజానీకమునకు తమ మహారాజన్న నంతటి యభిమానము. మహారాజు మీద వారికిగల యభిమానమే యౌచితినిగూడ బోత్రోలి వారు రాణి నంత తీవ్రముగ విమర్శించునట్లు చేసినది.

ఎట్లు పాక్కినదో ఈ వార్త?—ఏకాంతమున నందనోద్యాన వనమునందలి శ్రీ కృష్ణలీలా సరోవరమున హాలమహా రాజును, అతని ముద్దులరాణి వేదవల్లియు నొండొరులపై జలవిక్షేపము చేసికొనుచు జలక్రీడ నవధరించు వేళ "మహారాజా! మా మోదకై స్తాడయ" (మహారాజా! నన్ను నీటితో గొట్టవద్దు) అని గీర్వాణ భాషను వేడికొన్నదట. సంస్కృతభాషా పరిజ్ఞానము లేని హాల మహారాజు రాణి చెప్పిన దానిలో మోదకముమాట వచ్చుటచేత మోదకములు కావలెననుచున్నదని భ్రమపడి రాణికి వెంటనే వానిని తెప్పించి యిచ్చెనట. అంతట వెకసక్కెముగ విరగబడి నవ్వి రాణి తా నన్నమాట కర్థము చెప్పి, అంతమాత్రమయినను దేవభాష తెలియనందుకు మహారాజు నవహేళనము చేసినదట. ఇక నేమున్నది, ఈ వార్త నగరమంతయు పాక్కి, రాణి పౌరుల తీవ్ర విమర్శనమునకు గురియైనది. రాణి చేసిన యీ యవహేళనమునకు హాలమహారాజుమనసు చివుక్కుమని చిన్నబుచ్చుకొనుట సహజమే. ఎంతటి ముద్దుల రాణియైనను తన్నారీతిని బరిహసించినపుడు మహారాజు మనసు ఖేదము నొందక ప్రమోదము నందునా? చివరికి భార్యాభర్తల కలహ మెట్లు పర్యవసించునో యని ప్రజ లాందోళన పడుచుండిరి.

౨

మహారాజు శాతవాహన కులరత్న ప్రదీపము హాలుడైనను నిరక్షరకుక్షి కాడు. బాగుగా చదివిన వాడు, పండితుడు, రసజ్ఞుడు, కవిత్వ తత్త్వవిశారదుడు, మహాకవి. అయితే, అతని దంతయు ప్రాకృత భాషా పాండిత్యము. ఆ మహారాజు చెప్పిన కవన మంతయు ప్రాకృతముననే. కానైతే అతడు వేదమతావలంబకుడే, యజ్ఞ యాగాది వేదచోదిత కర్మానురక్తుడే;

కాని సంస్కృతము కంటెను ఆ మహారాజును ప్రాకృత భాషయొక్క తన ప్రాకృత విలాసమును జూపి యెక్కువగ నాకర్షించినది. చిన్ననాటి నుండియు ప్రాకృతమున పూర్వకవులు రచియించిన గాథలు (పద్యములు) అతని హృదయము నెంతో రంజింప జేసినవి. ఆ మహారాజునకు పూర్వకవుల గాథ లెన్నో కంఠస్థముగ వచ్చును. అత డెప్పుడు నేదో యొకటి చదువుచునే యుండును. అతడు పట్టాభిషిక్తుడై రాజ్యభారమును వహించిన పిదప రాజకార్యపు తొందరలలో గూడ అతని శ్రమ నపనయించి యానందమును హృదయమున నుల్లాసానందములను పల్లవింప జేయునది ప్రాకృత కవిత్వమే; అతడు ముందు మహారసికుడు, రసజ్ఞ శేఖరుడు అయిన కవిరాజు; అటుతరువాతనే అతడు మహారాజు. మహారాజత్వ మతనికి సంప్రదాయానుసారలబ్ధమైన యధికార విభ్రమము; కవిరాజత్వము దైవదత్తమై స్వతస్సిద్ధముగ నలవడిన పుణ్య పరిపాక విశేషము.

హాల మహారాజు రాజధాని ధనకటకమున రాజసభా నికటమున నుండిన విద్యామండపమున ననుదినము విద్యాగోష్ఠి జరుగుచునే యుండెడిది. రసజ్ఞుడును, కవిశేఖరుడును అయిన హాల మహారాజు తాము రచియించిన గాథలు సాదరముగ నాకర్ణించి మెచ్చుకొన్నజాలు తమ కృషి యంతయు సార్థకమైనట్టే, తాము తరించినట్టే యన్న భావనతో అనేక విషయములనుండి, దూరస్థములైన పలు దేశములనుండి జానపదులు, కవులు ధనకటక మహానగరమునకు మహారాజ సందర్శనాపేక్ష నరుదెంచువారు. కవిహృదయము తన కృతులను వినిపించి మెప్పునందుటకు సహృదయుడైన రసజ్ఞమూర్తి కొఱ కెంత తమకపడుచుండునో! కవిచరితార్థత తన కావ్యకన్యకకు దొరకు పాదకట్నమున గాదు; తన కావ్యరసవిశేషము నాస్వాదించి యానందించు రసికవరేణ్యుని యానంద పారవశ్యముననే యున్నది. మహారసజ్ఞశేఖరునికొఱకు మహాకవి యెట్లో మహాకవికొఱకు మహారసజ్ఞశేఖరుడు నట్లే నిత్యము ప్రతీక్షించుచుందురు. శారీరక సౌఖ్యానందమునకు సుదూరమైన, ఐహికవాంఛల కెడమైన, యట్టి నిరతిశయావ్యయానందమే బ్రహ్మానందము. హాల మహారాజ విద్యామండప మిట్టి నిరతిశయానంద సంఫుల్ల మల్లికాశోభాసముదీర్ణమై వెలుగునిగ్గులతో తురంగలించుచుండెడిది. ఆనాడెవనికైనను మహారాజ దర్శనము దుర్లభమేమో కాని ప్రాకృతభాషాకవుల కది సులభాతిసులభము. అట్టివారికి హాలుడు ముంగొంగు బంగారమే. కవియన్నజాలు మహారాజదర్శనమునకును, విద్యామండప ప్రవేశమునకును అడ్డమాకలు లేవు.

ధనకటకము గొప్ప బౌద్ధవిద్యాపీఠమై పాళీ, ప్రాకృతభాషలకు దోహదమిచ్చినది. ఇక నీ హాలమహారాజు కాలమున నది 'ప్రాకృత' విద్యాసస్యమునకు పంటపొలమే. అది సామాన్యపు బంటయా? గ్రీష్మ, వర్ష, హేమంతములు మూడు ఋతువులను ముక్కారు పంట! ధనకటకము కవినవ కటకమే; ఆనా డది ప్రాకృత కవికీరములకు రసాలకల్పభూరుహమయినది. ధనకటకాగతులు కవులు ఇటు కృష్ణవేణ్ణా తరిగి యా పుణ్యతరంగిణిమీద నొకరు, అటు పచ్చని పంట చేలకు బోయి వాటిమీదను, వాటిని కాపుకాయు తెలుగు పడుచులమీదను నొకరు, పైరుచేలలో పవలెల్ల చెమటోర్చి పనిచేసి భావిఫలావాప్తి కమాయకపు టానందముతో నిశ్రేణులు నిర్మించుకొనుచు ప్రక్క పల్లెల నివసించు కర్షక దంపతుల మధురజీవనముమీద నొకరు—ఇట్లొక విషయమేమిటి, వారికంటికి గాన వచ్చిన ప్రతివిషయమును వారి కవితకు వస్తువే యైనది. రస సౌందర్యస్నిగ్ధమై హృదయమును రంజింపజేయ వలెనుగాని కృతి కేవస్తువయిననేమి, రసదృష్టితో జూచువారికి జగమంతయు దివ్యమహాకావ్య సంగ్రథనమే. మానవజీవన మచ్ఛస్వచ్ఛమైన మధురాపగ; దీనినుండి రసార్ద్రములైన కావ్యామృతధారల నుత్పాదించి యెన్నిటినేని వెలయించవచ్చునని గ్రహించిన వారు హాలమహారాజు నాటి ప్రాకృత కవివతంసములు. వారు రచియించిన శృంగారరసాత్మకములైన రసవత్ఖండ కావ్యము లెన్నేని గలవు. శృంగారరసకావ్య లుబ్ధుడు హాలమహారాజు సేకరించి యుంచిన గాథలే కొన్ని వంద లున్నవి. ఒక్కొక గాథ యొక ఖండకావ్యమే. ఆ మహారాజున కీ గాథాసంకలనము ఒక వినోదకేళి

రైనది. మహారాజు తాను కవే; తాను రచియించిన గాథలుకూడ దన యాస్థానమునకు వచ్చు కవివరులకు చదివి వినిపించువాడు. ఒక్కొక్క గాథమీద కొంత కొంత గోష్ఠి జరుగుచుండెడిది. విద్యామండపమున నున్నంతకాలము హాలుడు మహారాజు కాడు. అతడు నొక కవే. అదియంతయు నొక మహాకవిసమాజము, అది యొక బ్రహ్మానందదాయకమైన సాహిత్యగోష్ఠి. అహమహమికలతో కవు లొండొరులకు దమ కావ్యములు వినిపింతురు; అందలి గుణాపగుణములను నిర్భయముగను, నిస్సందేహముగను వెల్లడింతురు; గోష్ఠిలో ఉత్తమములని నిగ్గుదేలిన గాథలను మహారాజునాజ్ఞానుసార మొక లేఖకుడు భూర్జ పత్రముల మీద చిన్నారి చిరుముత్యాలు చుట్టును మెరయు పసిడి గంటముతో వ్రాయుచుండును. ఉత్తమగాథ యని నిర్ణీతమైన యొకదానిని రచియించిన కవిని మహారాజు కార్షాపణములతో, దీనారములతో బహూకరించి సమ్మానించును. మహారాజు రచియించిన గాథ యుత్తమమైన దని నిర్ణీతమయ్యెనా మంగళ తూర్యములు మ్రోగును; కవులందరు లేచి యొక్కుమ్మడిగ "హాల మహారాజు దీర్ఘాయుష్మంతుడై రాజ్య మేలుగాక! కవితాసామ్రాజ్య పట్టభద్రుడై పురందర వైభవముతో వర్ధిల్లుగాక!" అని యాశీర్వదించి యక్షతలు చల్లుదురు.

ఆ హాల మహారాజు కవనమున గల్పించిన యభిరుచివలన నేమో ఆంధ్రదేశము నేటికి నసంఖ్యాకవి కర్షకజనమునకు ఆలవాలమై కవితకు మాగాణి పొలమయినది. పై నుడివిన వడువున హాల మహారాజు తనకు బూర్వముండిన కవులు, తననాటి, తన యాస్థానమునకు వచ్చిన కవులు, తాను రచియించిన గాథలు రమారమి సప్తశత నేరి వాటిని భూర్జ పత్రముల మీద వ్రాయించి గ్రంథస్థము కావించెను. ఈ గ్రంథమునకు సప్తశతి యని పేరు; ప్రాకృతమున దీనిని 'సత్తసయి' అందురు. ఈ గ్రంథ మిప్పటికి నా మహాకవి రసజ్ఞతను బ్రదర్శించు నక్షర రత్నదీపమై వెలుగొందుచున్నది.

కాలము గడచినకొలది హాల మహారాజున కీ కావ్య రసాస్వాదన తృష్ణ యధికమై రాజ్యభారము నంతయు దనకు విశ్వాస పాత్రులైన యమాత్య శిఖామణులు గుణాఢ్య శర్వవర్మలమీద మోపి విద్యా వినోదములలో నిమగ్నుడై తరచుగా విద్యా మండపమునందే కవుల గోష్ఠి నుండువాడు.

సచివోత్తము లిరువురును సంస్కృత, ప్రాకృతములను చక్కగా నభ్యసించినవారు; అయినను గుణాఢ్యునికి ప్రాకృతముమీద నున్న యభిమానము సంస్కృతముమీద లేదు. ప్రధానముగ నతడు ప్రాకృత భాషా విశారదుడు; అతనికి దెలియని 'ప్రాకృత' విద్యా రహస్య మేదియు లేదు. హాలమహారాజు ప్రాకృత భాషాభిమానమునకు చాలవరకు గుణాఢ్యప్రెగ్గడే కారణము. ప్రాతస్సంధ్యా సమయములను, సాయంసమయ వేళలను శ్వేతాశ్వములను బూన్చిన యరదము నెక్కి యువరాజు హాలుడు వాహ్యాళి వెడలునప్పుడు మహారాజునానతిని ఒక్కొక్కప్పుడు గుణాఢ్యప్రెగ్గడ కూడ నరుగుట వాడుక. అట్టి ప్రశాంత సమయముల ప్రాకృత గాథలు వినిపించి గుణాఢ్యుడు వాటిలోని కవితాగుణ విశేషములను యువరాజునకు విశదీకరించి చెప్పువాడు. లేబ్రాయ మేమో, హాలుని కీ రీతిని పిన్ననాటనే ప్రాకృతమున్న నభిరుచి గలిగినది.

గుణాఢ్యునికి ప్రతి శర్వవర్మ. శర్వవర్మకు దేవ భాషమీదనున్న యభిమానము ప్రాకృతము మీద లేదు. ప్రధానముగ నతడు గీర్వాణ విద్యాపారంగతుడు. సచివు లయినప్పటినుండి మహారాజు ప్రాకృత భాషాభిమానము నింకను దోహదముచేయ గుణాఢ్య ప్రెగ్గడయు, మహారాజును దేవభాషాభిమానిగా జేయ శర్వవర్మయు ననేక విధముల బ్రయత్నించుచుండిరి. ఈ ప్రయత్నము గుణాఢ్య ప్రెగ్గడకు సుకరమును, శర్వవర్మకు దుష్కరము నయినది. పట్టాభిషిక్తు డగునాటికే హాలునకు ప్రాకృతము మీది యభిమాన మధికముగ నుండుటచేత గుణాఢ్యుని దోహదము మహారాజు ప్రాకృతభాషాభిమానాంకురము పెరిగి పెద్దదయి మ్రానుకట్టుటకే తోడ్పడినది.

అదియునుగాక సాతవాహన మహారాజాస్థానము ప్రారంభమునుండియు ప్రాకృతభాష నాదరించినది. హాలమహారాజునకు పూర్వులయిన ఆంధ్ర-సాతవాహన భూవరులందరు ప్రాకృతమునే రాజభాషగ వ్యవహరిం

చిరి; రాజ్యవ్యవహారమునకు సంబంధించిన పత్రములన్నియు—అవి దానపత్రములైన నేమి, తదితరములైన నేమి--ప్రాకృతముననే యుండెను. ఆంధ్ర-సాతవాహన నరపతుల కాలమున ఆంధ్ర రాజ్యమున ముమ్మరముగ వ్యాపించిన బౌద్ధమత భాష ప్రాకృతము. ఆంధ్ర దేశమున నాడసంఖ్యాకములుగ వెలసిన బౌద్ధ విహారములలో బౌద్ధ గురువులు విద్యలన్నియు ప్రాకృతముననే బోధించువారు. హాలమహారాజు కూడ తన పూర్వులు పితృపాదుల యడుగుజాడలలో నడచినవాడే కాని క్రొత్తగా ప్రాకృతమును దెచ్చిపెట్టినవాడు కాడు. కాని హాలమహారాజు వేదమతావలంబకుడయినను అతని పూర్వులు అశ్వమేధ అగ్నిష్టోమాది వివిధ యాగములు చేసి వేదవిద్యా సంపన్నుల నాదరించిన వారైనను మహారాజాస్థానమున దేవభాషావిశారదుల కంతకంతకు ఆశ్రయము మృగ్యమగుచున్న దనియు, దేవభాషయెడల ననాదర మధికమగుచున్న దనియు రాజ్యమున గొంతకాలమునుండి యిటీవల గొంత యలజడి రేగుచున్న మాట వాస్తవము.

మహారాజయినను వేదశాస్త్రజ్ఞుల నసలే యాదరింపకపోవుట లేదు; కాని ప్రాకృతభాషా కోవిదుల సంఖ్యతో బోల్చి చూచినపుడు సంస్కృత పండితుల సంఖ్య లవలేశమును గాదని యంగీకరింపక తీరదు. ప్రాకృతభాషా కవులతోపాటు గీర్వాణ పండితులను గూడ పరిసమానముగా నభిమానించి యాదరించుట రాజ్యక్షేమమును ననుసరించి చూచినచో శ్రేయస్కరమే కాదు; అవశ్యక మనికూడ మహామంత్రి శర్వవర్మ మహారాజునకు పెక్కు తడవలు నివేదించెను గాని మహారా జేమి చేయగలడు? ఎంత ప్రయత్నించినను అతనికి సంస్కృతభాష ముక్కు మూలములే తెలియరావయ్యెను; సంస్కృత పండితులకు చేయుచువచ్చిన దాన సత్కార్యములు శర్వవర్మసలహా ననుసరించి చేసినవే కాని వారి పాండిత్య విశేషము నెరిగి చేసినవి కావు. సంస్కృత మా మహారాజునకు కేవలము పరభాషయే యైనది. నూటికి కోటికి ఏ నాలుగు ముక్కలో తక్క సంస్కృతభాషా పండితుల సంభాషణ సుంతయినను ఆ మహారాజునకు బోధపడదయ్యెను. కళాభిజ్ఞుడును, రసజ్ఞుడు నయిన ఆ కవిశేఖరునకు ప్రాకృతకవిత్వ మొసగినంత నిరతిశయానంద సుఖమును ఇతర మేదియు నొసగలేదు. తానతిసుకరముగ సంస్కృతమును నేర్పెదనని శర్వవర్మ ఎన్నిసారులు నివేదించినను మహారా జందుల కంగీకరింపలేదు. కాని శర్వవర్మ తన పట్టు విడువలేదు.

౩

రాణి వేదవల్లి ధనకటకమునకు వచ్చిననాటినుంచి శర్వవర్మ ప్రయత్నమునకు గొంత బలము చేకూరినది. రాణి సంస్కృత విద్యాభిమాని; అంతియకాదు, సంస్కృతమును జక్కగా నభ్యసించిన విదుషీమణి. తన తండ్రిది చిన్న రాజ్యమయినను వేదశాస్త్ర పారంగతులకు ఆశ్రయ మొసగి పేరుగాంచినది. ఆంధ్ర రాజాస్థానమున ప్రాకృత విద్యాగోష్ఠివలెనే యామె పుట్టినింటివారి రాజ్యమున శాస్త్రచర్చ లనేకములు. తన తండ్రి యాస్థానమున నట్టి చర్చలు జరుగునప్పుడు ఆమె తన తండ్రితో గూడ సభామంటపముననే యుండి వాటి నవధరించుచుండెడిది. ఆ చర్చల నవబోధము చేసికొనగల జ్ఞాన మామెకు గలదు. అందువలన నా చర్చలలో నుభయపక్షములవారును వాద ప్రతివాదములలో యుక్తి ప్రత్యుక్తులలో జూపు చాతుర్యమున కక్కజపడుచుండెడిది. ఆమె స్వయముగా శాస్త్రనిర్ణయనము చేయకపోయినను తన తండ్రియాస్థానమున జరుగుచువచ్చిన శాస్త్రచర్చలను వినుచువచ్చినందున ఆమెకు బహు శాస్త్రములను గురించి శ్రుతపాండిత్యము చాల గలదు. ఆమెకు దెలిసిన శాస్త్రవిషయమును నిర్దుష్ట మయినది. సంస్కృత విద్యాగంధ రహితుడైన హాలమహారాజు పాణిగ్రహణమున కామె మొట్టమొదట సమ్మతింపలేదు.

హాలమహారాజున కైనను లీలావతి మొదలైన భార్య లింకను గలరు; కాని వేదవల్లి అసమానలావణ్యరాశి; రూపజితరతీదేవి. వైదేశికు లనేకులవలన ఆమె సౌందర్య విభ్రమవిలాసములను గురించి విని హాలమహారా జామె చెట్ట బట్టనెంచి తన రాజ్యపు సీమావధుల నున్న చిన్న రాజ్యము నేలు నామె తండ్రికి ఆమెను దనకిచ్చి పరిణయము చేయవలసినదని వార్తనంపెను. ఆమె తండ్రి హృదయము వేదనాదోధూయమానమయినది. ఈ సంబంధము తన కూతురి కంగీకారము లేకపోవుటచేత మొట్టమొదట నామె తండ్రియు నందులకు సమ్మతింపలేదు;

కాని, కూతు నిచ్చి పెండ్లి చేయకపోయినచో మహారాజయిన హాలుడు ఎక్కడ దండెత్తివచ్చి తన్ను, తన రాజ్యమును నాశనముచేయునో యన్న భయ మొకటి, తన రాజ్యము గొప్పదయిన ఆంధ్రరాజ్యమునకును, ఇతరములైన పెద్ద రాజ్యములకును నడుమ నుండుటచేత హాలమహారాజుతో సంబంధము గలుపుకొన్నచో పొరుగున నున్న పెద్దరాజ్యములవలని యుపద్రవము రాకుండ అవశ్యకమయినచో నా మహారాజు తనకు దోడ్పడి తన రాజ్యమును గాపాడగలడను నాశ యొకటి—ఇట్టి కారణములు చెప్పి మంత్రు లీ వివాహమునకు సమ్మతింపవలసినదని యొత్తిడిచేసినపిదప నీ యాలోచనలోని సామంజస్యమును యోజించి యా మెతంత్రి తుద కట్టులో దన కూతు నొడంబరిచి యామెను హాలమహారాజున కిచ్చి మహావైభవముతో వివాహముకావించెను; అప్పటినుండి యామె హాలునికి మురిపెములు మూటగట్టు ముద్దులరాణి యైనది.

తన రాణు లందరిలో హాల మహారా జామె కిచ్చిన చన వధికము. ఆమె ధనకటకమునకు వచ్చిన నాటినుండి సంస్కృత భాషా విషయమున దంపతు లుభయులకు నేకాంతమున వాదోపవాదములు జరగుచునే యుండెడివి. హాలుడామెకు తన గాథాసప్తశతిని విప్పి కొన్ని గాథలు వినిపించి రాణిని ప్రాకృత భాషానురక్త జేయుటకు తాపత్రయ పడుచుండెను; ఆ విధముననే రాణియు సంస్కృత విద్యావైభవము నభివర్ణించి ఆ మహారాజును సంస్కృత భాషాభిమానిగ జేయ బ్రయత్నించు చుండెను. చివరి కుభయు లును తీవ్రముగ వాదింతురు; ఉద్రిక్త హృదయు లగుదురు; మొగములు చిట్లించుకొని చిడుముడి పాటుతో, విసుగుదలతో నుభయులు నున్నచోటున నుండి వెడలిపోవుదురు. ఇటీవల నుభయులకు నిట్టి వాదప్రతివాదములు తరచయినవి; కాని విచిత్ర మేమన, నుభయులకు నొండొరుల మీద గల యనురాగ మొక్కవాసియు దరుగలేదు; పరికదా - వారి ప్రేమానురాగములు దినదినాభివృద్ధి నందుచునే యుండెను. వా రొకరి నొకరు విడిచి చాలకాల ముండలేరు; పరస్పరము గలసికొన్నప్పుడు వాదింపక యూరకుండలేరు. వారిది విచిత్ర ప్రవృత్తి యైనది.

రాణి వేదవల్లి ధనకటకమునకు వచ్చిన నాటి నుండి ఆంధ్ర రాజాస్థానమున కరుదెంచు సంస్కృత పండితుల సంఖ్య యేకారణముననో పూర్వమున కంటె నించుక వృద్ధియైనది. మహారాజ దర్శనము గావించు కొన్న సంస్కృత విద్యార్థికులు రాణి దర్శనము చేయక వెడలువారు కారు. మహారాజు వలన నల్ప సత్కారము నంది యసంతృప్తి గన్నవారు రాణిని సందర్శించి సంతృప్తులై వెడలిపోవుచుండిరి. ఇది శర్వవర్మ కొక విధమయిన సంతృప్తిని గలిగించినను గుణాఢ్యునికి మాత్ర మసూయాజనకముగనే యుండెను.

రాణిని విమర్శించు జనమే శర్వవర్మ పైనికూడ దోషారోపణమునకు దొరకొనిరి. ఎట్లు పుట్టినదో చెప్పలేము కాని శర్వవర్మ మీద గూడ గొంత ప్రవాదము పడకపోలేదు. శర్వవర్మ బాసట లేక రాణి యంతటి సాహసముతోనే కాంత ముని జలకేళి సవరించునప్పు డైనను మహారాజు నట్లు పరిహసింపగలదా? ఇందెంతో కొంత శర్వవర్మకుగూడ జోక్య ముండియుండవలెనని ప్రజ లచ్చటచ్చట నూహింప జొచ్చిరి; కాని రాణిచర్య శర్వవర్మకే ఖేదము కలిగించినదని వా రెరుగరు. కాని యతడేమి చేయగలడు? ప్రజలు తన్నుగురించి యాడుకొను మాటలుకూడ శర్వవర్మ యెరుగకపోలేదు. తాను సంస్కృత భాషాభిమాని యగుటచేత జరిగిన విషయ మెంతదూరమైన బోవుటకును, ఎట్టి విషఫలితములనైన సంఘటింప జేయుటకును అవకాశము కలదని యాతడు బాగుగ నెఱుగును. అందువలన జలక్రీడానంతర రాణి వాసవిశేషములను, మహారాజుచిత్తవృత్తిని దెలిసికొనుట కాతడు ప్రయత్నించుచుండెను.

౪

రాణి చేసిన పరిహాసము వాడి ములుకువలె హృదయమునకు గ్రుచ్చుకొని హాలమహారాజును బాధించినది; కాని ధైర్యముతో నా బాధ సహించి మహారాజు రాణితో నప్పటి కేవియో సరసాలాపము లాడి సంభాషణను మార్చి యేమియు జరుగనట్లు లుచితరీతిని నటించెను. రాణి పరేంగిత జ్ఞానకుశలయే యైనను ఇప్పటున మాత్రము మహారాజు హృదయవేదనను పొడకట్ట లేకపోయెను. మహారా జంత చతురముగ ప్రవర్తించెను,

జలక్రీడానంతరము మహారాజు రాచనగరికి విచ్చేసి తన యేకాంతమందిరమున కరిగెను. అతని మనస్సునకు కుదురన్నది లేకపోయినది. అతడు మరల మరల నా పరిహాసవాక్యములే తలచుకొనును; ఇంతలో రాణి మీద కోపము వచ్చును. తప్పెవరిదని యాలోచనా నిమగ్నుడగును. రాణి దోషి కాదు: తప్పంతయు తనదే; తనమీద నామెకు ప్రేమ; చనవుకొలది నామె తన్నట్లు ఎకసక్కెమాడినది. నిజముగా దేవభాష తెలియని తప్పు తనది; ఆ సంభాషణము హృదయశల్యమగుట యేల? ఉన్నమాట కులుకెందుకు? ఏవో రకరకముల యాలోచనములు- ప్రశ్నలు నతడే వేసికొనును; సమాధానములు నతడే చెప్పుకొనును. వాదియు నతడే, ప్రతివాదియు నతడే; నేరారోపకుడు నతడే, దోష సమర్థకుడు నతడే. మొత్తము మీద అతనికి జలక్రీడనాటిరాత్రి నిద్ర సరిగా పట్టలేదు. మనస్సునకు స్తిమితము లేదు. రాత్రి యంతయు నీ భావలను గురించిన యాలోచనయే.

ఆ మరునాడుదయమున కాల్యకృత్యములు నిర్వర్తించుకొని పెందలకడనే తన రహస్యాలోచన మందిరమున కరిగెను. తన యమాత్యులు గుణాఢ్య ప్రెగ్గడ, శర్వవర్మల కుభయులకు వార్త నంపెను. అనతికాలముననే మంత్రు లిరువురు వచ్చి మహారాజు ననుజ్ఞ పొంది తమ యాసనముల నుపవిష్టులైరి. మహారా జేమి వచించునో యని మంత్రివరు లుభయులును మహారాజు వైపు నిరీక్షించుచుండిరి. –

హాలమహారాజు కడచిన దినమున జరిగిన సంఘటన ప్రస్తావమే చేయలేదు. “ఇంతటినుండి సంస్కృత విద్యనుగూడ నేర్చి యందలి విశేషములను దెలిసికొను కుతూహలము గలిగినది. భారతభూమికి సంస్కృత ప్రాకృతములు రెండు చక్షువులు; వీటిలో నేది కొఱవడినను దృష్టికి లోపమే; మా యమాత్యు లీ విషయమును జాలకాలమునుండి యెఱిగించుచున్నను నేటికి గాని యది మా చిత్తమునకు రాలేదు. వేదవిజ్ఞాన వల్లరి కొనలుసాగి నవలెత్తినది సంస్కృతమునే. వేదకర్మ ప్రవృత్తుడనైన నాకు సంస్కృతము రాకపోవుట గొప్ప లోపమని నాకు నేటికి దెలిసినది. ప్రాకృతమునెడల ఎంత యాదరాభిమానము లున్నను సంస్కృతమును నిరాదరింప నక్కరలేదు. ప్రాకృత కవితారసాస్వాదమునకు సంస్కృతి మడ్డురాదు. ప్రాకృతమును భూషించుటకు సంస్కృతమును దూషించ నక్కరలేదు. ధర్మసేతాధిష్ఠితుడను నా కుభయభాషలును సమానాదరణీయములే. సంస్కృతమున నన్ను మీ రెంతకాలమున బండితుని గావింపగలరు? నేర్చుట కది కష్టమైన భాష యని విందును. దాని నెంతకాలమున నేర్వవచ్చును” అని మహారాజు తన సచివులను ప్రశ్నించెను.

మహారాజువాక్యములు శర్వవర్మకు కప్పుపోత మానము లయినవి. మహారాజు చెప్పు విషయములను తన వీనుకేరలతో జాగ్రుచుండెను. ఆ మాటలన్నియు తనవే, వెనుక దాను మహారాజుతో వచించుచు వచ్చినవే; క్రొత్తవి కావు; కాని ఈ నూతన పరిస్థితిలో మహారాజునకే విషయము తెలియలేదు. అవి యన్నియు తన భావములేయని భ్రమించెను. శర్వవర్మ యుపదేశము మహారాజునకు తెలియకుండగనే అతని మనసున జొచ్చి యట్టి భ్రమ కలుగజేసినది. శర్వవర్మ కృషి ఒక్కనాటిది కాదు; వీలు చూచి సమయము చిక్కినప్పుడెల్ల నట్టి యుపదేశమును మహారాజునకు జేయుచునేయుండెను. ఆ మంత్రి సత్తముని చిరకాలపు కృషి నేటికి ఫలించినది. సంస్కృతము నేర్చినచో మహారాజు ప్రాకృత కవితాధిక్యము నొకరు చెప్పనక్కరలేకనే గ్రహింపగల డిదియు మేలే యని గుణాఢ్యమంత్రి తన్నుదా నాశ్వాసించుకొనెను.

“మహారాజా! మీ రన్నట్లు సంస్కృతము నేర్చుకొనుటకు కొంచెము కష్టమయిన భాషయే. అయిన నేమి, నేర్చుకొనవలయునని వజ్రసంకల్పమున్నచో నవలీలగ నేర్వవచ్చును. సంస్కృతమున బండితు డగుటకు ఆరు సంవత్సరములు చాలు” అని గుణాఢ్యుడు వచించెను.

గుణాఢ్యుని మాటల కడ్డుతగిలి “మహారాజా, సంస్కృతము నేర్చుకొనవలెనను వజ్రసంకల్పమే యున్నచో నారు సంవత్సరము లక్కఱలేదు, ఆఱు మాసములు చాలును. సంస్కృతమంత సులువైన భాషయే లేదు. దాని సులువుబరువులు దానిని నేర్పు

గురువులో నున్నది కాని అసలు భాషలో లేవు" అని శర్వవర్మ వక్కాణించెను.

దానిమీద సంస్కృతభాష నేర్పుటలోను, నేర్పుటలోను గల కష్టసుఖములను గురించి గుణాఢ్య ప్రెగ్గడ శర్వవర్మ లుభయులకును గొప్ప వాగ్వాదము జరిగినది. సంస్కృతమును నేర్పుట, నేర్పుట సులువని శర్వవర్మ, కష్టమని గుణాఢ్య ప్రెగ్గడ. చివరి కీ యుభయుల వాదము ముదిరి పాకమున బడినది. మహారాజును తా నాఱుమాసములలో సంస్కృతమున బండితుని చేయుదునని శర్వవర్మ మరల నుటంకించెను. ఆ విధముగా నాఱు మాసములలో బండితుని గావించినచో తానికమీద సంస్కృతమును గాని, ప్రాకృతమునుగాని, తుదకు దన స్వభాషనుగాని వాడక తాను వాగ్బంధము గావించుకొని మూగియై యుండెదనని గుణాఢ్యప్రెగ్గడ ఘోరమైన ప్రతిన చేసెను. ఆ ప్రతిన నాలకించి హాల నృపోత్తముడు నిర్విణ్ణుడయ్యెను. అంతటి ఘోర ప్రతిజ్ఞ వలదని మహారాజు గుణాఢ్యుని వారించెను. కాని అతడు వినుతీయలేదు. తా నాడున దొకటి, చేయున దొకటి కాదని అతడు మహారాజునకు విన్నవించెను. "మహారాజును సంస్కృతమున బండితుని గావించుట కాఱుమాసములు చాలును; నాకు పలుకు పంతము లొక్కటియే. నాబాసకు తిరుబాస లేదని శర్వవర్మ ఘోషించెను. అట్లు చేయలేనిచో మరణమే దండనమని మహారాజు గర్జించెను.

అంతటితో నాసభ ముగిసినది. నాడుమొదలు హాలుడు మరల విద్యార్థి యయ్యెను; శర్వవర్మ యాచార్యుడయ్యెను.

జరిగిన యుదంతమంతయు జనులకు దెలిసి వారు భయవిస్మయపరీతచేతస్కు లయిరి. శర్వవర్మపంతము నెగ్గవలెనని రాణి వాణి నుపాసింప దొడగినది. ఆంధ్ర రాజ్యమంతయు నీ పాడిపంతముల వార్త విని కళవళించిపోయినది. గుణాఢ్యప్రెగ్గడగెలుపు శర్వవర్మకు ప్రాణసంకటము; సంస్కృతమునకు వినాశనము; శర్వవర్మ విజయము గుణాఢ్యునికి పదవీభ్రష్టత; ప్రాకృతమునకుగూడ వినాశకరమా?

౫

ఎంత, ఆఱు నెలలు నిట్టె గ్రుగున తిరిగిపోయినవి. హాలమహారాజు ఆఱునెలల యనంతరము మహాసభ గావించెను. దేశదేశములనుండి ప్రాకృతభాషలోను, సంస్కృతభాషలోను గొప్పవిద్వాంసులైనవారు సభ కరుదెంచిరి. గుణాఢ్య శర్వవర్మలు మహారాజ సింహపీఠి కిరుప్రక్కల నుచితాసనముల నధివసించిరి. హాల మహారాజు దేవేరులకుగూడ ఆ సభామండపమున నుచిత స్థలముల నాసనము లేర్పాటుచేయబడినవి. ఆనాడు గీర్వాణభాషాపండితులు, కవులు తమ విద్యాప్రావీణ్యమును జూపుట కనుమతి యీయబడినది. హాలమహారాజే పరీక్షకుడు. అ దొక విచిత్రమైన పరీక్ష. శర్వవర్మ యాచార్యత్వమున మహారా జీయాఱు నెలలలో సంస్కృతమున నెంతటి పాండిత్యమును సంపాదించె నన్న విషయమును బరీక్షించుటకే నిజముగా నీసభ ఏర్పాటయినది. పరీక్షలో మహారాజు నెగ్గకపోయినచో నోటమి యాతనిది కాదు, శర్వవర్మది; పరీక్షలో మహారాజు గెలిచినచో గెలుపుకు అతనికి బహూకరణము లేదు; కాని గుణాఢ్యునికి శృంగభంగము: అవమానితు డతడు; ప్రతిజ్ఞ నిర్వహించవలసిన దతడు. సదస్యులు పరీక్షకులు, ధర్మనిర్ణేతలు. ఫలిత మేవిధముగ నుండునో, శర్వవర్మగుణాఢ్యులలో నెవరు గెలుతురో యని సభ యంతయు నుత్కంఠతో నున్నది. ఎల్లరకును గుండెలు దడదడ కొట్టుకొనుచున్నవి. నిశ్చల చిత్తులై కూర్చున్నారు గుణాఢ్య, శర్వవర్మలు.

భరతవిద్యాప్రవీణరైన యొక కోమలాంగి పుష్పాంజలి విక్షేపము గావించి 'కైవారపదానుసారకమనీయముగా' ప్రావేశికధ్రువాగానము పచరించి, ఆ వెనుక దేశిమార్గభేదంబుల లాస్యతాండవంబులు ప్రస్తరించి నాట్యరసాస్వోద్ఘాటనము చేసి, కడపట హాల మహారాజునకు పసిడిపళ్లెరమున అనర్ఘరత్నదీపమహానీరాజన మిచ్చి, మహారాజునాట్యవిశేషమునకు మెచ్చి యిచ్చిన ముత్యాలహారము నవనతవదనయై కానుకగా బడసి, విద్యుల్లతికవలె కొలువుకూటమున నుండి యంతర్హితయయ్యెను.

ఆ వెనుక సభ నలంకరించిన గీర్వాణ విద్వచ్ఛ్రే ష్ఠులు లేచి నిలబడి ఋగ్వేదమంత్రములతో ఇంద్రా వరుణులను, ఆదిత్య చంద్రములను, ద్యావా పృథ్వు లను సంప్రార్థించి, పిదప సామగానము చేసి హాలమహా రాజు నాశీర్వదించి రక్తపుష్పయుక్త హరిద్రాక్షతలను జల్లి తమ యాసనముల నుపవిష్టులైరి. అటుతరువాత ప్రజ్ఞానిధులైన పండితులును, కవులును సంస్కృతము నను, ప్రాకృతమునను ఆసువుగా చెప్పిన గద్యపద్యకావ్య ముల హాలమహారాజ గుణగణముల నభివర్ణించిరి. అంతట నా గద్యపద్యములందలి గుణాలంకార విశేషములను గుఱించియు, వాటి ప్రాశస్త్యమును గురించియు ప్రమో దావహమైన గోష్ఠి జరిగినది. రసజ్ఞశేఖరుడైన హాల మహారాజు ప్రాకృతమునసే కాక సంస్కృతమునగూడ సంభాషించుచు వాగ్గోష్ఠిలో నెక్కువగా పాల్గొనెను. ఆమహారాజు గీర్వాణభాషా నైపుణ్యమునకు సభాసదులు ముగ్ధులైరి. శర్వవర్మముఖము వికసించెను; గుణాఢ్యుని వదనము ముకుళితమయినది.

మూస పట్టములో మహారాజును గీర్వాణ విద్వాంసునిగ జేసిన మహామంత్రి శర్వవర్మ ప్రజ్ఞాశ్వర్యత కక్కజపడినవారే ఎల్లరును; అంత స్వల్పవ్యవధిలో మహా రాజు నెట్లు మహాపండితుని చేయగలిగెనని ఎల్లరును విస్మయపడువారే. షణ్ముఖోపాసకుడు శర్వవర్మ, ఆ మహాస్వామియనుగ్రహము వడసి కాతంత్రవ్యాకరణము రచియించి తన్మూలమున మహామంత్రి పంతముసాధించె నని యామహాసభలో రహస్య మొకోటి యొండొ యాచెవి కిని, ఆ చెవినుండి యాచెవికిని ప్రాకినది. ఉపాసనా బలమువలన గాకపోయినచో మహాసముద్రమంత భాష్యే మిటి, అంతటి యవలీలగ సాధ్యముగు టేమిటి అని సభ లోగొంతున గుసగుసలాడినది.

ఇం దెంతవరకు సత్యమున్నదో మనకు దెలియదు కాని శర్వవర్మవిరచితమైన కాతంత్ర వ్యాకరణ మిప్ప టికి నున్నది. ఆనాటి కది 'యభినవ లఘువ్యాకరణ' మట. ఈ కాతంత్రము చాల ప్రసిద్ధికెక్కిన గ్రంథము. అంతకు పూర్వముండిన సంస్కృత వ్యాకరణము లిది వచ్చిన వెనుక వెనుకబడిపోయినవని ప్రతీతి. నేటికిని తూర్పు బంగాళ దేశమునందును, కాశ్మీర దేశమునను ఈ కాతంత్రవ్యాకరణమునకు ప్రచారము కలదు. నాడు ఉత్తరాదిశాస్త్రులలో ప్రచారమున నుండిన ఇంద్రవ్యాక రణము ననుసరించి శర్వవర్మ ఈ కాతంత్రమును రచి యించెనని చెప్పుదురు. సంస్కృత వ్యాకరణ సంప్ర దాయములలో ఈ కాతంత్ర సంప్రదాయ మంధ్ర దేశ మునసే రూపొంది హాలుని నాటినుండి భారతఖండమున పరివ్యాప్తమైన దనుటలో భేదాభిప్రాయములు లేవు.

శర్వవర్మయుపదేశ మక్కఱలేకయే హాల సాత వాహన నృపాలుడు తన యాస్థానమునకు వచ్చిన గీర్వాణభాషా కవి పండితులకు వారి వారి సామర్థ్య నైపుణ్యములకు దగినట్లు సముచితరీతిని సన్మానించెను. కట్టకడపట నాతడు తన కాచార్యుడైన శర్వవర్మకు గూడ గజతురగ రత్నాంబరాభరణాదులను గురు దక్షి ణగ నొసగి సత్కరించి యుత్తరీయమును నడుమునకు చుట్టుకొని పాదాభివందన మాచరించెను. సదస్యులు జయఘోషతో మహారాజువినమ్రతను, గురుభక్తిని గొనియాడి సేసలు చల్లిరి. జయజయ వర్ధస్వ, శతాయు ష్మాన్ భవ, దీర్ఘాయుష్మాన్ భవ అను ఆశీర్వాక్యములు దిగంతముల మారుమ్రోగినవి. రాణీ వేదవల్లి యానంద మునకు మేరలేదు. సంస్కృతభాషావభిజ్ఞతా కళంక దూరుడై హాలమహారాజచంద్రుడు గీర్వాణులకు శివం కరుడయ్యెను. ఆ నాటి మహాసభ పంచమహా వాద్య ముల మంగళ ఘోషముతో సదస్యుల ఆశీర్వచన ప్రశం సలతో ముగిసినది. అది సంస్కృతభాషా యోషా కఖండ విజయము. ప్రాకృతభాషాసుందరికో?

ఆమహావిజయోత్సవ ముహూర్తమునసే యారం భము గుణాఢ్యపెగ్గడ మౌనవ్రతప్రతిజ్ఞా పరిపాలనము. ఇక నాతనికి తావెక్కడ?

౬

విజయోత్సవమునాటి రాత్రి గుణాఢ్యపెగ్గడను గుఱించి యనుకొన్నవారే లేరు. అతనినిగురించి విచా రించినవారే, లేరు. పౌరుల యానందపారవశ్యపు మైకము సాయంసమయ ప్రతీచీదిశా శోభవలె దిగజారి వారికి క్రమముగా జాగృతి కలిగినది. ఇక నామరునాడు—

ఇరువురు తారసిల్లిన జాలు గుణాఢ్య ప్రెగ్గడ ప్రస్తావమే. అతని ధనికత్వము, అతని రాజాశ్రయము, అతని యునికి, అతని మనికి అంతయు నొక పెద్ద ప్రశ్నార్థకము. అతని దౌట్టమితో జనసామాన్యపు సానుభూతియంతయు నతనివైపు మొగ్గినది. కాని సామాన్య జనము మాత్ర మేమి చేయగలదు? ఎక్కడ, గుణాఢ్య ప్రెగ్గడ ఎక్కడ? అతడు నివసించుచుండిన లోగిలి ఎక్కడ యని ప్రతిధ్వనించినది. అతడున్న బ్రాహ్మణ వాడ ఎక్కడ గుణాఢ్యప్రెగ్గడ యని మారుమ్రోగినది. రాజధానీనగరమంతటను ఇదే ప్రతిధ్వని. ఏదీ? లేడు. గుణాఢ్యప్రెగ్గడ కిక నగరములో తావేది? అతడు నగరములో లేడు.

దినములు గడచినవి, పక్షము లరిగినవి, మాసములు గతించినవి, సంవత్సరములు గడచిపోయినవి. కాలచక్ర మెంత వడివడిగా నెంతదూరము దొర్లిపోయినదో—ఇప్పుడు ధనకటక మహానగరమున గుణాఢ్య ప్రెగ్గడ విషయము స్మరించువారే లేరు. అటువంటి వ్యక్తి యొకప్పు డుండెనన్న గుర్తే లేదు. అతడు లేని లోపమే కానరాదు. అతడు లేకున్నమాట కాని, ప్రపంచవృత్తి యెప్పటియట్ల గడచిపోవుచున్నది. హాల రాజాస్థానమున సంస్కృతమున కిప్పుడు ప్రాకృతముతో సమానగౌరవాదరములు. క్రమముగా సంస్కృతకవిపండితసమాజము ప్రబలినది; సంస్కృతవాదులదే ఇప్పుడు పైచేయి; సంస్కృతమునకే పట్టాభిషిక్తత. ఒకప్పుడు మహారాజు ప్రాకృతభాషైకజీవి. ఇప్పుడాతడు అధికముగా సంస్కృత కావ్య వినోది. ప్రాకృత కవుల రాకవలనే మహారాజాస్థానమున ప్రాకృత కవితాగోష్ఠియు నల్పస్వల్పమయినది. ఎంతటి మార్పు! ఈ మార్పుతో హాలుడు బ్రహ్మణ్యు డయినాడు; ఆంధ్రాపథము బ్రహ్మావర్త మయినది. ధనకటకము చతుర్వేదపారగులును, షడ్దర్శనాది విద్యా విశేషజ్ఞులును, షట్కర్మనిరతులును అయిన యాతాయాత భూసురవ్రాతమునకు ధర్మపథ మయినది. వివిధ శిల్ప చిత్రాలంకార శోభితములైన చైత్యములతో చిహ్నిత మయిన కృష్ణవేణ్ణా నదీతీరము యాగశాలలతోను, యూపస్తంభములతోను అలంకృత మైనది. బౌద్ధుల ప్రాభవము చెన్నుమారుట కదే మొదలు; ప్రాకృత భాషా సుందరి జీవన పథము కంటకావృత మగుటకును అదే మొదలు. ఎంతటి మార్పు! ఆంధ్రలోకము నెఱుక లేకయే వచ్చిన మహాపరివర్తన మది. సాజముగనే వచ్చిన ట్లనిపించిన పరివర్తనము. గుణాఢ్యప్రెగ్గడమాట ఇప్పు డెవ్వరికిని స్మృతిపథమున లేదు; క్షీర నీరముల వలె గలసి మెలసియుండిన హాలమహారాజునకే గుణాఢ్య ప్రెగ్గడవిషయము ఇప్పుడు జ్ఞాపకము లేదు.

౨

గ్రీష్మమును వర్షము, వర్షమును హేమంతము-ఇట్లు ఋతువు లొకదాని నొకటి వెంబడించి తరుముచు చక్రభ్రమణవిధానము ననుసరించి ఎన్నితడవలో గిఱ్ఱున తిరిగిపోయినవి. హేమంతము మరిగి మరల గ్రీష్మము ప్రారంభ మైనది. ఎవరో ఏదో చదువుచుండ వన్యమృగములు మేతమేయుట మాని యచ్చట గుమిగూడి ఆ చదువునది ఏకాగ్రముగా నాలకించుచున్నవనియు, తాను చదివిన యొక్కొక్క యాకును ఆ పాఠకుడు అగ్నిలో బడవేసి తగులబెట్టుచుండెననియు నగరమునకు చారపప్పు, వెదురుబియ్యము, పుట్టతేనె మొదలైన అడవిని దొరకు వస్తువులను విక్రయమునకు దీసికొని వచ్చు కోడు, కోయ, చెంచు జనము విడ్డూరముగా చెప్పుచుండిరి. ఈ వార్త నగరమంతట బ్రాకినది. ఎల్లరు నిది విని యాశ్చర్యచకితులగువారే. వన్యమృగములకుగూడ రసగ్రహణశక్తి కలదా? గాలి మేపరికి గానరసమును గ్రహింపగల శక్తి యున్నపుడు అట్టిశక్తి జంతువుల కెందు కుండగూడదు? జంతువులకేమి, పురాణశ్రవణ కుతూహల మేమి? జంతుజాలమునుగూడ అంతటి రసపిపాస నుద్దీపింపజేసిన దట్టి గొప్పగ్రంథమో? అట్టి గ్రంథము నగ్నిలో పతనము చేయుట యేమి? పఠించిన వెనుక ఆ గ్రంథపత్రములను తగులబెట్టుట యేమి? ఎవరు పఠించువారు? గ్రంథమును రచించినవా రెవరు? ఆ గ్రంథ మేమి? గ్రంథము నగ్నిహోత్రము పాలు సేయుటకా రచించినది? అన్నియు సందేహములే; అంతయు విచిత్రమే.

ఈ విచిత్రవృత్తాంతము రాజప్రాసాదమునకూడ త్రోవచేసికొనినది; మహారాజు హాలునకుకూడ తెలిసినది. ఒకపట్టున మహారాజు దీనిని విశ్వసింపలేకపోయెను. నగరమునకువచ్చు నాటవికజనులను బిలువనంపించెను. స్వయముగ ఈ యుదంతము వారివలన తెలిసికొనెను, అంతయు నిజమే. ఇది యథార్థమని వారు మరల వక్కాణించిరి. విస్మయచకితుడైన మహారాజు ఈ విచిత్ర మేదో కనుగొనవలెనని ఆ వనచరులు త్రోవ చూప వింధ్యాటవి కరిగెను.

ఆ ప్రాంతమున కదివఱ కెన్నడు హాలమహారాజు రాలేదు; అక్కడ ఒక తెగ జనులు నివసించుచుండిరి. వారు మాటాడు భాష విచిత్రమైనది. హాలమహారాజున కది ప్రాకృతమువలె తోచినది; తా నెఱిగిన ప్రాకృతమునకు సన్నిహితమైనది. ఆ జనుల వన్నియు పైశాచికకృత్యములే. నవ్విన విరగబడి వా రొకచో నవ్వెదరు; వారి శోకము నంతియే. కోపము వచ్చిన వారి కంతయు క్రౌర్యమే. వారి యురుకు వారి చురుకు, వారి చేత వారి వ్రేత—అన్నియు విచిత్రములే, వికృతములే. అది మహారాజునకు పిశాచదేశ మనిపించినది. వారి భాష—పిశాచభాష—ఒక విధమైన ప్రాకృతమా? ఎంతకాలముక్రిందటనో మఱిగిపోయిన ప్రాకృతభాషాస్మృతులు మహారాజు మనసులో మరల మోసులెత్తినవి. ప్రాకృతభాషామాధుర్యము మరల పరిమళించినది; తద్భాషాపరిమళవిలోలములైనవి జిహ్వాశ్రవణేంద్రియములు. సమీపమున ఆ పర్ణకుటీరముముందు ఎండుటాకులు, చితుకులు, కట్టెలు మండి భగ్గరని జ్వాలలు వినువీథి కెగ్రాకుట మహారాజు చూచెను. శ్రవణపేయముగ వినబడుచున్నది ప్రాకృతగ్రంథపఠనము. ఎన్నాళ్ల కెన్నాళ్లకు వినబడినది ప్రాకృతము! హాలమహారాజులోని ప్రాకృతకవితారసజ్ఞత మరల నింతకాలమునకు మరొకమారు ప్రోత్సారితమైనది. ఎంత సొంపయిన రచన! ఎంత చక్కని కథాసంవిధానము! ఏమి టా గ్రంథము! ఎవ రా ప్రాకృతగ్రంథపాఠకుడు? సుపరిచితమైన దా కంఠస్వరము! హాలు డాకంఠస్వరమును గుర్తింప ప్రయత్నించెను. ఆలోచనలో అతని యడుగులకు మాంద్యము కలిగినది. చూచుచుండ మరల నొకమారు భగ్గుభగ్గుమని పైకెగసినది ఆమంట. చదివిన భూర్జపత్రము లగ్నిలో ఆహుతియైనవి. అదే యామంట పైకెగయుటకు కారణము.

హాలమహారాజుహృదయమున ప్రాకృతకవితాభిమానము మరల జాగరితమైనది. ఎందు కావిధమున ఆపత్రములు నిప్పులో వేసి బూదిసేయుట? ఎవ రాతడు? మహారాజుదగ్గర కరిగెను.

"వద్దువద్దు, తగులబెట్టవద్దు—ఎవరది? గుణాఢ్యులే, మా గుణాఢ్యులే!—తగులబెట్టకు తగులబెట్టకు గుణాఢ్యా! ఎంతటి హృదయంగమమైన కథ! ఏమిటది-అట్లు తగులబెట్టుచున్నావు?—" మహారాజ హృదయము శోకముచేత ఉద్రిక్తమయినది.

"మహారాజా! తమకు దయలేకపోయినది, ప్రాకృతభాషాభిమానులు, ప్రాకృత కవితారసజ్ఞులు మీరు ఆదరింపకపోరని రసవత్తమమైన ఈ బృహత్కథాకావ్యమును కొంతకాలముక్రిందట నాశిష్యుల కిచ్చి తమ సన్నిధికి బంపుకొన్నాను. నా దురదృష్టము కాక మరేమి మహారాజా! భాష మొరటుగా నున్నదని చెప్పి తమరు దానిని నిరసించి, స్వీకరించి యాదరింప దిరస్కరించినారట. మౌనవ్రత మవలంబించి తమ రాజ్యమును వదలి ఈ వింధ్యాటవులకు వచ్చి పిశాచభాష నేర్చి, తాను వరరుచిగురుపాదులవలన విన్న యద్భుతకథను పిశాచికాణభూతి నాకు వినిపింపగా ఆ కథాసంవిధానమునకు పరమాశ్చర్యము నొంది దానిని డెబ్బదిలక్షల గాథల గ్రంథముగా భూర్జపత్రములమీద నా రక్తముతో విలిఖించి తమకడకు పంపినాను. రసజ్ఞశేఖరులు తమరే దీనిని తిరస్కరించినప్పు డిక దీని నాదరించువా రెవరని నిర్వేదము నొంది, ఒకమారు చదువుకొని ఒక్కొకటియే తగులబెట్టుచున్నాను." అని గుణాఢ్యుడు బాష్పపూరితనేత్రుడై వచించెను.

కొంతకాలముక్రిందట తన యాస్థానమున కిరువురు బ్రాహ్మణబాలకులు వచ్చుట, ఇటువంటి గ్రంథ మేదో చదువుట హాలమహారాజు జ్ఞప్తి కెలయించు

కొని చాల వ్యసనముచెందెను. అప్పటికే అంతటి యద్భుతగ్రంథము బృహత్కథలోని ఆఱుభాగము లగ్నిపాలయి ఖిలమైనందుకు వగచి యా మహారాజు నరవాహనదత్తుని కథగల యేడవభాగముమాత్రము సంరక్షించి దాని కొక టీక వ్రాసి ప్రకటితముచేసెను.

హాలుడు గుణాఢ్యుని దన యాస్థానమునకు రావలసినదని సాదరముగ నాహ్వానించెనుగాని తన జీవితావశేషము నిక తపస్సున గడపనెంచి అత డందుకు సమ్మతింపలేదు. హాలమహారా జందుకు విచారింపగా "అంతయు దైవప్రేరితము, బృహత్కథాగ్రంథ మీమాత్రమైనను లోకమున ప్రవర్తితము కావలెనని అన్నియు నీరీతిని జరిగినట్లున్నవి. దేని కేది మూలమో, దేని కేది ఫలమో అల్పజ్ఞులము మన కేమి తెలియును ? విచారింపకుము. అంతయు దైవనిర్ణయము" అని గుణాఢ్యుడు మహారాజును సమాశ్వాసించెను.



పిల్లలను కూర్చోపెట్టడానికి ఎత్తుకుర్చీగానూ, అవసరమైనప్పుడు ఇస్త్రీబల్లగానూ మార్చడానికి వీలైన ఒక క్రొత్త పరికరం.

సంప్రశ్నము

"ప్రో. శా."

పంపాతీరవిశిష్టశాంతపరిశుభ్రత్యాగవైరాగ్యమై
సంపాదించిన వైభవమ్మును కళాసంపత్తులో జొన్పి నై
లింపస్వామిత కెక్కిపోయిన ప్రజాళిన్ నేటి చిత్రాలు భా
వింపన్ లేవు మహోద్యమస్ఫురణకే వేళావిహీనమ్ములై.

కాలము మీరి ధాన్యకటకమ్మున బౌద్ధము చచ్చిపోవునా
డేలిన శిల్పచాతురి, వహించిన ఆర్యగుణమ్ము దేశదే
శాలకు పూజ్యమౌచు మనసా వరవళ్ళను దిద్దెకాదొ! ఆ
కాలము పోయినా గుణవికాసము గూడ నశించు టొప్పునా?

నెత్తుకు వేడిగా యుబుక నేర్చిన పిన్నతనమ్ములోననే
కత్తిని బట్టి కాసె పెడగా బిగియించి అపూర్వసత్య ధ
ర్మాత్మప్రభుత్వమున్ నడుపనోపిన రుద్రమదేవినాటి లో
కోత్తమవీరజీవితమహోదయ మొక్కటి జ్ఞప్తి యున్నదా?

నాయకురాలి దర్పమున నాశనమైన మహోగ్రవీర జా
తీయ పరంపరాభ్యుదితదివ్యమహాస్సున కొక్కసారి బా
ధాయుతబాధ్యతాయుతకథాపరిశిష్టవివిక్త వైభవ
శ్రీ మెనలారు భావములు చిందెడు బాష్పము లేల కార్తువో?

నలిపిన దాంధ్రభూమి యుపచారము సర్వవిధాల నాడు; నేటి తీ
రుల మరి నేడునున్; భరతరూఢతరప్రభుశక్తి కెంతలెం
తలు ఘటియిల్లినా పరుల తాకిడి కోర్వని క్షామపాముగా
వెలిగియు నేడు చచ్చె ననిపించుట యొప్పని దుత్సహింపవా?

శక్తిగీత

శ్రీ హనుమచ్ఛాస్త్రి

శక్తీ !
మామకీనహృదయాధిష్ఠిత
భక్తీ !

నరకిన్నరసిద్ధసాధ్య
నానాప్రాణానిలబలవ
న్మూర్తీ !

ఈశ్వర, వాగీశ్వర, లక్ష్మీశ్వర
సంహార, వ్యాహార, విహార
వ్యవహారాదిమ
రక్తీ !

అనిలానలజలవిపులా
మహాబలాపూర్ణ జ్వల
ద్వ్యక్తీ !

ఆదిరాజఖడ్గ, సచివ
మేధాధికవేగోద్భవ
ప్రాజ్యమహారాజ్యచల
ద్రక్తపతాకా
వర్తీ !

మహావీరకరకృపాణీ !
మహాకవీశానలేఖ
నీ !—

చిత్రకారహృల్లోక వి
చిత్రవర్ణశోభామయ
రేఖావిలస ద్విచలత్
నృత్యమోహిని !

గాయకమృదుకంఠనాళ
క్రమచలనజాతసుధా
కల్లోలేహల్లోహల
గీతసుందరీ !

రావమ్మా ! ఏవమ్మా
నీ విశాలదయాపాం
గావలోకనాలు ? తల్లి !.

నీవే ఈ లోకానికి
మోవలేని ఊపిరి—
నీవులేని పరిధిలోన
లేవు లేవు వెలుగులు.

—" శరత్పూజ "

గుణగవిజయాదిత్యుడు - రాష్ట్రకూటులు

= శ్రీ నేలటూరి వెంకటరమణయ్య =

గుణగవిజయాదిత్యుని గంగవాడి దండయాత్రను వర్ణించుచు నతనికి, రాష్ట్రకూటులకు గల సంబంధమును కొంతవఱకు వివరించియున్నాము. చెప్పినది మరల నిచట చెప్పవలసిన యావశ్యకత లేదు. వింగవిల్లి పరాజయానంతరము గుణగుడు రాష్ట్రకూటులకు లొంగి యధీనుడై యుండెనా? లేక నిజస్వాతంత్ర్యమును పునః ప్రతిష్ఠించుకొనగలిగెనా? అను విషయములు విచారింపదగినవి.

ఇటీవల ప్రకటితమైన గుణగవిజయాదిత్యుని సీసలి తామ్రశాసన మీ యంశమును గొంత విశదము సేయుచున్నది. అందు 'యస్యభుజ న్నృపతుఙ్గః, ప్రతిదిన మర్థిస్పృశ భవతి రిపునృపతుఙ్గః' అను వాక్యమొకటి కానవచ్చుచున్నది.[1] శాసనపరిష్కర్తలగు శ్రీ సోమశేఖరశర్మగారు "ప్రతిదినము విజయాదిత్యుని భుజమును సమర్థస్పృశము చేసి నృపతుంగు డనువాడు రిపునృపతుంగుడు (విజయాదిత్యుని శత్రునృపతులలో సమున్నతుడు) అగుచున్నాడు" అని దీనికి అర్థవివరణము గావించియున్నారు.[2] ఈ వివరణమువలన గుణగవిజయాదిత్యునికి నృపతుంగుడు శత్రువనియు, నతని కొడుకు నృపతుంగుడతని భుజమునకు సమర్థస్పృశము గావించి యతని శత్రువులలో సమున్నతుడాయె ననియు దెలుపుచున్నది. శర్మగారి వివరణము ననుసరించినయెడల వింగవిల్లి రణము నడచినతరువాత గుణగవిజయాదిత్యుకు నృపతుంగుని పరాభూతుని గావించి తనస్వాతంత్ర్యమును మరల నెలకొల్పుకొనెనని యె చవలసి యున్నది. కాని పై సీసలి శాసన వాక్యమునకు వేరొక విధముగ నర్థము చేసుకొనవచ్చును: 'విజయాదిత్యుని భుజమును సమర్థస్పృశము జేసి నృపతుంగుడు రిపునృపతుంగుడు - అనగా శత్రురాజులను అతిశయించుచున్నాడు.' అని యర్థము చెప్పినను తప్పుకాదు. ఈ విధముగ పై శాసన వాక్యము నర్థము చేసికొనిన, విజయాదిత్యుడు శర్మగారు చెప్పినట్లు శత్రువుకాక మిత్రుడగుచున్నాడు. అతడు నృపతుంగునిచే సమర్థస్పృతుడై యతని శత్రువులను నిర్జింపగా నతడు శత్రువుల కతిశయుడాయెనని చెప్పవలసి వచ్చును. పరికించి చూడగా నిదియే శాసనగ్రంథకర్త యభిప్రాయమని తోచుచున్నది. ఈ సందర్భమున అమ్మరాజ విజయాదిత్యుని కలుచుంబఱ్ఱు తామ్రశాసనమందలి 'గుణగవిజయాదిత్యపతి రంకకార స్సాహసా ద్వల్లభనృపసమర్థస్పృ"భుజః' [3] అను వాక్యమును స్మరణకు దెచ్చుకొనవలయును. 'పతియైన గుణగవిజయాదిత్యుడు సాహసము వల్లభ నృపతిచే సమర్థస్పృశ భుజుడైన యంకకారుడు' అని యీ వాక్యమున కర్థము. అంకకారుడన నెవ్వడో, వాని ధర్మమెట్టిదో తెలిసికొనినగాని పై విశద వాక్యము యొక్క భావము సంపూర్ణముగ మనకు బోధపడజాలదు. అంకకారుడనునది కన్నడపదము. ప్రధాన సేవకుడు, ప్రముఖయోధుడని రెండర్థముల నీమాటకు కిట్టెలు వ్రాసియున్నాడు. 'అంకకారుడు' తెనుగున అంకకాడగుచున్నది. తెనుగు నిఘంటుకర్తలును, పండితులును దీని కవర్థ ఛేది సమంజసమని తోచిన దాని ననుగుణముగ నర్థము వ్రాసియున్నారు. "అంకకాడు. దే. విశ. (అంకము + కాడు) చలముపట్టువాడు. చు పాద" అని సీతారామాచార్యులు. "మొనగాడు, ముఖ్యుడు,

1. భారతి సం. ౨౩. పుట ౪౮౬.

2. ,, ,, ,, ౩౬౭.

3. ఎపి ఇండి. సం. ౯, పుటలు ౧౯౬ మొదలు; ఇండి. ఆంటి. సం. ౨౦, పుట ౨౬౧.

కూటకుఁడు; చలపాది, మాత్సర్యశీలుఁడు, కళంకముగల వాఁడు" అని సూర్యనారాయణీయము. 'అంకకాఁడు' నకు రూపాంతరము 'అంకంబువాఁడు' అను మాటకు శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు 'ముద్రాధారి' అని యర్థము వ్రాసిరి 4. 'అంకము' అను మాటకు 'గుఱుతు' అని యర్థ ముండుటచేతను, 'ముద్ర' యను 'గుఱుతు'ను సమానార్థ పదము లగుటచేతను 'అంకంబు వాఁడు' అన 'ముద్రాధారి' యని యర్థము చెప్పవచ్చును. మఱియు పాల్కుఱికి సోమనాథుఁడు శివుని కొలువు నియోగములను లెక్కించుచు "అంకంబువాఁడు శేణాధి నాథుండు" 5 అని చెప్పియుండుటచేతను, 'అంక కాఁడు' శివుని రెండు నియోగములలో నివాఁడే యగుట చేతను శాస్త్రిగారు చెప్పిన యర్థమే సరియని తోచ వచ్చును. కాని బసవపురాణమునం దీమాటకు శాస్త్రిగారు చెప్పిన యర్థము సరిపడదేమో యని సందేహము గలుగుచున్నది. శేణాధినాథుని కథ ప్రకరణాంతరమున బసవపురాణమున గలదు (పుట ౧౩౬). ఇతడు ...లా పురమున రాజ్యము సేయుచు పరరాజులకు 'సప్పకొట్టు' అను వాఁకిట గప్పము గొనుచు నుండెను. కాని శివ భక్తుఁడు. 'భూతి రుద్రాక్షధారణుల దన ప్రాణలింగ భావన విశ్వసించు' వాఁడు; వారితో యుద్ధము సేయఁడు. ఇది యతని నియమము. ఈ మర్మము దెలిసి పర రాజులు 'భూతిరుద్రాక్షధారణు'నొక్క 'దళవాయి శాసన ధారి గావించి' పంపగా శేణాధినాథుఁడు "తన తంత్రమును దాను జనుదెంచి తాఁకి, యని సేయు భూతిరుద్రాక్ష ధారణుని గని 'శివశివ' యంచు గరవాలువైచి, చను దెంచి భువి జక్కజాఁగి మ్రొక్కె" నట. ఈ వర్ణన వలనఁగా శేణాధినాథుఁడు కూటకుఁడైన రాజుగాక కేవలము ముద్రాధారి కాఁడని తోచుచున్నది. 'అంకకాఁడు'ను బాహత్తర నియోగములలో నివాఁడే యగుటచేత నిచట 'అంకంబువాఁడు' అనగా 'కూటకుఁడు'అని యర్థము చెప్పుకొనుట యుక్తము.

---

4 బస. పీఠిక. పుట ౧౧౪.

5. బస. అ. ౨. పుట ౪౬.

5-క. "అఙ్కాః కల్పే త్రివిధాః ప్రోక్తాః" అని ముద్రితపాఠము. ఈ శ్లోకమునకు దరువాత వరుసగా నెనిమిదివిధము లైన యఙ్కములు వర్ణింపబడియుండుటచేత నిది యపపాఠమనుట తెల్లము. "అఙ్కాః కల్పేష్టవిధాః ప్రోక్తాః" అని యుండవలెవచ్చును.

6. అభి. చింతా. (గా. ఓరి. సీరీస్) పుట ౨౫.

అంకకాఁడు యోధుఁడే యైనను, యోధులందఱును నంకకాండ్రు కాజాలరు. అంకము సేయువాఁడు అంక కాఁడు. అంకము యుద్ధమే యైనను యుద్ధము లన్నియు నంకము లనుటకు వలనుపడదు. 'అంకము' 'అంకకాఁడు' అనునవి పరిభాషా పదములు. ఇవి పరిభాషాపదము లని గుర్తించక పోవుటచే మన నిఘంటుకర్తలు వీనియర్థము గ్రహింపలేకపోయిరి. 'అంకము' - సర్వాద్య యుద్ధము. సర్వజ్ఞసోమేశ్వరుఁడు దన యభిలషితార్థ చింతామణియం దీయంకయుద్ధ స్వరూపమును విపుల ముగా వర్ణించియున్నాఁడు. అంకయుద్ధము రాజవినోద ములలో నొక్కటి. ఒకఁడు సమానుఁడైన మఱియొక్క నితో తుల్యుఁడై యాయుధము లేగాని రంగస్థలమున నిలిచి చేయు యుద్ధము విజ్ఞులచే 'నంక' మనబడుచున్నది. అంకము లెనిమిది విధములైనవి. 5-క అందొక్కొక్క దానియొక్క లక్షణములను, కారణములను, పేరులను క్రమముగ వర్ణించుచున్నాను. (౧) పరిభూతాంక ములు:—తిట్టుట, కొట్టుట, మూర్ధవాననము, దళబంధనము, నోటియందలి తమ్మ పైనుమియుట, కేశచ్ఛేదనము మొదలగువాని మూలమున గలిగిన యవమానమును బాపుకొనుటకై చేయు నంకము పరిభూతాంకమని జనసంపదలందు చెప్పబడుచున్నది. (౨) మత్సరాంకము:—ఒక వేశ్యానిమిత్తము కామక్రోధ ములకు లోనై యీర్ష్యచే జేయునట్టి యంకము మత్స రాంక మనబడుచున్నది. (౩) భూమ్యంకము:- గ్రామ క్షేత్రాదులను హరించుటవల్లను, సీమావ్యాజమువల్లను, దేశాధిపతి నిమిత్తమునను గలుగు పోరాటము భూమ్యంక మనబడును. (౪) బిరుదాంకము:- ఒకని నుద్దేశించి మఱియొ క్కఁడు అందరిచేతను బిరుదులను పఠింపించినను, పాడించి నను, కాహళములను మ్రోయింపించినను, మదోద్ధతుఁడై మహిషముపై స్వారిసేసినను, పగలు దీపము ప్రదీపించి నను, పీఠములందు గద్దెపరకలను విడిపించినను గలుగునంకము బిరుదాంకమని చెప్పబడుచున్నది. (౫) విద్యాంకము:— యుద్ధవృత్తివలన జీవించువారు శస్త్రవిద్యాగర్వితులై సల్పు యుద్ధము విద్యాంక మనబడుచున్నది. (౬) వైరాం కము:- పిత్రాదుల మరణమువలన గలిగిన వైరమును దల చుకొని చేయు యుద్ధమునకు వైరాంకమని సోమ భూపతి పేరిడుచున్నాఁడు. (౭) ద్రోహాంకము:- కృతా పరాధులను నిగ్రహించుటకు తాదృశులైనవారిచే రాజు చేయించు యుద్ధమునకు ద్రోహాంక మనిపేరు. (౮) మోహమువలన పాపములను జేసి విరక్తుఁడై రాజు కడకువచ్చి యఘనివృత్తి కొఱకు చేయు యుద్ధము ప్రాయశ్చిత్తాంకమని చెప్పబడుచున్నది 6.

రాజవినోదములలో నంకవినోద మొకటి యగుటచే రాజులు, మండలేశ్వరులు, సామంతులు మున్నగువారు పూర్వకాలమున దమ యాస్థానములయం దంకకాండ్రను నియమించువారు. ఎవ్వరి కాలమునను ఏ రంకయుద్ధము సేయ నియమింపబడియుండిరో వారి యంకకారులమని సగర్వముగ వీరు చెప్పుకొనెడివారు. 'విక్రమాదిత్యనంకకారు', 'సత్తిగనంకకారు', 'అహవమల్లనంకకారు' మున్నగునవి యీని కుదాహరణములు 7. రాజులకే కాక సేనలకును, దేవాలయములకును, దేశమునకు గూడ నంకకాండ్రుండువారు. 'సేనయనంకకారు' 'మహాశివాలయనంకకారు', 'భగవతియనంకకారు' 'శివనంకకారు' 'దేశియంకకారు' మొదలగు బిరుదు లీవిషయమును దెల్లము సేయుచున్నవి 8. తమ యాస్థానముల యందు స్థిరముగ నియోగింపబడిన యంకకారులను గాక రాజు లొక్కొక్కప్పుడు సమానులతోడనో, లేక వారి ప్రతినిధులతోడనో పోరాడుటకు గొప్పవారిని అంకకాండ్రుగ నియమించెడివారు. క్రీ. శ. ౧౦ వ శతాబ్దమున వెలసిన రాజశేఖరకవి తన బాలరామాయణ నాటకమున రామరావణులపక్షమున వారి యంకకారులు పోరాడిన యుద్ధమును వర్ణించియున్నాడు. విషయము మాత్ర మగుటచే నించుక దీర్ఘమైనను నాటకభాగము నిం దుదాహరించుచున్నాను.

"అతః పరం వీరవిలాసో భవిష్యతి.

(తతః ప్రవిశతో రాక్షసౌ.)

ఏకః:- సఖే దుర్ముఖ, కిమపి మహాన్ సత్త్వక్షయో రావణస్య; యత్కుమారసింహనాదరథ మపాస్య కస్మిన్నపి వనౌకసి కృతః, నాప్యనర్హః. కేవల మేకం తులాయుద్ధం తత్ర ప్రవర్తితం. తత్రైవ లఙ్కాధిపత్యం, సీతాపహారితా న పునరర్పితా.

దుర్ముఖః:— అర్య సుముఖ, సావధానాస్త్రిజటయా సమాదిష్టం. యథాగస్త్యేన జగ్ధ నరాన్తక రాక్షసకులాం ప్రేక్షేథాం. యేన యుష్మన్ముఖాత్ శ్రుత్వా, సీతాదేవ్యై నివేదయిష్యామి. తద్యావత్పాంచ గతా విస్మృతావ దహం జానామి నపునః కారణం. తత్ కథ్యతాం యథాప్రతిపన్నమ్.

సుముఖః:— పరం లఙ్కేశ్వరేణ శుకసారణౌ ప్రహితౌ దాశరథి మభిధాతు మభిహితం చ తాభ్యామ్.

తక్రాత్రింభ్రజాస్పృశాభిః ఫల మభిలషితం
  హేలయా యస్య లిప్సోః
సౌక్ష్మం కర్ణకాన్తే వ్యాహామహామికయా
  శ్రుధారాగ్రేషు,
స్ఫూర్తి తత్కృత్ప్రభాసు ప్రకుపితగిరిశా
  కృష్టనామాగ్రపాణి
స్తోమోద్యత్కోటిఘటిత ఘటితా
  కాంచనీ తాలమాలా.

స నిశాచరచక్రవర్తీ త్వాం నాహ, యస్మిత ! మఖిలవానరరాక్షసయాకార్యేణ సంయామేన తిరేకం తులాయుద్ధం ప్రవర్తయావః. తత్రచ—

తత్కాక్ష్యాకారవిజయే తవ నామ, లఙ్కా
సీతాచ మే భవతు రిక్త భవత్వసు నాశః
మత్కాక్ష్యాకారవిజయే తు మమాధిపత్యం
తస్యాంచ తే పురి, కళత్రజనేన తత్ర.

దుర్ముఖః :— తత స్తతః ?

సుముఖః:— తతశ్చ కోసలకులాంభోధరచన్ద్రేణ రామభద్రేణాభిహితం — యుక్తాహ గృహీతప్రణయా, కింపున రావణో రక్షాకారత్వ మూచితం యదస్మా రత్ర పక్ష్యే ఽభియోగః.

దుర్ముఖః :— తత స్తతః ?

సుముఖః :— తతశ్చ సౌమిత్రి సుగ్రీవ విభీషణ జాంబవ దాంజనేయ ప్రభృతిభి ర్నిషిద్ధేనాపి తేనైవ తిష్ఠత్యుపాధ్యాయ కాక్షకారీకృతః కుమారో ఽఙ్గదో రఘూద్వహేన; నిజపుత్రో నరాన్తకస్తు లఙ్కేశ్వరేణ."

పై జూపిన యుదాహరణములవలన అంకకాడన సేవలము తోటుడు గాడనియు, నంకయుద్ధము సేయు గొప్పయోధుడే యంకకాడనియు, నంకయుద్ధము ద్వంద్వయుద్ధ విశేషమనియు, నంకవినోదము రాజవినోదములలో నొకటి యగుటచే రాజులు తమ యాస్థానమున నంకకాండ్రను స్థిరముగ నుంచుకొనెడివారనియు, నొక్కొకప్పుడు సమానులైన రాజులతోగాని, వారి ప్రతినిధులతోగాని పోరవలసి

---

7. దక్షి. ఇం. శాసనములు. సం. ౯. భా. ౧ నెం. ౧౬౧; సం. ౬. నెం. ౧౦౨.

8. దక్షి. ఇం. శాసనములు. సం. ౪. నెం. ౩౬౪, ౩౪౪, ౩౬౮; సం. ౯. భా. ౧. నెం. ౩౪౪, ౨౧౫, ౧౧౦.

8-క. 'తులాయుద్ధ' మనగా సమానులు చేయు యుద్ధము అని యర్థము.

నపుడు తమకు బదులు యుద్ధముసేయుటకు తమ శాత్రవులైన రాజులనో, రాజకుమారులనో తాత్కాలికముగ నంకకాండ్రుగ నియమించువారనియు దేలుచున్నది. మఱియు నంకయుద్ధమున జయమందిన యంకకాండ్రను రాజులు సత్కరించి గౌరవించెడివారు.

"ప్రతిజ్ఞాపాలకానాంతు
 జయం దద్యాన్నృపః స్వయం
ప్రసాదదానకం భూరి
 వస్త్రకాఞ్చనభూషణమ్.
గ్రామా నశ్వాం స్తథా నిష్కాన్
 వృత్తిం దత్వాను జీవితమ్
మృతానాం బన్ధుదానార్థం
 పరలోకక్రియార్థకే
కృపాదానం ప్రదాతవ్యం
 కాఞ్చనం భూరిభూభుజా" 9.

అంకయుద్ధమును గూర్చియు, అంకకాండ్రను గూర్చియు చెప్పవలసిన విషయము చాల కలదు. కాని యది ప్రస్తుత మనావశ్యకమగుటచే నంకకాలి విచారము చాలించెదము. గుణగవిజయాదిత్యుడు సాక్షాత్తు వల్లభనృపసమర్పితభుజాదైన యంకకారు డగుటచే వల్లభనృపుని కత డాశ్రయు డైన రాజేకాని యాతనిపై విజయమందిన శత్రువు కాజాలడు. మఱి యతడు గుణగవిజయాదిత్యుని భుజము మీఁద సమర్పించె ననగా, గుణగు డతని యాదేశముచొప్పున నతని శత్రువులను నిర్జించినందుకు సంతసించి గౌరవించుటకొఱకే. ఈ సందర్భమున 'గంగా సంగజవైరి శక్తి రణరాగ రట్టేశసంచోదితో జిత్వా...' యను నమ్మరాజవిష్ణువర్ధనుని ఈడేరుశాసన శ్లోకమును స్మరణకు దెచ్చుకొనవలయును 10. కావున సీసలితామ్రశాసనమువలన నతడు నృపతుంగు నోడించె నని చెప్పుటకు వీలులేదు; శాసన శ్లోకము గుణగుడు నృపతుంగుని కాశ్రితుడనియే తెలుపుచున్నది. ఇంతవఱకు లభ్యమైన శాసనసాక్ష్యమును బట్టి చూడగా నృపతుంగుని మరణకాలమువఱకును గుణగవిజయాదిత్యుడు రాష్ట్రకూటుల కరిగాపైయుండె ననియే తోచుచున్నది.

---

9. అభి. చిం. (గై. ఓరి. సీరీస్) పుట ౨౩౯.

10. దక్షి. ఇం. శాసనములు. సం. ౧. పుట ౩౬.

11. భారతి. సం. ౫. పుటలు. ౬౧౯-౬౨౦.

నృపతుంగుని రాజ్యము క్రీ. శ. ౮౭౭ తో సమాప్తి నొందినది. తరువాత నతని కుమారుడగు నిమ్మడి కృష్ణవల్లభుడు రట్టసామ్రాజ్యమున కభిషిక్తు డాయెను. ఇతని యాధిపత్యమును గుణగవిజయాదిత్యు డంగీకరించలేదు. ఇమ్మడి కృష్ణవల్లభుడు పూర్వచాళుక్యులపై దన యధికారమును నిలుపుకొనగోరెను. అంతట పూర్వచాళుక్య రాష్ట్రకూటయుద్ధము మరల ప్రారంభమైనది. ఈ యుద్ధము పెక్కు పూర్వచాళుక్య శాసనములయందు వర్ణింపబడియున్నది. వీనియందు గుణగవిజయాదిత్యుడే స్వయముగ రాష్ట్రకూటకృష్ణుని యనుచరసహితముగ నోడించినట్లు వ్రాసియున్నను, వాస్తవముగ రట్టరాజ్యముపై దండయాత్రను సూత్రధారుని వలె నడపించినవా డతని బ్రాహ్మణసేనాపతి పండరంగడు. మొదటి చాళుక్యభీముని నాటి ధర్మవర శిలాశాసనమునను, అమ్మరాజ విజయాదిత్యుని మలియంపూండి శాసనమునందును నీ విషయము స్పష్టము సేయబడియున్నది.

ఈ యుద్ధమునకు సంబంధించిన యంశములు కొన్ని పూర్వచాళుక్యశాసనములందు వర్ణింపబడియున్నవి. ఇవన్నియు నేకధాటికి జెందినవో, లేక రెండుమూడు ప్రత్యేకయుద్ధయాత్రలందు నడచినవో నిశ్చయించి చెప్పుటకు వీలుకాదు. ఈ యుద్ధమును వర్ణించెడి శాసనము లన్నిటియందును బ్రథమచాళుక్యభీముని కాలపు ధర్మవరశిలాశాసనము ప్రాచీనతమము. ఇది గుణగవిజయాదిత్యుని మరణానంతర మిరువదేండ్ల లోపల వేయించినది. ఇందు—

"లోకాసనం శక్కరాజు నోడించిన
 వల్లభు కొల్పన వెల్ల వెఱుంగ
కన్నరాభూపతి నన్నెజిలోం జూపె
 సంకిలాణ్ణను వేని బింక మడిచె
దణ్డునై వచ్చిన దొడ్డైన బోఅనిం
 జేకొని కాచె భూలోకం బెఱుంగ
కిరణపురము దహాలని తంబు దగొపాండు
 నచలపురము సాధ్ని నచలితుణ్డు
వల్లభుణ్డు గుణక నల్లణ్డు వన్నివం
 బణ్డరంగ చూరె కణ్డాంగు" 11.

అని యుద్ధమునందు నడచిన యంశములు వర్ణింపబడినవి. మొదటి రెండుపంక్తులును గడపటి, గీతపాదములును గన్నరభూపతితోడి యుద్ధమునకు జెందినవి. వీనిమధ్యనుండు సీసతృతీయపాదము బోఅసంరక్ష

గాను తెల్పుచున్నది. ఈ పోరు లెవ్వరితో, వానిపై నెత్తివచ్చిన శత్రు వెవ్వరో తెలియదు. కాని యీపోరు దాక్షిణాత్యసమ్రాట్టులతో డనుటకు నే బల్లహాంధ్రమున నా కాలమున రాజ్యముసేయుచుండిన కలికాలాన్వయులగు వేంగిచాళుక్యులలో నొక్కడై యుండునని తలచుట సమంజసము. అట్లైన నితనిపై నెత్తివచ్చిన శత్రువు కన్నరుడే యైయుండు గానవచ్చును. రాష్ట్రకూటులు దక్షిణకర్ణాట, పశ్చిమాంధ్రములపై దమ యాధిపత్యమును స్థాపించుటకై యచటి రాజులతో నిరంతరము పోరుచుండిరి. కాని యిది యిట్లని నిశ్చయించి చెప్పుటకు సాధనములు లేవు. పోరికి గన్నరునితో నెట్టి సంబంధము లేకపోయినను పోవచ్చును. దీని సత్యాసత్యము తెల్పునట్టి శాసనగ్రంథమున శాసనగ్రంథకర్త యుద్ధాంశములను వర్ణించిన విధమును జూడగా, గుణగవిజయాదిత్యుడు కన్నరునితో రెండుపర్యాయములు పోరాడియుండవలయునని తోచుచున్నది.

కన్నరునితో మొదటియుద్ధము:—ఈయుద్ధ మెప్పుడు నడచెనో చెప్పుటకు వీలులేదు. ఒకవేళ నిది యాంధ్రదేశమున నడచి యుండిన నుండవచ్చును. అమోఘవర్షుడు దివంగతుడైన పిమ్మట నిజస్వాతంత్ర్యమును ప్రకటించిన గుణగవిజయాదిత్యుని మరల రాష్ట్రకూటుల యధికారముక్రిందికి దెచ్చు నుద్దేశముతో నిమ్మడి కృష్ణవల్లభుడు పూర్వచాళుక్యరాష్ట్రముపై నెత్తివచ్చిన దండయాత్ర ఇది యని యూహించుచున్నాము. ఇతనికి బాసటయై సంకిలుడను బిరుదుముగల కూరుడు నిజసైన్యముతో నడచెను. కాని వీరిరువురును యుద్ధమున నోడి పారిపోయిరి. ఇచట పరామర్శింపవలసిన యంశములు రెండు కలవు.

(౧) పై నుదాహృతమైన ధర్మవరశాసనపద్యమున మొదటిపంక్తియందు 'లోహాసనం జెక్కి రాహను నోడిచినవల్లభు గొల్చిన' పండరంగడు యుద్ధమునకు వెడలినట్లు చెప్పియున్నది. రాహుని గుర్తించుటకు సాధ్యముగాదని యింతకుపూర్వము చెప్పియున్నాము. అతడెవ్వడైనను నతని నోడించిన వల్లభుడు గుణకవల్లభుడు, అనగా గుణగవిజయాదిత్యుడని నిస్సంశయముగ జెప్పవచ్చును. ఇట్లనుటకు గారణములు రెండు: పండరంగడు కొలిచిన ప్రభువు గుణగవిజయాదిత్యు డనుట యొకటి; 'వల్లభుణ్డుగుణకెనల్లుండు వచ్చిన' యను శాసనవాక్యము రెండవది. కావున పండరంగని కన్నర సంకిలులపైకి యుద్ధమునకు పంపిన వల్లభుడు గుణగవిజయాదిత్యు డనుట నిశ్చయము. 'వల్లభ' బిరుదము తొలుదొల్త ప్రాచీనబాదామి చాళుక్యరాజులది. వారినుండి యది రాష్ట్రకూటులకు సంక్రమించెను. రాష్ట్రకూటులు వల్లభు లని ప్రఖ్యాతినందిరి. కాని ధర్మవరశాసనమందలి యీ బిరుదు రాష్ట్రకూటుల కన్వయింపదు; గుణగవిజయాదిత్యునికే చెల్లునని పైని నిరూపించియున్నాము. గుణగవిజయాదిత్యునికి పూర్వులైన వేంగిచాళుక్యరాజులకుగాని, యతని తరువాత రాజ్యభారము వహించిన యతని వంశజులకుగాని యీ బిరు దుండినట్లు కానరాదు. రాష్ట్రకూటులను జయించినపిమ్మట వారినుండియే యతడీ బిరుదును గ్రహించియుండవలయును.

(౨) ఇందు పేర్కొనబడిన కన్నరుడు రాష్ట్రకూట ఇమ్మడి కృష్ణవల్లభు డని ఇంతకుముందు చెప్పియున్నాము. సంకిలుండను నతడు డాహాళాధీశ్వరు డని [illegible], మలియంపూడి తామ్రశాసనములవల్ల దెలియుచున్నది.[12] ప్రస్తుత బుందేలు ఖండమునకు పూర్వము హిందూరాజుల యేలుబడియందు డహాళము, చేదిమండల మను పేర్లు చెల్లుచుండెను. హైహయవంశజులైన రాజు లిచట రాజ్యము సేయుచుండిరి. వీరికిని రాష్ట్రకూటరాజులకును సన్నిహితబాంధవ్యముండినట్లు శాసనములవల్ల దెలియుచున్నది. రాష్ట్రకూట మూల్మడి గోవిందరాజుయొక్క కాంగ్లి తామ్రశాసనమునం దీబాంధవ్య మిట్లు వర్ణింపబడియున్నది[13].

"తస్మా దకాలవర్షో
 నృపతి రభూ దత్యపరాక్రమ త్రస్తైః
సద్యః సముద్ధతాగ్రం
 ఖేటకమహితైః పరిత్యక్తం.
సహస్రార్జున వంశస్య భూషణం కొక్కలాత్మజా
 తస్యా భవన్మహాదేవీ జగత్తుంగ తతో జని."

"గంభీరా ద్రత్ననిధే రభూ ద్భ్రాత్రీపతస్తరస్తు
కొక్కలసుతరణవిగ్రహజలధే ర్లక్ష్మీ సముత్పన్నా."

ఈ శ్లోకములవల్ల సహస్రార్జునుని వంశజుడగు కొక్కల్లునికి కుమార్తె యకాలవర్షుని (కృష్ణుని) భార్య యాయెననియు, నీ కొక్కలునికి రణవిగ్రహు డను కొడుకుండెననియు తెలియుచున్నది. మఱియు నిమ్మడి కర్కరాజు కర్దా తామ్రపట్టిక లీరణవిగ్రహునికి

12. ఎపి. ఇండి. సం. ౯. పుట ౮౪; Cp. No' 6 of 1938-39 (అప్రకటితము).

13. ఇండి. ఆంటి. సం. ౧౨. పుట ౨౫౦.

సంకుళశంకరగణ యను నామాంతరము లుండినట్లు తెల్పుచున్నది 14.

"చేదీశో దళితద్విషద్ద్విరదశః
శ్రీహైహయానాం కులే
కొక్కల్ల స్సుతభూ న్నృ తస్య
తనయా యా శంకుకస్యాగ్రజా,
తస్యాం కృష్ణనృపాత్ గతః
కృతమహాదేవీ పదాయా మభూత్
తైసైర్గః ప్రథితో నగై
ర్భువి జగత్తుంగాభిధానః సుతః."

ఈ శంకుకుడే పండరంగనితో యుద్ధమున నోడిపోయిన డాహాళాధీశ్వరుడైన సంకిలుడని చరిత్రకారుల యభిప్రాయము.

కన్నరునితో రెండవ యుద్ధము, డహాళవిజయయాత్ర:—ఇది కన్నరునితో విజయాదిత్యుడు చేసిన రెండవ యుద్ధము. మొదటి యుద్ధమునకు దాఁటవాయి. నే నూహించినట్లు మొదటి యుద్ధము కన్నరుడు పూర్వచాళుక్యరాజ్యముపై నెత్తివచ్చినప్పు డాంధ్రదేశమునందే నడచియుండగా దీనితో దానికిది జవాబు. ఇది మన పరిశోధకులు గాని, చరిత్రకారులు గాని గమనించక విడిచిన యంశ మొకటి కాని యిచట నొక్కి చెప్పవలసియున్నది. ఈ రెండవ యుద్ధము నడచిన రంగ మాంధ్రదేశము గాదు; రాష్ట్రకూటసామ్రాజ్యమును గాదు; హైహయరాజుల స్వతంత్రమైన డహాళరాజ్యము. సంకిలునితో గూడ కృష్ణవల్లభుని గుణగవిజయాదిత్యు డచటనే యెదిరించెను. దీనికి వాస్తవమైన కారణమేమో తెలియదు; కాని యది రెండువిధములుగ నుండియుండవచ్చును: విజయాదిత్యునిచే నిర్జితుడై నిజరాజ్యమున తలదాచుకొనుటకు తావులేకపోగా, కృష్ణవల్లభుడు తన మిత్రుడును, మరదియు నైన సంకిలుని యండ జేరియుండవచ్చును; గుణగుడు పరారియైన కృష్ణుని వెన్నంటి తఱుముచుపోయి డహాళదేశమును జొచ్చి దానిని జయించియుండవచ్చును. అథవా, సంకిలుడు కృష్ణవల్లభునికి సహాయమొనర్చినందుకు గినిసి, విజయాదిత్యుడు డహాళముపై నెత్తిపోగా కృష్ణవల్లభుడు సంకిలునికి సహాయము చేయుటకు డహాళమునకు పోయి యచ్చట నతడు పూర్వచాళుక్యసైన్యముల నెదిర్చియుండవచ్చును. కారణ మేదియైనను గుణగవిజయాదిత్యుడు డహాళముపై నెత్తిపోయి, సంకిల కృష్ణవల్లభుల నోడించి యా దేశమును జయించినది సత్యము. మఱియు గుణగవిజయాదిత్యుడు కళింగగాంగులను, హైహయులకు సామంతులైన కోసలులను, రాష్ట్రకూటుల సామంతులైన వేములవాడచాళుక్యులను జయించినట్లు పూర్వచాళుక్యశాసనములవలన తెలియవచ్చుచున్నది. ఈ విజయము లన్నియు డాహళదండయాత్రయందే చేకూడిన వని తలచుచున్నాము.

కళింగగాంగులు:—ప్రాచీన కాలమునుండియు త్రికళింగములలో రెండు, మధ్యదక్షిణ కళింగములు పూర్వచాళుక్యుల ప్రభుత్వముక్రింద నుండినవి. కావున గుణగవిజయాదిత్యునిచే నిర్జితులై యతనికి ఏనుగులను చెండిని సమర్పించుకొన్నవా రుత్తర కళింగులై యుండవలయును.15 పూర్వగాంగ శాసనములనుబట్టి

---

14. ఇండి. ఆంటి. సం. ౧౨ పు. ౨౬౫.

15. చాళుక్య శివర్మ మహారాజు బొడ్డేటి శాసనములో (ARE Cp. 18 of 1908-9. చూ. Cp. 10 and 11 of 1908 9.) విశాఖపట్టణమండలములోని భీమునిపట్టణము తాలూకాకు చెందిన భోగపురము మధ్యకళింగాంతర్గతమైనట్లు చెప్పియున్నది. క్రీ. శ. ౧౦ వ శతాబ్దము నాటి చోళశాసనములలో ప్రాతగంజాము మండలములోని మహేంద్రగిరిపర్వతము కళింగదేశమునకు ఉత్తరపుసరిహద్దనియు, నటుపై నుండు దేశము ఒడ్డదేశమనియు చెప్పియున్నది. (దక్షిణ. ఇం. శాసనములు. సం. 3. ఎపి. ఇండి. సం. ౨౧, పుట ౧౩౨) ప్రథమ కులోత్తుంగ చక్రవర్తి కాలమున విరచింపబడిన కళింగత్తు-ప్పరణి యందు ఉత్తర కళింగాధిపతి యతనికి కప్పము కట్టక పోగా యతని నణచుటకు కులోత్తుంగ చక్రవర్తి దండయాత్రనంపినట్లును, నతని సేనాధిపతి యా యుత్తర కళింగాధిపతిని జయించి మహేంద్రగిరి శిఖరముపై జయస్తంభము నిలిపినట్లును వ్రాసియున్నది. (ప్రొఫెసరు నీలకంఠ శాస్త్రి, చోళులు, సం. ౨. పుట. ౩౬) ఈ విజయమును ప్రకటించు శాసనములు నేటికిని మహేంద్రగిరిపై నున్నవి. భీమునిపట్టణ ప్రాంతదేశము మధ్యకళింగమైన, దానికి ఉత్తరముగ మహేంద్రగిరిపర్యంతము వ్యాప్తమైన దేశము ఉత్తర కళింగమై యుండవలయును. మఱియు గోదావరి తూర్పుగట్టుననుండి భీమునిపట్టణమువఱకును గల దేశము దక్షిణకళింగ మగుట తెల్లము. పాతలూరి తామ్రశాసనమున (భారతి సం ౧. సంచిక ౧. పుట ౧౦౪) గుణగవిజయాదిత్యుడు 'సదక్షిణాపథ సత్రికలింగదేశ మన్యపాలయ' త్తని చెప్పియుండుటచేత నతడుత్తర కళింగమునుగూడ జయించి స్వాధీనపఱచుకొనెనని మనము నిశ్చయించి చెప్పవచ్చును.

చూడగా నాకాలమున చీకిరలన దానశాసనము నొసగిన దేవేంద్రవర్మ తండ్రియగు భూపేంద్రవర్మ యుత్తర కళింగము నేలుచుండినట్లు తోచుచున్నది16. తమరాజ్యమును గాపాడుకొనుటకు పూర్వగాంగులే ప్రయత్నములు గావించిరో తెలియదు; కాని యుద్ధమున నిర్జితులై పైజెప్పినట్లు వీరు సంధిగావించుకొనవలసి వచ్చెను.

కళింగవిజయము డాహళకండయాత్రకు ప్రస్తావనవంటిది. వేంగినుండి గంగ యావళిదేశములపై దండయాత్ర నడపగోరు విజిగీషువులకు కళింగమును మొదట జయించుట యావశ్యకము. తీరప్రాంతమునుండి దేశాంతర్భాగమునకు పోవు మార్గములు కళింగములోని కనుమలగుండ బోవుచుండుటచేత, క్రీ. శ. ౧౦వ శతాబ్దము నాటి చోళచక్రవర్తులవలె, గుణగవిజయాదిత్యుడును ప్రప్రథమమున కళింగమును స్వాధీనపఱచుకొనవలసిన వాడాయెను.

బద్దెగడు:—దానార్ణవుని కన్దయము తామ్రశాసనమునను, మొదటి శక్తివర్మ పెన్నేగ, పథుపట్టు, ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలయందును గుణగ విజయాదిత్యుడు బద్దెగ డను నొక శత్రువు కభయ మిచ్చినట్లు చెప్పియున్నది17. ఈ బద్దెగడు గుణగవిజయాదిత్యుని వలెనే చాళుక్య వంశజుడు; కాని శాఖాంతరమునకు జెందినవాడు. అతడు రాష్ట్రకూట సామంతుడు; వారి సామ్రాజ్యమునకు మూలస్తంభమువంటివాడు.

అతనికి వృత్తిగా వారిచ్చిన దేశము గుణగవిజయాదిత్యుని కడమపార్శ్వమున తెలింగాణమున గోదావరికి దక్షిణతీరమున నుండెడిది. గవర్నమెంటు శాసన శాఖవారు చెప్పిన ట్లాతడు కన్నడ మహాకవియగు పంపని కాశ్రయభూతుడైన యిమ్మడి యరికేసరి నరపాలుని పూర్వులలో నొక్కడు18. ఈ శాఖకు మూలపురుషుడైన మొదటి యుద్ధమల్లుడు మాన్యఖేట రాష్ట్రకూట సామ్రాజ్య స్థాపకుడగు దంతిదుర్గునికి సమకాలికుడు. దంతిదుర్గు డుత్తర దిగ్విజయమునకు వెడలినపుడు యుద్ధమల్లు డతని వెంటబోయి, రాజపుత్రస్థానమునందలి సపాదలక్ష దేశము నతని పక్షమున గొంతకాలము పాలించెను. దంతిదుర్గుని మరణానంతరము రాష్ట్రకూట సామ్రాజ్యమున గలిగిన కలహములవలన ఉత్తరదేశమందు వారి యధికారము క్షీణించెను. అప్పుడు యుద్ధమల్లుడు సపాదలక్షమునుండి వచ్చి యిప్పటి హైదరాబాదు రాజ్యములోని నిజామాబాదు జిల్లాకు చెందిన బోధనపుర ప్రాంతమున నొక చిన్న రాజ్యమును స్థాపించెను. తరువాత నితని వంశజులు కరీంనగర మండలములోని లెంబులవాటిక, లేక లేములవాడ (యిప్పటి వేములవాడ) యను స్థలమునకు దమ రాజధానిని మార్చుకొనిరి. ఈ కారణముచేత నీ వంశము వారికి వేములవాడ చాళుక్యులని చరిత్రకారులు నామకరణము చేసియున్నారు.

బద్దెగని ప్రతాపమును పంపమహాకవి తన విక్రమార్జున విజయ పీఠిక యందు వర్ణించి యున్నాడు. అందతడు వర్ణించిన యంశము లన్నియు గుణగవిజయాదిత్యుని కాలమునకు పిమ్మట నడచినవి. పంపని పీఠికయందుగాని, వేములవాడ చాళుక్యశాసనములలోని ప్రశస్తులందుగాని బద్దెగని పరాభవమును గూర్చి యొక్క మాటయేనియు గానరాదు. పంపాది గ్రంథకర్తల యొక్కయు, వేములవాడ ప్రశస్తికర్తల యొక్కయు మౌనమువలన పూర్వచాళుక్య శాసనముల యాథార్థ్యము సంశయగ్రస్తమని యెంచరాదు. ఏలన, వారి మౌనమునకు గారణము దమ కాశ్రయమైన రాజవంశము యొక్క పరాభవమును దలపెట్ట నిష్టము లేకపోవుటయే.

బద్దెగనికి గుణగ విజయాదిత్యుని సైన్యములతో నెప్పుడు ఘర్షణ గలిగెనో తెలియదు. మల్లప్పదేవుని పిఠాపురి శిలాశాసనమున గుణగవిజయాదిత్యుడు చక్రకూట దుర్గమును దగులబెట్టినట్లు చెప్పియున్నది19. మధ్యహిందూ యుగమున దక్షిణాపథమున బలవత్తమమని ప్రఖ్యాతి

---

16 ఆం. హి. రి. సొ. పత్రి. సం. ౨. పుటలు ౧౪౬-౧౬౪. ఇది తూర్పుగాంగశకము క్రీ. శ. ౪౯౬ వ సంవత్సరమున ప్రారంభమాయెనన్న యభిప్రాయము ననుసరించి చెప్పినమాట. (చూ. ఇండి. ఆం. సం. ౫౧. పుట ౨౩౭ మొదలు). కాని, శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు గాంగశకము క్రీ. శ. ౫౦౫-౬ వ ప్రారంభమాయెనని చెప్పుచున్నారు (ఆంధ్ర. కల్చ. సం.) పై రెం డభిప్రాయములలో నేది సత్యమైనను, నామాటలను మరల్చుకొన నవసరము లేదు.

17. ఆం. హి. రి. సొ. పత్రిక. సం. ౧౧. పుట. ౭౦ తరువాయి; మద్రా. గవ. ఓరి. మాన్యు. లైబ్రరీ ౧౫-౬-౨౬, సం. ౧. పుటలు ౩౪౭-౫౦; ఆం. పరి. పత్రి. సం. ౩. పుట ౪౦౭; C P. No. 15 of 19 7-18.

18 ARE 1918 Part II. Para 5.

19 ఎపి. ఇండి. సం. ౪, పుటలు ౨౩౩-౪.

సందిన దుర్గములలోనిది యొక్కటి. రణవ్యక్తి జూచిన నా పరిసర దేశముల కిది యాయత్తస్థానము వంటిది. పూర్వోత్తర దక్షిణాపథ భూముల యుద్ధయాత్రలు సేయు దండనాథు లందఱును చక్రకూటమును సాధించుట ప్రధాన కార్యముగ గణించువారు. ఈ చక్రకూటము బద్దెగని రాష్ట్రమున కతిసమీపమున గోదావరి కన్వలి తీరమున నుండియుండుట వలన ప్రాయకః అది యతని యధికారముక్రిందనే యుండి యుండవచ్చును. ఈ యూహ సరియేని బద్దెగకు విజయాదిత్యునితో కలహ మిచటనే నడిచి యుండవలయును. ఇది యెట్లున్నను బద్దెగను విజయాదిత్యుని కోడి సంధిగావించు కొనెను.

కోసలులు:—చక్రకూట దహనమైన తరువాత కోసలులతో యుద్ధము. అప్పటి కోసలచరిత్రను గూర్చి విశేష మేమి తెలియదు. గుణగవిజయాదిత్యుని సైన్యముల నెదిరించిన కోసలాధిపు డెవ్వడో చెప్పుటకు వీలులేదు. కోసలాధిపతులు మని చెప్పుకొనిన సోమవంశీరాజు లప్పటి కింక నభ్యుదయము నందలేదు. రాయపుర ప్రాంతములను పాలించుచుండిన శ్రీపుర పాండువంశీ నరపాలుర యధికార మప్పటికి సమాప్తి నందినట్లున్నది. ఒకవేళ గుణగ విజయాదిత్యుని ప్రతిపక్షి శ్రీపురాధిపుల యధికారమును గూలద్రోసి కొంత కాలము కోసలమును పాలించి శరభపురరాజ వంశమునకు జెందియుండ వచ్చును. హైహయవంశజు డగు ముగ్ధతుంగ ప్రసిద్ధధవళ శంకరగణుడు, అనగా రాష్ట్రకూట యువ్వకి కృష్ణవల్లభుని మరదియు, మిత్రుడును నైన సంకిలుడు కోసలేంద్రు నొక్కని జయించి, వానిని కడనుండి 'పురి' యను స్థలమును గైకొనినట్లు తెలియ వచ్చుచున్నది 20. గుణగ విజయాదిత్యునిచే నోడి సంధిచేసుకొనినవా డితడైనను కావచ్చును. కోసల పాలు డెవ్వడైనను, పండరంగని ప్రతాపమున కోర్వ కొనజాలక యేనుగులను సమర్పించుకొని డాహళమార్గమున పూర్వచాళుక్య సైన్యమును నిరాటంకముగ సాగిపోనీయ వలసివచ్చెను.

పూర్వచాళుక్యసైన్య మన్ని దేశములను గడచి తుదకు డాహళమును ప్రవేశించెను. సంకిలుడు చాళుక్యుల దాడినుండి దనరాజ్యమును సంరక్షించుట కెట్టి కట్టుదిట్టములను గావించెనో తెలియదు. యుద్ధమున నడచిన సంగతుల వివర మేమియు దెలియరాక పోయినను, చాళుక్యసైన్యములు నడచిన మార్గమును స్థూలముగ నిర్ణయించవచ్చును. ధర్మవరశాసనప్రకారము పండరంగడు కిరణపురము, డహాళము, నిరుతము, దళైనాడు, అచలపురము మున్నగు స్థలములను, దేశములను ప్రవేశించెను 21. ఇందు పేర్కొనబడిన కిరణము మధ్యపరగణాలలోని బాలెఘాటుజిల్లాయందలి యిప్పటి 'కిరణ్‌పూర్' పట్టణమే యని డాక్టరు ఎ. ఎస్. అల్తేకరుగారు చక్కగా గుర్తుపట్టినారు 22. ఇదియే సంకిలుని రాజధాని యని వీరి యభిప్రాయము. పండరంగడు కిరణపురమును ముట్టడించినపుడు సంకిల కృష్ణవల్లభు లిరువురు నచటనే యుండిరి. కాని, వారు శత్రుల నెదిరించుట కెట్టి ప్రయత్నమును గావించినట్లు కానరాదు. అడ్డువాకలేక పైకొనివచ్చు చాళుక్యసైన్యముల యాటోపమును గాంచి భయవిహ్వలులై పట్టణమును విడచి పాఱిపోయిరి. 23. రాజు త్యజించిపోయిన రాజధానిని రక్షించువా రెవ్వరు? సులభముగ నది చాళుక్యులకు హస్తగత మాయెను. శత్రువుల గుండెల దిగులు కొల్పుటకు పండరంగడు కిరణపురమును దగ్ధము గావించెను. కిరణపురదహనము వెనుక డాహళనిరుతింబులను, దళైనాడును సత్వరముగ జయింపబడినవి. డాహళము పైజెప్పినట్లు చేదిరాజుల కాలపట్టు; తక్కిన రెండు సీమ లెచ్చటివో నిశ్చయించుటకు సాధ్యము కాకపోయినను, నవి చేదిరాజ్యాంతర్గతములై యుండవలయును. ఈ దేశములను జయించిన పిమ్మట పండరంగడు సైన్యములను నడిపించుకొని పశ్చిమముగ బోయి యచలపురమును ముట్టడించెను; ఇది యిప్పటి బీరారుదేశమున

20. హేమచంద్రరాయ్, డినాస్టిక్ హిస్టరీ. సం. ౨. పుటలు ౭౫౭-౫౯; ఎపి. ఇండి. సం ౧. పుట ౨౫౮.

21. భారతి. సం. ౫, భా. ౧. పుట ౬౨౦.

22. రాష్ట్రకూటులు, వారి కాలము, పుట. ౯౫. శ్రీ రావు రాజా వెంకట కృష్ణరావు పంతులుగారు తమ గుణగవిజయాదిత్యుడను చారిత్రక నాటకము యొక్క పీఠికయందు "వారి (రాష్ట్రకూటుల) రాజధాని మాన్యఖేటము. దానికే కిరణపురమని ప్రతినామ మున్నట్లు తోచును" అని వ్రాసిరి (భారతి సం. ౨౪ పుట ౫౬౩). ఇట్టి తలంపు కలుగుట కవకాశము లేదు. కిరణపురము వేరు, మాన్యఖేటము వేరు.

23. దక్షి. ఇండి. శాసనములు—సం. ౧. పుట ౩౬౬; ఎపి. ఇండి, సం. ౯. పుట ౧౭౭.

నెల్లిచ్పూరను పేర బరగుచున్నది. దీనిగూడ శత్రువులను దశేమి వశేముగావించి రగుల్కొల్పెను 24.

అచలపురపతనముతో కృష్ణవల్లభునిపై గుణగ విజయాదిత్యుని దాడి ముగిసినది. అది గొప్ప విజయము. ఈ దీర్ఘదండయాత్రయందు చాళుక్య సైన్యములకు జేకూరిన విజయపరంపరలవలన కృష్ణవల్లభునికి వెన్నుముక విరిగినది. రాష్ట్రకూటరాజలాంఛనములగు గంగాయమునాచంద్రాదిత్య చిహ్నములను పాలిధ్వజమును విజయాదిత్యునికి సమర్పించి సంధిని కోరెను. కృష్ణవల్లభునిపై దన జయమును బ్రకటించుటకు విజయాదిత్యుడు రాష్ట్రకూటుల 'వల్లభ' బిరుదమును స్వీకరించి పంచమహాశబ్దములను బ్రోయించెను. 'దక్షిణాపథసత్త్రికలింగ'పాలకుడనని ప్రకటించెను. కాని గుణగ విజయాదిత్యునకు రాష్ట్రకూటసామ్రాజ్యమును గూల ద్రోయు నుద్దేశము లేదు. అట్టి యుద్దేశ ముండినను నది నెఱవేరియుండదు. విజయాదిత్యునిచే నెన్ని పరాజయములం గ్రిగుడైనను కృష్ణవల్లభుడు సంపూర్ణముగ శక్తిహీనుడు కాలేదు; మిత్రబలము సమయలేదు; మిత్రరాజు లెవ్వరును నతని విడనాడక యెప్పటియట్ల మైత్రి నాటించుచుండిరి. సామంతులుగాని, మాండలీకులుగాని ద్రోహము దలపెట్టలేదు. ఇట్టి పరిస్థితులయందు రాష్ట్రకూటుల యధికారమును దొలగద్రోయుట సాధ్యమైన కార్యము గాదు. విజయాదిత్యుడు రాష్ట్రకూటులపై యుద్ధము ప్రకటించుటకును, డాహళముపై దండువెడలి యా దేశమును పాడుసేయుటకును ముఖ్యముగ రెండుకారణములు గాన్పించుచున్నవి: నిజస్వాతంత్ర్యమును నెలకొల్పుట యొకటి; పూర్వము రాష్ట్రకూటులును, వారిమిత్రులును చాళుక్యులకు గావించిన పరాభవమునకు బ్రతీకారము సల్పుట మఱియొకటి. ఈ రెండు కార్యములను సంపూర్ణముగ నెఱవేర్చి యాతడు కృతకృత్యుడాయెను. కావున కృష్ణవల్లభుడు దన యోటమి నొప్పుకొని సంధిని గోరగా గుణగుడు దండుల కొప్పుకొని యుద్ధమున గొనిన రాజ్యమును, సామ్రాజ్యపదమును నతనికి మరల నిచ్చి సైన్యములను మరల్చుకొని నిజరాజ్యమునకు దరలివచ్చెను 25.

డాహళయుద్ధయాత్ర జయప్రదముగ ముగిసిన వెనుక గుణగవిజయాదిత్యుడు మూడునాలుగేండ్ల పర్యంతము రాజ్యపాలన మొనరించెను. దేశమున నెట్టి యుపద్రవము లేకపోవుటచే శాంతి ప్రబలెను; విజయాదిత్యుడు రాజ్యభారమునంతయు మంత్రులపై నిడి ధర్మకార్యములయందు కాలము గడపుచు క్రీ. శ. ౮౯౧ సంవత్సరమున, నలుబదినాలుగేండ్ల పర్యంతము కీర్తిప్రతాపములతో ప్రజాపాలన మొనరించి దివంగతుడాయెను.

పూర్వచాళుక్యవంశజులైన రాజులందరిలో గుణగవిజయాదిత్యుడుదాత్తముడు. ఇతని రాజ్యకాలమున చాళుక్యుల కీర్తిప్రఖ్యాతులు దశదిశల వ్యాప్తిము వర్ధిల్లినది. తత్పూర్వముగాని, తదనంతరముగాని పూర్వచాళుక్య రాజ్యమంతటి వైశాల్యము నంది యుండలేదు. అమోఘవర్షుని కోడి యతని యాధిపత్యమును గొంతకాలమంగీకరింపవలసి వచ్చినను, దానాతే కృష్ణవల్లభుని జయించి, తన స్వాతంత్ర్యమును పునరుద్ధరించుకొనగల్గెను; కృష్ణవల్లభునిపై దన యధికారమును నెలకొల్పి యతని దనకు పాదాక్రాంతునిగా గావించుకొనెను. పూర్వచాళుక్య శౌర్యపరాక్రమము లాతనియం దుచ్చసిద్ధి నందినవి. 'చండచాళుక్య' నామము సార్థకమై శత్రులకు గుండె లవియించినది.

గుణగ విజయాదిత్యునికి సంతు లేదు. ఇతనికి ముగ్గురు తమ్ములుండినట్లు శాసనముల వలన దెలియుచున్నది. విక్రమాదిత్యుడు పెద్దవాడు; గుణగ విజయాదిత్యునికి యువరాజైయుండి యన్నకు ముందే గతించినట్లున్నది. ఇతడు పెక్కు పూర్వచాళుక్య శాసనములందు 'సచ్చరూపతి' అని స్తుతింపబడి యుండుటచేత సేనల గూర్చుటయందును, విచ్చుటయందును నితడు గడు నేర్పరియై యుద్ధములయందు విజయాదిత్యుని చేదోడై యుండెనని యూహింపవలసి యున్నది. ఇతనికి ప్రథమ చాళుక్యభీము డను పుత్రుడొకడు పుట్టెను. యువరాజ విక్రమాదిత్యునికి వెనుకటవారు నృపకామ యుద్ధమల్లులు. నృపకాముని యాజ్ఞప్తి మీదనే గుణగుడు నాతలూరు గ్రామమును బ్రాహ్మణులకు దానముచేసినది 26. యుద్ధమల్లు 27 డంతటి సుప్రసిద్ధుడు కాడు; కాని యతని పుత్రపౌత్రాదుల ప్రఖ్యాతి వలన నతని పేరు ముందుకు వచ్చినది. తన సోదరులతో గూడి గుణగ విజయాదిత్యుడు రాజ్యమును జనరంజనముగ పాలించె

---

24. ఆం. పరి. పత్రిక. సం. ౧౧. పుట ౨౮౧. "కిరణపుర మచలపుర మురు నెల్లూరుపురా స్వబాహ శైరేత్"

25. ఎపి. ఇండి. సం. ౪. పుట ౨౩౩.

26. ఆం. పరి. ప.; సం. ౧౧. పుట ౨౫౪.

27. Cp. 6. of 1938-39 (అప్రకటితము). 'చాలుక్యభీమ పితృవ్య యుద్ధమల్లస్యనప్తా స్తాలనృపః'

వని చేబ్రోలుశాసనమున జదివినట్లు స్మరణయుం దున్నది ఇది యెట్లున్నను యువరాజ విక్రమాదిత్యుకును, నృపకామునకును నతని శాసకాలముగ ప్రవర్తించుచుండి రని శాసన వాక్యమువలన దెలియవచ్చుచున్నది. యుద్ధమల్లుడు ప్రతికూలుడైన చెప్పుటకు లేదు. కావున గుణగవిజయాదిత్యుడు రాజ్యతంత్ర మర్మజ్ఞుడై తమ్ములను గూడదీసికొని ఐకమత్యముతో బ్రభుత్వము సలిపెను.

గుణగవిజయాదిత్యుని ఖడ్గమునకును, గాఢ్యమునకును కర్తలై రాజకార్యములను జయప్రదముగ సాగించిన వీరులు కొంద రతని శాసనములందు పేర్కొనబడియున్నారు. వీరియందు కడియరాజును, వాతని కుమారుడగు పండరంగడును ప్రముఖులు. పుట్టుకచే బ్రాహ్మణులైనను, నప్పటి దేవోత్తము లనేకుల మార్గము ననుసరించి, వీరు వేదాధ్యయనముతోబాటు ధనుర్వేదముగూడ నభ్యసించి, సమిధలు, దర్భలు దాల్చు కరముల నాయుధములు ధరించి క్షాత్రోపజీవులై రాజసేవయందేమి, దేశసంరక్షయందేమి నిరంతరము పాటుపడుచు దమ యనుపమ ధారణపై కీర్తి గడించిరి. కడియరాజు భట్టకాలుని వంశమున బుట్టెను. ఇతని వాస్తవ నామధేయ మెద్దియో తెలియదు. 'కడియరాజు' అను పదము 'కటకరాజ' అను సంస్కృత శబ్దమునకు భ్రష్టరూపము. 'కటకము' అనగా సేన; కటకమున కధిపతి కటకరాజు. కావున నిది యుద్యోగ నామముగాని పురుష నామము గాదు. కడియరాజు పూర్వచాళుక్య మూలబలమున కధ్యక్షుడు; స్వశక్తిసామర్థ్యములవల్ల నత డీపదవిని వడసెను; అసమానధైర్యసంపన్నుడగు నీ బ్రాహ్మణ సేనాపతి దన యపూర్వ పరాక్రమమును బ్రకటించి గుణగుని పార్శ్వమున నిలిచి పోరాడుచు నొకానొక రణక్షేత్రమున శత్రువులచే హతుడాయెను 28.

అట్టివాని మించిన కొడుకు పండరంగడు. ఆయుధపరిచయమును, సేనాప్రవేశమును నితనికి బాల్యముననే కలిగినట్లున్నవి. ఇతడు దన పోటుతనమును, దండు నడపు నేర్పును బ్రప్రథమమున భోయదండయాత్రయందు బ్రదర్శించి ప్రభువు మన్ననకు పాత్రుడాయెను. అదిమొదలు కొంచె మించుమించుగ గుణగవిజయాదిత్యుని యుద్ధము లన్నియు నితని యాధిపత్యము క్రిందనే నడచినవి. పండరంగడు గుణగవిజయాదిత్యుని కృపాణహస్తమని చెప్పవచ్చును. సంకిల, కృష్ణవల్లభులపై విజయమును, డాహళదండయాత్రయు నీతని యాధ్వర్యము క్రిందనే నడచెనని ముందే చెప్పియున్నది. అతిదుర్గమమైన చక్రకూటదుర్గమును దన క్రోధాగ్నిచే దగులబెట్టిన దితడే. మర్త్యమహేశ్వరుని కోపోద్దీపిత మైన కంటిచిచ్చువంటి మఱియైన కిరణపురాచలపుర కొల్లారుపురము లను త్రిపురములను పండరంగడు కాల్చివేసె. పండరంగడు సాటిలేని జోదు; మేటి దళవాయి. సమకాలికులయం దితనితో జతగూర్చి పేర్కొనగల దండనాయకుడు లేడు; దక్షిణభారతభూమియంతయు నీతని ప్రతాపభానుమూర్తిచే దేదీప్యమానముగ వెలుంగిపోయినది. పండరంగడు గుణగవిజయాదిత్యుని మరణానంతరముగూడ కొంత కాలము జీవించియుండెనేమో; కాని గుణగుని యనంతర మితడు కత్తిని మరల చేబట్టలేదు.

ఆంధ్ర ద్రోణాశ్వత్థామ లనదగిన ఈ యిరువురు మహావీరులేగాక, మరికొందరు బ్రాహ్మణయోధులు గుణగవిజయాదిత్యునికి ఖడ్గసహాయు లుండిరి. వీరియందు వినయశర్మ యొక్కడు. నొలంబాధీశ్వరుడగు మంగిరాజుతో గుణగవిజయాదిత్యుడు యుద్ధము సేయుచుండగా నితడు మంగిని వధించు మార్గమును విజయాదిత్యుని కుపదేశించెను; తన కృతజ్ఞతా సూచకముగ ట్రెండిపల్లిమ గ్రామమును నగ్రహారము చేసి గుణగు డితనికి దానమొసగెను. విజయాదిత్యుని సైన్యమున వినయశర్మయొక్క స్థానమునుగూర్చి చరిత్రపరిశోధకు లభిప్రాయభేదమును గనపఱచియున్నారు. ఈ యంశమునకు సంబంధించిన సంగతుల నన్నిటిని పరామర్శించి చూడగా, వినయశర్మ విజయాదిత్యుని సేనాధ్యక్షవర్గములో నివాడని తోచుచున్నది. 29.

గుణగవిజయాదిత్యుని ఖడ్గసహాయుడైన బ్రాహ్మణవీరు డింకొక్కడు కలడు. ఇతని పేరు రాజాదిత్యుడు; కొండముండల పాలకుడైన కాడుశెట్టియొక్క సేనాపతి కుమారమూర్తి వంశమున జన్మించెను. కాట్లపట్టు దానశాసనమున కుమారమూర్తి చరిత్ర కొంతగలదు. ఏదోయొక కారణమువలన దన దొరయగు కాడుశెట్టితో గలహించి యాతని శపించి వేంగి మండలమునకు వచ్చి యుండి యనగ్రామమును నివాసస్థానముగ జేసికొని యచట స్థిరముగ గాపురముండెను. కుమారు డను

---

28. ఆం. హి. రి. సొ. పత్రిక, సం. ౫ పుట. ౧౧౮.

29. ఎపి. ఇండి. సం. ౫. పుట. ౧౩౫.

సామంతరము గల పెద్దన యను కొడుకు కతనికి కలిగెను. పెద్దనకొడుకు రాజాదిత్యుడు. ఈ రాజాదిత్య శస్త్ర విద్యాపారగుడై గుణగవిజయాదిత్యుని యొద్ద యుద్ధ యందు శ్రుకీయము గావించి యపరిమిత ధనరాసుల నతనికి తెచ్చియిచ్చెను. రాజాదిత్యుని సేవకు మెచ్చుకొని గుణగ విజయాదిత్యు డతనికి వేంగి సహస్ర గ్రామములకు చెందిన కొట్లపల్లెను గ్రామమును సర్వకర పరిహారముగా నగ్రహారము చేసి యిచ్చెను 30.

గుణగవిజయాదిత్యుని రాజ్యకాల మాంధ్ర వాఙ్మయ చరిత్ర యందు ప్రథమఘట్టము. సాలంకాయనుల నాటి నుండియు దేశమున తెనుగుభాష వాడుకయందుండెనని చెప్పుటకు గొన్ని యాధారములున్నను భాషా స్వరూప మిట్టిదని నిర్ణయించుటకు దగిన సాక్ష్యమెద్దియు గాన రాదు. క్రీ.శ. 6 వ శతాబ్దమున నాంధ్రభాషాచరిత్ర యారంభమైనదని చెప్పవచ్చును. క్రీ.శ. ౬౦౦-౬౩౦ల మధ్య రాజ్యపాలన మొనర్చిన మొదటి మహేంద్రవర్మ పల్లవుని శాసనములయందు కొన్ని తెలుగు బిరుదులు కలవు. వీనికంటె ముఖ్యమైనవి రేనాటి తెలుగుచోళుల శాసనములు. పూర్వ రాష్ట్రపత్య చాళుక్యరాజులవి ఈ శతాబ్దమునకు చెందినవే మరి కొన్ని శాసనములు గలవు; సామాన్యముగ నివి యన్నియు చిన్నవి. మూడు నాలుగు వాక్యములతో శాసనగ్రంథమంతయు ముగిసిపోవును; పద్యముల జాడ యెచ్చటను గానరాదు. చక్కని వచనము. ప్రాత తెలుగు శాసనములు పెక్కింటిని పరిష్కరించి ప్రకటించిన శ్రీ వల్లంపల్లి సోమశేఖరశర్మగారు వీనిలో గొన్నింటియందు గానవచ్చు భాషా విశేషమును గూర్చి యిట్లు వ్రాసియున్నారు: "శాసనభాష అంతా తెలుగే. శాసనమంతా గద్యంలో వున్నది. కొన్ని కొన్ని పదాలుమాత్రమే కాకుండా వాక్యరచన కూడా విలక్షణంగానే వున్నది" 31. "శాసనము లోని తెనుగుపదముల కొన్నిటి రూపమును, అర్థమునుగూడ నుబోధపడుట లేదు. ఇంకను విచిత్రమైనది ఇందలి వాక్యరచనాపద్ధతి. ఇది మనమిప్పుడు వాడు పద్ధతికి భిన్నమైనది. ఇప్పుడు మనము వాక్యరచనలో క్రియాపదమును కర్తకర్మలకు తరువాత పెట్టుదుము. మన యీ మూడవ శాసనమున అది కర్తకు దరువాతను, కర్మకు పూర్వమునను వచ్చినది. ఇది అపూర్వము. పొట్లదుర్తి-మాలెపాడు శాసనమునను ఈ పద్ధతియే కానబడును. ప్రాచీనాంధ్రవాక్యరచనాపద్ధతి యిదేనా, ఇది యింక నితరశాసనములలో గానవచ్చునా? ఇదియే యైన, యీ పద్ధతి ఎంతకాలమువరకుండెను? ఇది నాటి సామాన్యపద్ధతి కానిచో పొట్లదుర్తి-మాలెపాడు, మాచెర్ల శాసనములలో నిట్లుండుటకు కారణమేమి?" 32 లభ్యమైన ప్రాచీన తెనుగుశాసనముల నన్నిటిని సమకూర్చి వానిని ఒండొంటితో బోల్చి పరిశోధించి చూచినగాని సోమశేఖరశర్మగారి ప్రశ్నల కన్నిటికిని సరియైన సమాధానము కుదురదు. ఈ ప్రాచీన తెనుగుశాసనములందు సంస్కృతపదములకంటె తెనుగుపదములే యెక్కువగ గానవచ్చుచున్నవి. శాసన గ్రంథకర్తలు దమ పాండిత్యమును జూపక చెప్పవలసిన విషయమును నిర్వక్రముగ వర్ణింతురు. కాని గుణగవిజయాదిత్యుని కాలమునకు శాసనభాష మారిపోయినది. సంస్కృతపద భూయిష్ఠమైనది; శబ్దాలంకారములు మెండైనవి. పొట్లదుర్తి-మాలెపాడు శాసనమును గుణగవిజయాదిత్యుని ధర్మవరశాసనముతో బోల్చిచూచిన నీ విషయము తెల్లము గాగలదు.

పొట్లదుర్తి-మాలెపాడు శాసనము

స్వస్తి॥ శ్రీ పోతిమహారాజు ల్లొకవ|ఇచ్చిత్రోతి అణపోతులు రేవణకాలు పుద్దణకాలు ఇచ్చినవ| న్నన పెన్నాణ ఇశే ఊరికి॥ దేసితిచ్చిన వాస్తువ| ఇచ్చుమహాపాతకున్ద కుర॥ అనిశైరు వులికితమ॥

ధర్మవర శాసనము

విజయాదిత్య పాదప| ద్మ శ్రీమత్ రాయమా శ్రీమత్కాడెయరాజు గుణగాభరణుండు దన|. క.ని ఈశ్వరునకుం గాటికేయుండుంబోలె చాపష్టికలా విశారదుణ్డ| న్న అయ్యపయ్యయు సకలశాస్త్రార్థపారగులయ్యెద| షణ్డగంగులు అల్లయపెగ్గడలుం గరణమ్మన షణ్డగుసు ఈధ| న్మన్వాసన హనోద్యోగమ్మునను బృహస్పతి సమానులయ్య పెగ్గడకాడెయ| గారి కొడుకు తెజయరాజు షడ్గుణ్ణి అశ్వన్నతంబునను బన్చిన వ్ర|పాదం బని సమస్తభూజ్యధరనిరూపిత మహా మస్త్రాధిపతి మ|హేశ్వర పశుపాతి దేవబ్రాహ్మణ

30. ఎస్. టి. వి. యస్. హైదరాబాద్ ఆన్యువల్. ౧౯౩౯-౪౦. పుటలు ౨౩-౨౪.

31. పొట్లదుర్తి-మాలెపాడు శాసనము-వ్యాస సంగ్రహము పుట ౩౦౫.

32. మొదటి జయసింహవల్లభుని మాచెర్ల శాసనము-భారతి సం. ౨౩ పుటలు ౧౫౩-౧౫౪.

సురుచిరకీర్తిప్రగణ్యుఁ సకలక్షత్రియుఁ సంపన్నుండు మయవిజయ
రాజు విజయేశ్వరంబు గలకనివ్వాణానంబు సేసి దిశ
సుస్థిరం ప్రాకారంబు మఠంబును నిర్మించి ......

ధర్మవరశాసనభాషతో నన్నయభట్టారక కృత మహాభారతములోని యీ క్రిందివచనమును జూడుడు: “అఖిలజలధి వేలావలయవలయితవసుమతీవనితా విభూషణంబైన వేంగీదేశంబునకు నాయకరత్నంబుఁ బోని రాజమహేంద్రపురంబునందు మహేంద్రమహిమతో బరమానందంబున ననవరతమహామహీరాజ్యసుఖంబు లనుభవించుచు సకలభువనలక్ష్మీవిలాసనివాసం బయిన రమ్యధర్మార్థకృతిలంబున మంత్రిపురోహిత సేనాపతి దండనాయక దౌవారిక మహాప్రధానసామంత సామంతవిలాసినీ పరివృతుండయి యిష్టకథావినోదంబులనుండి యొక్కనాడు” 33

ఆంధ్రవచనరచనయందు ధర్మవరశాసనము గడు ముఖ్యమైనది. పొట్లూరు త్రిపురాంతకశాసనమునకును, నాంధ్రమహాభారతమునకును, భాషాస్వరూపమును బట్టి, యిది మధ్యస్థానము నాక్రమించుకొనుచున్నది. ధర్మవరశాసనమునకు పొట్లూరు త్రిపురాంతకశాసనము కంటె నన్నయకృత మహాభారతముతో నెక్కువ చుట్టరికము కలదు. శ్రీ సోమశేఖరశర్మగారు చెప్పినట్లు ధర్మవరశాసనభాష గ్రాంథికము. “విజయాదిత్యుని నాటి శాసన మంతయు ‘గ్రాంథికగద్యపద్ధతి’నుండి నాటి గద్యరచనల ధోరణిని తెలుపుచున్నది. కొండవ శిలాశాసనమున పద్యమును, గద్యమును గూడ గలవు. ఈ రెండుశాసనములును ఈ విషయమున ఆంధ్రభాషాచరిత్రమునకు అత్యంతముఖ్యములైనవయినను ఇంతవఱకు భాషాభిమానులు కాని, పండితులు కాని వీటిని వలసినంత శ్రద్ధతో పరిశీలించి పరిశోధింపక పోవుట విచారకరము.” 34 అను శర్మగారి వాక్యము లాంధ్రభాషాచరిత్రకారు లెల్లరును మననము చేయ దగినవి.

గుణగవిజయాదిత్యుని కాలమున నాంధ్రపద్యరచన మొట్టమొదట పొడసూపినది; తత్పూర్వ మాంధ్రమున పద్యరచన యుండెనని చెప్పుటకు దగిన శాసనాధారములు గానరాకపోయినను గుణగుని కాలము దాని జన్మకాలము గాదు; లభించిన మూడునాలుగు పద్యములను శోధించిచూడగా నాంధ్రకవుల కది పద్యరచనయందు ప్రథమప్రయత్నము గా గనిపింపదు, గుణగుని నాటికి కవిత్వము చెప్పుట వారికి చిరపరిచితమైన విద్యయై తోచగలదు. పదముల పొందిక యుల్లంఘింపనిచ్చి, పద్యముల నడకయు, ఛందోవిశేషములును నన్నయకవిత్వమును స్మరణకు దెచ్చుచున్నవి. ధర్మవరశాసన సీసమున నన్నయసీసములు కొన్నిటియందువలె ప్రాసయతియే నాలుగుపాదములయందు గానవచ్చుచున్నది. మఱియును నీకాలమునకు జెందిన పద్యశాసనము లన్నిటియందును సీసగీతములును, తరువోజ మధ్యాక్కరలు వాడబడినవి. వృత్తములు లేవు; తెనుగు వృత్తములెందును గానరాకపోయినను వృత్తరచన యప్పటివారెఱుగరని యెంచరాదు. గుణగవిజయాదిత్యుని సాతలూరు తామ్రశాసనమునందు ప్రాసముతో గూడిన చంపకమాలావృత్త మొకటి గానవచ్చుచున్నది. చూడుడు :

“అరినృపవాజివారణ స
దాతిమహోగ్రవిరామమారుతః
పరకరిసుస్థితాసిధ గు
చిప్రవినాశనభానుసన్నిభః
సురతరదీనభాగవత
మానవమానితకల్పపాదపః
వరకరిగల్లభూమిప భు
జానిరిహాక్షి భువి ప్రహసతే.”

ఈచంపకమాలావృత్తముపై సాతలూరు తామ్రశాసనసంపాదకులైన శ్రీ. శ్రీ. కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావుగారు ఇట్లు వ్రాసియున్నారు: “దీని నాలుగు చరణములందును ప్రాసకలదు. ఈ నియమము సంస్కృత సంప్రదాయము ననుసరించియే యున్నది. ఆంధ్ర సంప్రదాయము ననుసరించి లేదు.” “చంపకమాలావృత్తము సాంస్కృతికమైనను దానికి సంస్కృతవాఙ్మయమునందు విశేషప్రచారము లేదనుట యందఱకు దెలిసిన విషయమే. సుప్రసిద్ధకవు లెవ్వరు దానిని వాడియుండలేదు. కర్ణాటాంధ్రభాషలయందు నీవృత్తము విశేషముగ గన్పించుచున్నది. అట్లే ద్వితీయాక్షర ప్రాసవిషయమున్ను. ఈ రెండును దేశభాషలందు కలవు. సంస్కృతమునందు లేవు. కాబట్టి పై పద్యము సంస్కృతమునందున్నను అది దేశభాషా సంప్రదాయము ననుసరించి వ్రాయబడెననుటకు సందియము లేదు. అనగా తొమ్మిదవ శతాబ్దములో గుద్రవారవిషయములో, అనగా గుడివాడప్రాంతమునందు తెనుగు

33. మహాభారతము, ఆది. ఆ. ౧: ౮.

34. ధర్మవరశిలాశాసనములు - భారతి, సం. ౫. పుట. ౬౧౩.

కవులు ప్రాసయుక్తమైన చంపకమాలావృత్తము రచించు చుండిరని మన మీ సంస్కృతశ్లోకమువలన నూహింపవచ్చును. అప్పటికి వృత్తములలో యతి పాటింప బడుచుండెనో లేదో ఈ పద్యమును బట్టి ఏమియు నిశ్చయముగ జెప్పలేము. కన్నడమునందువలెనే యతి నియమము తెనుగునందు మొదట లేకయుండెనే మో!" 34క.

చంపకమాలావృత్తమునకు సంస్కృతవాఙ్మయమున ప్రచారము లేదనియు, ద్వితీయాక్షర ప్రాసనియమము దేశిభాషలయందే కానవచ్చుచున్న దనియు, దత్కారణమున నది యాంధ్రభాషాసంప్రదాయము ననుసరించి వ్రాయబడె ననియు పై వాక్యముల సారాంశము. కాని యాంధ్రభాషయందు చంపకమాలాదివృత్తములను రచించుట లోకసంప్రదాయమునుండి యేర్పడియుండె నని యుదాహృతశాసన శ్లోకమువలన నిశ్చయము కాజాలదు. ఆంధ్రసంప్రదాయమునకు ప్రధానాంగము యతి. ఇది సంస్కృత కర్ణాటభాషలలోని యతి, అనగా విరామము గాదు. ఆంధ్రసంప్రదాయము ననుసరించిన యతి గుణగవిజయాదిత్యుని నాటి యద్దంకి ధర్మవరశాసనములయందు గానవచ్చుచున్నది. గుణగవిజయాదిత్యుని నాటికి పాతలూరు శాసనచంపకమాలయందు గానవచ్చుదానికంటె భిన్నమైన యతినియమము నాంధ్రకవులు పాటించుచుండిరనుట తెల్లము. అనగా నప్పటికే యతిప్రాసలను గూర్చి నేటివఱకు చెల్లుచుండు సంప్రదాయ మేర్పడినది. కావున శ్రీ లక్ష్మణరావుగా రనుమానించినట్లు 'కన్నడమునందువలెనె యతినియమము తెనుగునందు మొదట లేకయుండెనేమో'యని చింతించుట కవకాశము లేదు. ఏ కారణముచేతనో పాతలూరు శాసనగ్రంథకర్త యాంధ్రసంప్రదాయమును ద్వేషించి కర్ణాటకసంప్రదాయము ననుసరించినాడు; కాని యతని మార్గ మాంధ్రకవులకు రుచింపలేదు. ఇట్లు గుణగవిజయాదిత్యునికి పూర్వమే యాంధ్రమున పద్యరచన ప్రారంభమైనదని తలచుట కవకాశమున్నను చాళుక్యులకు పూర్వము తెనుగువారు కవిత్వము చెప్పి యెఱుంగరని దృఢముగ జెప్పవచ్చును. ఈపట్టున—

"మును మార్గకవిత లోకం
బున వెలయగ దేశికవిత బుట్టించి తెనుం
గున నిలిపి రంధ్రవిషయం
బున జన చాళుక్యరాజు మొదలుగ బలువుర్."

అను నన్నెచోడుని పద్యమును జ్ఞప్తికి దెచ్చుకొనవలయును. ఆంధ్రవాఙ్మయ విమర్శకాగ్రేసరుడని వాసికెక్కిన శ్రీ డాక్టరు కట్టమంచి రామలింగారెడ్డిగారు రాజరాజవర్ధంతి యుత్సవమందు దమ యధ్యక్షవచనమున "ఇక్కడ చేర్కొనిన చాళుక్యరాజు రాజరాజు గాని, ఇంకొక డనుట అసాధ్యమైన కార్యము" అని దృఢముగ జెప్పిరి 35. రెడ్డిగారు మిక్కిలి గొప్పవారు; వారి కీర్తిచే మోహితులై మఱికొందఱు విమర్శకులు నీ విషయమును పరిశీలించి చూడక యే రెడ్డిగారి యభిప్రాయమునే యంగీకరించిరి. గుణగవిజయాదిత్యుని కాలమున కవిత్వ మాంధ్రులు చెప్పుచుండిరని శాసన సాక్ష్యములవల్ల ఋజువగుచుండగా, దేశికవితను బుట్టించి తెనుంగున నంధ్రవిషయమున నిలిపిన చాళుక్యరాజు రాజరాజని చెప్పుట యెట్లు సాధ్యమగును? కావున పెద్దలే యైనను రెడ్డిగారు వచించిన వాక్యమును త్రోసిపుచ్చుట సరి. చక్కగ చింతించి చూడగా నన్నెచోడుడు చేర్కొనిన చాళుక్యరాజు రాజరాజును గాడు, గుణగవిజయాదిత్యుడును గాడు. అతనికి ముందు తెనుగు దేశమును పాలించిన చాళుక్యరాజులలో నొక్కడు కావలయును. మఱియు నతడు పూర్వచాళుక్యవంశజుడే యని తలచవలసిన యవసరము లేదు. బాదామి చాళుక్య వంశజుడైనను కావచ్చును. పూర్వచాళుక్యుల యధికారము క్రింద నుండిన తెనుగుదేశముకంటె వీరి యధికారమునకు లోనై యుండిన తెనుగుదేశము వైశాల్యమున పెద్దది. మొదటి విక్రమాదిత్యుని కాలమునుండి రెండవ కీర్తివర్మ యంత్యమువఱకును తెలింగాణము సర్వమును, రాయలసీమయందలి భాగమును బాదామి చాళుక్య రాజుల యేలుబడిక్రింద నుండెను. వారి శాసనములు తెనుగు భాషయందు రచింపబడినవి రాయలసీమయందచట నచట గానవచ్చుచున్నవి. కావున తెనుగున కవిత్వము పుట్టించిన చాళుక్యరాజు వీరియం దొక్కడైనను గావచ్చును.

34-క. భారతి. సం. ౧. సంచి. ౧. పుటలు ౯౧—౯౩

35. రాజరాజ నరేంద్రపట్టాభిషేక సంచిక. పుట. ౨౦౩.

కలగూరగంప

మట్టి మహిమ

మట్టిని మహా చులకనగా చూడటం మనకు మామూలు. కాని మట్టికున్న మహత్త్వం మరొకదానికి లేదు. పరమేశ్వర సృష్టి యావత్తూ పంచభూతాత్మకమైనది. "పృథివ్యాప స్తేజో వాయురాకాశాత్" అని వేదవాక్యంకూడా "పృథివి" అని మంటికి ప్రథమస్థానం ప్రసాదించింది. వేదాంతపరంగా యోచిస్తేకూడా మట్టికున్న మహిమ కొంత తెలియవస్తుంది. దేహం మట్టిలో పుట్టి, మట్టిలో పెరిగి, మట్టిలో కలిసిపోతుందని తత్త్వజ్ఞు లంటారు. "Dust thou art, to dust return est" అంటుంది ఆంగ్ల వేదాంతం. పండితుడు, పామరుడు, పాపి, పుణ్యాత్ముడు, రాజు, రౌతు - అన్న తరతమభావాలు, కుల వ్యత్యాసాలు, పాటించక సర్వ మానవులను మాత్రమే కాక సమస్తజీవరాసులను కూడా సమదృష్టితో చూచి తనలో లీనం చేసుకొనే మట్టిని మనం భగవత్స్వరూపంగా భావించడంలో తప్పేముంది! అందుకనే, వెండి బంగారాలకన్నా, పంచలోహప్రతిమలకన్నా మట్టితో చేసిన వినాయకవిగ్రహం పూజకు శ్రేష్ఠమని వ్రతకల్పంలో చెప్పియున్నది. నాగులపంచమినాడు పుట్టమట్టిని తెచ్చి పూజించడం మన కెరుగనిది కాదు.

వైద్యశాస్త్రంలో మట్టికి చోటు కద్దు. కొన్ని మందులు భూపుటం వేస్తారు. కొన్ని వ్యాధులకు బంకమట్టిపట్టు వేస్తారు. కొన్ని వస్తువులను, మట్టితో కడచం చేసి శుద్ధిచేస్తారు. కొందరు డాక్టరులు మట్టినే మందుగా వాడేస్తారు.

శిథిలమైపోయిన మన నాగరకత ప్రస్తుతం మట్టిలోనే కలిసియున్నది. చారిత్రకపరిశోధకులు త్రవ్వి తీసిన కొన్ని వస్తువులద్వారా, మట్టిక్రింద పూడియుండి, యిటీవల చిక్కుచున్న తామ్రశాసనాలద్వారా మన నాగరకత "ఇంతటిదా!" అని మనము తెలుసుకొనుచున్నాము. ఇటువంటి మహాసామ్రాజ్యాలెన్నో మట్టిపాలైపోయినవి.

మానవుడు మాతృగర్భంలో ప్రవేశించింది మొదలు, భూగర్భంలో ప్రవేశించేవరకూ, వాని జీవితం మట్టిమీదనే ఆధారపడి ఉంటుంది. గర్భిణులు కొందరు మన్ను తినడం మనకు తెలిసిన విషయమే. ఇక చిన్నబిడ్డలు మన్ను తినడం వేరే చెప్పనక్కరలేదు. ఈ యలవాటు పిల్లలకు —అభిమన్యునికి పద్మవ్యూహ ప్రవేశం మాతృగర్భంలోనే పట్టుబడినట్లు—గర్భిణులుగా నుండు స్త్రీలు మన్ను తినడంచేత—పట్టుబడుతుంది. సాక్షాత్ శ్రీ మహావిష్ణువే కృష్ణావతారఘట్టంలో (మానవజన్మ కాబట్టి) మన్ను తినక తప్పింది కాదు. ఆపని కాస్త చేసి, దండింప దలచిన తల్లి యశోదకు బ్రహ్మాండాలు మింగగలిగిన తన నోటిని చూపి భయపెట్టి పరువు దక్కించుకొన్నాడు.

ఇక పిల్లలకు యెన్నిరకాల ఆటవస్తువులు కొని పెట్టినా, మట్టితో ఆడుకొన్నంత సంతోషం రాదు. మన జీవితానికి కావలసిన ఆహారపదార్థములు, సస్యాదులు, కందమూలములు, ఫలములు వస్త్రాలు మట్టిలోనే పైరగుచున్నవి కాని, ఆకాశంలోనుండి రాలడంలేదు. మనం కట్టుకొనే యిండ్లు యెంత గొప్ప మేడలైనా పునాది మట్టి క్రిందినుండియే ప్రారంభమగుచున్నది. తుదకు కొంపలు కూలిపోవడం తటస్థించినా, మట్టిలోనే కలసిపోతవి.

మానవ నాగరకత ప్రప్రథమం మట్టిలోనే ప్రారంభించినది. మొదట నరుడు మట్టిలో సత్తువ కలదని గ్రహించి పంటలు పండించినాడు. తర్వాత దాని నుండి కుండలు చేయడం తెలుసుకొన్నాడు. తర్వాత మట్టితో యిండ్లు కట్టుకొన్నాడు. క్రమేణా, మట్టిలో భిన్న భిన్న తత్త్వాలున్నవని గ్రహించి అమూల్యములగు వెండిబంగారాలను వెదకి పట్టినాడు. అంతటితో వదలక రస, విష, గంధకాది ద్రవ్యములు, యితర ధాతువర్గములను మట్టినుండి విడదీసి వానిని మ[illegible]చి, నా[illegible]గుకు కూడా వాడడం తెలుసుకొన్నాడు. మట్టిని త్రి[illegible] "కిరొసీను," సీలబొగ్గు కని పెట్టినాడు. ఇసుకను క[illegible]ముచేసి గాజు (గ్లాసు) తయారుచేసి వింతవింత[illegible]

ఫులు తయారుచేసినాడు. అంతేకాదు; ఆ స్థానమునుండి సన్నని దారము తీసి, బట్టలు నేయడంగురించిన పరిశోధనలు విదేశాలలో జరుగుచున్నవి.

ఒక్కొక్క దేశపు మట్టికి ఒక్కొక్క ప్రత్యేకత కద్దు. భారతదేశపు మట్టిలో బంగారం పండుతుంది; రత్నరాసు లున్నవి. అందుకే "రత్నగర్భ" అంటారు మన దేశాన్ని. చైనాదేశపు మట్టితో "పింగాణీ" తయారయి, "కప్పు, సాసర్లు" వస్తున్నవి. బ్రిటిష్ మట్టిలో నేలబొగ్గున్నది. బర్మామట్టిలో "కిరోసిను" చిక్కుతుంది అమెరికాదేశపు మట్టిలో మొట్టమొదటి "అటాం బాంబు" తయారైనది

ఇలా మట్టిలో అమృతం, హాలాహలంగూడా వుంది. మనుష్యుడు జీవించడానికి దేనినగా మట్టిని ఆధారంగా తీసుకొనుచున్నాడో, ఆజీవనంగా మట్టి గొట్టుకు పోవుచున్నాడు. జీవితనాటకం జరిగే రంగస్థలం మట్టి. తుదకు నాటక పాత్రల నిష్క్రమణంకూడా మట్టిలోకే.

ఈ విధంగా మనం పుట్టడం పెరగడం, గిట్టడం- యీమూటికీ ఆధారభూతమగు మట్టినే సృష్టి స్థితి లయ కారకులగు త్రిమూర్తుల స్వరూపంగా భావించి, పృథ్వీ సూక్తం పఠిస్తూ లోకకల్యాణాన్ని కాంక్షించి ఆర్య ధర్మాన్ని యెందుకు కాపాడగూడదు?

చె. వెంకట రామయ్య.

* * *

నాగార్జునాచార్యులు

(త్రివర్ణచిత్ర వివరణ)

మహాయానమతోద్ధారకుడు, సిద్ధుడు ఐన నాగార్జునుడాంధ్రుడు. ఇతడు చతుర్వేదపారంగతుడు, షట్శాస్త్రవేత్త. బౌద్ధజాతకకథలు సృష్టించి, వైదికమతాధారమైన కర్మను ధర్మపరం చేసి కర్మసూత్రానికి విశ్వాధారాన్ని పరిష్కరించి, దేశీయులను విదేశీయులనూ కోటానుకోట్లుగా తనవద్దకే రప్పించుకున్న మహానుభావుడితడు. బుద్ధభగవానుని ధర్మసందేశాలను మహాయానస్వరూపంలో బోధించినాడు.

శిల్ప, చిత్ర కళలను ఆధారంగా తీసుకుని, అమరావతి, అజంతా మొదలగు పెక్కు కళాకేంద్రాలు నిర్మించినాడు. ఇవి నేటికిని యావత్ప్రపంచ వాఙ్మయంలోనూ ప్రథమ స్థానాన్ని అలంకరించినాయి.

బుద్ధధాతువును పద్మంలో గోళాకృతిగావున్న బంగారుభరిణెలో వుంచుకొని అది ప్రమాణంగా బౌద్ధధర్మాలను బోధించడం ప్రమాణపటువు ఆచారం.

మహాయానమతోద్ధారకుడయిన నాగార్జునుని చేతిలోని బుద్ధధాతువు సంచారసమయంలో ఒకచోట నిక్షిప్తమయింది. అందుచేత అతడా స్థలమునే ప్రమాణంగా తీసుకుని అక్కడే వుండి తన చరమదశను గడిపినాడు. పైరెండు కారణాలవల్లా అది ఒక గొప్ప క్షేత్రమైంది. ఇదే గుంటూరుజిల్లా పల్నాడు తాలూకాలోని నాగులవరంవద్ద వున్న నేటి "నాగార్జున బౌద్ధ శిల్పకళాక్షేత్రము".

నేడుకూడ అతని ఆత్మ ఆ శిథిలశిల్పాల ద్వారా బౌద్ధధర్మాలను బోధిస్తూ సజీవంగా వుంది.

సుబ్బరాయశర్మ.



విమర్శనము

చిత్రసీమ

రచయిత: ముద్దా విశ్వనాథంగారు. ప్రకాశకులు: జయనికేతనం, పబ్లిషర్స్, మద్రాసు ౪. వెల ౧ రూ.

గాంధీమహాత్మునికి ఆదర్శజ్యోతి అయిన టాల్‌స్టాయికథ. ఇందులోని ఇతివృత్తము ఆత్మబలమునకు పశుబలమునకు, బుద్ధిబలమునకు భుజబలమునకు గల వ్యత్యాసములను ప్రదర్శించునదై, భావగర్భితమైనదై, మనస్సులకు ఉత్తేజము కల్గించునదై యున్నది.

నాగరికత చరిత్ర

రచన: సి. ఇ. యం. జోడ్. అనువాదము: చింతా దీక్షితులు గారు. వెల రూపాయి పావలా.

ప్రాచీన, అర్వాచీన పాశ్చాత్య నాగరికతల సంగ్రహ చరిత్ర ఇది. సంగ్రహమన్నమాటయేకాని విషయవిశదీకరణ చక్కగానున్నది. ఇంకను చీనాల నాగరకతకూడ కించిత్తుగా ఇందులో ప్రశంసింపబడినది. ఉన్నత తరగతుల విద్యార్థులు అవశ్యముగా చదివి మననము చేయదగిన పుస్తకము. భాష, శైలులు సలక్షణముగా తీరియున్నవి.

మహమ్మదీయరాజ్యాలలో జాతీయ వికాసము

రచన: కాశీపట్నం కొండయ్యగారు. వెల రూపాయిన్నర.

ఈజిప్టు, అరేబియా, సిరియా, పాలస్తీనా, ట్రాన్సు జోర్డను, ఇరాకు, మధ్య అరేబియాలలో ౧౯౩౫ నాటివరకు ప్రవర్తిల్లిన జాతీయోద్యమాలు, కలిగిన జాతీయవికాసము ఈ గ్రంథములో జిగి బిగి [illegible] మంచి వ్యావహారికభాషయందు సాంగోపాంగముగా వివరింపబడినవి. రచన కథారూపములో చక్కగా నడిచినది. ప్రకాశకులు, పనిలోపనిగా, ఆ తరువాతి సంఘటనలనుకూడ దీనిలోనే చేర్పించి, ప్రకటించియుండిన ఇంకను బాగుండియుండును.

పై రెండు పుస్తకములకును ప్రకాశకులు: కల్చరల్ బుక్స్ లిమిటెడ్, పెరంబూరు, మద్రాసు ౧౧.

గ్రంథస్వీకారము

ఆంధ్రభాషావికాసము

కృతికర్త: విద్వాన్ గంటి జోగి సోమయాజి గారు, యం. ఏ., యల్. టి., మహారాణీపేట, విశాఖపట్టణము. వెల ౧౫ రూ.

అరవిందజీవితము

మూడవకూర్పు: సుమారరువది పేజీల క్రొత్త విషయములు చేర్పబడినవి. ప్రకాశకులు: చతుర్వేదుల వెంకటకృష్ణయ్యగారు, శ్రీ అరవిందాశ్రమము, పుదుచ్చేరి. వెల మూడున్నర రూపాయ.

రత్నావళి

శ్రీహర్షుని సంస్కృతనాటకమునకు తెలుగు. అనువాదకులు: మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు. ప్రకాశకులు: యస్. సుబ్బేశ్వరరావు బ్రదర్స్, రాజమహేంద్రవరము. వెల రూపాయి పావలా.

చతురంగ చాతుర్యము

గుఱ్ఱమును అరువదినాలుగు గదులలో దాటించు విధానము. ప్రకటనకర్త: వేపా భీమశంకరంగారు, చ[illegible]వరము, విశాఖపట్టణము జిల్లా. వెల ౨ అ.

ఆచార్యరంగా

సంగ్రహ జీవితచరిత్ర. రచయిత[illegible]: జాస్తి [illegible] వెంకటనరసయ్య, ధూళిపాళ వెంకట సు[illegible]గార్లు.



చదువుల తల్లి

మహానంది దేవాలయ ముఖమంటపపు లోకప్పులోని శిల్పఖండము, రాతితో మలచినది.



భారతి [illegible] 47.

పర్వతపుత్రి

చిత్రకారుడు : శ్రీ [illegible] ప్రసాదరాయచౌదరి.



చదువుల తల్లి

మహానంది దేవాలయ ముఖమంటపపు లోకప్పులోని శిల్పఖండము. రాతితో మలచినది.